

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శుక్రవారం | 9-2-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 295 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతఋతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: చతుర్దశి ఉ. 8.04, అమావాస్య తె. 4.28 వరకు; నక్షత్రం: శ్రవణం రా. 11.30 తదుపరి ధనిష్ఠ; వర్జ్యం: శే. ఉ. 7.12, తె. 3.00-4.25; దుర్ముహూర్తం: ఉ. 9.05-9.51, మ. 12.53-1.38; అమృతఘడియలు: మ. 2.17-3.41; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 6.49; సూర్యాస్తమయం: 6.11 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

రేయ్ ల.. కొడకా..

నీకు బ్రేకులు వేస్తా!

మంత్రి గుమ్మనూరు జయరాం తిట్ల దండకం

బీసీ నాయకుడు వీరేశ్‌కు బెదిరింపులు 12

కర్నూలు జిల్లాలో ఆడియో టేపు కలకలం

150 కోట్లు ఇస్తేనే పెద్దల సభకు!

సీమ ఎమ్మెల్యేకు వైసీపీ షాక్? 2

మూడ్ మారుతోంది!



టీడీపీ గెలుపు ఖాయం.. వైసీపీ ఓటమి తథ్యం

'ఇండియా టుడే' తాజా సర్వేలో వెల్లడి

- టీడీపీకి 45 శాతం ఓట్లతో 17 ఎంపీ సీట్లు
- వైసీపీకి 41 శాతంతో 8 ఎంపీ సీట్లతో సరి
- జనసేనను కూడా కలిపితే కూటమికి 52%
- బీజేపీకి 2 శాతం ఓట్లు వస్తాయని అంచనా
- 2022 ఆగస్టు నుంచే పెరుగుతున్న టీడీపీ బలం

ఆంధ్రప్రదేశ్ ప్రజల మూడ్ మారింది! వైసీపీ సర్కారుకు మూడినట్లే అని తేలింది. తెలుగుదేశం పార్టీ గెలుపు ఖాయమని స్పష్టమైంది. అటు జనసేన, ఇటు బీజేపీతో కలిసి టీడీపీ పోటీ చేస్తే... మరింత ఘనమైన విజయం తథ్యమని చెప్పవచ్చు. 'మూడ్ ఆఫ్ ది నేషన్' పేరుతో నిర్వహించిన తాజా సర్వే ఫలితాలను 'ఇండియా టుడే' సంస్థ గురువారం వెల్లడించింది.

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే... టీడీపీకి 45శాతం ఓట్లు, 17 ఎంపీ సీట్లు ఖాయం! ఇదీ... 'ఇండియా టుడే' తాజా అంచనా! 'ఇండియా టుడే' ప్రతి ఆరు నెలలకోసారి 'మూడ్ ఆఫ్ ది నేషన్' పేరుతో సర్వే నిర్వహిస్తోంది. రెండేళ్లుగా ఏపీలో ప్రజల మూడ్ మారుతోందని, జగన్ పాలన పట్ల విముఖత, టీడీపీకి ఆదరణ పెరుగుతోందని ఈ సర్వే ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. 2022 ఆగస్టులో నిర్వహించిన సర్వే ప్రకారం... టీడీపీ గెలుచుకునే ఎంపీ సీట్ల సంఖ్య ఏడు మాత్రమే! తదుపరి సర్వేలో అది పదికి పెరిగింది. ఇక... గత ఏడాది ఆగస్టులో నిర్వహించిన సర్వేలో 25 ఎంపీ స్థానాల్లో టీడీపీ 15 గెలుచుకునే అవకాశముందని తేలింది. తాజా సర్వేలో ఆ సంఖ్య 17కు పెరిగింది. డిసెంబరు 15వ తేదీ నుంచి జనవరి 28 మధ్య ఈ సర్వే నిర్వహించారు. టీడీపీ, వైసీపీ, ఎన్డీయే (బీజేపీ), ఇండియా కూటమి (కాంగ్రెస్), ఇతరుల ప్రాతిపదికన ఈ సర్వే నిర్వహించారు. దీని ప్రకారం... ఇప్పటికిప్పుడు

మిగతా 11వ పేజీలో...

రాష్ట్రం కోసం తప్పదనిపిస్తోంది!

ఎన్డీయేలో చేరికపై చంద్రబాబు మనోగతం

- షాతో చర్చల సారాంశాన్ని సహచరులకు చెప్పిన అధినేత
- జగన్ పాలనలో ఆంధ్ర దివాలా.. అభివృద్ధి అనేదే లేదు
- మళ్లీ పట్టాలెక్కించాలంటే కేంద్ర సహకారం తప్పనిసరి
- పైగా రాజధాని కట్టాలి.. పోలవరం పూర్తిచేయాలి 12
- యువతకు ఉపాధి కల్పించాలి.. రాష్ట్రమే ఇవన్నీ చేయలేదు
- మోదీ 3.0 ఖాయమనిపిస్తోంది.. పైగా వాళ్లే పిలుస్తున్నారు
- ఏపీకి మంచి జరిగే వీలుంది.. మైనారిటీల ఆందోళనా చెప్పా
- మన పరిమితులూ తెలియజేశా.. వివరించిన టీడీపీ అధినేత

గతం గతః!

అన్నీ మరచి.. కలిసి సాగుదాం

అభివృద్ధి, సిద్ధాంతాల్లో మనకు పెద్ద తేడాల్లేవు

దక్షిణాదిన ఎన్డీయే బలోపేతానికి సహకరించండి 12

ఏపీ అభివృద్ధికి మద్దతు

బాబుకు అమిత్‌షా హామీ

11 నుంచి లోకేశ్ 'శంఖారావం' 11



మళ్లీ జగన్ వస్తే మీ భూములు కబ్జానే

- పొలాలు, స్థలాలన్నీ సర్కారు గుప్పిట్లోనే
- ప్రజల ఆస్తుల తాకట్టుకూ వెనుకాడరు
- కట్టుబట్టలు కూడా దోచేస్తారు.. జాగ్రత్త
- ఓటు అనే ఆయుధంతో తరిమికొట్టండి
- గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు తప్పారు
- మట్టి చెంబిచ్చి.. వెండిచెంబు స్వాహా 3
- పులి, సింహం అంటూ స్వీయ ప్రచారం
- బీజేపీ ముందు తొడ కొట్టండి చూద్దాం
- గుంటూరు, ఏలూరు సభల్లో షర్మిల ఫైర్

ఆశాలపై దుశ్శాసనపర్వం



ఆశా కార్యకర్తను కాళ్లు పట్టి లాగిపారేస్తున్న మగ పోలీసు

- ఉద్యోగ భద్రత కోరిన చిరుద్యోగులపై ఉక్కుపాదం
- చుట్టుముట్టి.. దుస్తులు పట్టి ఎడాపెడా లాగేసిన వైనం
- విరుచుకుపడిన మగ పోలీసులు సైతం..
- మహిళలనీ లేకుండా కాళ్లూ చేతులు పట్టి ఈడ్చివేత
- 12 డిమాండ్లతో చలో విజయవాడకు ఆశాల పిలుపు
- మహాధర్నాకు వెళ్లకుండా పోలీసుల ఆటంకాలు
- రాష్ట్రవ్యాప్తంగా అరెస్టులు, గృహ నిర్బంధాలు

విజయవాడ, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ భద్రత, జీతాల పెంపు డిమాండ్‌తో రాష్ట్రం నలుమూలల నుంచి 'చలో విజయవాడ'కు బయలుదేరిన ఆశా కార్యకర్తలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. 'యథా పాలకా.. తథా

మిగతా 12వ పేజీలో...



'కోడికత్తి' శ్రీనుకు బెయిల్

షరతులతో మంజూరు చేసిన హైకోర్టు 3

- ప్రతి ఆదివారం ముమ్మిడివరం పీఎస్‌లో హాజరుకావాలి
- మీడియా ముందు ఎలాంటి ప్రకటనలూ చేయొద్దని ఆదేశం
- విచారణలో ట్రయల్ కోర్టుకు సహకరించాలని సూచన
- సమీప భవిష్యత్తులో విచారణ పూర్తయ్యేలా లేదని వ్యాఖ్య
- బెయిల్ నిరాకరిస్తూ ఎన్ఐఏ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులు కొట్టివేత
- నేడు విశాఖ సెంట్రల్ జైలు నుంచి శ్రీనివాస్ విడుదల

ఢిల్లీలో వాలిన జగన్

- అమిత్‌షా పిలుపు కోసం నిరీక్షణ!
- బాబుతో బీజేపీ చర్చలు జరిపిన మరుసటి రోజే జగన్ ఢిల్లీకి
- నేడు ప్రధానితో సీఎం భేటీ!?



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుతో బీజేపీ పెద్దలు చర్చలు జరిపిన మరుసటి రోజే... వైసీపీ అధినేత, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఢిల్లీ చేరుకున్నారు. గురువారం సాయంత్రం ఆయన ప్రత్యేక విమానంలో దేశ రాజధానిలో వాలిపోయారు. వచ్చీ రాగానే కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కలుసుకునేందుకు సమయం కోరారు. అయితే... ఆయన ఇతర వ్యవహారాల్లో తల మునకలై ఉన్నారని, కుదిరితే శుక్రవారం సమయమిస్తారని హోంమంత్రి వ్యక్తిగత సిబ్బంది రాత్రి 10 గంటల ప్రాంతంలో జగన్‌కు

మిగతా 12వ పేజీలో...

'సలహా' కాదు.. సొంతం స్వాహా!

ఎండీసీ సలహాదారుగా అదానీ ఉద్యోగి

- ఇప్పటికీ పాత బాసు సేవలోనే తరిస్తున్న వైనం
- దానికోసం సంస్థను ముంచేస్తున్న సలహాదారు
- అధికారంలోకి రాగానే నియమించిన జగన్
- ఔరా అనిపించేలా వేతనం.. అలవెన్సులు
- మధ్యప్రదేశ్ గనుల్లో ఏపీకి దక్కింది సున్నా
- అదానీకేమో కళ్లుచెదిరే లాభాలు దక్కేలా చక్రం

కార్పొరేట్ దిగ్గజ కంపెనీలు, ప్రైవేటు సంస్థలు.... ప్రభుత్వంలో పనిచేసే అధికారులు, పెద్దలతో సాన్నిహిత్యం కోరుకుంటాయి. తమ పనులను చక్కబెట్టుకోవచ్చని ఆశ పడతాయి. ఇందుకోసం ఎంతయినా ఖర్చుపెడతాయి. వారి కోసం ఖరీదైన పార్టీలు, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుంటాయి. ఇక గిఫ్టులు సరేసరి. అయితే ఇది పాత పద్ధతి!..

ఇప్పుడు కొత్తగా మొదలైన పంథా ఏమిటో తెలుసా? తమ దగ్గర పనిచేస్తున్న ఉద్యోగిని ప్రభుత్వ ఉద్యోగంలో కూర్చోబెట్టి, కళ్లుచెదిరే జీతం, ఇతర అలవెన్సులు ఇప్పిస్తారు. ఇక తాము కోరుకున్న పనులు సాఫీగా జరిగిపోయేలా చేసుకుంటారు. ఈ నయా పంథాను రాష్ట్రంలో అదానీ అద్భుతంగా అమలు చేసుకుపోతున్నారు..

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

అదానీ సంస్థలో పనిచేస్తున్న వ్యక్తిని ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ(ఏపీఎండీసీ)లో మినరల్ సలహాదారుగా నియమించారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తల్లోనే ఈ నియామకం జరిగింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు, అదానీకి మధ్య బంధం గత

మిగతా 12వ పేజీలో...

రోజుకో భారతీయ విద్యార్థి మరణం!

అమెరికాలో ఆందోళనకరం.. పరిస్థితులపై అవగాహన అవసరమని స్వచ్ఛంద సంస్థల సలహా

న్యూయార్క్, ఫిబ్రవరి 8: అమెరికాలో భారతీయ విద్యార్థుల వరుస మరణాలపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. సగటున రోజుకో భారతీయుడి మరణ వార్త వినాల్సి వస్తోందని టీమ్ ఎయిడ్ అనే స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు మోహన్ నన్నపనేని ఆవేదన వ్యక్తం చేశారు. భారత్ నుంచి వచ్చే వలసదారులకు అమెరికాలో తమ భద్రత గురించి అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఉందని చెప్పారు. ఇండియానా రాష్ట్రంలో ఈవారం సమీర్ కామత్ అనే విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మరణించారు. ఆయన తుపాకీతో తలపై కాల్చుకొని మరణించినట్టు అధికారులు తేల్చారు. అలాగే, గత నెలలో జార్జియాలో వివేక్ సైనీ అనే విద్యార్థిని ఓ వ్యక్తి మాదకద్రవ్యాల మత్తులో సుత్తితో కొట్టి చంపేశాడు. ఇలాంటి ఘటనలు ఎక్కువవుతున్నాయని మోహన్ తెలిపారు. అమెరికాలో రోడ్డు ప్రమాదాలు, ఆత్మహత్యలు, నరమేధాల ద్వారా తమవారిని కోల్పోయి దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్న భారతీయులను ఆదుకునేందుకు టీమ్ ఎయిడ్ వంటి స్వచ్ఛంద సంస్థలు కృషి చేస్తున్నాయ న్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను అమెరికా పంపేందుకు చాలా డబ్బు వెచ్చిస్తున్నారని, అయితే, ఉపాధి అవకాశాలు లేక నైరాశ్యంలో అనేకమంది విద్యార్థులు ఆత్మహత్య వంటి తీవ్రమైన చర్యలకు పాల్పడుతున్నారని మోహన్ తెలిపారు.

అగ్రరాజ్యంలో ఉండిపోవాలనే ఉద్దేశంతో..

'భారత్ నుంచి వచ్చిన అనేకమంది విద్యార్థులు కష్టాల పాలవుతున్నారు. దురదృష్టవశాత్తూ వారిలో కొందరు చనిపోతున్నారు. అనేక ఏళ్లుగా ఇది జరుగుతోంది. అలాంటివారికి సాయం చేసేందుకు 2001 నుంచి క్రియాశీలంగా పనిచేస్తున్నా' అని మోహన్ వివరించారు. మృతుల్లో విద్యార్థులు, ఇటీవలే అమెరికా వచ్చిన హెచ్1బీ ఉద్యోగులు ఎక్కువగా ఉంటున్నారని చెప్పారు. అమెరికాలో చదివినంత మాత్రాన హెచ్1బీ వర్క్ వీసా లభిస్తుందనే గ్యారెంటీ ఏమీ లేదని, ఈ కారణమే యువతను తీవ్ర ఒత్తిడికి గురిచేస్తోందని తెలిపారు. భారత్‌కు తిరిగి వెళ్లే కంటే అమెరికాలోనే ఉండిపోవాలనే ఉద్దేశంతో కొందరు గ్యాస్ స్టేషన్లలో సైతం పనిచేస్తున్నారని, కొందరు చట్టవ్యతిరేక పనుల్లోనూ ఇరుక్కుంటున్నారన్నారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరికీ తగినన్ని అవకాశాలు ఉండవనే విషయంపై విద్యార్థులు కచ్చితంగా అవగాహనతో ఉండాలని, అమెరికాలో విద్యాభ్యాసం పూర్తయిన తర్వాత భారతదేశానికి తిరిగి వెళ్లిపోయేందుకూ సిద్ధపడాలన్నారు.నకిలీ యూనివర్సిటీలు, విద్యాసంస్థల్లో విద్యార్థులను చేర్పించేందుకు భారీ వాగ్దానాలు చేసే కన్సల్టింగ్ ఏజెన్సీల ఉచ్చులో విద్యార్థులు చిక్కుకోకూడదని ఆయన సూచించారు. కాగా, విద్యార్థులు భారత ఎంబసీలు, కాన్సులేట్లలో తమ వివరాలు నమోదు చేసుకోవాలని, తద్వారా వారిని తరచుగా సంప్రదించేందుకు, అత్యవసర పరిస్థితుల్లో ఆదుకునేందుకు అవకాశం ఉంటుందని టీమ్ ఎయిడ్ సంస్థకే చెందిన ప్రేమ్ భండారీ సూచించారు.



లోకం తీరు



ప్రధాని మోదీ ఓబీసీ కాదు

» కులం పేరుతో దేశ ప్రజలను మోసగిస్తున్నారు: రాహుల్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: ప్రధాని నరేంద్ర మోదీ తనను తాను ఓబీసీగా ప్రకటించుకొని దేశ ప్రజలను మోసగిస్తున్నారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. 'తాను ఓబీసీగా జన్మించానని మోదీ చెబుతున్నారు. కానీ ఆయన ఓబీసీలో పుట్టలేదు. ఆయన జనరల్ కేటగిరీకి చెందిన కుటుంబంలో పుట్టారు' అని ఒడి సాలో రెండో రోజు గురువారం కొనసాగిన భారత్ జోడో న్యాయ్ యాత్రలో రాహుల్ వ్యాఖ్యానించారు. గుజరాత్ సీఎం అయిన తర్వాత మోదీ తన కులాన్ని ఓబీసీగా మార్చుకున్నారని, ఆయన పుట్టుకతోనే ఓబీసీ కాదని స్పష్టంచేశారు. 2000వ సంవత్సరంలో బీజేపీ అధికారంలో ఉన్నప్పుడు మోదీ పుట్టిన ఘాంచీ కులాన్ని జనరల్ నుంచి ఓబీసీ కేటగిరీలో చేర్చారని తెలిపారు. ఆయన ఓబీసీలో పుట్టలేదు కాబట్టి ఆయన కులగణనకు ఎప్పటికీ అంగీకరించరని రాహుల్ విమర్శించారు. కాగా, ప్రధాని మోదీ సామాజిక వర్గానికి సంబంధించి రాహుల్ చేసిన వ్యాఖ్యలపై తాను స్పందించబోనని, అయితే కొందరు తమ పుట్టుకతో కాకుండా సర్టిఫికెట్ ఆధారంగానే ఓబీసీలుగా గుర్తింపు పొందుతున్నారని సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ పేర్కొన్నారు. ప్రధాని మోదీ ఓబీసీ కేటగిరీలో జన్మించలేదంటూ రాహుల్ వ్యాఖ్యలపై కేంద్ర ప్రభుత్వం గురువారం స్పందించింది. 'ప్రధాని కులంపై రాహుల్ చేసిన ప్రకటనలో వాస్తవాలు' పేరిట ఒక సంక్షిప్త నోట్ విడుదల చేసింది. 'మండల్ కమిషన్ గుజరాత్‌లో చేపట్టిన సర్వే అనంతరం ఇండెక్స్ 91(ఏ)కింద ఓబీసీ జాబితాను తయారు చేసింది. ఆ రాష్ట్రానికి చెందిన 105 ఓబీసీ కులాల జాబితాలో మోద్-ఘాంచీని కూడా చేర్చారు" అని తెలిపింది.

జీసస్ పక్కకు... జగనన్న ముందుకు!

» 'కృష్ణా' పాస్టర్లతో విమలా రెడ్డి సమావేశం



పాస్టర్ల సమావేశంలో మాట్లాడుతున్న విమలా రెడ్డి

గన్నవరం, ఫిబ్రవరి 8: ముఖ్యమంత్రి జగన్ మేనత్త వైఎస్ విమలారెడ్డి నేతృత్వంలో కృష్ణాజిల్లా గన్నవరం ఏబీ కన్వెన్షన్‌లో గురువారం జరిగిన పాస్టర్ల సమావేశం పక్కా రాజకీయ ప్రచార సభగా మారింది. సమావేశంలో ఎక్కడా జీసస్ ఫొటో లేకపోవడం, ఎటు చూసినా సీఎం జగన్, విమలారెడ్డి, ఎమ్మెల్యే వంశీ మోహన్ ఫొటోలు ఉండటంతో సమావేశానికి హాజరైన పాస్టర్లు అసహనం వ్యక్తం చేశారు. జగన్‌ను మళ్లీ సీఎం చేసేందుకు పాస్టర్లు క్రియాశీలకంగా వ్యవహరించాలని వక్తలు పిలుపునిచ్చారు. ప్రభుత్వ సలహాదారులు ఫాదర్ బాలస్వామి, మేడిది జాన్సన్, క్రిస్టియన్ మైనార్టీ సెల్ కృష్ణాజిల్లా అధ్యక్షుడు పోలిమెట్ల జయరాజు, కార్యదర్శి కె.కిరణ్‌మూర్తి పాల్గొన్నారు. ముఖ్య అతిథి విమలారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో క్రైస్తవులు బలపడాలంటే జగన్‌ను మళ్లీ సీఎంని చేయాలని, దీనికోసం అందరూ యాక్టివ్‌గా పనిచేయాలని కోరారు. ప్రస్తుతం కొందరు ప్రభుత్వాన్ని కూల్చాలని చూస్తున్నారని, సేవకులుగా మనమంతా అండగా ఉంటే క్రైస్తవులకు పథకాలు అందుతాయని చెప్పారు. ప్రభుత్వ సలహాదారులు చెప్పినట్లు నడుచుకోవాలని పాస్టర్లకు విమలారెడ్డి సూచించారు. సదస్సుకు వచ్చిన పాస్టర్లకు మంచి విందు ఏర్పాటుచేసి ఒక్కొక్కరికి రూ.500 పంపిణీ చేశారు.

రేపటి నుంచి నంబూరులో 'ఇస్తిమా'

» ప్రార్థనలకు లక్షల్లో తరలిరానున్న ముస్లింలు

» రాజకీయ ప్రచారం కోసం వైసీపీ నేతల హడావుడి

» ప్రత్యేక రైలు వేశామంటూ ఎంపీ మిథున్ ప్రచారం

» అంతా అవాస్తవం: ఖండించిన ముస్లిం నేత నసీర్



ఇస్తిమా ప్రార్థనల ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా

గుంటూరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ముస్లింలు సంప్రదాయంగా చేసుకునే ఇస్తిమా వేడుకలకు గుంటూరు నగర శివారులోని నంబూరు వేదికగా మారింది. ప్రార్థనల కోసం ఇక్కడ ఎంపిక చేసిన ప్రాంగణంలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ నెల 10, 11 తేదీల్లో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని తమ రాజకీయ ప్రచారానికి అనువుగా మార్చుకొనేందుకు వైసీపీ నేతలు తాపత్రయపడుతున్నారు. గత నాలుగేళ్లలో ఎన్నడూ ఇస్తిమా వైపు కన్నెత్తి చూడని నేతలు సైతం ఎన్నికల వేళ కావడంతో నిర్వహణ ఏర్పాట్లలో దూరిపోయి హడావుడి చేస్తున్నారు. అన్నమయ్య జిల్లా ములకలచెరువు నుంచి నంబూరుకు ప్రత్యేక రైలు ఏర్పాటు చేస్తున్నట్లు వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి కొద్ది రోజులుగా పెద్దఎత్తున ప్రచారం చేసుకుంటున్నారు. డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, మేయర్ కావటి మనోహర్‌నాయుడు, ఇతర నాయకులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ, మతపెద్దల ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమానికి వైసీపీ రంగు పులిమేందుకు ప్రయత్నిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ముస్లింలు ఎంతో పవిత్రంగా భావించే ఈ సభలకు ఎవరి ప్రమేయం లేకుండానే వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది ముస్లింలు స్వచ్ఛందంగా తరలివెళ్తారు. ఇస్తిమా ఎక్కడ జరిగినా ఆయా రాష్ట్రాల్లో , దేశాల్లో అధికారంలో ఉండే ప్రభుత్వాలు అధికారికంగా అక్కడ తమ వంతు మౌలిక సౌకర్యాలు కల్పించటం ఆనవాయితీ. కాగా, ఇస్తిమా అనేది ఎంతో పవిత్రమైన వేదిక అని, ఈ ప్రార్థనలకు లక్షలాది మంది ముస్లింలు స్వచ్ఛందంగా తరలివస్తారని ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలి తెలిపారు. దీనిద్వారా రాజకీయ లబ్ధి పొందాలనుకోవడం అవివేకమని అన్నారు. కాగా, నంబూరులో జరిగే ఇస్తిమా ప్రార్థనలకు ఎంపీ మిథున్‌రెడ్డి ప్రత్యేక రైలు ఏర్పాటు చేస్తున్నట్లు సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం అవాస్తవమని గుంటూరు తూర్పు టీడీపీ ఇన్‌చార్జి ఎండీ నసీర్ అహ్మద్ అన్నారు. ఆ ప్రాంత ముస్లింలు సొంత డబ్బు ఖర్చు పెట్టుకొని స్వచ్ఛందంగా తరలివస్తున్నారని తెలిపారు.

సొంతంగా ఎంత ఖర్చు చేస్తారు?

» ఉత్తరాంధ్ర ఎమ్మెల్యేలతో వైవీ సుబ్బారెడ్డి ఆరా

అమరావతి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఐప్యాక్ సర్వే ఆధారంగా ప్రజాబలం ఉన్న నేతకే ఎన్నికల్లో పోటీ అవకాశమిస్తామని ఇప్పటిదాకా చెబుతూ వచ్చిన వైసీపీ అధిష్ఠానం.. తాజాగా ఎన్నికల్లో ఎంత ఖర్చు చేస్తారంటూ సిటింగ్ ఎమ్మెల్యేలను ఆరా తీయడం ప్రారంభించింది. గురువారం ఉత్తరాంధ్ర ప్రజాప్రతినిధులతో వైవీ సుబ్బారెడ్డి వ్యక్తిగతంగా సమావేశమయ్యారు. ఆ భేటీల్లో వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచేందుకు అనుసరిస్తున్న ప్రణాళికలు ఏమిటని ఒక్కొక్కరినీ సుబ్బారెడ్డి అడిగినట్లు సమాచారం. ఎన్నికల్లో ఎంతెంత ఖర్చు చేయగలరంటూ ఆరా తీశారని ఒక సిటింగ్ ఎమ్మెల్యే తెలిపారు. రానున్న ఎన్నికల్లో పార్టీ ఇచ్చే ఆర్థిక సాయం కాకుండా సొంతంగా ఎంత ఖర్చు చేయగలరని అడిగినట్లు చెప్పారు. రాజ్యసభ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి బరిలో ఉంటారన్న ప్రచారం నేపథ్యంలో.. అభ్యర్థులైన వైవీ సుబ్బారెడ్డి, మేడా రఘునాథరెడ్డి సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ ఎమ్మెల్యేల ఖర్చులు కొంత భరిస్తారని ప్రచారం జరుగుతోంది.

బ్లాక్ & వైట్ కాంగ్రెస్ - బీజేపీ ఫైట్


ప్రెస్‌కు నల్ల పత్రం విడుదలచేసిన కాంగ్రెస్.. రాజ్యసభలో శ్వేతపత్రం చదివిన బీజేపీ

» ఎన్నికల వేళ పత్రాల యుద్ధంతో కాక

» ఒక్కసారిగా అట్టుడికిన రాజ్యసభ

» ఆర్థికవ్యవస్థను నాశనంచేసిన యూపీఏ

» సభలో విరుచుకుపడ్డ మోదీ సర్కారు



బ్లాక్ పేపర్‌ను విడుదల చేస్తున్న కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: ఎన్నికల వేళ పార్లమెంటు వేదికగా గురువారం 'పత్రాల' యుద్ధం హోరాహోరీ సాగింది. ఇదిగో మోదీ పాలన నిర్వాకం అంటూ విపక్షం యూపీఏ నల్లపత్రం మీడియాకు విడుదల చేయగా, యూపీఏ పదేళ్ల పాలన అసలు గుట్టు ఇదిగో అంటూ అధికార ఎన్డీయూ 'శ్వేతపత్రం'తో దీటుగా ఎదుర్కొంది. గురువారం ప్రభుత్వం సభలో శ్వేతపత్రం పెట్టనుందని తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ ముందే అప్రమత్తం అయింది. పార్లమెంటు సమావేశాలు ప్రారంభానికి ముందే మీడియాను పిలిచి నల్ల పత్రం విడుదలచేసింది. అనంతరం ఆ పార్టీ సభ్యులు నల్లవస్త్రాలు ధరించి రాజ్యసభకు వచ్చారు. అవే దుస్తుల్లో రాజ్యసభలోకి ప్రవేశించిన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే 'నల్ల పత్రం'లోని అంశాలను ప్రస్తావిస్తూ, మోదీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. అందరూ అనుకున్నట్టే భారత ఆర్థిక వ్యవస్థపై శ్వేత పత్రాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారు. గత యూపీఏ ప్రభుత్వ పాలనతో తమ పరిపాలనను పోల్చుతూ ఈ పత్రంలోని అంశాలను ఆమె వివరించారు. "మంచి స్థితిలో ఉన్న ఆర్థిక వ్యవస్థతో యూపీఏ 2004లో తన పాలన ప్రారంభించింది. కానీ, మా చేతికి 2014లో అప్పగించేసరికి అది పతనావస్థలో ఉంది. అవినీతి తారస్థాయిలో ఉండేది. ఆర్థిక క్రమశిక్షణ లేదు. నిధుల దుర్వినియోగానికి అంతులేదు. సర్వత్రా సంక్షోభ ఛాయలు కనిపించాయి" అని తెలిపారు. కాంగ్రెస్ 1991లో ప్రారంభించిన ఆర్థిక సంస్కరణలను తన హయాంలో కొనసాగించడంలో విఫలమయిందని విమర్శించారు. దీంతో ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడానికి గత పదేళ్లలో అనేక కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి వచ్చిందని నిర్మల వివరించారు. అంతకుముందు.. "పదేళ్ల అన్యాయ కాలం" పేరిట కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే 54 పేజీలతో కూడిన బ్లాక్ పేపర్‌ను విడుదల చేశారు. గత పదేళ్లలో జరిగిన ఆర్థిక, సామాజిక, రాజకీయ అన్యాయాలను ఎత్తిచూపుతూ మోదీ ప్రభుత్వ వైఫల్యాలపై విమర్శలు ఎక్కుపెట్టారు. మోదీ ప్రభుత్వం ఈ పదేళ్ల కాలంలో దేశ ఆర్థిక వ్యవస్థను, వ్యవసాయరంగాన్ని సర్వనాశనం చేసిందని, నిరుద్యోగాన్ని పెంచిందని, మహిళలపై నేరాలు పెరుగుతున్నా పట్టించుకోలేదని, మైనారిటీలకు తీవ్ర అన్యాయం చేసిందని మండిపడ్డారు. "ప్రధాని మోదీ పార్లమెంటులో మాట్లాడినప్పుడల్లా తన వైఫల్యాలను కప్పిపుచ్చుకుంటున్నారు. అందుకే బ్లాక్ పేపర్ ద్వారా బీజేపీ వైఫల్యాలను ప్రజలకు తెలియజేయాలనుకుంటున్నాం" అని ఖర్గే అన్నారు.

అన్నీ లోపభూయిష్ఠ నిర్ణయాలే...

మోదీ పాలనలో దేశంలో నిరుద్యోగం భారీగా పెరిగిందని, పెద్దనోట్ల రద్దు, లోపభూయిష్ఠమైన జీఎస్టీ వంటి ఆర్థిక విపత్తులు చోటుచేసుకున్నాయని బ్లాక్ పేపర్‌లో కాంగ్రెస్ ఆరోపించింది. లక్షలాది మంది రైతులు, దినసరి కూలీల భవిష్యత్తును నాశనం చేశారని విమర్శించింది. భారత భూభాగంలో చైనా ఆక్రమణలపై మోదీ ప్రభుత్వం మౌనంగా ఉందని కాంగ్రెస్ ఆరోపించింది. అగ్నిపథ్ పథకంతో సైన్యాన్ని బలహీన పరుస్తోందని, ఎన్నికల కమిషన్, ఈడీ, ఆర్బీఐల స్వతంత్రతను దెబ్బతీస్తోందని, మీడియాతో పాటు ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకుని వాటిని అంతం చేయడానికి ప్రయత్నిస్తోందని విమర్శించింది. విద్వేషం, విభజన రాజకీయాలతో దేశ సామాజిక వ్యవస్థను నాశనం చేశారని దుయ్యబట్టింది. కాగా, ప్రతిపక్ష సభ్యులను సస్పెండ్ చేసి సభలో బిల్లులు ఆమోదింపజేసుకోవడం ప్రజాస్వామ్యం అవుతుందా అని మోదీ సర్కారును ఖర్గే నిలదీశారు.

మన్మోహన్ స్ఫూర్తిప్రదాత: మోదీ

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌ను స్ఫూర్తిప్రదాత అంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కొనియాడారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ కూడా, చక్రాలకుర్చీలో రాజ్యసభకు వచ్చి ఢిల్లీ సర్వీసు బిల్లు-2023పై చర్చలో పాల్గొన్నారని మోదీ గుర్తుచేశారు. గురువారం పార్లమెంటులో ఆయన.. రాజ్యసభ నుంచి పదవీవిమరణ చేస్తున్న 52మంది సభ్యుల గౌరవార్థం మాట్లాడారు. ఈ సందర్భంగా రాజకీయ విభేదాలను కొంత పక్కనపెట్టి ఒకింత భావోద్వేగ ధోరణిని ప్రదర్శించారు. రాజ్యసభనూ, దేశాన్నీ తన హయాంలో స్ఫూర్తిమంతంగా మన్మోహన్ నడిపించారని కొనియాడారు.

ప్రసిద్ధ కథకుడు శ్రీపతి కన్నుమూత



శ్రీకాకుళం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ తెలుగు కథకుడు, విరసం తొలితరం నాయకుడు శ్రీపతి (పుల్లట చలపతి) వయోభారంతో హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో కన్నుమూశారు. శ్రీపతి 'మంచుపల్లకి-మరి తొమ్మిది, సత్యజిత్ రాయ్ ఎవరు?, బెనారస్ చిత్రాలు వంటి కథా సంపుటాలు వెలువరించారు. 'కాటుక కళ్ల-కథలు మూడు' ఆయన చివరి కథా సంపుటం. తాను పుట్టి పెరిగిన శ్రీకాకుళం జిల్లా కవిటి మండలం భైరిపురం గ్రామం నేపథ్యంగా తన చివరి కథ 'మామిడిపళ్ల ఊరు' రచించారు. ఏ అంశం చెప్పినా పూదోటల సౌందర్యం వర్ణించడం శ్రీపతి శైలి. ఆల్ ఇండియా రేడియో ఉద్యోగిగా ఢిల్లీలో చాలాకాలం పనిచేశారు. అనంతరం హైదరాబాద్ పాతబస్తీలో తన కుటుంబంతో స్థిరపడ్డారు. 1969 డిసెంబరులో వెలువడిన 'తిరగబడు' కవితా సంకలనం.. ఆ మరుసటి సంవత్సరం విప్లవ రచయితల సంఘం (విరసం) ఆవిర్భావానికి నాంది ప్రస్తావన పలికింది. 'తిరగబడు' కవులుగా పదిమంది యువకులు ముందుకొచ్చి తమ కవితలను స్వేచ్ఛా సాహితి తరఫున ప్రచురించారు. ఈ యువకుల్లో శ్రీపతితోపాటు ప్రముఖ కవి వరవరరావు, పెండ్యాల యాదగిరిరావు, పెండ్యాల కిషన్‌రావు, నెల్లుట్ల సంజీవరావు, దేవులపల్లి సుదర్శన్‌రావు, లోచన్, వడ్డేపల్లి సుధాకర్, టంకశాల అశోక్, నరసింహారెడ్డి ఉన్నారు. కాగా, శ్రీపతి మృతి పట్ల శ్రీకాకుళం సాహితీ సమాఖ్య ప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు. అక్షర సౌందర్యం అంతర్థానం అయిందంటూ నివాళి అర్పించారు. హైదరాబాద్‌లో అభిమానులు, సన్నిహితుల సమక్షంలో ఆయన భౌతికకాయానికి గురువారం అంత్యక్రియలు పూర్తయ్యాయి.

వైవీ, బాబూరావు రాజ్యసభకు!

అరణి శ్రీనివాసులు స్థానంలో మేడా రఘునాథరెడ్డికి

అసెంబ్లీ ప్రాంగణంలో సీఎంతో ముగ్గురి భేటీ

15న నామినేషన్ల దాఖలు!

అమరావతి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులను సీఎం జగన్ ఖరారు చేశారు. ఎన్నికలు జరిగే 3 స్థానాలకు టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, పాయకరావుపేట (ఎస్సీ) ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి సోదరుడు, కాంట్రాక్టరు మేడా రఘునాథరెడ్డి పేర్లను ప్రకటించారు. వారు గురువారం అసెంబ్లీ ప్రాంగణంలోని సీఎం చాంబర్లో జగన్‌ను కలిసి.. తమకు అవకాశమిచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ నెల 15వ తేదీన మంచి ముహూర్తం ఉండడంతో.. ఆరోజున నామినేషన్లు వేస్తామని చెప్పారు. వాస్తవానికి చిత్తూరు సిటింగ్ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు టికెట్ నిరాకరించిన వైసీపీ నాయకత్వం.. తర్వాత ఆయన్ను రాజ్యసభకు పంపుతున్నట్లు వెల్లడించింది. తర్వాత ఆర్థిక బలాబలాలను బేరీజువేసుకుని.. మేడా రఘునాథరెడ్డిని తెరపైకి తెచ్చింది. మల్లికార్జునరెడ్డికి ఈ దఫా అసెంబ్లీ టికెట్‌ను నిరాకరించి.. ఆయన స్థానంలో ఆకేపల్లి అమరనాథరెడ్డిని ఇన్‌చార్జిగా ప్రకటించారు. పాయకరావుపేట ఎమ్మెల్యే అయిన బాబూరావు స్థానంలో రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులును ఇన్‌చార్జిని చేసిన సంగతి తెలిసిందే. అయితే పార్టీ పెట్టకముందు నుంచీ తనతోనే ఉన్న బాబూరావుకు తాను అన్యాయం చేసినట్లు ఎస్సీ వర్గాల్లో విమర్శలు రావడంతో ఆయన్ను రాజ్యసభకు పంపాలని జగన్ నిర్ణయించారు.

150 కోట్లు ఇస్తేనే పెద్దల సభకు!

» సీమ ఎమ్మెల్యేకు వైసీపీ షాక్?

అమరావతి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రాయలసీమకు చెందిన ఓ అధికార పార్టీ ఎమ్మెల్యేకు ఈ దఫా టికెట్ నిరాకరించారు. సీమలో బలమైన సామాజిక వర్గానికి చెందిన ఆయన్ను రాజ్యసభకు పంపుతామని వైసీపీ నాయకత్వం హామీ ఇచ్చింది. ఎంపీని అయిపోతానని ఆయన కూడా ఎంతగానో ఆనందించారు. తీరా చావుకబురు చల్లగా చెప్పారు. రూ.150 కోట్లు చెల్లిస్తేనే రాజ్యసభకు వెళ్లే అవకాశం లభిస్తుందని ఆయన్ను పిలిపించి మరీ స్పష్టం చేసినట్లు తెలిసింది. అంత మొత్తం ఇవ్వలేనని ఆయన చేతులెత్తేయడంతో ఆయన్ను పక్కనపెట్టినట్లు సమాచారం. రూ.100 కోట్లు సమర్పించుకున్న రెడ్డి సామాజిక వర్గ నేతను ఇప్పుడు అభ్యర్థిగా ప్రకటించడం గమనార్హం. ఈ పరిణామంపై ఆ ఎమ్మెల్యే ఆక్రోశం వెలిబుచ్చారు. ఎర్రచందనం, ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణాతో సంపాదించిన సొమ్ము తన వద్ద లేదని.. అందుకే అంత ఇవ్వలేనని చెప్పానని అంతరంగికుల వద్ద వ్యాఖ్యానించారు.

మోదీ హ్యాట్రిక్ ఖాయం!

» బీజేపీకి 304 సీట్లు.. ఎన్డీఏకు 335

» ఇండియాకు 166.. కాంగ్రెస్-71

» ఇండియాటుడే సర్వేలో వెల్లడి



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ సారథ్యంలో బీజేపీ మరోసారి విజయ కేతనాన్ని ఎగరవేయనుందని 'మూడ్ ఆఫ్ ది నేషన్' పేరుతో ఇండియాటుడే ఛానల్ నిర్వహించిన సర్వే వెల్లడించింది. బీజేపీ 304 సీట్లతో సొంతంగా మెజారిటీ సాధించి వరుసగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుందని, బీజేపీ భాగస్వామ్య పక్షాలను కూడా కలుపుకొంటే ఎన్డీఏ కూటమి బలం 335 స్థానాలకు చేరుకోనుందని ఈ సర్వే తెలిపింది. ప్రతిపక్ష ఇండియా కూటమి 166 సీట్లకే పరిమితమవుతుందని, కాంగ్రెస్ 71 సీట్లను గెల్చుకుంటుందని పేర్కొంది. సర్వేలో భాగంగా గత ఏడాది డిసెంబరు 15-జనవరి 28 మధ్య దేశంలోని 543 నియోజకవర్గాల్లో 35,801 మంది వ్యక్తులను ఇండియాటుడే సర్వే చేసింది. ఈ సర్వే వెల్లడించిన వివరాల ప్రకారం.. అత్యధికంగా 80 స్థానాలున్న యూపీలో మరోసారి బీజేపీ ప్రభంజనం సృష్టించనుంది. ఆ పార్టీ సొంతంగా 70 సీట్లను, మిత్రపక్షం అప్నాదళ్(ఎస్) 2 సీట్లను గెల్చుకోనున్నాయి. 2019లో ఈ రెండు పార్టీలకు కలిపి 64 సీట్లు (బీజేపీ 62) రాగా ఇప్పుడు అవి పెరగనున్నాయి. ఇక ప్రతిపక్ష ఇండియా కూటమికి చెందిన సమాజ్‌వాదీపార్టీ గత ఎన్నికల్లో గెల్చుకున్న 15 స్థానాల్లో 8 కోల్పోయి, ఈసారి ఏడు స్థానాలకు పరిమితం కానుంది. కాంగ్రెస్ ఒక్క సీటునే గెల్చుకోనుంది. యూపీ తర్వాత అత్యధిక సీట్లున్న మహారాష్ట్ర(48)లో శివసేన, ఎన్సీపీలు అంతర్గతపోరుతో చీలిపోయిన విషయం తెలిసిందే. శివసేనలో ఉద్ధవ్ వర్గం, ఎన్సీపీలో శరద్‌పవార్ వర్గం ఇండియా కూటమిలో ఉండగా, సీఎం ఏక్‌నాథ్‌షిండే నాయకత్వంలోని శివసేన, అజిత్ పవార్ సారథ్యంలోని ఎన్సీపీ ఎన్డీఏలో ఉన్నాయి. ఈ రాష్ట్రంలో మెజారిటీ సీట్లు(26) ఇండియా కూటమి గెల్చుకోనుంది. కూటమిలోని కాంగ్రెస్ 12 సీట్లు, ఎన్సీపీ-పవార్, శివసేన-ఉద్ధవ్ కలిసి 14 సీట్లు గెల్చుకోనున్నాయి. ఇక 42 సీట్లతో మూడో స్థానంలో ఉన్న పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ పట్టు 22 సీట్లను గెల్చుకోనుంది. బీజేపీకి 19 సీట్లు, కాంగ్రెస్‌కు ఒక్క సీటు లభించవచ్చు. వామపక్షాలకు ఒక్క సీటూ రాదట. 40 సీట్లున్న బిహార్‌లో ఎన్డీఏ 32, ఇండియా 8 సీట్లను గెల్చుకోవచ్చు. అయితే, ఈ సర్వే జరిగిన సమయానికి ఇండియా కూటమిలో ఉన్న నితీశ్ ఇటీవల ఎన్డీఏలో చేరిన విషయం తెలిసిందే. దీంతో ఎన్డీఏకు లభించే సీట్లు మరింత పెరిగే అవకాశం ఉంది. 39 సీట్లున్న తమిళనాడులో అన్ని సీట్లనూ డీఎంకే-కాంగ్రెస్‌లతో కూడిన ఇండియా కూటమి గెల్చుకోనుంది. గుజరాత్, రాజస్థాన్‌లను గత ఎన్నికల్లోలాగే ఈసారి కూడా బీజేపీ పూర్తిగా స్వీప్ చేయనుందని ఈ సర్వే వెల్లడించింది.

ఎవరికెన్ని సీట్లు?

రాష్ట్రం (మొత్తం సీట్లు)	ఎన్డీఏ	ఇండియా
	(2019తో పోల్చితే పెరుగుదల/తగ్గుదల)	
ఉత్తరప్రదేశ్ (80)	72 (+8)	8 (-8)
మహారాష్ట్ర (48)	22 (-19)	26 (+21)
పశ్చిమ బెంగాల్ (42)	19 (+1)	23 (-1)
బిహార్ (40)	32 (-7)	8 (+7)
తమిళనాడు (39)	0	39 (+1)
మధ్యప్రదేశ్ (29)	27 (-1)	2 (+1)
కర్ణాటక (28)	24 (-3)	4 (+3)
గుజరాత్ (26)	26	0
రాజస్థాన్ (25)	25	0
ఆంధ్రప్రదేశ్ (25)	0	0
	ఇతరులు (టీడీపీ-17; వైఎస్సార్‌సీపీ-8)	
కేరళ (20)	0	20
తెలంగాణ (17)	3 (-1) ఇతరులు-4	10 (+7)
ఝార్ఖండ్ (14)	12	2
అస్సాం (14)	12 (+3)	2 (-1)
పంజాబ్ (13)	2 (-2) ఇతరులు-1	10 (+1)
హరియాణ (10)	8 (-2)	2 (+2)
ఢిల్లీ (7)	7	0
ఉత్తరాఖండ్ (5)	5	0
జమ్మూకశ్మీర్ (5)	2	3
హిమాచల్ ప్రదేశ్ (4)	4	0

(+/- గుర్తులు లేనివి.. 2019 ఎన్నికలతో పోల్చితే మార్పు లేనివి. ఆయా రాష్ట్రాల్లో ఫలితాలు నాడు, నేడు ఒకే విధంగా ఉంటాయని అంచనా)

మహిళా శక్తికి హ్యాట్సాఫ్

» 1,514 రోజులుగా అమరావతి కోసం పోరాటం

» మన ప్రభుత్వం వస్తే అమరావతి నిర్మాణం: భువనేశ్వరి



తుళ్ళూరు, తాడికొండ, ఫిబ్రవరి 8: మహిళా శక్తి చాలా గొప్పదని, ఎట్టిపరిస్థితిలోనూ వెనుకంజ వేయకుండా మనశక్తిని చాటుకుందామని టీడీపీ అధినేత నారా చంద్రబాబు సతీమణి భువనేశ్వరి అన్నారు. రాజధాని గ్రామం వెంకటపాలెంలో గురువారం పాడి రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 1,514 రోజులుగా అమరావతి కోసం పోరాటం చేస్తున్న మహిళలకు హ్యాట్సాఫ్ చెప్పారు. మన ప్రభుత్వం వస్తుంది.. అమరావతి నిర్మాణం జరుగుతుందన్నారు. స్త్రీలకు సేచ్ఛనిచ్చింది ఎన్టీఆర్ అని చెప్పారు. 1994లో హెరిటేజ్ వ్యాపార బాధ్యతలు అప్పజెప్పారని, మొదట్లో 400 మంది రైతులతో ప్రారంభమైన హెరిటేజ్ నేడు మూడులక్షల మందికి పెరిగిందన్నారు. పాడిపంటలు బాగుంటేనే దేశం బాగుంటుందని చెప్పారు. పార్టీని అంటిపెట్టుకుని ఉన్న కార్యకర్తల కుటుంబాలు కష్టాల్లో వుంటే తెలుగుదేశం పార్టీ వారికి అన్ని వేళలా తోడుంటుందని భువనేశ్వరి భరోసా ఇచ్చారు. గుంటూరు జిల్లా తాడికొండ నియోజకవర్గంలోని ఫిరంగిపురం, తాడికొండ, తుళ్లూరు మండలాల్లో గురువారం ఆమె పర్యటించారు. చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక మనస్తాపంతో మృతిచెందిన పార్టీ కార్యకర్తల కుటుంబాలను పరామర్శించారు. ఫిరంగిపురం మండలం కండ్రిక శివారు గ్రామం రేగులగడ్డకు చెందిన నల్లజర్ల పెద చెన్నకేశవరావు, తాడికొండ మండలం బండారుపల్లి గ్రామంలోని తూమాటి బాలయ్య, తుళ్లూరు మండలం తుళ్లూరుకు చెందిన మోరం సాంబశివరావు, రాయపూడికి చెందిన గోరగంటి మల్లికార్జునరావు, వెంకటపాలెం గ్రామానికి చెందిన లంకా నరసింహారావు కుటుంబ సభ్యులను కలిశారు. ఒక్కో కుటుంబానికి రూ.3లక్షల చెక్కును అందజేశారు.

కొడకా.. కడప గల్లీల్లో తిరగలేరు

» టీడీపీ నేత శ్రీనివాసరెడ్డికి డిప్యూటీ సీఎం సోదరుడు హెచ్చరిక



అహ్మద్‌బాషా

కడప, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): 'మేం ఫ్యాక్షన్ వదిలేశాం. తిరిగి మొదలుపెడితే కడప గల్లీలో తిరగలేరు. రెడ్‌బుక్‌లో రాసుకుంటున్నా అంటున్నావ్. ఏం చేస్తావ్. ద్వారకానగర్‌లో నీ ఇంటికే వస్తాం. మీ ఇంట్లో దూరుతాం. ఏం పీక్కుంటావో పీక్కో. బచ్చా నాకొడకా.. నువ్వేందిరా చెప్పేది' అంటూ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా సోదరుడు అహ్మద్‌బాషా మీడియా సాక్షిగా, పోలీస్‌స్టేషన్‌లోనే టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డిని దూషించారు. కడపలోని 39వ డివిజన్‌కు చెందిన ఆరిఫుల్లా అనే టీడీపీ కార్యకర్త తమ డివిజన్‌లో సమస్యలు ఉన్నాయని, కార్పొరేటరు పరిష్కరించలేదంటూ ఇటీవల సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. దీనిపై కార్పొరేటరు, ఆయన కుమారుడు పీరుల్లా గురువారం మోచంపేటలోని టీడీపీ నేత ఆరిఫ్ ఇంటికి వెళ్లారు. ఈ సందర్భంగా ఇరువర్గాల వారు కొట్టుకున్నారు. పోలీసులు టీడీపీ నాయకుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై ఫిర్యాదు చేసేందుకు ఆర్.శ్రీనివాసరెడ్డి తన అనుచరులతో స్టేషన్‌కు వెళ్లారు. మరోవైపు మేయర్ సురేశ్‌బాబు, డిప్యూటీ సీఎం సోదరుడు అహ్మద్‌బాషా తమ అనుచరులతో స్టేషన్‌కు చేరుకున్నారు. స్టేషన్‌లో ఉన్న టీడీపీ నేతలపై దాడి చేశారు. పోలీసుల ఎదుటే వారిని బండ బూతులు తిట్టారు. ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. పోలీసులు టీడీపీ వారిని అక్కడి నుంచి పంపేశారు. వైసీపీ వాళ్లు మాత్రం పోలీస్‌స్టేషన్‌లోనే ఉన్నారు. డిప్యూటీ సీఎం అంజద్‌బాషా సోదరుడు అహ్మద్‌బాషా పోలీసుస్టేషన్ వెలుపల మీడియా ఎదుట టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడిని పత్రిక రాయలేనివిధంగా బండబూతులు తిట్టారు. జరిగిన ఘటనపై కేసు నమోదు చేయకుంటే మా కేడరు బయటికి వస్తుంది. దానికి పోలీసులే బాధ్యత వహించాలని హెచ్చరించారు. వైసీపీ వాళ్లు వెళ్లిపోయాక డీఎస్పీ షరీఫ్ మాట్లాడుతూ.. వ్యక్తిగత గొడవలు, పార్టీలకు అంటకట్టవద్దని కోరారు.

టెట్ నోటిఫికేషన్ విడుదల

- 18 వరకు దరఖాస్తులకు గడువు
- మన్యం, అల్లూరి మినహా అన్ని జిల్లాల్లో పరీక్షలు
- డీఎస్సీలో టెట్‌కు 20శాతం వెయిటేజీ

అమరావతి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) నోటిఫికేషన్‌ను పాఠశాల విద్యాశాఖ గురువారం విడుదల చేసింది. గురువారం నుంచే దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించింది. ఈ నెల 17 వరకు ఫీజులు చెల్లించొచ్చని, 18 దరఖాస్తుల సమర్పణకు చివరి రోజు అని తెలిపింది. ఈనెల 27 నుంచి మార్చి 9 వరకు రోజుకు రెండు సెషన్ల చొప్పున పరీక్షలు జరుగుతాయని పేర్కొంది. ఫలితాలు మార్చి 14న విడుదలవుతాయని తెలిపింది. డీఈడీ, బీఈడీ అర్హతలు ఉన్నవారితో పాటు ఉపాధ్యాయ విద్యా కోర్సుల్లో నాలుగో సెమిస్టర్ చదువుతున్న వారు కూడా టెట్ రాయొచ్చని వివరించింది. కేంద్రం నిర్వహించే సీటెట్ రాసే అవకాశం ఉన్నవారు కూడా ఏపీటెట్ రాసే అవకాశం ఉందని పేర్కొంది. టెట్‌లో పేపర్-1ఏ, పేపర్-2ఏ, పేపర్-1బీ, పేపర్-2బీ ఉంటాయని, అభ్యర్థులు ఒక్కో పేపర్‌కు రూ.750 చొప్పున చెల్లించాల్సి ఉంటుందని స్పష్టంచేసింది. డీఈడీ, బీఈడీ రెండు అర్హతలు కలిగి ఉన్నవారు నాలుగు పేపర్లు రాయొచ్చని తెలిపింది. ఫీజుల చెల్లింపు, దరఖాస్తుల సమర్పణ మొత్తం పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్ ద్వారానే చేయాలని పేర్కొంది. ఒకసారి దరఖాస్తును సమర్పించాక అందులో మార్పులు చేసే వీలుండదని, తప్పనిసరిగా మార్చుకోవాలనుకుంటే మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని స్పష్టంచేసింది. పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాలు మినహా అన్ని జిల్లాల్లో పరీక్షా కేంద్రాలు ఉంటాయని, అభ్యర్థులు ఫస్ట్ కమ్ ఫస్ట్ పద్ధతిలో కేంద్రాలు ఎంపిక చేసుకోవాలని సూచించింది. ఒకవేళ అభ్యర్థులు కేంద్రాన్ని ఎంపిక చేసుకోకపోతే పాఠశాల విద్యాశాఖే ఆటోమేటిక్‌గా సమీపంలోని కేంద్రాన్ని నిర్ణయిస్తుందని తెలిపింది. ఒక్కో పేపర్ 150 మార్కులకు జరుగుతుందని, డీఎస్సీలో టెట్‌కు 20శాతం వెయిటేజీ ఉంటుందని స్పష్టంచేసింది. టెట్‌లో అర్హత సాధించేందుకు అభ్యర్థులు... ఓసీలు 60శాతం, బీసీలు 50శాతం, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ఎక్స్‌సర్వీస్‌మెన్ 40శాతం మార్కులు సాధించాలని వివరించింది. టెట్‌లో అర్హత సాధిస్తే ఆ సర్టిఫికెట్‌కు జీవితకాల కాలపరిమితి ఉంటుందని స్పష్టం చేసింది.

విద్యుత్ శాఖ తప్పిదం.. దళితుడికి శిక్ష!

- కూలీకి రూ.లక్షకుపైగా కరెంటు బిల్లు
- కట్టలేదని సరఫరా నిలిపివేత



జీలుగుమిల్లి, ఫిబ్రవరి 8: విద్యుత్ బిల్లుల్లో తప్పులు దొర్లడం సహజం. వాటిని అధికారులు సరిచేసి బిల్లు కట్టించుకుంటారు. ఇక్కడ మాత్రం తప్పుడు బిల్లు ఇవ్వడమేగాకుండా.. కట్టలేదని విద్యుత్ సరఫరా తీసేసి ఇబ్బందిపెడుతున్నారు. ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం దర్భగూడెంకు చెందిన దళిత కూలీ పిల్లెం వెంకయ్యకు ప్రతి నెలా తక్కువ యూనిట్ల విద్యుత్ వాడకంతో ప్రభుత్వ సబ్సిడీతో బిల్లు చెల్లించే అవసరం రాలేదు. ఇటీవల ప్రధాన మంత్రి ఆవాస యోజన పథకంలో చిన్నపాటి భవనం నిర్మించుకున్నాడు. అప్పటి నుంచి కనీస చార్జీతో విద్యుత్ బిల్లు చెల్లిస్తున్నాడు. జనవరిలో ఒకేసారి రూ.1,11,198 బిల్లు రావడంతో అవాక్కయ్యాడు. 15,902 యూనిట్ల వినియోగం చూపి.. రూ.లక్షకుపైగా బిల్లు ఇవ్వడంతో.. సరిచేయాలంటూ అధికారుల చుట్టూ తిరిగాడు. అయినా ఎవరూ స్పందించ లేదు. అంతేగాకుండా రూ.పది వేలైనా చెల్లించాలంటూ సిబ్బంది ఒత్తిడి చేశారు. బిల్లు చెల్లించలేకపోవడంతో ఫిబ్రవరి 3న విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దీంతో వెంకయ్య కుటుంబం నాలుగు రోజుల నుంచి చీకటిలోనే ఉంటోంది.

మళ్లీ జగన్ వస్తే..
మీ భూములు కబ్జానే

- గుంటూరు, ఏలూరు సభల్లో షర్మిల ఫైర్

తెనాలి/ఏలూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): జగన్‌కు మళ్లీ ఓటేసి గెలిపిస్తే ప్రజల పొలాలు, స్థలాలన్నీ సర్కారు గుప్పిట్లోకి వెళ్లిపోతాయని పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల అన్నారు. భూములను కబ్జా చేస్తారని, ప్రజల చేతుల్లో సెంటు భూమి కూడా ఉండదని, కట్టుబట్టలు కూడా మిగలకుండా దోచేస్తారని హెచ్చరించారు. ఒకసారి చేసిన పొరపాటును ఈసారైనా సరిచేసుకోవాలని, ఓటు అనే ఆయుధంతో తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. వైఎస్ బిడ్డగా చెబుతున్నానని, ప్రజలు ఈ ఒక్కసారి తన మాట వినాలని కోరారు. గురువారం గుంటూరు జిల్లా తెనాలి మండలం కొలకలూరులో రచ్చబండ కార్యక్రమంలో, ఏలూరు జిల్లా దెందులూరు నియోజకవర్గం పోతునూరులో నిర్వహించిన బహిరంగ సభలో ఆమె పాల్గొన్నారు. కొలకలూరు సభలో ప్రభుత్వం వల్ల నష్టపోయిన బాధితులు, అర్హతున్నా పథకాలు అందనివారు, నష్టపోయిన రైతులు, ఇతర బాధితులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అండగా ఉంటానంటూ వారికి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. "మళ్లీ జగన్ అధికారంలోకి వస్తే మీ సెంటు భూమి కూడా మీ చేతుల్లో ఉండదు. ప్రాణం మీదకొచ్చి ఆసుపత్రి ఖర్చుల కోసం మీ స్థలం తాకట్టు పెట్టుకుని డబ్బు తెచ్చుకోవాలన్నా ఇకపై సర్కారు అనుమతి కావాల్సిందే. మీ నేలపై సర్వ హక్కులూ సర్కారుకేనట. ఒక్కసారి గెలిపించినందుకు లిక్కర్ మాఫియా దగ్గర నుంచి మట్టి, ఇసుక మాఫియా, చివరకు గనులు, ప్రభుత్వ భూములన్నీ కొల్లగొట్టేశారు. మద్యం ఏ బ్రాండ్ అమ్మాలనేది ప్రభుత్వమే నిర్ణయిస్తుంది. ఎంతకు అమ్మాలో కూడా సర్కారే నిర్ణయిస్తుంది. ఇదంతా మీరు రోజూ చూస్తున్నదే. ఇక మిగిలింది మీ నేలే. ఇంకా 30 ఏళ్లు తానే అధికారంలో ఉంటానన్న ధీమాతో మీ భూములను దోచుకునేందుకు ఇప్పుడే ఓ చీకటి జీవో తీసుకొచ్చేశాడు. ఆ జీవోలో ఉన్న వాస్తవాలు తెలిస్తే మీకు నిద్ర కూడా పట్టదు. ఇకపై మీ భూమిని అమ్మాలంటే ప్రభుత్వం అనుమతించాలి. బ్యాంకుల్లో తనఖా పెట్టాలన్నా ప్రభుత్వ ఇష్టమే. కష్టపడి పైసా పైసా కూడబెట్టి కొన్న ఇళ్ల స్థలం, పొలంపై హక్కు మాదే.. వారిష్టమేంటని మీరు అనుకోవచ్చు. కానీ మీ పొలాలు, స్థలాలు రేపటి రోజున మీవి కావు. మళ్లీ జగన్ గెలిస్తే వాటన్నిటిపై అధికారం జగనన్నదే. మీ ఆస్తులను కూడా తాకట్టు పెట్టడానికి వెనుకాడరు. మీరు ముందు చూపుతో జాగ్రత్త పడకపోతే చివరకు కట్టుబట్టలు కూడా మిగలవు. చీకటి జీవో అమలయితే ఏమీ మిగలదు" అని షర్మిల హెచ్చరించారు.

జగనన్న అవసరం ఉందా?

"మద్య నిషేధం పెట్టాకే ఓట్లడుగుతానని చెప్పిన జగన్ గెలిచాక ఆ మాట మరిచిపోయారు. చివరకు ప్రభుత్వమే మద్యం వ్యాపారం చేసేలా మాటతప్పిన ఘనుడు. అటువంటివాడు అధికారంలోఉంటే ఏమవుతుందనేది నాకంటే మీకే ఎక్కువ అనుభవం ఉంది. ఆనాడు ఎన్నికల సమయంలో జగన్ తరఫున నేనే ప్రచారం చేశాను. కుటుంబంలో ఎంతమంది పిల్లలుంటే అందరికీ అమ్మఒడి ఇస్తానని ఆయన మాటగా చెప్పాను. దానిని కూడా ఆయన తప్పాడు. కుటుంబంలో ఒక్కరికే ఇస్తున్నారు. అదికూడా రూ.15 వేలు కాకుండా రూ.12 వేలే. ఇచ్చిన రూ.12 వేలకు బదులు రూ.24 వేలు లాగేసుకుంటున్నారు. కుటుంబంలో చదివిన ఆ ఒక్కరు కూడా ఉపాధి లేక వలస పోతున్న పరిస్థితి ఉంది. రాష్ట్రానికి ఈయనగారు ప్రత్యేక హోదా తీసుకురాలేదు కాబట్టి పెద్ద పరిశ్రమలు కూడా రాలేదు. అవి లేకుంటే ఉద్యోగాలు ఎక్కడి నుంచి వస్తాయి? ప్రభుత్వ ఉద్యోగాల విషయం అటుంచితే, కనీసం ప్రైవేటు ఉద్యోగాలు కూడా లేక యువత ఇతర రాష్ట్రాలకు వలస పోతున్నారు. మీకు మీ పిల్లల్ని దూరం చేసే జగనన్న అవసరం ఉందో! లేదో మీరే నిర్ణయించుకోవాలి" అని షర్మిల అన్నారు.



దెందులూరు సభలో మాట్లాడుతున్న షర్మిల, హాజరైన జనం

అది మెగా కాదు దగా డీఎస్సీ

"అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ ప్రకటిస్తామని, 25వేల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన జగనన్న గెలిచాక ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదు. మళ్లీ ఎన్నికలు వచ్చాక డీఎస్సీ ప్రకటన చేశారు. ఇది మెగా డీఎస్సీ కాదు.. కేవలం ఎన్నికల వేళ నిరుద్యోగులను మోసం చేసేందుకు తీసుకొచ్చిన దగా డీఎస్సీ. ప్రతి సంవత్సరం జనవరిలో జాబ్ కేలండర్ విడుదల చేస్తామని చెప్పిన జగన్ ఈ విషయంలోనూ మాట తప్పారు. జాబ్ క్యాలెండర్ మాట దేవుడెరుగు, ఉన్న ఉద్యోగాలు కూడా ఊడిపోతున్నాయి. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు 7వేల ఉద్యోగాలు భర్తీచేస్తామని చెబితే జగన్ హేళన చేశారు. ఆయన మాత్రం ఈ ఐదేళ్లలో ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వకుండా ఎన్నికలకు ముందు డీఎస్సీ ప్రకటించారు. 6 వేల ఉద్యోగాల భర్తీకి మాత్రమే అంగీకరించడం చూస్తే ఆయనను జనం ఏం చేయాలి? ఆయన అధికారంలోకి వచ్చేనాటికే రాష్ట్రంలో 30వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటిని భర్తీచేయలేక నూతన విద్యావిధానం పేరుతో పాఠశాలలనే మూసేసిన ఘనత ఆయనది. యువత భవిత బాగుండాలంటే మరోసారి మోసపోకూడదు. ప్రధానంగా మహిళలు అప్రమత్తం కావాలి. చెత్త ఆలోచన ఉన్న ప్రభుత్వం పోతేనే మన భవిష్యత్ బాగుపడుతుంది" అని షర్మిల అన్నారు.

ఈ ప్రభుత్వానికి సిగ్గులేదా?

'ఐదేళ్లుగా జగనన్న సీఎంగా ఉండి ఏపీకి ఏం సాధించారు? ప్రతిపక్షంలో ఉండగా ప్రత్యేక హోదా కోసం పోరాటాలు చేశారు. ఎంపీలు అందరూ మూకుమ్మడిగా రాజీనామా చేస్తే హోదా ఎందుకు రాదో చూద్దామన్నారే? మరి ఐదేళ్లుగా ఎందుకు చేయలేదు? సీఎం అయ్యాక ఒక్కసారైనా హోదా గురించి మాట్లాడారా? బీజేపీ విభజన హామీలన్నింటినీ నెరవేర్చేసిందని సీఎం అసెంబ్లీలో చెప్తున్నారే.. హోదా వచ్చిందా? రాజధాని వచ్చిందా? పోలవరం పూర్తయిందా? సిగ్గులేదా ఈ ప్రభుత్వానికి అని అడుగుతున్నా. జగన్ ప్రతిపక్షంలో ఉండగా హోదా కోసం కేంద్రం మెడలు వంచుతానని చెప్పి, ఇప్పుడు తలలు వంచి సలాంలు కొడుతున్నారు. సీఎం అయ్యాక అదే బీజేపీకి తొత్తులుగా మారి హోదా గురించి మర్చిపోయారు. ఒక్కటంటే ఒక్క హామీ నెరవేర్చకపోయిన ఇటు పాలక పక్షానికి అటు బీజేపీకి సిగ్గు, శరం ఏమైనా ఉందా? అని అడుగుతున్నా. జగనన్న తనకు తాను పులినని, సింహాన్నని ప్రచారం చేసుకుంటున్నారే.. మీరు పేపర్‌కు పులా? సాక్షికి సింహమా? ఏదీ ఒక్కసారి బీజేపీ ముందుకు వెళ్లి పంజా విసరండి. ఒక్కసారి బీజేపీ ముందుకెళ్లి తొడ కొట్టండి చూద్దాం. కేవలం బెదిరింపులు, బూతులతో చేసే మీది ఒక దిక్కుమాలిన పాలన. ఏపీకి సంజీవని వంటి ప్రత్యేక హోదాను కాంగ్రెస్ సాధించి తీరుతుంది" అని షర్మిల అన్నారు.

డబ్బు తీసుకోండి..
మంచి పార్టీకే ఓటు

"అమ్మా! ఇది ఎన్నికల సమయం. ఐదేళ్లకు ఒకసారి వచ్చే సమయం. ఓట్ల కోసం అందరు నాయకులూ వస్తారు. డబ్బులు ఇస్తారు. ఎవరెవరు ఎంతెంత ఇచ్చినా తీసుకోండి ఫర్లేదు. శాండ్ మాఫియా, లిక్కర్ మాఫియా నాయకులు ఏమిచ్చినా వద్దనకండి. కానీ, ఓటు మాత్రం మీ ఆలోచన అయి ఉండాలి. మంచి పార్టీకే ఓటు వేయండి. మీకు ఎవరైతే మంచి చేశారో వాళ్లకే మద్దతివ్వండి" అని కోరారు.

షర్మిలకు భద్రత పెంపు

కడప (క్రైం), ఫిబ్రవరి 8: పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు పోలీసు భద్రతను పెంచారు. ఆమె అభ్యర్థన మేరకు వన్ ప్లస్ వన్ గన్‌మెన్ నుంచి టూ ప్లస్ టూకు పెంచామని కడప ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ గురువారం తెలిపారు. భద్రతా ప్రమాణాల నిబంధనల మేరకు పెంచామన్నారు. ఎవరి ప్రాణాలకైనా ముప్పు పొంచి ఉందని, వారికి గన్‌మెన్ కేటాయించాలని ఇంటెలిజెన్స్ విభాగం ఇచ్చే సిఫారసు నివేదిక మేరకు గన్‌మెన్లను కేటాయిస్తామని ఎస్పీ తెలిపారు.

నిబంధనల మేరకే జనసేనకు గాజుగ్లాసు

- గుర్తు కోసం మొదట జనసేన దరఖాస్తు చేసుకొంది
- హైకోర్టుకు నివేదించిన కేంద్ర ఎన్నికల సంఘం
- పూర్తి వివరాలతో కౌంటర్ వేయాలని సీఈసీకి ఆదేశం

అమరావతి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): చట్ట నిబంధనలకు అనుగుణంగానే జనసేన పార్టీకి గాజుగ్లాసు గుర్తును కేటాయించామని కేంద్ర ఎన్నికల సంఘం హైకోర్టుకు నివేదించింది. గాజుగ్లాసు గుర్తు కోసం మొదట జనసేన పార్టీ దరఖాస్తు చేసుకుందని, ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్ విధానంలో ఆ పార్టీకే ఆ గుర్తు కేటాయించామని కోర్టుకు తెలిపింది. పిటిషనర్ పార్టీ, జనసేన పార్టీలు గుర్తింపులేని రిజిస్టర్డ్ పార్టీ నిర్వచనం పరిధిలోకి వస్తాయని కేంద్ర ఎన్నికల సంఘం తరఫున సీనియర్ న్యాయవాది అవినాష్ దేశాయ్ తెలిపారు. నిబంధనల ప్రకారం అసెంబ్లీ కాలపరిమితి ముగియడానికి ఆరు నెలల ముందు గుర్తుల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రస్తుత అసెంబ్లీ కాలపరిమితి ఈ ఏడాది జూన్ 11తో ముగుస్తుందన్నారు. ఈ నేపథ్యంలో గతేడాది డిసెంబరు 12న దరఖాస్తులు ఆహ్వానించామన్నారు. జనసేన పార్టీ గాజుగ్లాసు గుర్తు కేటాయించాలని కోరుతూ అదే రోజు దరఖాస్తు చేసిందన్నారు. పిటిషనర్ డిసెంబరు 20న దరఖాస్తు చేయగా, ఆ దరఖాస్తు 26వ తేదీన ఎన్నికల సంఘానికి అందిందన్నారు. నిబంధనల ప్రకారం మొదట దరఖాస్తు చేసుకున్న పార్టీకి గుర్తు కేటాయించామన్నారు. ఈ వివరాలను పరిగణలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ ఎన్.జయసూర్య పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించారు. విచారణను ఈ నెల 13కి వాయిదా వేశారు.

నేటి నుంచి విశాఖలో రాష్ట్రస్థాయి 'ఆడుదాం ఆంధ్ర'

విశాఖపట్నం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): 'ఆడుదాం ఆంధ్ర' రాష్ట్రస్థాయి పోటీలు శుక్రవారం నుంచి ఐదు రోజులపాటు విశాఖ నగరంలో జరుగుతాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 26 జిల్లాల నుంచి 2,964 మంది క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు.

'కోడికత్తి' శ్రీనుకు బెయిల్

షరతులతో మంజూరు చేసిన హైకోర్టు .. ప్రతి ఆదివారం ముమ్మిడివరం పీఎస్‌లో హాజరుకావాలి

- నేడు విశాఖ సెంట్రల్ జైలు నుంచి శ్రీనివాస్ విడుదల

అమరావతి/అమలాపురం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కోడికత్తి కేసులో నిందితుడు జనిపల్లి శ్రీనివాసరావుకు హైకోర్టులో ఊరట లభించింది. న్యాయస్థానం అతనికి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. విశాఖ ఎన్ఐఏ కోర్టు సంతృప్తి మేరకు రూ.25 వేల పూచీకత్తుతో రెండు ష్యూరిటీలు సమర్పించాలని ఆదేశించింది. బెయిల్‌పై విడుదలైన అనంతరం కోర్టు తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు ప్రతి ఆదివారం ముమ్మిడివరం ఎస్‌హెచ్‌వో ముందు హాజరు కావాలని పిటిషనర్‌కు స్పష్టం చేసింది. విచారణ సాఫీగా పూర్తయ్యేలా ట్రయల్ కోర్టుకు సహకరించాలని సూచించింది. కేసు గురించి మీడియా ముందు ఎలాంటి ప్రకటనలు చేయొద్దని పిటిషనర్‌ను ఆదేశించింది. బెయిల్ నిరాకరిస్తూ విశాఖలోని ఎన్ఐఏ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేసింది. ప్రస్తుత ఉత్తర్వులతో ప్రభావితం కాకుండా విచారణను కొనసాగించాలని ఎన్ఐఏ కోర్టుకు స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు, జస్టిస్ మండవ కిరణ్మయితో కూడిన ధర్మాసనం గురువారం తీర్పు ఇచ్చింది. 2018 అక్టోబరు 25న అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌పై విశాఖ ఎయిర్‌పోర్టు లాంజ్‌లో కోడి కత్తితో దాడి చేసిన ఘటనలో నిందితుడు శ్రీనివాస్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో ఆయనకు బెయిల్ ఇచ్చేందుకు నిరాకరిస్తూ విశాఖ ఎన్ఐఏ కోర్టు గతేడాది సెప్టెంబరు 22న ఉత్తర్వులు జారీ చేసింది. వాటిని సవాల్ చేస్తూ శ్రీనివాసరావు హైకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్ తరఫున న్యాయవాదులు పిచ్చుక శ్రీనివాసరావు, సలీం, ఎన్ఐఏ తరఫున అడిషనల్ సొలిసిటర్ జనరల్ బి.నరసింహశర్మ వాదనలు వినిపించారు. జనవరి 24న ఇరువైపుల వాదనలు ముగియడంతో తీర్పు రిజర్వు చేసిన ధర్మాసనం గురువారం నిర్ణయాన్ని వెల్లడించింది.

తీర్పులో ఏముందంటే...

'హత్య చేయాలనే ఉద్దేశంతోనే బాధితుడి (జగన్మోహన్‌రెడ్డి) మెడపై నిందితుడు కోడికత్తితో దాడి చేసేందుకు ప్రయత్నించారని విశాఖ ఎయిర్‌పోర్టు పీఎస్ పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో నిర్దిష్టంగా పేర్కొనలేదు. సీఐఎస్ఎఫ్ కమాండెంట్ దినేశ్ కుమార్ విచారణలో కోర్టుకు ఇచ్చిన సాక్ష్యంలోనూ హత్య చేయాలనే ఉద్దేశంతో నిందితుడు దాడిచేశారని చెప్పలేదు. బాధితుడికి స్వల్పగాయమే అయిందని గాయ ధ్రువీకరణ పత్రంలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో బాధితుడికి తీవ్రమైన గాయం కాలేదని, దానివల్ల మరణం సంభవించదన్న పిటిషనర్ న్యాయవాది వాదనతో ఏకీభవిస్తున్నాం. ఐదున్నరేళ్లుగా పిటిషనర్ జైల్లో మగ్గుతున్నారని, 2019లో చార్జిషీట్ దాఖలు చేసినా విచారణలో పురోగతిలేదని పిటిషనర్ వాదిస్తున్నారు. సాక్ష్యం నమోదుకు అడ్వకేట్ కమిషనర్‌ను నియమించాలని బాధితుడు వేసిన అనుబంధ పిటిషన్ ట్రయల్ కోర్టులో పెండింగ్‌లో ఉంది. లోతైన విచారణ జరిపేలా ఆదేశించాలని వేసిన అనుబంధ పిటిషన్‌ను కొట్టివేయడాన్ని సవాల్ చేస్తూ పిటిషనర్ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో దిగువ కోర్టులో విచారణ ప్రక్రియను హైకోర్టు నిలుపుదల చేసింది. కారణం ఏదైనా పిటిషనర్ తప్పు లేకుండా విచారణలో జాప్యం జరుగుతోంది. వేగవంతమైన విచారణ నిందితుడి హక్కు. రాజ్యాంగంలోని అధికరణ 21 ఇదే చెబుతుంది. విచారణ లేకుండా ఎక్కువకాలం నిర్బంధించడం మానవ హక్కులను హరించడమే. త్వరితగతిన విచారణ జరగాలని శ్రీనివాసరావు మాదిరి జైలులో నిర్బంధంలో ఉన్న నిందితులు కోరడం న్యాయబద్ధమైనదే. కారణం ఏదేమైనప్పటికీ సమీప భవిష్యత్తులో కేసు విచారణ పూర్తికావడం సాధ్యపడేటట్లు లేదు. ఈ తప్పును పిటిషనర్‌కు ఆపాదించలేం. సుదీర్ఘ కాలంగా జైలులో మగ్గుతున్న కారణంగా పిటిషనర్ తనపై నమోదైన కేసును సమర్థంగా ఎదుర్కోలేకపోతున్నారన్న పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనతో ఏకీభవిస్తున్నాం. బెయిలిస్తే సాక్ష్యాలు తారుమారు చేసే అవకాశం ఉందన్న అడిషనల్ సొలిసిటర్ వాదనలతో మేం ఏకీభవించడంలేదు. విచారణకు అందుబాటులో లేకుండా పోయే ప్రమాదం ఉందని, సంచలన కేసు అయినందున మీడియా ముందు అవాస్తవాలు చెబితే విచారణపై ప్రతికూల ప్రభావం చూపుతుందన్న ఏఎస్‌జీ ఆందోళనలు పరిగణనలోకి తీసుకొని షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తున్నాం' అని తీర్పులో పేర్కొన్నారు.



కోడికత్తి దాడిలో జగన్ భుజానికైన గాయం, విశాఖ పోలీసుల అదుపులో శ్రీను (ఫైల్)

శ్రీనుతో 'విదసం' సభ్యుల ములాఖత్

విశాఖపట్నం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): కోడికత్తి కేసులో నిందితుడు శ్రీనివాస్‌ను విశాఖ దళిత సంఘాల (విదసం) ఐక్యవేదిక సభ్యులు గురువారం జైలుకెళ్లి ములాఖత్ ద్వారా కలిశారు. బెయిల్ వచ్చిన విషయం చెప్పగానే శ్రీనివాస్ ఉద్వేగానికి లోనయ్యాడని, చేతులు పట్టుకొని కృతజ్ఞతలు చెప్పాడని విదసం కన్వీనర్ బూసి వెంకటరావు తెలిపారు. శుక్రవారం ఎన్ఐఏ కోర్టులో జామీను పత్రాలు సమర్పించిన తర్వాత శ్రీనివాస్‌ను బయటకు తీసుకొచ్చి సొంతూరు పంపిస్తామని చెప్పారు. ఈ బృందంలో విదసం ప్రతినిధులు ఎస్ఆర్ వేమన, ఎస్.సుధాకర్, అప్పలరాజు ఉన్నారు.

కుటుంబ సభ్యుల హర్షం

కోడికత్తి శ్రీనుకు బెయిల్ మంజూరు కావడంపై కుటుంబ సభ్యులు, బంధువులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శ్రీను బెయిల్ కోసం తల్లి సావిత్రి, సోదరుడు సుబ్బరాజు ఢిల్లీకి వెళ్లారు. స్వగ్రామంలో తండ్రి తాతారావు ఒక్కరే ఉన్నారు. బెయిల్ విషయంలో న్యాయవాది సలీమ్, మిత్రబృందం చేసిన కృషిని ప్రతి ఒక్కరూ అభినందిస్తున్నారు.

కోడి కత్తి శ్రీను రక్షణ బాధ్యత జగన్‌దే

- కోర్టుకు హాజరై సాక్ష్యం చెప్పాలి.. ఏపీ భవన్ ధర్నాలో నేతల డిమాండ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): కోడి కత్తి శ్రీనుకు, ఆయన కుటుంబసభ్యులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత జగన్ ప్రభుత్వంపై ఉందని వివిధ సంఘాల నేతలు స్పష్టం చేశారు. దళితులు, మైనార్టీలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులకు వ్యతిరేకంగా కోడి కత్తి శ్రీను తల్లి సావిత్రి, అన్న సుబ్బరాజుతోపాటు సమతా సైనిక్ దళ్, మైనారిటీ హక్కుల పోరాట సమితి, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం ఢిల్లీలోని ఏపీ భవన్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మైనార్టీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ ఫారూక్ షిబ్లీ మాట్లాడుతూ.. జగన్ పాలనలో దళితులకు, మైనార్టీలకు తీరని అన్యాయం జరుగుతోందన్నారు. జగన్‌కు మనసు ఉంటే కోర్టుకు వచ్చి సాక్ష్యం చెప్పి శ్రీను కుటుంబ సభ్యులను ఆదుకునేవారన్నారు. కోడి కత్తి కేసుకు సంబంధించిన అన్ని అంశాలూ త్వరలో బయటికి వస్తాయని వైసీపీ రెబల్ ఎంపీ రఘురామకృష్ణరాజు ఆశాభావం వ్యక్తం చేశారు. అర్హత లేని వ్యక్తిని అందలమెక్కించిన ఘనత కోడి కత్తిదన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఏపీ ప్రభుత్వం చేసినంత అన్యాయం చరిత్రలో ఏ రాష్ట్రమూ చేయలేదన్నారు. సమతా సైనిక్ దళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లి సురేంద్రబాబు మాట్లాడుతూ కోడి కత్తి శ్రీనును బలిపశువును చేసి జగన్ సీఎం పదవిని అధిష్ఠించారన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ధర్నాలో పాల్గొని సంఘీభావం తెలిపారు. కోడి కత్తి శ్రీను కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఏపీలో రాజకీయ పార్టీలపైనా దాడులకు పాల్పడుతూ జగన్ వ్యవహరిస్తున్న తీరు సిగ్గు చేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితుడిని కొట్టి చంపి డోర్ డెలివరీ చేసిన నిందితుడిని జగన్ వెంటేసుకు తిరుగుతున్నారని ఆరోపించారు.

నేటి నుంచి గుణదలమాత
వంద వసంతాల వేడుకలు



విద్యుత్ దీపాల వెలుగుల్లో గుణదలమాత క్షేత్రం

విజయవాడ (గుణదల), ఫిబ్రవరి 8: దక్షిణ భారతదేశంలో రెండవ అతిపెద్ద క్రైస్తవ దేవాలయంగా పేరుపొందిన గుణదల మాత క్షేత్రం వంద వసంతాల వేడుకలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి 9, 10, 11 తేదీల్లో గుణదల మేరీ మాత ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేసినట్టు విజయవాడ కతోలిక పీఠం మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మూడు రోజులపాటు జరగనున్న ఉత్సవాలకు ముఖ్యఅతిథులుగా విజయవాడ బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు, భారత్ నేపాల్ దేశాల అపోస్థలిక రాయబారి లియోపొల్డో జిరెల్లి హాజరుకానున్నారని తెలిపారు. ఉత్సవాలకు లక్షలాదిగా భక్తులు తరలిరానుండటంతో రైల్వే, ఆర్టీసీ ఉన్నతాధికారులతో చర్చించి తగిన ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు.

పత్రికల్లో వచ్చినవి నమ్ముతారా?

- స్పీకర్‌గా మంచి నిర్ణయాన్ని తీసుకోండి.. అనర్హత పిటిషన్‌పై ఆనం

అమరావతి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): 'ఢిల్లీ మెట్రోలో ప్రధాని మోదీతోపాటు మాజీ సీఎం చంద్రబాబు ప్రయాణం చేస్తూ నమస్కరిస్తున్నట్టుగా పత్రికలో వచ్చింది. దానిని నమ్ముతారా? నేను వేరే పార్టీ తరఫున ప్రకటనలు ఇచ్చినట్లుగా ఆ పత్రికల యాజమాన్యాల నుంచి పత్రాలు తీసుకువస్తారా? వాస్తవాల ఆధారంగా ఉన్నత నిర్ణయం తీసుకోండి' అని స్పీకర్ తమ్మినేని సీతారాంను ఉద్దేశించి వైసీపీ ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. పత్రికల్లో వచ్చిన సమాచారాన్ని ఎలా నమ్ముతానని స్పీకర్ సమాధానం ఇచ్చారు. తనపై పత్రికల్లో వచ్చిన ప్రకటనలకూ ఇంతే విలువ ఉంటుందని ఆనం సమాధానం ఇచ్చారు. అనర్హత పిటిషన్‌కు సంబంధించి స్పీకర్ కార్యాలయం నోటీసు పంపడంతో గురువారం ఆనం హాజరయ్యారు. కాగా, వైసీపీ ఎమ్మెల్యేలు తాడికొండ శ్రీదేవి, మేకపాటి చంద్రశేఖరరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తమకు అనారోగ్యంగా ఉన్నందున హాజరుకాలేమని సమాచారం పంపారు. అదేవిధంగా టీడీపీ ఎమ్మెల్యేలు వల్లభనేని వంశీ, మద్దాల గిరి, వాసుపల్లి గణేశ్, కరణం బలరాం.. స్పీకర్ ముందు వ్యక్తిగతంగా హాజరుకాలేదు. దీంతో ఈ ఎనిమిది మందిపై స్పీకర్ నిర్ణయం ఎలా ఉంటుందోనన్న ఆసక్తి నెలకొంది.

'కృష్ణపట్నంలో' కంటైనర్ టెర్మినల్ కొనసాగించాల్సిందే!

- లేకపోతే పోరాటమే.. పోర్టు సీఈవోకు అఖిలపక్షం అల్టిమేటం

ముత్తుకూరు, ఫిబ్రవరి 8: నెల్లూరు జిల్లా అదాని కృష్ణపట్నం పోర్టులో కంటైనర్ టెర్మినల్‌ను యథావిధిగా కొనసాగించకపోతే పోరాటం తప్పదని అఖిలపక్షం నాయకులు హెచ్చరించారు. టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, అఖిలపక్షం నాయకులు కంటైనర్ టెర్మినల్ ఆధారిత కంపెనీల ఉద్యోగులతో గురువారం కృష్ణపట్నం పోర్టు గేట్ వద్ద ఆందోళన చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొనడంతో పోర్టు అధికారులు ముఖ్య నాయకులకు మాత్రమే పోర్టు సీఈవోతో మాట్లాడేందుకు అవకాశం ఇచ్చారు. సీఈవో జీజే రావుతో నాయకులు సమావేశమై కంటైనర్ టెర్మినల్ తరలించడంపై నిలదీశారు. సోమిరెడ్డి మాట్లాడుతూ వారం రోజుల్లో లిఖితపూర్వకంగా కంపెనీ నిర్ణయాన్ని తెలియజేయాలని లేకుంటే ప్రజల పక్షాన పోరాటం చేసేందుకు అఖిలపక్షం సిద్ధంగా ఉంటుందని స్పష్టంచేశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

చీల్చినవారిదే పార్టీ!

అఖిలభారత జాతీయ కాంగ్రెస్‌కు విదేశీ సోనియాగాంధీ నాయకత్వం వహించడాన్ని సవాలుచేసి, పార్టీనుంచి సస్పెండ్ అయి, పి.ఎ.సంగ్మా, తారిఖ్ అన్వర్లతో కలిసి నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీని స్థాపించిన శరద్‌పవార్ పాతికేళ్ళ తరువాత పార్టీపేరూ, గుర్తూ కోల్పోవాల్సి వచ్చింది. ఎన్సీపీని, గడియారం గుర్తును చీలికవర్గానికి ఎన్నికల సంఘం దఖలుపరిచి, మూడురకాల పేర్లలో ఏది కావాలో ఎంచుకోమనడంతో ఈ మరాఠా రాజకీయయోధుడి పార్టీ చివరకు శరద్‌చంద్రపవార్ ఎన్సీపీగా మిగిలింది. సమయాన్ని చూపించే గడియారం తమ వద్దే ఉన్నందుకు ఇది అజిత్‌పవార్ కాలం అని ఎన్డీయేలో చేరిన వర్గం గుర్తుచేస్తున్నది. ఎన్నిపోయినా పర్లేదు, పెద్దాయన ఉన్నందున కాలం మాకే కలిసొస్తుందని మరో వర్గం గాంభీర్యాన్ని ప్రదర్శిస్తోంది.


సార్వత్రిక ఎన్నికల తరుణంలో ఈ ఎదురుదెబ్బకు ప్రతీకారంగా కుటుంబం కంచుకోట బారామతి నుంచి శరద్‌పవార్ లోక్‌సభకు పోటీచేయబోతున్నారని ఓ పెద్ద ప్రచారం ఊపందుకుంది. శరద్‌పవార్ కుమార్తె సుప్రియాసూలే ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ స్థానంలో తమ అభ్యర్థిని దింపబోతున్నట్టు ఉపముఖ్యమంత్రి అజిత్‌పవార్ ప్రకటించిన నేపథ్యంలో, బారామతి బరిలోకి పెద్దాయనే రావాలని కార్యకర్తలంతా ఆశపడ్డారు. శరద్‌పవార్ రాజ్యసభ సభ్యత్వం ఇంకా ఉన్నదని, ఆయన లోక్‌సభ పోటీలోకి దిగే ప్రశ్నే లేదని రాష్ట్రశాఖ అధ్యక్షుడు జయంత్ పాటిల్ గురువారం స్పష్టంచేయడంతో కార్యకర్తలు నిరుత్సాహపడ్డారట. తన జీవితకాలంలో పార్టీలను నిర్మించి, పలుమార్లు చీల్చిన ఈ రాజకీయదురంధరుడికి ఎనభైమూడేళ్ళ వయసులో ఉన్నది కోల్పోవడం, ఎన్నికలముందు కొత్తగా పునాదులు వేసుకోవాల్సిరావడం దురదృష్టకరమైన స్థితే.

గతానికి ఇప్పటికీ తేడావుంది. ఇప్పుడు ఆయన తన కుటుంబీకుడు, అప్పుడు, ఇంతకాలమూ పార్టీలో చక్రం తిప్పిన అజిత్‌పవార్‌తో పోరాడాలి. సార్వత్రిక ఎన్నికలు దూరంలో లేనందున, పార్టీ పేరును ఆయన ప్రజల్లోకి అతివేగంగా తీసుకుపోవాలి. గడియారం గుర్తుకు ఓటేయడానికి అలవాటు పడిన జనసామాన్యానికి తనకు ఖరారు కాబోతున్న కొత్త గుర్తునూ పరిచయం చేయాలి. పోయినవారు పోను మిగిలిన నాయకులనూ, కార్యకర్తలనూ యుద్ధానికి సిద్ధం చేయాలి. ప్రజల్లో ఉన్న ఆదరణను, సానుభూతినీ ఓట్లరూపంలోకి మార్చుకోవడం అంత సులభం కాదు.

ఇటీవల శివసేన, ఇప్పుడు ఎన్సీపీ, రెండూ బీజేపీ చేతిలో దెబ్బతిన్నాయి. ఎన్నికల సంఘం నిర్ణయం వెనుక అదృశ్యశక్తులున్నాయని పవార్ కుమార్తె వ్యాఖ్యానించడం రాజకీయమే కావచ్చు కానీ, ఈసీ నిర్ణయాలు చీలికవర్గాలను ఎత్తిపట్టే రీతిలో ఉండటం ఆశ్చర్యం కలిగిస్తోంది. పార్టీ నియమావళి సక్రమంగా లేకపోవడం, పాటించకపోవడం, అంతర్గత ఎన్నికలు సక్రమంగా జరగకపోవడం ఇత్యాది కారణాల రీత్యా చివరకు శాసనసభలో బలాబలాలనే ప్రధానంగా పరిగణించి తాను నిర్ణయానికి రావాల్సివచ్చిందని ఎన్నికల సంఘం అంటోంది. శివసేన, ఎన్సీపీ చీలికల నేపథ్యంలో ప్రాంతీయపార్టీలన్నీ నియమావళి, అంతర్గత ప్రజాస్వామ్యం విషయంలో నేర్చుకోవాల్సిందేమిటో చర్చ జరుగుతోంది. కానీ, ఎన్నికల సంఘం పవిత్రంగానే వ్యవహరించిందన్న నమ్మకం సామాన్యులకు లేకపోవడానికి ప్రధాన కారణం, దాని కమిషనర్ల నియామకం విషయంలో సుప్రీంకోర్టు సూచనలను కూడా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బేఖాతరుచేయడం. కమిషనర్ల ఎంపిక కమిటీలోకి ప్రధానితో పాటు ఓ కేంద్రమంత్రిని కూడా చేర్చి బీజేపీ సంఖ్యాబలంతో చట్టం చేసుకుంది. ఈసీ మీద అధికారపక్షం ఇంతటి శ్రద్ధపెడుతూంటే, అది స్వతంత్రంగా ఉంటుందని, ఫిరాయింపులకు అడ్డుపడుతూ ప్రజాస్వామ్యాన్ని రక్షిస్తుందని ఎవరు నమ్ముతారు? వివిధ ఎన్నికల సందర్భంలో సంఘం వ్యవహరిస్తున్న తీరు తెన్నులు కూడా అనుమానాలకు ఆస్కారం కలిగించే రీతిలోనే ఉంటూ వస్తున్నాయి.

గత సార్వత్రిక ఎన్నికలనుంచి ఇప్పటివరకూ మహారాష్ట్రలో జరిగినన్ని చీలికలు, చేరికలు ఎక్కడా లేవు. రెండు బలమైన ప్రాంతీయశక్తుల చీలికనుంచి బలంగా అవతరించిన అక్కడి ప్రభుత్వం పార్లమెంటు ఎన్నికల్లో అద్భుతాలు చేయాలి. కానీ, ఏక్‌నాథ్ షిండే, అజిత్‌పవార్ సృష్టితో ఎన్డీయే బాగుపడలేదని, పైగా గతంలో కంటే ఎక్కువ పార్లమెంటు స్థానాలు కోల్పోవచ్చునని సర్వేలు అంటున్నాయి. నాయకుల చేరికతో అధికారాన్ని అందుకోవచ్చుకానీ, ప్రజావిశ్వాసాన్ని పొందడం అంత సులభం కాదు.

పత్తాలేని ప్రజాస్వామ్య నైతికత



> చండీగఢ్ మేయర్ ఎన్నిక భారత ప్రజాస్వామ్య దౌర్బల్యాలను బహిర్గతపరిచింది. ఎంతగా అంటే ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని దేశ సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయక తప్పలేదు. సదరు రిటర్నింగ్ ఆఫీసర్, అందునా పాలక పార్టీలో ఒక చిన్న పదవిలో ఉన్న ఆ వ్యక్తి తన సొంతంగా వ్యవహరించగలడని ఎవరైనా విశ్వసిస్తారా? అతడు తన సొంతంగా వ్యవహరించలేడన్నది స్పష్టం. అయినప్పుడు ఆ మేయర్ ఎన్నికలో చోటుచేసుకున్న అక్రమానికి అసలు బాధ్యులు ఎవరు?

మీరు, ఈ సంపాదకీయ పుటలోని NW వ్యాసంపై దృష్టి పెట్టే ముందే, మొదటి పేజీలో పాకిస్థాన్ సార్వత్రిక ఎన్నికలపై వార్త చదివే వుంటారు. పాకిస్థాన్‌లో ఎన్నికలా!? రాజకీయ పరిశీలకులతో పాటు పాక్ ఓటర్లలో అత్యధికులు సైతం ఆ ప్రక్రియను ఒక 'ఎంపిక'గా మాత్రమేగానీ, ఒక 'ఎన్నిక'గా చూడడం లేదన్నది ఒక నిష్ఠుర సత్యం. పాకిస్థాన్‌లో ప్రజాస్వామిక మాంద్యానికి కారణమేమిటో మరి చెప్పనవసరం లేదు. ఆ దేశ సర్వం సర్వాధిపత్య సైన్యం ఒక పద్ధతి ప్రకారం తమ వ్యవస్థలోని సమస్త స్థాపరమైన నిరోధక సమతౌల్యాల (చెక్స్ అండ్ బ్యాలెన్సెస్)ను ఒక పద్ధతి ప్రకారం నిర్మూలించింది. పాకిస్థాన్‌కు భిన్నంగా భారతీయ ప్రజాస్వామ్యం ఇప్పటికీ సుదృఢంగా ఉన్నది. అయితే మన వ్యవస్థ అంతా సజావుగా, సక్రమంగా ఉందని భావించడం తొందరపాటే అవుతుంది. 'మ్యాచ్ ఫిక్సింగ్' (లాలూచీ క్రీడ) అనేది భారత ఉపఖండపు అంటువ్యాధి కాదూ? కనుక దేనినైనా వెన్వెంటనే విశ్వసించకుండా సంశయాత్మక వైఖరితో వివేచించడం ఆరోగ్యకరం.

చండీగఢ్ మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ ఎన్నిక ఆ వాస్తవాన్ని మరోసారి నొక్కి చెప్పింది. ప్రపంచ అతి పెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థలో ఒక మేయర్ ఎన్నిక పెద్దగా ప్రాముఖ్యం లేని వ్యవహారమే. ఉపేక్షణీయమైనది. అయితే చండీగఢ్ మేయర్ పదవికి తాజాగా జరిగిన ఎన్నిక మరో విధంగా ప్రాధాన్యాన్ని సంతరించుకున్నది. అవును, ప్రస్తావిత మేయర్ ఎన్నిక భారత ప్రజాస్వామ్య దౌర్బల్యాలను బహిర్గతపరిచింది. ఎంతగా అంటే ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని దేశ సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయక తప్పలేదు. పోలింగ్ ప్రక్రియను నిర్వహించిన రిటర్నింగ్ అధికారి అవకతవకలకు పాల్పడడం నియమ నిబంధనలను కెమెరా సాక్షిగా ఉల్లంఘించడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. అతడి చర్యలు ప్రజాస్వామ్యాన్ని పరిహసించడమే కాదు, హత్య చేయడమేనని సుప్రీంకోర్టు ఆగ్రహించింది. సదరు రిటర్నింగ్ అధికారిని కఠినంగా శిక్షించాలని ఖండితంగా పేర్కొంది. ఇప్పటికివి న్యాయపరమైన వ్యాఖ్యలే కావచ్చుగానీ, అయితే చండీగఢ్‌లో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన వారిని ఎట్టి పరిస్థితులలోనూ శిక్షించి తీరాల్సిందేనన్న విషయమై సుప్రీంకోర్టు దృఢ సంకల్పంతో ఉన్నది. అత్యున్నత న్యాయవ్యవస్థ తీవ్ర ఆగ్రహం సమర్థనీయమైనదే, సందేహం లేదు. అయితే ఇబ్బంది కలిగించే ప్రశ్న ఒకటి ఉన్నది: మేయర్ ఎన్నికలోనే అవకతవకలు అంతగా జరిగితే అంతకంటే కీలక ప్రాధాన్యమున్న (అసెంబ్లీ లేదా పార్లమెంటు) ఎన్నికలలో అటువంటి అక్రమాలు చోటుచేసుకుంటే సంభవించేది ఏమిటి? మన ప్రజాస్వామ్యం ఏమైపోను?

చండీగఢ్ మేయర్ ఎన్నిక ఈ ఏడాది జనవరి 18నే జరగవలసి ఉండగా చివరిక్షణంలో వాయిదా వేశారు. రిటర్నింగ్ అధికారిగా నియమితుడైన వ్యక్తి హఠాత్తుగా అనారోగ్యానికి గురై ఆస్పత్రిపాలు కావడం వల్లే ఎన్నికను వాయిదా వేయడం అనివార్యమయింది. అయితే న్యాయస్థానం జోక్యంతో ఆ ఎన్నికను సత్వరమే నిర్వహించక తప్పలేదు. కానీ నిర్వహించిన తీరుతెన్నులు అనేక అనుమానాలకు తావిచ్చేవిగా ఉన్నాయి. ఎనిమిది ఓట్లను రిటర్నింగ్ అధికారి చిత్రంగా రద్దు చేశారు. అవన్నీ ఆమ్ ఆద్మీ పార్టీ– కాంగ్రెస్ కూటమికి చెందినవే. ఆ రద్దయిన ఓట్ల బ్యాలెట్ పత్రాలను పరిశీలించేందుకు పోలింగ్ ఏజెంట్లకు అనుమతి నివ్వలేదు. ఈ అల్ల కల్లోలంలో భారతీయ జనతా పార్టీ అభ్యర్థి కొత్త మేయర్‌గా ఎన్నికైనట్టు ఏకపక్షంగా ప్రకటించడం జరిగింది. ఆ ప్రకటన చేసిన రిటర్నింగ్ అధికారి అనీల్ మాసి బీజేపీ మైనారిటీ మోర్చా సభ్యుడు, మునిసిపల్ కార్పొరేషన్ నామినేటెడ్ కౌన్సిలర్ కావడంతో మేయర్ ఎన్నికలో అతడి పాత్ర మరింతగా అనుమానాస్పదమయింది.

చండీగఢ్ మేయర్ ఎన్నికను స్థానిక పాలనా సంస్థల సంకుచితత్వ రాజకీయాలకు మరొక తార్కాణంగా కొట్టివేయవచ్చు. అయితే ప్రతిపక్ష 'ఇండియా' కూటమి భాగస్వాములుగా ఆప్, కాంగ్రెస్ పార్టీలు కలసికట్టుగా మొట్టమొదటిసారి బీజేపీని సవాల్ చేస్తూ ముందుకు రావడంతో ఆ మేయర్ ఎన్నిక ఎనలేని ప్రాధాన్యం సంతరించుకున్నది. ఆరంభ దశలో ఉన్న 'ఇండియా' కూటమి తన సంఖ్యాబలం ప్రత్యర్థి ప్రాబల్యాన్ని తీవ్రంగా సవాల్ చేయగలదని 'ఇండియా' కూటమి ప్రప్రథమంగా రుజువు చేసింది. కాగా సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో 'ఇండియా' కూటమి ఐక్యతను, మనోస్థైర్యాన్ని మరింతగా దెబ్బ తీసేందుకు చండీగఢ్ మేయర్ ఎన్నిక బీజేపీకి ఒక అవకాశాన్ని కల్పించింది.



■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

ఈ కారణంగానే చండీగఢ్ మేయర్ ఎన్నిక పర్యవసానాలు భావి రాజకీయాలకు సూచనలుగా ఉన్నాయి. ఒక విధంగా అవి అమంగళకరంగా ఉన్నాయని చెప్పక తప్పదు. ప్రతిపక్షానికి స్పష్టమైన సంఖ్యాబలం ఉన్నప్పటికీ ఆప్–కాంగ్రెస్‌కు 20 మంది కౌన్సిలర్ల మద్దతు ఉండగా, బీజేపీకి 16 మంది కౌన్సిలర్ల మద్దతు ఉన్నది. అయినప్పటికీ ఆ మేయర్ పదవి 'తస్కరణ'కు గురయింది. అయినప్పుడు భావి ఎన్నికల పోరాటాలలో ఇటువంటి పరిణామాలు సంభవించవనేందుకు భరోసా ఏమిటి? మరింత ముఖ్యమైన విషయమేమిటంటే రిటర్నింగ్ అధికారి కపట ప్రవర్తన, రాజ్యాంగ అధికారులు, ప్రజాస్వామిక సంస్థలూ అంతకంతకూ నిరంతర నిఘాకు గురవుతున్న తీరుతెన్నులకు అనుగుణంగా ఉన్నది. గవర్నర్ల పాత్రను – జార్ఖండ్ గవర్నర్ ఇందుకొక తాజా ఉదాహరణ– పాలకులు అంతకంతకూ తమ తీవ్ర పక్షపాత దృక్పథం నుంచి చూస్తున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కానివ్వండి లేదా సీబీఐ కానివ్వండి, చట్టాలను అమలుపరిచే సమస్త అధికార యంత్రాంగమూ అధికారంలో ఉన్న పార్టీకి పూర్తి అనుకూలత, విధేయతతో వ్యవహరించడం మామూలు విషయమయిపోయింది. చివరకు ఎన్నికల సంఘం తటస్థతను కూడా ప్రశ్నించడం జరుగుతోంది!

కార్యనిర్వాహక వర్గం అధికారాల దుర్వినియోగంలో భాగంగానే ఈ పరిణామాలు సంభవిస్తున్నాయనే వాదన ఒకటి గట్టిగా ఉన్నది. అందులో నిజం లేకపోలేదు. అయితే ఇవి కేవలం 2014లో మాత్రమే ప్రారంభం కాలేదు. దశాబ్దాలుగా మన అధికార రాజకీయాలలో అవి చాలా సహజంగా, తరచు చోటుచేసుకుంటున్నాయనేది ఎవరూ కాదనలేని సత్యం. ఇందిరాగాంధీ ఒక అర్ధరాత్రి అత్యవసర పరిస్థితిని ప్రకటించి తన ప్రత్యర్థులు అందరినీ అరెస్ట్ చేయలేదా? రికార్డు స్థాయిలో రాష్ట్రాలలో 50 సార్లు కేంద్ర పాలన విధించిన ఘన చరిత్ర కూడా ఆమెదే కాదూ? ఆమె తనయుడు రాజీవ్‌గాంధీ పరువు నష్టం బిల్లు తీసుకువచ్చి పత్రికా స్వాతంత్ర్యానికి భంగం కలిగించలేదూ? ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆయన మంత్రులు తరచూ విమర్శిస్తుండే జవహర్‌లాల్ నెహ్రూ ప్రజాస్వామ్య విలువలు, సంప్రదాయాలను నిష్ఠగా పాటించిన నేతగా ప్రసిద్ధుడు. మరి ఆయన సైతం రాజ్యాంగానికి మొదటి సవరణతో వాక్ స్వాతంత్ర్యానికి అవరోధాలు కల్పించారు. కేరళలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన కమ్యూనిస్టు పార్టీ ప్రభుత్వాన్ని రద్దు చేశారు.

అందరికీ 'మంచిరోజులు' తీసుకువస్తామనే హామీతో నరేంద్ర మోదీ ప్రభుత్వం 2014లో అధికారంలోకి వచ్చింది. బీజేపీ భిన్నమైన పార్టీ అని, కాంగ్రెస్‌కు భిన్నమైన పాలనా సరళిని అనుసరించి ప్రజలకు శ్రేయస్సు సమకూరుస్తుందని నొక్కి చెప్పారు. అత్యవసర పరిస్థితి, చీకటి రోజుల్లో జైలువాసం గడిపిన బీజేపీ నాయకులకు తమ సొంత ప్రభుత్వ హయాంలో కళంకిత రాజకీయ వ్యవస్థను ప్రక్షాళించే అవకాశం లభించింది. మరి వారు ఆ విధ్యుక్త ధర్మాన్ని నిర్వర్తించారా? మోదీ పదేళ్ల పాలనలో విపక్ష నేతలను భయభీతులకు గురిచేసి లేదా ప్రలోభాలతో కనీసం నాలుగు ప్రతిపక్ష ప్రభుత్వాలను కూల్చి వేశారు. మరో రెండు విపక్ష ప్రభుత్వాలను తమకు అనుకూలంగా మార్చుకున్నారు. ఎన్నికలలో ప్రజలు ఇవ్వని మెజారిటీలను తమ 'సొంత' పద్ధతులలో సాధించుకున్నారు. ఈడీ, సీబీఐ మొదలైన కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలు ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో ఎంత చురుగ్గా ఉంటున్నాయో, బీజేపీ పాలిత రాష్ట్రాలలో అంత మందకొడిగా వ్యవహరిస్తున్నాయి. ఇక ప్రలోభాల గురించి చెప్పనవసరం లేదు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు కోట్ల రూపాయలు అందినట్టు ప్రజలు బాహాటంగా చెప్పుకుంటున్నారు. మంత్రి పదవులు, వివిధ కేసుల నుంచి నిర్దోషిగా బయటపడుతున్న వైనాన్ని గమనిస్తే ప్రలోభాలు వాస్తవమేనని అర్థమవుతుంది. గత రెండు సంవత్సరాలుగా ఎన్నికలు జరగని ముంబై మునిసిపల్ కార్పొరేషన్ రూ.500 కోట్ల విలువ చేసే వివిధ ఆధునికీకరణ ప్రాజెక్టులకు సంబంధించిన కాంట్రాక్టులను పూర్తిగా పాలక బీజేపీ–శివసేన ఎమ్మెల్యేలకు ఇచ్చిందని విపక్ష నేతలకు ఒక్కటీ కూడ ఇవ్వలేదని సమాచార హక్కు చట్టం ఆధారంగా సేకరించిన సమాచారం ప్రాతిపదికన ఇటీవల ఒక ప్రముఖ దినపత్రికలో ఒక వార్త వెలువడింది. రాజకీయ ప్రయోజనాలకు ప్రజల సొమ్మును ఇలా నిస్సిగ్గుగా ఎంపిక చేసిన కొద్దిమందికే పంపిణీ చేస్తున్నప్పుడు అందరికీ సమాన అవకాశాలు లభిస్తాయని విశ్వసించడం ఎలా? రాజకీయవేత్తల ధనబలం ఇప్పటికే ఎన్నికలను కళంకితపరిచింది. అపారదర్శక ఎన్నికల బాండ్లు పాలక పార్టీలకు మాత్రమే ఉపయోగపడుతున్నాయి. మరి ఎన్నికలలో పోటీలు అసమ పోటీలుగా కాక మరెలా ఉంటాయి? ఎన్నికల కమిషనర్ల నియామకం కూడా సమస్యాత్మకంగా ఉన్నది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్‌ల సక్రమతపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పాలక పార్టీలు వాటిని తమకు అనుకూలంగా ఉపయోగించుకుంటున్నాయనే ఆరోపణలు రుజువు కానప్పటికీ ఎన్నికల నిష్పాక్షిక నిర్వహణ విశ్వసనీయంగా జరగాలంటే మరింత నిఘా, అవసరమైన చోట న్యాయవ్యవస్థ పర్యవేక్షణ అవసరం కూడా ఎంతైనా ఉన్నది. సరే, చండీగఢ్ మేయర్ ఎన్నికలో అక్రమంగా వ్యవహరించిన రిటర్నింగ్ అధికారిని శిక్షించి తీరాలని సుప్రీంకోర్టు కఠినంగా మాట్లాడిన నేపథ్యంలో ఒక చివరి ప్రశ్న: సదరు రిటర్నింగ్ ఆఫీసర్, అందునా పాలక పార్టీలో ఒక చిన్న పదవిలో ఉన్న ఆ వ్యక్తి తన సొంతంగా వ్యవహరించగలడని ఎవరైనా విశ్వసిస్తారా? అతడు తన సొంతంగా వ్యవహరించలేడన్నది స్పష్టం. అయినప్పుడు ఆ మేయర్ ఎన్నికలో చోటుచేసుకున్న అక్రమానికి ఎవరు నిజమైన జవాబుదారు?

కదిరి సీమ స్మృతిలో కమ్యూనిస్టు రవూఫ్

మచ్చలేని మహామనిషి, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతిగా సీపీఐ(ఎంఎల్)కు చెందిన ఎస్‌పి రవూఫ్ పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. ఆయన నమ్మిన సిద్ధాంతాలు, ఆచరించిన మార్గాల స్ఫూర్తితో ఎంతోమంది పేదలు తమ హక్కులను సాధించుకున్నారు. సగం కాలం జైల్లోనే గడిపిన ఆయన, జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నారు. కనీసం వివాహం కూడా చేసుకోకుండా చివరి శ్వాస వరకూ పేదల పక్షాన పోరాడుతూనే గడిపారు. పోరాటమే ఊపిరిగా బలహీనవర్గాల కోసం తన జీవితాన్ని ధారపోసిన రవూఫ్ అంటే ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో తెలియనివారుండరు. అభాగ్యుల పాలిట ధ్రువతారగా నిలిచిన రవూఫ్ ఫిబ్రవరి 9, 2013న నింగికేగారు.

మధ్య తరగతి ముస్లిం కుటుంబంలో 1924లో అనంతపురం జిల్లా, కదిరిలోని కుటాగుళ్లలో ఆయన జన్మించారు. బీఏ పూర్తి చేసుకున్న ఆయన కదిరిలోని ఓ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేశారు. చిత్తూరు జిల్లా మదనపల్లిలో న్యాయవాద విద్యను అభ్యసించి, 1964లో న్యాయవాద పట్టాను పొందారు. అనంతరం మదనపల్లిలో కృష్ణశాస్త్రి అనే న్యాయవాది వద్ద అసిస్టెంట్‌గా కొన్నాళ్లు పనిచేశారు. న్యాయవాద వృత్తిలో స్వాతంత్ర్య సమరయోధుడు టంగుటూరి ప్రకాశం పంతులును రవూఫ్ ఆదర్శంగా తీసుకున్నారు. డబ్బులేదనే కారణంతో ఏ ఒక్కరికీ అన్యాయం జరగకూడదన్న ఉద్దేశంతో పేదల పక్షాన న్యాయస్థానంలోనూ తన పోరాటాన్ని సాగించారు.

'ప్రోగ్రెసివ్ గ్రూప్ ఆఫ్ కదిరి' పేరుతో రవూఫ్ ఎన్నో కార్యక్రమాలను నడిపారు. భూస్వామ్య దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడేవారు. ఇష్టం లేకపోయినా పార్టీ హైకమాండ్ సూచన మేరకు ఆయన ఎన్నికల్లో పాల్గొన్నారు. పంచాయతీ ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు. కమ్యూనిస్టు పార్టీలో సహచర నాయకుడు నిజాంవలితో కలసి అనేక పోరాటాల్లో పాలుపంచుకున్నారు. నిజాంవలితో కలసి భూస్వాముల దౌర్జన్యాలకు అడ్డుకట్ట వేయడంలో రవూఫ్ సఫలీకృతులయ్యారు. నిజాంవలి సీపీఐలోనే కొనసాగారు. ఈ నేపథ్యంలో ప్రజానాయకుడిగా ఎదుగుతున్న తరిమెల నాగిరెడ్డిని రవూఫ్ అనుసరించారు. ఆయన చేసే పోరాటాలకు రవూఫ్ ప్రచారం చేసేవారు. అనంతపురం జిల్లా రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ నాగిరెడ్డి నిరవధిక నిరాహార దీక్షను చేపట్టారు. నాగిరెడ్డికి పోటీగా నిజాంవలి కూడా నిరాహార దీక్షకు దిగారు. తన మిత్రుడిని కాదనుకుని నాగిరెడ్డికే రవూఫ్ మద్దతు పలికి, దీక్షను విజయవంతం చేసేందుకు గ్రామగ్రామాన తిరుగుతూ ప్రజలను చైతన్యపరిచారు.



> అనంతపురం జిల్లాలో మహిళలపై అకృత్యాలు చేసేవారిపై, భూస్వాములపై రవూఫ్ కఠిన చర్యలు తీసుకునేవారు. ప్రధానంగా కదిరి ప్రాంతంలోని రైతులు పెత్తందార్ల దోపిడీకి తీవ్రంగా గురయ్యేవారు. అనేకమంది భూస్వాములు, వడ్డీ వ్యాపారులు రైతులకు అప్పు ఆశ చూపి, అక్రమంగా ప్రామిసరి నోట్లు రాయించుకుని భూములను సొంతం చేసుకునేవారు. ఈ దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలను సాయుధం చేసి భూస్వాముల గుండెల్లో రవూఫ్ సింహస్వప్నంగా నిలిచారు.

అనంతపురం జిల్లా కమ్యూనిస్టు ఉద్యమంలో రవూఫ్ పాత్ర గణనీయమైనది. రవూఫ్ కర్ణాటక, కేరళ, తమిళనాడు, యూపీ, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాల్లోని నక్సలైట్ నాయకులతో, గ్రూపులతో సత్సంబంధాలను కొనసాగించి ఉద్యమాన్ని దేశవ్యాప్తం చేయడానికి కృషి చేశారు. వారితో కలసి భూస్వాములు, పెత్తందార్లతో నిరంతరం పోరాడేవారు. విజయనగరం జిల్లా పార్వతీపురం కేసులో ఆయనకు యావజ్జీవ కారాగారశిక్ష విధించారు. ఉద్యమంలో భాగంగా మొత్తం మీద ఆయన దాదాపు 27 సంవత్సరాలు జైల్లోనే గడిపారు.

మార్క్సిస్టు పార్టీ నుంచి విడిపోయిన తర్వాత రవూఫ్ నక్సల్బరీ ఉద్యమంలో కీలక భూమిక పోషించారు. నక్సల్బరీ నాయకుడైన చారుమజుందార్ ఆలోచనలకు ఆయన ప్రభావితులయ్యారు. నిరంతరం భూస్వాముల దోపిడీ, దౌర్జన్యాలపై రవూఫ్ సమరశీల పోరాటాలు చేశారు. చారుమజుందార్ సలహాతో శ్రీకాకుళంలో జరిగిన సాయుధ పోరాటంలో పాలుపంచుకున్నారు. ఈ క్రమంలోనే 1970లో జరిగిన సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర మహాసభలో రవూఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఎంపికయ్యారు. 1973లో అరెస్టయ్యారు. జైలులో ఉన్న సమయంలో కొండపల్లి సీతారామయ్య(కేఎస్)తో రవూఫ్‌కు పరిచయం ఏర్పడింది.

అనంతరం సీపీఐ(ఎంఎల్)తో తెగదెంపులు చేసుకున్న రవూఫ్ 1979లో సీపీఐ(ఎంఎల్) ఏపీ రీ ఆర్గనైజేషన కమిటీ (ఏపీఆర్‌సీ)ని ప్రారంభించారు. ఏపీఆర్‌సీ తనవంటి వైఖరి కలిగిన కేరళ రాష్ట్ర కమిటీతో జత కలిసింది. 1981లో జరిగిన అఖిలభారత సమావేశంలో సీపీఐ(ఎంఎల్) రీ ఆర్గనైజింగ్ కమిటీ సీపీఐ(ఎంఎల్) సెంట్రల్ రీ ఆర్గనైజేషన(సీఆర్‌సీ)గా మారింది. 1985లో అంతర్జాతీయ స్థాయిలో 'రెవెల్యూషనరీ ఇంటర్‌నేషనల్ మూవ్‌మెంట్' (రిమ్) ఆవిర్భవించింది. రవూఫ్ నాయకత్వంలోని పార్టీ ఇందులో చేరింది. విప్లవాత్మక మార్పులకు రవూఫ్ నాయకత్వం వహించారు. ఆ తర్వాత జరిగిన పలు కారణాల వల్ల సీఆర్‌సీ (కమ్యూనిస్టు రీ ఆర్గనైజింగ్ కమిటీ) రెండుగా చీలిపోయింది. ఒక విభాగంలో ఉన్న కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లోని కమ్యూనిస్టు మిత్రులతో కలసి సీపీఐ(ఎంఎల్) నక్సల్బరీని ఏర్పాటు చేశారు. 2006 దాకా రవూఫ్ ఆ పార్టీ కార్యదర్శిగా పనిచేశారు. అనంతరం ఈ పార్టీ సీపీఐ మావోయిస్టులో విలీనమైంది. అప్పటికే వయో భారం, అనారోగ్యం వల్ల ఆయన కదిరికే పరిమితమయ్యారు. వివిధ కమ్యూనిస్టు పార్టీల మధ్య ఐక్యత కోసం ఆయన ఎంతగానో శ్రమించారు.

అనంతపురం జిల్లాలో మహిళలపై అకృత్యాలు చేసేవారిపై, భూస్వాములపై రవూఫ్ కఠిన చర్యలు తీసుకునేవారు. ప్రధానంగా కదిరి ప్రాంతంలోని రైతులు పెత్తందార్ల దోపిడీకి తీవ్రంగా గురయ్యేవారు. అనేకమంది భూస్వాములు, వడ్డీ వ్యాపారులు రైతులకు అప్పు ఆశ చూపి, అక్రమంగా ప్రామిసరి నోట్లు రాయించుకుని భూములను సొంతం చేసుకునేవారు. ఈ దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలను సాయుధం చేసి భూస్వాముల గుండెల్లో రవూఫ్ సింహస్వప్నంగా నిలిచారు. పోలీసులు రవూఫ్ కోసం గాలిస్తున్నా, కదిరి ప్రాంత ప్రజలు ఆయనకు అండగా నిలిచి, కాపాడారు. కదిరి మాత్రమే కాకుండా పెనుకొండ, నల్లమాడ, హిందూపురం, పేరూరు, ధర్మవరం తదితర ప్రాంతాల్లో రవూఫ్ పర్యటించి రైతుల పక్షాన నిలిచారు.

రవూఫ్ పేదలకు అందించిన సేవలకు చిహ్నంగా కదిరి పట్టణంలోని కుటాగుళ్లలో ఆయన అభిమానులు స్మారక స్థూపాన్ని నిర్మించారు. ఈ స్థూపాన్ని కమ్యూనిస్టు నాయకుడు, ఎస్‌పి రవూఫ్ మెమోరియల్ ట్రస్టు అప్పటి అధ్యక్షుడు వడ్లమూడి కృష్ణారావు 2015, ఫిబ్రవరి 9న ఆవిష్కరించారు.

■ చల్లా నవీన్ కుమార్ నాయుడు
సీనియర్ జర్నలిస్టు

(నేడు రవూఫ్ వర్ధంతి)

డీఎస్సీ...మెగా జగన్నాటకం!

ఐదేళ్ల క్రితం పాదయాత్రలో భాగంగా జగన్మోహన్ రెడ్డి ఉత్తరాంధ్ర బహిరంగసభల్లో తాము అధికారంలోకి వస్తే 23 వేల టీచర్ పోస్టులను భర్తీ చేస్తామని, ఏటా డీఎస్సీ ప్రకటిస్తామని, జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని మెగా హామీ ఇచ్చారు. ఐదేళ్లు పూర్తికావస్తున్నా మెగా కాదుకదా కనీసం మినీ అయినా ప్రకటించకపోవడం విడ్డూరం. ఇప్పుడు మళ్లీ ఎన్నికలు సమీపిస్తుండడంతో డీఎస్సీ నాటకానికి తెర తీశారు. ఒకసారి 23 వేల పోస్టులు భర్తీ అన్నారు. మరోసారి 18,520 ఖాళీలు ఉన్నట్లు అసెంబ్లీ సాక్షిగా లెక్కలు వల్లించారు. ఇంకోసారి మాట మార్చి 8,366 అని చెప్పారు. తీరా 6,100 టీచర్ పోస్టులు భర్తీ చాలంటూ నిరుద్యోగుల ఆశలను తుస్సుమనిపించారు. దానికితోడు అప్రెంటిస్ విధానాన్ని పునరుద్ధరించి ప్రభుత్వానికి ఆర్థిక భారం లేకుండా పక్కా ప్లాన్‌తో నాటకం ఆడుతున్నారు. ఇదంతా నిరుద్యోగులను మోసం చేయడం కాదా? ప్రభుత్వం ఈ మినీ డీఎస్సీని ఇన్నాళ్ల తర్వాత ప్రకటించడంతో వయోపరిమితి మించిపోయి ఎంతోమంది అభ్యర్థులు అనర్హులయ్యారు. పోస్టుల సంఖ్యను పెంచి, జనరల్ అభ్యర్థుల వయోపరిమితిని 47 ఏళ్లు చేయాలి.

– తూలుగు రమణారావు

డిటిఎఫ్ రజతోత్సవ సభలు

డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డిటిఎఫ్) రజతోత్సవ సభలు ఫిబ్రవరి 10, 11 తేదీలలో విశాఖపట్నంలోని డాబా గార్డెన్స్‌లో గల ప్రేమసమాజంలోని కె.లక్ష్మారెడ్డి ప్రాంగణంలో జరుగనున్నాయి. ఈ సభల్లో 'విద్యారంగ సమస్యలు–విద్యార్థి ఉపాధ్యాయ జమిలి ఉద్యమాల ఆవశ్యకత' అంశంపై అఖిలభారత విద్యాహక్కు వేదిక జాతీయ సెక్రటేరియట్ సభ్యులు ప్రొ. జి.హరగోపాల్ ప్రసంగిస్తారు. 'నియత విద్య–సహజ విద్య' అంశంపై టీచర్, బౌద్ధ రచయిత డి.చంద్రశేఖర్ మాట్లాడతారు. 'మాతృభాషా మాధ్యమం–ఆర్థిక స్థితిగతులు' అంశంపై తెలుగు భాషోద్యమ సమాఖ్య అధ్యక్షులు గార్లపాటి ఉమామహేశ్వరరావు ప్రసంగిస్తారు.

– డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్

రాయలసీమకు జగన్ ద్రోహం!

> ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి హయాంలో రాయలసీమలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయడం సంగతి అటుంచి, ఆయన పునాదిరాళ్లు వేసిన పలు సాగునీటి ప్రాజెక్టులు నిధుల లేమితో అటకెక్కాయి. కృష్ణ, తుంగభద్ర నదుల నుంచి చట్టబద్ధంగా నికర జలాలు అందడం లేదనే ఆవేదన చిరకాలంగా ఉన్నా, అంతిమంగా పెన్నా వరద నీళ్లతో పాటు వర్షపు నీరు కూడా నిల్వ చేసుకొనే వసతి రాయలసీమకు కరువైంది. ఆ దిశగా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏ చర్యలనూ తీసుకోలేదు.



రాయలసీమ సుదీర్ఘ చరిత్ర పుటలు తిరగేస్తే జగన్మోహన్ రెడ్డి చేసినంత ద్రోహం ఏ ముఖ్యమంత్రి చేసి ఉండరేమో? అనిపిస్తుంది. పాదయాత్ర సమయంలో మాట తప్పను మడమ తిప్పను అని రాయలసీమ వాసులకు ఇచ్చిన హామీలన్నీ గాలికి పోయాయి. సీమ సాగు నీటి ప్రాజెక్టులకు తీవ్ర అపకారం చేసే కొత్త ట్రిబ్యునల్ నియామకానికి కేసీఆర్‌తో జగన్ లాలూచీ పడ్డారు. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయడం అటుంచి, తను పునాదిరాళ్లు వేసిన పలు సాగునీటి ప్రాజెక్టులు నిధులు లేమితో అటకెక్కాయి. జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చి ఉంటే రాయలసీమలో ఈ ఏడాది ఇంత భారీ ఎత్తున వలసలు ఉండేటివి కావు.

రాయలసీమ ప్రస్తావనకు వచ్చిన ప్రతి సందర్భంలో సాగునీటి ప్రాజెక్టులే ఎందుకు ముందుకు వస్తున్నాయంటే ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షలు, ఆవేదనలు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల ప్రజలకు భిన్నంగా ఉంటాయి. రాయలసీమలో వర్షపాతం తక్కువ. పైగా ఎక్కువ భాగం వ్యవసాయం వర్షాధారంగా కొనసాగుతుంది. ఫలితంగా రాయలసీమ వాసులు నీళ్లు నీళ్లు అని కలలో కూడా పరితపిస్తూ ఉంటారు. నేడు సగటు రాయలసీమవాసి రాజకీయాలతో నిమిత్తం లేకుండా 'నమ్మి నానబోస్తే పుచ్చి బుర్రలైనాయ'ని మథనపడుతున్నాడు. జగన్మోహన్ రెడ్డిని గుడ్డిగా నమ్మిన రాయలసీమ అస్తిత్వం కోరే ఆయన సామాజికవర్గం కూడా దిక్కుతోచని స్థితిలో ఉన్నది. కొందరు మాత్రం పోరుబాట వదలకుండా ప్రజాసంఘాల సమన్వయ వేదిక ఏర్పాటు చేసుకొని తిరుగుబాటు బావుటా ఎగరేశారు. జగన్మోహన్ రెడ్డి హయాంలో రాయలసీమతో పాటు నెల్లూరు జిల్లాలో 2019 నుంచి నాలుగేళ్ల కాలంలో రూ.2,637 కోట్లు మాత్రమే సాగునీటి ప్రాజెక్టులకు వ్యయం చేశారు. తమకు న్యాయం జరగలేదని సీమ వాసులు తిరస్కరించిన టీడీపీ హయాంలో 2014 నుంచి 2019 వరకు రూ.13,959 కోట్ల రూపాయల వ్యయం చేశారు.

జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి పదవి చేపట్టిన తర్వాత 2019లో రాయలసీమ పర్యటనకు వచ్చిన సందర్భంగా రాయలసీమను కోనసీమ చేసేందుకు సాగునీటి ప్రాజెక్టుల ప్రతిపాదనలు పంపమని కోరారు. ఇప్పుడు రాష్ట్ర ఇంజనీర్ ఇన్ చీఫ్‌గా ఉన్న నారాయణరెడ్డి కర్నూలు చీఫ్ ఇంజనీర్‌గా రూ.33,134 కోట్ల వ్యయంతో పలు పథకాలతో నివేదిక సమర్పించారు. అందులో ఏ ఒక్కటీ పట్టాల కెక్కలేదు. తీవ్ర వివాదాలు, గ్రీన్ ట్రిబ్యునల్ కేసుల్లో నలుగుతున్న రాయలసీమ ఎత్తిపోతల పథకం ఇందులో ఒకటి. తీరా ఇప్పుడు ఇది తాగునీటి పథకంగా మిగిలింది. కర్నూలు ఇంజనీరింగ్ అధికారులు ఈ పథకాన్ని ఈ పాటికే నిర్మాణం పూర్తయిన ముచ్చుమర్రి విస్తరణగా ప్రతిపాదన పంపారు. కాని తాడేపల్లి పాలెస్‌లో దీనిని పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ విస్తరణగా మార్చారు. ఫలితమే ఇన్ని తిప్పలు.

మరీ విడ్డూరమేమంటే 17 కిలోమీటర్లకు పైగా అప్రోచ్ ఛానల్ శ్రీశైలం రిజర్వాయర్ ముంపు ప్రాంతంలో ప్రతిపాదించడమే. కాళేశ్వరం ప్రాజెక్టుకు విద్యుత్ బిల్లుల మోత ఉంటే అయితే గియితే రాయలసీమ ఎత్తిపోతలకు అప్రోచ్ ఛానల్ గుదిబండ కాబోతోంది. ప్రతి ఏటా బురద తీయడం తలకు మించిన భారంగా మారబోతోంది. ఇంజనీరింగ్ నిపుణులు ముక్కు మీద వేలేసుకొనేదిగా ఉంది. ఇంత హడావుడి చేసి రాయలసీమ ఎత్తిపోతల నుంచి అదనంగా ఒక్క చుక్క నీటిబొట్టు తీసుకోబోమని రాష్ట్ర ప్రభుత్వమే గ్రీన్ ట్రిబ్యునల్ ముందు అఫిడవిట్ వేసింది. కేంద్ర జల సంఘానికి పంపిన డీపీఆర్‌లో కూడా ఇదే ఉంది. మరెందుకు ఈ పథకం చేపట్టినట్లు? తాజాగా శ్రీశైలం జలాశయం కృష్ణ యాజమాన్య బోర్డు అధీనంలోకి వెళ్లింది. బోర్డు అనుమతిస్తేనే ఏ మేరకైనా పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి నీళ్లు తీసుకోవలసి ఉంటుంది. వాస్తవంలో రాయలసీమలో ఎవ్వరూ ఈ ఎత్తిపోతల గురించి ఆలోచించడం లేదు.

వాళ్లు కోరుకొనేది సిద్ధేశ్వరం అలుగు ఆర్డీఎస్ కుడి కాలువ వేదవతి, తుంగభద్ర ఎగువ సమానాంతర కాలువ, గుండ్రేవుల రిజర్వాయర్. వీటి గురించి రాష్ట్ర ప్రభుత్వం కించిత్తు కూడా పట్టించుకోవడం లేదు. గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మాణం జరిగితే కేసీ కెనాల్ ఆయకట్టు మొత్తం శాశ్వతంగా స్థిరీకరణ జరుగుతుంది. కేసీ కెనాల్ ఆయకట్టుకు 2.965 టియంసిల సామర్థ్యంతో నిర్మించిన అలగనూరు జలాశయం నిర్మాణ లోపంతో చుక్కనీరు నిల్వ లేకుండా పశువుల మేత పొలంగా ఉంది. 2,65,628 ఎకరాలకు 39 టియంసిలు నికర జలాలు కేటాయింపులున్నా, కేవలం 1.25 టియంసిల సామర్థ్యం కలిగి బ్రిటీష్ కాలంలో నిర్మించిన సుంకేసుల బ్యారేజీ ఒక్కటే కేసీ కెనాల్ ఆయకట్టుకు దిక్కు. ఒక్కో ప్రాజెక్టుది ఒక్కో విషాద గాథ.

ఈ జాబితాలో హంద్రీనీవా ఎత్తిపోతల పథకముంది. కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు నాలుగు జిల్లాల్లో ఆరు లక్షల ఎకరాలకు సాగునీరు, 33 లక్షల మందికి తాగునీరు అందించే పథకమిది. 2021లో హంద్రీనీవా ప్రస్తుతమున్న ప్రధాన కాలువ 6300 క్యూసెక్కులు ప్రవహించే విధంగా 6,182 కోట్ల రూపాయలతో లైనింగ్ చేపట్టడానికి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. ఈ ప్రతిపాదన ఏమైందో తెలియదు. హంద్రీనీవా పురోగతికి నిదర్శనంగా గత ఏడాది జూన్ నెలతో ఆఖరైన నీటి సంవత్సరంలో శ్రీశైలం జలాశయానికి రెండు వేల టియంసిల నీళ్ళు చేరినా హంద్రీనీవా నుంచి 28 టియంసిలు మాత్రమే లిఫ్టు చేశారు. ఈ నీటి సంవత్సరంలో డిసెంబర్ ఆఖరుకు కేవలం 24 టియంసిలు లిఫ్టు చేశారు. సంభ్రమాశ్చర్యాలు గొల్పే మరో అంశమేమంటే ఒక్క హంద్రీనీవాకే విద్యుత్ బిల్లులు 2,700 కోట్లు చెల్లించవలసి ఉంది. కొసమెరుపు ఏమంటే 2019లో కర్నూలు ఇంజనీరింగ్ అధికారులు పంపిన ప్రతిపాదనల్లో ఇప్పుడున్న హంద్రీనీవా ప్రధాన కాలువకు సమానాంతర కాలువ నిర్మాణం మరొకటి ఉంది. ఆ ప్రతిపాదన ఊసే చర్చకు రాలేదు. 3850 క్యూసెక్కులు సామర్థ్యంతో కాలువ వున్నా అంతకు తక్కువగా నీటి ప్రవాహం సాగినా టీడీపీ హయాంలో కొన్ని సంవత్సరాల్లో 40 టియంసిలు ఎత్తి పోశారు. ఈ పథకం కింద పంట కాలువల నిర్మాణానికి భూసేకరణ ఎక్కడేసిన గొంగడి అక్కడే అన్నట్లుంది.

మరో పథకం వెలిగొండ. ఈ పథకానికి చెందిన రెండు టన్నెళ్లు పూర్తయినట్లు, పథకం అమలులోకి వచ్చేసిందని, నిర్మాణ సంస్థతో పాటు ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రకటనలు విడుదల చేసింది. ఇల్లు అలకగానే పండుగ కాదుకదా? ఇది మిగులు జలాల ఆధారంగా నిర్మించిన ప్రాజెక్టు. వరద నీరే గతి. కృష్ణా నది నుంచి రెండు తెలుగు రాష్ట్రాలు చుక్కనీరు తీసుకోవాలన్నా ఇక ముందు బోర్డు అనుమతించాలి. వరద రోజుల్లో కూడా ఈ సూత్రం అన్వయిస్తుంది. మరి ఏ పద్దు కింద వెలిగొండకు నీటిని విడుదల చేయిస్తారు? రెండు టన్నెళ్ల ద్వారా వచ్చే కృష్ణా జలాలు ఈపాటికే నల్లమల కొండల మధ్య నిర్మితమైన నల్లమల సాగర్ చేరాలి. ఇక్కడ 11 గ్రామాలు ముంపు కిందకు వస్తాయి. ఇంతవరకు వీరికి పరిహారం ఇవ్వలేదు. పునరావాసం కల్పించలేదు. ఇందుకు తొలి దశలోనే దాదాపు 900 కోట్ల రూపాయలు కావాలని అంచనా వేశారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ వైఖరి చూస్తుంటే పరిహారం ఇవ్వకనే గండికోట నిర్వాసితులలాగా నల్లమల సాగర్‌లో నీళ్లు నింపి నిర్వాసితులను ముంపులో ముంచేట్టుగా ఉంది. ఇవన్నీ అటుంచి జగన్ 2019 డిసెంబర్‌లో పునాది రాయి వేసిన కుందు నదిపై నిర్మించే జొలదరాసి, రాజోలి రెండు పథకాలు కొంచెం కూడా ముందుకు సాగలేదు. ఈ రెండు పథకాల కోసం 1226 ఎకరాల భూసేకరణ చేశారు. కానీ రైతులకు నష్టపరిహారం ఇవ్వలేదు.

కాగా కుందు నది బ్యూటిఫికేషన్ పేర వేలాది మంది రైతులను వీధి పాలు చేశారు. కొన్ని సంవత్సరాలుగా ఈ రైతులు నదికి ఇరువైపుల విద్యుత్ మోటార్లు పెట్టుకొని వ్యవసాయం చేసేవారు. ఈ పథకం అమలుకు ఇవన్నీ తొలగించి వీరి కడుపు కొట్టారు. ఈ నదిని ఒక కాలువగా చేసేందుకు సిద్ధమయ్యారు. కనీసం ఈ నదిలో చెక్‌డ్యామ్‌లు నిర్మించి ఉంటే భూగర్భజలాలైనా పెరిగేటివి. కృష్ణ, తుంగభద్ర నదుల నుంచి చట్టబద్ధంగా నికర జలాలు అందడం లేదనే ఆవేదన చిరకాలంగా వున్నా, అంతిమంగా పెన్నా వరద నీళ్లతో పాటు వర్షపు నీరు కూడా నిల్వ చేసుకొనే వసతి రాయలసీమకు కరువైంది. ఆ దిశగా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏ చర్యలనూ తీసుకోలేదు. 2023 జూన్ నెలతో ఆఖరైన నీటి సంవత్సరంలో పెన్నా నది నుంచి 200 టియంసిలు సముద్రం పాలయ్యాయి. పెన్నా నదిపై ఆఖరు జలాశయం సోమశిల నుంచి విడుదలైన గణాంకాల మేరకు అంత క్రితం నీటి సంవత్సరం 415 టియంసిలు, 2021 జూన్‌తో ఆఖరైన నీటి సంవత్సరం 315 టియంసిలు... మొత్తం 965 టియంసిలు సముద్రం పాలయ్యాయి. పెన్నా నదిపై ఎప్పుడో నిర్మించిన నాలుగు జలాశయాలు కూడా మరమ్మతులకు నోచుకోకుండా శిథిలావస్థకు చేరుకున్నాయి. పెన్నా అహోబిలం 11.4 టియంసిల నీటి నిల్వ సామర్థ్యంతో ఉన్నా పూర్తి స్థాయిలో నిల్వ చేసిన సందర్భం లేదు. మైలవరం గతి కూడా అంతే. గొంతెండి పోతున్న రాయలసీమకు ప్రకృతి ప్రకోపం కాసింతైతే, పాలకుల నిర్లక్ష్యంతో వర్షపు నీటిని నిల్వ చేసుకుని వాడుకొనే అవకాశం కూడా లేకుండా పోయింది.

• వి. శంకరయ్య
విశ్రాంత పాత్రికేయులు



చలో అసెంబ్లీకి బయల్దేరిన డీఎస్సీ నిరుద్యోగులను తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద అరెస్టు చేస్తున్న పోలీసులు



ఉక్కుపాదం

ఆశా వర్కర్లు, నిరుద్యోగులపై పోలీసుల ప్రతాపం

వేతనాల పెంపు కోసం పోరాటం ఆశా వర్కర్లది.. డీఎస్సీలో ఉద్యోగాల సంఖ్యను పెంచాలన్న ఆరాటం డీఎస్సీ అభ్యర్థులది.. పిడికిలి బిగించి గురువారం ముందుకు కదిలారు. తాడేపల్లి మండలంలోని వడ్డేశ్వరంలో ఉన్న వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడించాలని ఆశా వర్కర్ల సంఘం పిలుపునివ్వగా, డీఎస్సీ పోస్టుల సంఖ్యను పెంచాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో 'చలో అసెంబ్లీ'కి తరలారు. ఈ రెండు పిలుపులనూ పోలీసులు ఆపేశారు. అడుగులు వేసిన ఆశా వర్కర్లను, డీఎస్సీ అభ్యర్థులను నిలువరించారు.
- విజయవాడ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి)

- ఆశా వర్కర్లకు అడ్డు..
- ధర్నాచౌక్ వద్ద భారీగా పోలీసులు
- వచ్చిన వారిని వచ్చినట్టుగా అదుపులోకి..
- డీఎస్సీ అభ్యర్థులు 'చలో అసెంబ్లీ'కి వెళ్లకుండా అడ్డంకులు
- కళాక్షేత్రం వద్ద నిరుద్యోగుల అరెస్టు

కొలనుకొండ వద్ద ఆశా వర్కర్లను లాగేస్తున్న పోలీసులు

దద్దరిల్లిన ధర్నాచౌక్

ధర్నాచౌక్ నుంచి వడ్డేశ్వరం వెళ్లడానికి ఆశా వర్కర్లు నిర్ణయించుకున్నారు. తుమ్మలపల్లి కళాక్షేత్రం నుంచి వెలగపూడిలోని అసెంబ్లీకి వెళ్లాలని ఏఐఎస్ఎఫ్ నేతలు భావించారు. కానీ, వివిధ జిల్లాల నుంచి విజయవాడకు వచ్చే కార్యకర్తలను నగర ప్రవేశద్వారాల వద్ద పోలీసులు అడ్డుకున్నారు. తెల్లవారుజాము నుంచి రంగంలోకి దిగిన పోలీసులు బస్టాండ్, రైల్వేస్టేషన్‌లో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. లాడ్జీలను తనిఖీ చేశారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన కార్యకర్తలను అరెస్టు చేశారు. పోలీసుల నుంచి తప్పించుకుని ధర్నాచౌక్‌కు వచ్చిన ఆశా వర్కర్లను అదుపులోకి తీసుకున్నారు. ధర్నాచౌక్, అలంకార్ సెంటర్ వైపు మార్గాన్ని బారికేడ్లతో మూసేసి వాహనాలను దారి మళ్లించారు. అక్కడికి వచ్చిన ఆశా వర్కర్లను అరెస్టు చేశారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్దకు వస్తుండడంతో ఆ మార్గాన్ని పోలీసులు మూసివేశారు. పోలీస్ కంట్రోల్ రూమ్ దగ్గర నుంచి గెద్ద బొమ్మ వరకు బందోబస్తు ఏర్పాటు చేశారు. రైల్వేస్టేషన్, పాత ప్రభుత్వాసుపత్రి వైపు నుంచి వచ్చిన ఏఐఎస్ఎఫ్ నేతలను పోలీసులు అరెస్టు చేశారు. గుంటూరు వైపునకు వెళ్లే అన్ని మార్గాల్లో పోలీసులు పికెట్లు ఏర్పాటు చేశారు.



ధర్నాచౌక్ వద్ద బస్సులోనూ నినాదాలు



కొలనుకొండ వద్ద..



మంగళగిరిలో ఆశా వర్కర్ల నినాదాలు

చచ్చినా వదలరు

శవాలపై కూడా రాజకీయాలు చేసే రోజులు వచ్చేశాయి. ఓట్ల కోసం చనిపోయిన వారి ఓట్లను బతికున్నట్టుగా వేరే బూత్‌కు బదలాయించే నీచ ఆలోచనలు రాజ్యమేలుతున్నాయి. సెంట్రల్ నియోజకవర్గ ఓటర్ల తుది జాబితాలో ఇదే జరిగింది. చనిపోయిన వారి ఓట్లను తొలగించకుండా, బతికున్నట్టుగా చూపించి వేరే బూత్‌కు బదలాయించిన అధికార పార్టీకి చెందిన ఓ బీఎల్వో బాగోతం టీడీపీ నాయకుల పరిశీలనలో బయటపడింది.

- 30వ డివిజన్ 29వ బూత్‌లో చనిపోయిన వారికి ఓట్లు
- 27 ఓట్లు తొలగించకుండా వేరే బూత్‌కు బదలాయింపు
- అధికార పార్టీ నేతల అండతో ఓ బీఎల్వో బాగోతం
- టీడీపీ నాయకుల పరిశీలనలో బయటపడిన నిజాలు
- మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్‌కు ఫిర్యాదు

సెంట్రల్‌లో శవ రాజకీయాలు


(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఇప్పటివరకు బతికున్న ఓటర్లనే అటు, ఇటు అక్రమంగా మార్పులు చేశారు. తాజాగా చనిపోయిన వారి ఓట్లను కూడా మార్చేసిన బాగోతాలు బయటపడ్డాయి. సెంట్రల్ నియోజకవర్గంలో చనిపోయిన వారి ఓట్ల తొలగింపునకు ప్రతిపక్షాల నుంచి కుప్పలుతెప్పలుగా దరఖాస్తులు రాగా, వాటిని తొలగించకుండా తెలివిగా బీఎల్వోలు బూతులు మార్చారు. ఓటర్ల తుది జాబితా పరిశీలనలో ఈ వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి.

అసలు నిజాలివీ..

30వ డివిజన్‌లోని 29వ నెంబర్ పోలింగ్ బూత్‌లో చనిపోయిన 27 ఓట్లను వేరే బూత్‌కు బదిలీ చేశారు. ఇలా బదిలీ చేసింది స్థానిక పోలింగ్ బూత్ ఆఫీసర్ (బీఎల్వో) సునీల్ కుమార్. చనిపోయిన వారి ఓట్ల తొలగింపునకు దరఖాస్తులొస్తే వాటిని తొలగించాల్సిన బీఎల్వో వేరే బూత్‌కు బదిలీ చేయటం వెనుక అనేక ఆరోపణలు వస్తున్నాయి. అధికార పార్టీకి ప్రయోజనం కల్పించేందుకే ఇలా చేశారని తెలుస్తోంది.

ప్రతిపక్షాన్ని దెబ్బతీసేందుకే...

గత ఎన్నికల్లో సెంట్రల్ నియోజకవర్గంలో అధికార పార్టీ చాలా స్వల్ప ఓట్లతో నెగ్గింది. ఈ దఫా ప్రభుత్వ వ్యతిరేకత తీవ్రంగా ఉండటంతో ఎలాగైనా గెలవాలన్న ఉద్దేశంతో వైసీపీ పెద్దలు బీఎల్వోలపై ఒత్తిళ్లు తెస్తున్నారు. ఓటర్ల తుది జాబితా వచ్చిన క్రమంలో ఎందుకైనా మంచిదని టీడీపీ సెంట్రల్ నియోజకవర్గ నేతలు బూత్‌లవారీగా పరిశీలన ప్రారంభించారు. ఈ సూక్ష్మ పరిశీలనలో చనిపోయిన వారి ఓట్లు కనిపించాయి. వాస్తవానికి 30వ డివిజన్ 29వ నెంబర్ బూత్‌లో 27 మంది చనిపోయిన వారి ఓట్లు ఉన్నాయని టీడీపీకి చెందిన బీఎల్వోలు గతంలోనే గుర్తించారు. తాము గుర్తించిన అంశాలను పరిశీలించి నిర్ధారణ చేసుకున్నాక మునిసిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత ఆ ఓట్లను తొలగించినట్టుగా చూపారు. కానీ, తొలగించలేదు. వేరే బూత్‌కు మార్పు చేశారు. ఓటర్ల తుది జాబితా వచ్చిన నేపథ్యంలో ఫిర్యాదు చేసిన ఓట్లు తొలగించారో లేదోనని టీడీపీ నాయకులు పరిశీలించగా, ఈ తాజా విషయాలు బయటపడ్డాయి. ఈ విషయాన్ని టీడీపీకి చెందిన బీఎల్వోలు తమ పార్టీ నేతల దృష్టికి తీసుకొచ్చారు. దీంతో టీడీపీ నాయకుడు నవనీతం సాంబశివరావు మళ్లీ మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్‌కు ఫిర్యాదు చేశారు. బీఎల్వో సునీల్ కుమార్‌పై చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటానని కమిషనర్ హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో టీడీపీ నాయకులు అన్ని డివిజన్లలో డెత్ ఓటర్లు ఎంతమంది వచ్చారని పరిశీలిస్తున్నారు.



మృతిచెందిన జంపని రంగ సుశీల పేరును ఒక బూత్‌లో (పై ఫొటో) తొలగించి.. మరో బూత్‌లో (కింద ఫొటో) చేర్చారు

ఆది నుంచీ ఇదే వైఖరి

సెంట్రల్ నియోజకవర్గంలో చనిపోయిన వారి ఓట్లను తొలగించటం లేదు. ఆధారాలు చూపుతున్నా పట్టించుకోవట్లేదు. కొంతకాలం సాంకేతిక కారణాలు సాకుగా చూపారు. చివరకు స్పెషల్ సమ్మరీ రివిజన్ (ఎస్ఎస్ఆర్)లో కూడా సరి చేయలేదు. దీంతో ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు వెళ్లాయి. ఈ దశలో చనిపోయిన వారి ఓట్లను వేరే బూత్‌లకు బదిలీ చేసి మభ్యపెట్టే ప్రయత్నం చేశారు. దీనివెనుక పెద్ద కుట్రే జరిగిందని, భారీగా చేతులు మారాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఓట్ల స్థానంలో తెలంగాణ నుంచి వచ్చిన వారితో ఓట్లు వేయించే అవకాశం ఉందని ప్రతిపక్షాలు ఆందోళన చెందుతున్నాయి.

మరియమాతా.. వందనం

నేటి నుంచి గుణదల మేరీమాత తిరునాళ్ల

- మూడు రోజులు వేడుకలు
- ఈసారి ఘనంగా శత వసంతాల సంబరాలు
- భారీ ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు
- 50, 20 ఏళ్ల దీక్ష తీసుకున్న గురువులతో దివ్యపూజాబలి
- గుణదల రైల్వేస్టేషన్‌లో హాల్ట్, బీఆర్టీఎస్ రోడ్డులో మినీ బస్టాండ్

- 6లో..



దేవినేని ఇంట విషాదం

చంద్రశేఖర్ మృతికి నాయకుల సంతాపం

కంచికచర్ల, ఫిబ్రవరి 8 : టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు కుటుంబంలో విషాదం నెలకొంది. దేవినేని ఉమా, దివంగత వెంకటరమణ సోదరుడైన చంద్రశేఖర్ (56) గురువారం తెల్లవారుజామున మృతిచెందారు. చంద్రశేఖర్ కొద్దిరోజుల నుంచి ఊపిరితిత్తులకు సంబంధించిన న్యూమోనియా వ్యాధితో బాధపడుతున్నారు. శ్వాసకు ఇబ్బంది కలగటంతో చికిత్స నిమిత్తం వారం క్రితం ఆయన హైదరాబాద్ అపోలో ఆసుపత్రిలో చేరారు. మూడు రోజుల క్రితం ఆయనకు గుండెపోటు వచ్చింది. వైద్యులు మంగళవారం శస్త్రచికిత్స చేశారు. ఆరోగ్యంగా తిరిగి వస్తాడని అందరూ భావిస్తున్న తరుణంలో బుధవారం రాత్రి చంద్రశేఖర్ ఆరోగ్య పరిస్థితి ఒక్కసారిగా విషమించింది. గురువారం ఉదయం 5 గంటల సమయంలో ఆయన తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. చంద్రశేఖర్ భౌతికకాయాన్ని గురువారం మధ్యాహ్నం స్వగ్రామం కంచికచర్లలోని ఇంటికి తీసుకొచ్చారు. ఉమాతో పాటు మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య టీడీపీ గన్నవరం ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు.. చంద్రశేఖర్ భౌతికకాయంపై టీడీపీ జెండా కప్పి నివాళులర్పించారు. ఎమ్మెల్యేలు డాక్టర్ మొండితోక జగన్మోహనరావు, వసంత కృష్ణప్రసాద్, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్, మాజీ మంత్రులు కొల్లు రవీంద్ర, నెట్టెం రఘురామ్, నక్కా ఆనందబాబు, ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, టీడీపీ నాయకులు కేశినేని చిన్ని, బుద్దా వెంకన్న, కనపర్తి శ్రీనివాసరావు, శ్రీరాం తాతయ్య, దాసరి బాలవర్ధనరావు, బోడె ప్రసాద్, నాగుల్‌మీరా, ఎంఎస్ బేగ్, నూతలపాటి బాల, చలసాని ఆంజనేయులు, ఆచంట సునీత, పట్టాభి, గన్ని వెంకట నారాయణ ప్రసాద్ (అన్నా), కోట వీరబాబు, ఆళ్ల గోపాలకృష్ణ, జనసేన నాయకులు తంబళ్లపల్లి రమాదేవి, వైసీపీ నాయకుడు దేవినేని అవినాష్, బండారు హనుమంతరావు తదితరులు చంద్రశేఖర్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. గురువారం సాయంత్రం దేవినేని రమణ ఘాట్ వద్ద అంత్యక్రియలు నిర్వహించారు.





దేవినేని చంద్రశేఖర్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న కేశినేని చిన్ని, సౌమ్యతో దేవినేని ఉమా (ఇన్‌సెట్‌లో) దేవినేని చంద్రశేఖర్ (ఫైల్)

జోగి వారి కుటుంబపాలన

పెనమలూరు నియోజకవర్గంలో మంత్రి, ప్రస్తుత వైసీపీ అభ్యర్థి జోగి రమేశ్ కుటుంబపాలన మొదలైంది. మైలవరం, పెడన నియోజకవర్గాల్లో మొదలైన జోగి హవా ప్రస్తుతం పెనమలూరులో కొనసాగుతోంది. ఆయన కుమారుడు జోగి రాజీవ్‌కు ఎలాంటి పదవీ లేకున్నా అధికారిక కార్యక్రమాల్లో పెద్దపీట వేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు జోగి రమేశ్ సోదరుడు, తనయులు బుసుక, ఇసుక రవాణాల్లో జోక్యం చేసుకుని సెటిల్‌మెంట్లు చేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

- పెడన, మైలవరం అయిపోయింది..
- ఇక పెనమలూరులో మొదలైన పెత్తనం
- అధికారిక కార్యక్రమాల్లో కుమారుడి ఫొటోలు
- బుసక, ఇసుక రవాణా, సెటిల్‌మెంట్లలో జోక్యం
- భవన నిర్మాణదారులనూ పిండేస్తున్న వైనం



జోగితో ఆయన తనయుడు

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : పెనమలూరు నియోజకవర్గ వైసీపీ అభ్యర్థిగా జోగి రమేశ్‌ను అధిష్ఠానం ప్రకటించింది. ఆ మరుక్షణం నుంచే పెనమలూరుపై పట్టు కోసం జోగి పావులు కదపడం ప్రారంభించారు. ఆయన తనయుడు జోగి రాజీవ్, సోదరుడు రాము ఇతర కుటుంబ సభ్యులు పెనమలూరులో ప్రధాన ఆదాయ వనరులపై దృష్టి సారించారు.

● ఆ రెండు నియోజకవర్గాలను పిండేసి..

జోగి రమేశ్ ప్రస్తుతం పెడన నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిథ్యం వహిస్తున్నారు. అక్కడ ఏ చిన్న పని కావాలన్నా జోగి అనుచరులకు మామూళ్లు ముట్టచెప్పుకోవాల్సిందేనన్న ముద్ర పడింది. చెరువుల తవ్వకాలు మొదలు చిన్నచిన్న కాంట్రాక్టుల వరకు అన్నిటా కమీషన్లు గుంజారన్న ఆరోపణలు ఉన్నాయి. జోగి సోదరుడు రాము మైలవరం నియోజకవర్గంలో మట్టి, బూడిద దోపిడీతో కోట్లు వెనుకేశారన్న ఆరోపణలున్నాయి. ఈ విషయాన్ని సాక్షాత్తు వైసీపీ ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాదే చెప్పడం గమనార్హం. మైలవరంలో తనను సగం ప్రాంతానికే పరిమితం చేశారని మిగిలిన ప్రాంతమంతా జోగి కనుసన్నల్లోనే ఉండేదని వసంత ఆరోపించారు. తాజాగా పెనమ లూరుకు జోగి రావడంతోనే వసూళ్ల దందాకు తెరదీశారన్న ఆరోపణలు ఉన్నాయి. బుసక తోలకానికి నెలవారీ మామూళ్లు పెట్టారని, వసూలు చేస్తున్నారని విమర్శలు ఉన్నాయి.

ఆరోపణలివీ..

- వణుకూరు ప్రాంతంలో బుసక తోలకానికి రూ.25 లక్షలు తీసుకున్నారని సొంత పార్టీ నాయకులే చెబుతున్న మాట.
- పెనమలూరు విజయవాడ చెంతనే ఉండటంతో ఇక్కడ భవన నిర్మాణాలు, రియల్ ఎస్టేట్ జోరుగా సాగుతుంది. ప్రభుత్వం మారుతుందన్న వార్తలతో ఇటీవల ఇక్కడ వెంచర్లు కూడా ఎక్కువగా వస్తున్నాయి. వీరందరి నుంచి నిర్దేశిత మొత్తాన్ని ఫిక్స్ చేసి వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వెంచర్ వేస్తే ఎకరాకి రూ.10 లక్షలు, అక్రమ నిర్మాణాల

మిగతా 6వ పేజీలో..

బోట్లు.. పాట్లు!

పర్యాటకుల ప్రాణాలతో ఏపీటీడీసీ చెలగాటం!



- గుజరాత్ నుంచి సెకండ్ హ్యాండ్ మెకనైజ్డ్ బోట్లు, సేఫ్టీ బోట్లు
- రూ.లక్షలు వెచ్చించి బోట్ల కొనుగోలుపై సర్వత్రా విమర్శలు

- 6లో..



దివ్యపూజాబలి సమర్పిస్తున్న మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, గురువులు

నవదిన ప్రార్థనలకు పెద్దసంఖ్యలో హాజరైన భక్తులు

ఘనంగా ముగిసిన నవదిన ప్రార్థనలు

గుణదల, ఫిబ్రవరి 8 : గుణదలమాత వంద వసంతాల వేడుకలు పురస్కరించుకుని గడచిన 9 రోజులుగా నిర్వహిస్తున్న నవదిన ప్రార్థనలు గురువారంతో ముగిశాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విజయవాడ కతోలిక పీఠం మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన భక్తులకు సందేశమిచ్చారు. పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో పుణ్యక్షేత్ర ప్రాంగణం కిటకిటలాడింది. రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు, ఎస్ఎస్‌సి డైరెక్టర్ తోట సునీల్ రాజు, ఫాదర్ మరియన్న తదితర గురువులు దివ్య సత్ప్రసాద మదనంతో కొండపైకి చేరుకుని సవిప్షి దివ్యపూజాబలి సమర్పించారు.

గుణదలమాత ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు

గుణదల : ఈ నెల 9, 10, 11 తేదీల్లో గుణదల మేరీమాత ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేసినట్టు విజయవాడ కతోలిక పీఠం మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మూడు రోజులపాటు జరగనున్న ఉత్సవాలకు ముఖ్యఅతిథులుగా విజయవాడ బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు, భారత్, నేపాల్ దేశాల అపోస్థలిక రాయబారి లియోపొల్డో జిరెల్లి హాజరుకానున్నారని తెలిపారు. ఉత్సవాలకు లక్షలాదిగా భక్తులు తరలిరానుండటంతో రైల్వే, ఆర్టీసీ ఉన్నతాధికారులతో చర్చించి తగిన ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. దూరప్రాంతాల నుంచి వచ్చే రైళ్లను ఈ మూడు రోజులపాటు గుణదల స్టేషన్ వద్ద నిలిపేలా ఏర్పాటు చేశామన్నారు. అదే విధంగా బీఆర్టీఎస్ రోడ్డులో ఆర్టీసీ బస్సుస్టాప్ అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. బిషప్‌గ్రాసీ గ్రౌండ్‌లో మొబైల్ టాయిలెట్స్‌ను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. వంద వసంతాల వేడుకల నేపథ్యంలో గురువులుగా దీక్షబూని 50 వసంతాలు, 25 వసంతాలు పూర్తిచేసుకున్న వారితో మొదటి రోజున వేదికపై దివ్యపూజాబలి సమర్పించేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా తాగునీరు, పారిశుధ్య ఏర్పాట్లపై మున్సిపల్ సిబ్బందితోపాటు ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సహాయం తీసుకుంటున్నట్టు చెప్పారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు ఎదురుకాకుండా ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ కాంతి రాణా బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారన్నారు.



విజయలక్ష్మి, జనార్ధనరావులను సన్మానిస్తున్న ఆక్వాడెవిల్స్ ప్రతినిధులు

ఆరుపదుల వయసులో కృష్ణానదిని ఈదేశారు

» పొట్లూరి దంపతుల ఘనత

విజయవాడస్పోర్ట్స్, ఫిబ్రవరి 8 : అరవై సంవత్సరాలు పైబడిన వయస్సులో ఇటీవల జరిగిన రివర్ క్రాస్ పోటీల్లో పొట్లూరి విజయలక్ష్మి, పొట్లూరి జనార్ధనరావులు కృష్ణానది ఈది సత్తా చాటారని మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, బీసీసీఐ మాజీ చీఫ్ సెలెక్టర్ ఎంఎస్కే ప్రసాద్‌లు కొనియాడారు. విజయలక్ష్మి, జనార్ధనరావులు ప్రముఖ షోరూమ్ సోనోవిజన్ ఎండీ భాస్కరమూర్తి తల్లిదండ్రులు. ఈ సందర్భంగా ఆక్వా డెవిల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన సన్మానసభలో ఈ ఘనత సాధించిన దంపతులను ఘనంగా సత్కరించారు.

విదేశాల్లో వెలిగిన కాకులపాడు తేజం మేఘన

» ప్రపంచ ప్రసిద్ధ యూనివర్సిటీ ఆప్తమాలజీలో సీటు కైవసం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 8 : ప్రపంచ ప్రసిద్ధ క్లీవ్లాండ్ యూనివర్సిటీలో కంటి వైద్య విభాగంలో (అంతర్జాతీయ ప్రముఖులకు మాత్రమే) మేఘన చలసాని సీటు కైవసం చేసుకుంది. ఇటీవల జరిగిన ప్రవేశాల్లో మేఘన ఎంపికైనట్టు యూనివర్సిటీ నుంచి వచ్చిన ఉత్తర్వులను గురువారం అందుకున్నారు.



తల్లిదండ్రులతో మేఘన చలసాని

కాకులపాడుకు చెందిన చలసాని పూర్ణబ్రహ్మయ్య కుమారుడు కృష్ణారావు, పద్మజ దంపతుల కుమార్తె మేఘన తల్లిదండ్రులతో కలిసి అమెరికాలోని ఓహియోలో ఉంటోంది. చిన్ననాటి నుంచి చదువులో రాణిస్తూ 24సంవత్సరాల వయస్సులోనే ఎండీ, ఎంబీఏ డబుల్ డిగ్రీ 7సంవత్సరాల్లోనే సాధించడంతో పాటు ప్రపంచ ప్రసిద్ధ యూనివర్సిటీలో వైద్య విద్యకు సీటు సాధించడం పట్ల తాత చలసాని పూర్ణబ్రహ్మయ్య హర్షం వ్యక్తం చేశారు. కృష్ణామిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు, కాకులపాడు సర్పంచ్ కాజ ప్రసాద్, చలసాని శ్రీనివాస్ తదితరులు ఫోన్‌లో అభినందనలు తెలిపారు.



నూతనంగా ఎన్నికైన వ్యవసాయ అధికారుల సంఘం నాయకులు

వ్య.అధికారుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

కృష్ణలంక, ఫిబ్రవరి 8 : ఎన్టీఆర్ జిల్లా వ్యవసాయ అధికారుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక గురువారం నిర్వహించారు. రైతు సాధికార సంస్థ, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కార్యాలయంలో ఈ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. సంఘం జిల్లా అధ్యక్షులుగా కె.రఘురామ్ (విజయవాడ అర్బన్ వ్యవసాయ అధికారి), ఉపాధ్యక్షురాలిగా ఎం.స్వప్న (వ్యవసాయ అధికారి, జిల్లా కార్యాలయం, విజయవాడ) కార్యదర్శిగా ఆర్.సురేష్ (వ్యవసాయ అధికారి, రెడ్డిగూడెం) కోశాధికారిగా షేక్ టిప్పు సుల్తాన్ (వ్యవసాయ అధికారి, ఎ.కొండూరు) సంయుక్త కార్యదర్శిగా ఎస్.వాణి అనూష (వ్యవసాయ అధికారి జీవనియంత్రణ ప్రయోగశాల, ఇబ్రహీంపట్నం) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎంపికలో రాష్ట్ర వ్యవసాయ అధికారుల సంఘం అధ్యక్షులు బాల భాస్కర్, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్, కోశాధికారి మురళీకిషోర్ పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బంది, ఏపీ ఎన్జీఓస్ అసోసియేషన్ ప్రతినిధులు జేఏసీ నాయకులు అభినందించారు.

టెట్ ఫలితాల తర్వాతే డీఎస్సీకి అవకాశం కల్పించాలి

» కలెక్టర్‌కు విన్నవించిన కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల విద్యార్థులు



కృష్ణలంక, ఫిబ్రవరి 8 : కృష్ణాజిల్లాలో ఎస్జీటీ పోస్టులు పెంచాలని, టెట్ పరీక్ష మార్చి నెలాఖరున జరపాలని, టెట్ ఫలితాలు విడుదలయ్యాకే డీఎస్సీకి దరఖాస్తు చేసుకొనే అవకాశం కల్పించాలని కోరుతూ కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల విద్యార్థులు గురువారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావును కలిసి వినతిపత్రం సమర్పించారు. 2018 నుంచి డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నామని, ప్రస్తుతం నోటిఫికేషన్ విడుదల చేసి తక్కువ పోస్టులతో మరింత తక్కువ కాలంలో ఇప్పుడే విడుదల చేసిన సిలబస్‌తో తమకు ప్రిపరేషన్ కష్టసాధ్యంగా వుందని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఎస్జీటీ, ఎస్ఏలలో పోస్టులను పెంచి ఇప్పుడే ప్రకటించిన సిలబస్ ప్రిపేర్ అయ్యేందుకు కావాల్సిన కాలపరిమితిని ఇప్పించాల్సిందిగా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

బోట్లు.. పాట్లు!

కాసుల కోసం కక్కుర్తి..

» గుజరాత్ నుంచి సెకెండ్ హ్యాండ్ మెకనైజ్డ్ బోట్లు, సేఫ్టీ బోట్లు

» రూ. లక్షలు వెచ్చించి బోట్లను కొనుగోలుపై సర్వత్రా విమర్శలు

పర్యాటకుల ప్రాణాలతో ఏపీ టీడీసీ చెలగాటం!



గుజరాత్ నుంచి కొనుగోలు చేసిన సెకండ్ హ్యాండ్ మెకనైజ్డ్(వెన్నెల) బోట్లు, సీ షిప్స్ సేఫ్టీ బోట్లు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

గుజరాత్ నుంచి సెకండ్ హ్యాండ్ బోట్లను కొనుగోలు చేసి కృష్ణానదిలో తిప్పేందుకు ఏపీటీడీసీ అధికారులు చర్యలు చేపడుతున్నారు. సెకండ్ హ్యాండ్ బోట్లు ట్రయల్స్‌లోనే బోటింగ్ పైలట్లకు చుక్కలు చూపించడంతో వీటికి మరమ్మతులు కూడా చేపడుతున్నారు. పర్యాటకాన్ని అభివృద్ధి చేయాలంటే ఇలాంటి బోట్లనా కొనేది.. పర్యాటకుల భద్రతను ఏపీటీడీసీ అధికారులు గాలిలో దీపంలా మార్చివేశారు. కృష్ణానదిలో పన్నెండు అడుగుల లోతు ఉండే స్టోరేజ్ రిజర్వాయర్‌లో బోట్లను నడపటం అంటే ఆషామాషీ కాదు.. గతంలో పవిత్ర సంగమం, గోదావరిలో బోటు ప్రమాదాల నేపథ్యంలో, పర్యాటకుల భద్రతను దృష్టిలో ఉంచుకుని కొన్ని పాలసీలు తీసుకు వచ్చారు. దాని ప్రకారం సముద్రంలో తిరిగే బోట్లకు ఎలాంటి అనుమతులు ఉంటాయో అదే రకమైన నిబంధనలు ఇక్కడ కూడా అమలు చేయాల్సి ఉంటుంది. దీనికి భిన్నంగా ఏపీటీడీసీ అధికారులు లక్షలు వెచ్చించి సెకండ్ హ్యాండ్ బోట్లను కొనుగోలు చేయటం తీవ్ర వివాదాన్ని సృష్టిస్తోంది. బోట్ల కొనుగోలు వెనుక భారీ ఎత్తున గోల్‌మాల్ జరిగిందన్న ఆరోపణలు కూడా వస్తున్నాయి. గుజరాత్‌లో కాలం చెల్లిన బోట్లను ఏపీటీడీసీ అధికారులు కొనుగోలు చేసినట్టుగా తెలుస్తోంది. ఈ వ్యవహారంలో ఒక జీఎం అధికారి తీరుపై తీవ్ర స్థాయిలో విమర్శలు, ఆరోపణలు వస్తున్నాయి. పదవీ విరమణ చెందినా ఈ అధికారి చెలామణి అవుతూ హరిత బెర్మ్ పార్క్‌లో ఏడాదిన్నరగా తిష్ట వేసి ఇష్టారీతిన నిర్ణయాలు తీసుకుంటున్నట్టు ఆరోపణలున్నాయి. రాష్ట్రంలోనే భవానీ ఐల్యాండ్, హరిత బెర్మ్‌పార్క్‌ల ద్వారా ఏపీటీడీసీకి గణనీయమైన ఆదాయం వస్తోంది. బోటింగ్ యూనిట్ ద్వారా ఇప్పటి వరకు ఏపీటీడీసీ కొన్ని కోట్ల రూపాయల ఆదాయాన్ని సమకూర్చుకుంది. డిమాండ్ ఉన్న బోటింగ్ యూనిట్‌లోకి సరికొత్త బోట్లను తీసుకురావటం ద్వారా మరింతగా పర్యాటకుల ఆదరణను చూరగొనే అవకాశం ఉంది.

ఏపీటీడీసీ కృష్ణానదిలో నడపుతున్న బోట్ల విషయానికి వస్తే భవానీ, బోధిసిరి, క్రిష్ణవేణి, జగదాంబ, ఆమరపాలి, జలజాక్షి, ధరణి, పాంటూన్, పోలిక్రాఫ్ట్ బోట్లలో సింహభాగం కాలం చెల్లిపోయి తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. మరమ్మతుల పేరుతో లక్షలు ఖర్చు చేస్తున్నారు కానీ కొత్త బోట్లను కొనుగోలు చేయటం లేదు. ఈ బోట్లకు మరమ్మతులకు పెడుతున్న ఖర్చుతో కొత్త బోట్లను కొనుగోలు చేయవచ్చు. ఇటీవల కృష్ణానదిలో పర్యాటకుల విహారానికి కొత్త బోట్లను కొనుగోలు చేయనున్నట్టు ఏపీటీడీసీ అధికారులు ప్రకటించారు. అయితే కొత్తబోట్ల స్థానంలో సెకండ్ హ్యాండ్ బోట్లను కొనుగోలు చేశారు. రెండు రంగువెలిసిపోయిన మెకనైజ్డ్ బోట్లను కొనుగోలు చేశారు. వీటికి వెన్నెల అని నామకరణం చేశారు. గుజరాత్ నుంచి ఈ బోట్లను కొనుగోలు చేసినట్టు తెలుస్తోంది. ఈ బోట్లను కృష్ణానదిలో నడపడం కూడా కష్టంగానే కనిపిస్తోంది.



ట్రయల్ రన్‌లో మోటార్ బ్లేడ్ చేపల వలకు చిక్కి బోటు కలవరపెట్టింది. ఇలాంటి మెకనైజ్డ్ బోట్లను ఉపయోగించటం కత్తిమీద సాములాంటిదే అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరో రెండు చిన్న బోట్లను సెకండ్ హ్యాండ్‌లో కొనుగోలు చేశారు. ఇవి సముద్రంలో షిప్పలకు కట్టిఉంచే సేఫ్టీ బోట్లు. ఈ బోట్లను స్పీడ్ బోట్లుగా ఉపయోగించాలని భావిస్తున్నారు.

> కృష్ణానదిలో బోటింగ్ విహారం పేరుతో కోట్ల రూపాయలు దండుకుంటున్న అధికారులు ఎప్పుడో కాలం చెల్లిన బోట్లను తిప్పుతూ పర్యాటకుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఆదాయార్జనే ధ్యేయంగా.. ఏపీటీడీసీ అధికారులు కొత్త బోట్ల కొనుగోలులో కక్కుర్తి వ్యవహారం విమర్శలకు తావిస్తోంది. బోటింగ్‌కు ఉన్న ఆదరణ, ఆదాయం చూస్తే కొత్త బోట్లు కొనుగోలు చేసి పర్యాటకాన్ని వృద్ధి చేసుకోవాల్సిన ఏపీటీడీసీ రూ. లక్షలు ఖర్చు పెట్టి సెకండ్ హ్యాండ్ బోట్లను కొనుగోలు చేయటం పర్యాటక శాఖలో పెను దుమారాన్ని రేపుతోంది.

ఈ బోట్లకు అనుమతులు అనుమానమే!

గుజరాత్ నుంచి కొనుగోలు చేసిన సెకండ్ హ్యాండ్ బోట్లకు అనుమతులు వచ్చే అవకాశం కనిపించడం లేదు. సెకండ్ హ్యాండ్ బోట్లు కావటంతో ఇన్సూరెన్స్ చేయటం కూడా ప్రశ్నార్థకంగా ఉంది. ఇలాంటి బోట్లకు ఇరిగేషన్ శాఖ రూట్ పర్మిషన్లు ఇవ్వటం కూడా అనుమానమే. అన్నింటికీ మించి మెకనైజ్డ్ బోట్లు రెండూ ప్రయాణికుల సమూహాన్ని సురక్షితంగా తీసుకు వెళ్లగలవా అన్న పరీక్షలను కూడా చేయాల్సి ఉంది. ఈ పరీక్షలను తట్టుకునే అవకాశం కూడా కనిపించటం లేదు. ఈ బోట్లకు అనుమతులు రావాలంటే వీటిని ఎవరు తయారు చేశారు.. ఎంత కాలం వినియోగించారు.. ఏ కారణంగా వీటిని తీసేశారు.. వంటి విషయాలు కూడా తెలియాల్సి ఉంటుంది.

నత్తనడకన రిజిస్ట్రేషన్ల ప్రక్రియ

» పనిచేయని సర్వర్లు.. లబ్ధిదారుల పడిగాపులు

కూచిపూడి, ఫిబ్రవరి 8 : జగనన్న సెంటు స్థలాల లబ్ధిదారుల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నత్తనడకగా సాగుతోంది. దీంతో లబ్ధిదారులు రోజుల తరబడి కార్యాలయాల వద్ద పడిగాపులు పడుతున్నారు. ఈ నెల 2వ తేదీన ప్రక్రియ ప్రారంభం కాగా, ప్రతీ రోజు రాత్రి 10 గంటల వరకు కార్యాలయ సిబ్బంది, లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారు.



లబ్ధిదారుడు, వీఆర్వోతోపాటు సచివాలయ కార్యదర్శి వేలిముద్రలు రెండేసి పర్యాయాలు తీసుకోవటంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. కూచిపూడిలో లబ్ధిదారులు 239 మంది ఉండగా, వారం వ్యవధిలో 34 రిజిస్ట్రేషన్లు మాత్రమే పూర్తయ్యాయి. 21 గ్రామపంచాయతీల్లో 1766 మంది లబ్ధిదారులు ఉండగా, బుధవారం నాటికి 350 రిజిస్ట్రేషన్లు మాత్రమే పూర్తయ్యాయి. సర్వర్లు పనిచేయకపోతే రిజిస్ట్రేషన్లు ఎలా పూర్తవుతాయని కార్యాలయ సిబ్బంది అసహనం వ్యక్తం చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే.. 12 నుంచి ఆందోళన

» ఏపీఎన్జీవోల సంఘం వెస్ట్ కృష్ణా అధ్యక్షుడు విద్యాసాగర్

వన్‌టౌన్, ఫిబ్రవరి 8 : ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుంటే ఈనెల 12 నుంచి ఆందోళన చేపడతామని ఏపీఎన్జీవోల సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గాంధీనగర్‌లోని ఎన్జీవో హోమ్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇప్పటివరకు ప్రభుత్వానికి సహకరించామని, సమస్యల పరిష్కారంలో వాయిదాలు తప్ప ముందుకు సాగలేదని అన్నారు. ప్రభుత్వంలో ఏమాత్రం స్పందన లేదని, సహనాన్ని పరీక్షించవద్దని ప్రభుత్వానికి సూచించారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణలో ప్రభుత్వం చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం స్పందించి సమస్యలను పరిష్కరించకుంటే ఈనెల 12 నుంచి ఆందోళనకు దిగుతామని, ఈమేరకు ఉద్యోగుల మనోభావాలను కూడా పరిగణనలోకి తీసుకుని ఈనెల 11న విస్తృతస్థాయి సమావేశం నిర్వహించి ప్రధాన కార్యదర్శికి నోటీసు ఇస్తామని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న విద్యాసాగర్

చరిత్రలో ఇటువంటి దుస్థితి ఎన్నడూ చూడలేదు : యూటీఎఫ్

యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ, విద్యారంగానికి కోట్లాది రూపాయలు వ్యయం చేస్తున్నామని ప్రభుత్వం చెప్పడం హాస్యాస్పదమన్నారు. ప్రభుత్వ పాఠశాలల సంఖ్యను తగ్గిస్తున్నారని కొత్త అధ్యాపక పోస్టుల నియామకం లేదని, మౌలిక సదుపాయాల కల్పన కేవలం ప్రచార ఆర్భాటమేనన్నారు. పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు ధాలినాయుడు మాట్లాడుతూ, ఉద్యోగ సమయంలో ప్రభుత్వంపై నమ్మకంతో దాచుకున్న డబ్బును నిర్ణీత సమయానికి ఖాతాలో జమ చేయకపోవడం పదవీవిరమణ చేసిన ఉద్యోగుల పట్ల నిర్లక్ష్యవైఖరిని స్పష్టం చేస్తోందన్నారు. అదనపు క్వాంటమ్‌ను పునరుద్దరించాలన్నారు. ఎన్జీవో సంఘం నాయకులు ఎండీ ఇక్బాల్, ఎ.సాంబశివరావు, సాయిరాం, గెజిటెడ్ అధికారుల సంఘం సహ అధ్యక్షుడు డీ ఎస్ ఎన్ రెడ్డి, ఎం రాజబాబు, కె సంపత్‌కుమార్, ఎస్‌కే నజిరుద్దీన్, బీవీ రమణ, కే శివలీల, జయశ్రీ, సత్యనారాయణ రెడ్డి, సీహెచ్ మధుసూధనరావు, ఎస్‌కే ఖాశిం,సీహెచ్ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే రమేశ్‌బాబును నిలదీస్తున్న సర్పంచ్, ఎంపీటీసీలు

పార్టీ మారారని ఎంపీ ఫొటో తొలగిస్తారా..

» సచివాలయ భవన ప్రారంభంలో ప్రొటోకాల్ రగడ!

» ఎమ్మెల్యేను నిలదీసిన సర్పంచ్, ఎంపీటీసీలు



ఘంటసాల, ఫిబ్రవరి 8 : యండకుదురులో నూతనంగా నిర్మించిన సచివాలయ భవన ప్రారంభోత్సవంలో ఎంపీ బాలశౌరి ఫొటో లేకుండా శిలాఫలకం ఏర్పాటు చేయటంపై జనసేన నేత పూషడం సర్పంచ్ అంకం మారుతీరావు, ఎంపీటీసీ సిద్ధినేని కుమార్‌రాజాలు ఎమ్మెల్యేను నిలదీశారు. ఘంటసాల మండల పరిధిలోని యండకుదురు గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనం, ఆర్బీకే సెంటర్‌ను అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేశ్‌బాబు గురువారం ప్రారంభించారు. ఎంపీ పార్టీ మారారని, ప్రొటోకాల్ లిస్టు ప్రకారమే ఫొటో వేయటం జరుగుతుందని ఎమ్మెల్యే తెలపటంతో.. గుడివాడలో జరిగిన కార్యక్రమంలో శిలాఫలకంపై ఎంపీ ఫొటో ముద్రించారని సర్పంచ్ సమాధానమిచ్చారు. కావాలనే ఎంపీ ఫొటో తీసివేశారని సర్పంచ్, జనసైనికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



అంబటి రాంబాబు, పేర్ని నానిల చిత్రపటాలను చెప్పులతో కొడుతున్న వీరమహిళలు, జనసైనికులు

ఎంపీపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే తడఖా చూపిస్తాం..

మోపిదేవి : మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరిపై వైసీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు అనుచిత వ్యాఖ్యలు చేస్తే జన సైనికుల తడఖా చూపిస్తామని పార్టీ నాయకులు హెచ్చరించారు. బాలశౌరిపై మంత్రి అంబటి రాంబాబు, మాజీ మంత్రి పేర్ని నానిల అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ గురువారం సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. వైసీపీ నేతల చిత్రపటాలను చెప్పులతో కొట్టి, కాళ్లతో తన్ని నిరసన తెలిపారు. అవనిగడ్డ, మోపిదేవి, చల్లపల్లి, నాగాయలంక మండలాల నాయకులు, కార్యకర్తలు జనసేన పార్టీ కార్యాలయం నుంచి కొవ్వొత్తులతో ర్యాలీగా ప్రధాన కూడలికి చేరుకున్నారు. ఖబడ్దార్ వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు అంటూ నినాదాలు చేస్తూ నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు మత్తి వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షుడు పూషడపు రత్నగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో భారీగా చేరికలు..

పెడన రూరల్/బంటుమిల్లి : జగన్ పాలన పట్ల అసంతృప్తితో, టీడీపీ చేపట్టనున్న విధానాలకు ఆకర్షితులై వైసీపీ నేతలు అనేక మంది తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. నడుపూరు గ్రామంలోని దావు శ్రీరాములుకుటుంబంతోపాటు పలువురిని పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. గురువారం 'బాబు ష్యూరిటి భవిష్యత్ గ్యారంటి' కార్యక్రమంతో ఇంటింటి ప్రచారం చేశారు. అర్జా నగేష్, శలపాటి ప్రసాద్, శీరం ప్రసాద్, బొడ్డు చినబాబు, పరసా కామేశ్వరరావు, పుప్పాల నాని, పరసా ధనాంజనేయులు, టీడీపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.

బంటుమిల్లిలో నాగన్న చెరువు గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. గురువారం కాగిత కృష్ణప్రసాద్ ఇంటిలో గ్రామానికి చెందిన వైసీపీ సర్పంచ్, 40 కుటుంబాలు టీడీపీ కండువాలు కప్పుకున్నారు. ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి అవినీతిపాలన, రాక్షసవైఖరి తట్టుకోలేక తెలుగుదేశం పార్టీలోకి వచ్చామని వారు చెప్పారు. కాగిత కృష్ణప్రసాద్ విజయానికి తమవంతు కృషి చేస్తామన్నారు.



కాగిత కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో టీడీపీ కండువాలు కప్పుకున్న వైసీపీ నేతలు

అధినేత నిర్ణయానికి కట్టుబడి ఉంటా.. : వేదవ్యాస్

బంటుమిల్లి : రానున్న ఎన్నికల్లో పెడన నియోజకవర్గ సీటు కేటాయింపు విషయంలో టీడీపీ, జనసేన అధినేతల నిర్ణయానికి కట్టుబడి ఉంటానని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ అన్నారు. గురువారం మండలంలో పర్యటన అనంతరం ఆయన చినగొల్లపాలెంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, 15 సంవత్సరాల క్రితం తాను మండలానికి చేసిన అభివృద్ధి పనులను ఈ సందర్భంగా గుర్తుచేశారు. గతంలో చంద్రబాబునాయుడు తనకు సీటుపై హామీ ఇచ్చారని, ఆయన మాటమీద నిలబడతారని నమ్మకముందన్నారు. చంద్రబాబు మాటకు కట్టుబడి ఉంటానని నన్నారు. జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి నడకుదుటి బ్రహ్మం, పుప్పాల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బూరగడ్డ వేదవ్యాస్

జోగి వారి కుటుంబపాలన

(5వ పేజీ తరువాయి)

నుంచి ఫ్లోర్‌కు.. అందులో ఉన్న ఫ్లాట్ల ఆధారంగా రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలు వసూలు చేస్తున్నారని ఆరోపణలున్నాయి.

- ఎన్నికల నిధులు మొత్తం నెల.. రెండు నెలల కాలంలో వసూలు చేయడమే లక్ష్యంగా జోగి అనుచరులు తమ దందా నడిపిస్తున్నారు. జోగి అనుచరుల దూకుడు చూసి పెనమలూరు నియోజకవర్గ వాసులు బెంబేలెత్తుతున్నారు. ఈయన కన్నా గత ఎమ్మెల్యేనే ఎంతో నయం అన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

అధికారిక కార్యక్రమాల్లో తనయుడి భజన

పెనమలూరు నియోజకవర్గంలో ఏ అధికారిక కార్యక్రమం నిర్వహించినా వేదికపైన, కార్యక్రమం జరిగే ప్రాంతంలో వేసిన ఫ్లెక్సీల్లో జోగి తనయుడు రాజీవ్ ఫొటో తప్పనిసరిగా ఉండాలన్న ఆదేశాలు ఇప్పటికే అందరికీ వెళ్లాయి. దీంతో ఏ కార్యక్రమం జరిగినా జోగి రాజీవ్ ఫొటో కనిపిస్తోంది. పార్టీ కార్యక్రమాల వరకు సర్దుకుపోతాం కానీ అధికారిక కార్యక్రమాల్లోనూ ఈ ఫొటోలు ఏంటని సొంత పార్టీవారే విమర్శిస్తున్నారు. రాజీవ్‌కు పార్టీలో ఎలాంటి పదవి లేదు. వాస్తవానికి పార్టీ కార్యక్రమాల్లోనూ ఆయన ఫొటో వేయాల్సిన అవసరం లేదు. కానీ ఏకంగా అధికారిక కార్యక్రమాల్లోనూ ఆయన ఫొటోలు దర్శనమిస్తున్నాయి. వైసీపీ యువజన నాయకుడు అన్న హోదాతో ఈ ఫొటోలు వేస్తున్నారు. అధికారిక కార్యక్రమాల్లో తండ్రితోపాటు ఈయన కూడా పాల్గొంటున్నారు. వేదికలు పంచుకుంటున్నారు. జోగి తీరుపై ఎన్నికల్లో గెలవకముందే కుటుంబపాలన తీసుకొచ్చేశాడు. ఇక గెలిస్తే నియోజకవర్గంలో ఏ వైసీపీ నాయకుడికీ బతకనివ్వరన్న ప్రచారం సొంత పార్టీ నాయకుల్లో జరుగుతోంది.

డిగ్రీ మూడో సెమిస్టర్ పరీక్షా ఫలితాలు విడుదల

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 8 : కృష్ణా విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ మూడవ సెమిస్టర్ పరీక్షా ఫలితాలను గురువారం విడుదల చేశారు. విశ్వవిద్యాలయం పరిధిలో 5733 మంది హాజరు కాగా, 3260 మంది ఉత్తీర్ణులై 56.86 శాతం ఉత్తీర్ణత సాధించారు. పునః మూల్యాంకనానికి ఈనెల 19లోగా దరఖాస్తు చేసుకోవచ్చని రిజిస్ట్రార్ తెలిపారు.



సంఘటనపై విచారిస్తున్న సీఐ జానకీరాం

వివాహిత హత్యాయత్నంపై ప్రత్యేక బృందాల విచారణ

జగ్గయ్యపేట, ఫిబ్రవరి 8 : పట్టణంలో బుధవారం రాత్రి జరిగిన మిల్క్‌పార్లర్ నిర్వాహకురాలు గోపిరెడ్డి సత్యశ్రీ(35) హత్యాయత్నంపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. విజయవాడ ఏసీపీ ఆదేశాల మేరకు ముగ్గురు సీఐల పర్యవేక్షణలో ఆరుగురు ఎస్సైలతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. బాధితురాలి కుమార్తె (15) ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ జానకిరాం తెలిపారు. విజయవాడలో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సత్యశ్రీ ఆరోగ్యం విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది. సంఘటనా స్థలంలో ఉన్న సీసీ పుటేజీల ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. బాధితురాలి మొబైల్ ఫోన్ కాల్‌డేటా ఆధారంగా విచారిస్తున్నారు. సత్యశ్రీ కోలుకుని నోరు విప్పితే అసలు విషయం బయటకు వచ్చే అవకాశం ఉంది. ఆమె వద్ద పని చేసిన వ్యక్తుల నుంచి, ఆర్థిక లావాదేవీలు నడిపిన వ్యక్తులను విచారిస్తున్నారు. సత్యశ్రీ వ్యక్తిగత జీవితంపై భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. గోదావరి జిల్లాకు చెందిన వ్యక్తిని కులాంతర వివాహం చేసుకుందని చెబుతున్నారు. అయితే బంధువులు, కుటుంబసభ్యులు తమకు ఎవరిపైనా అనుమానాలు లేవని చెబుతుండటంతో కేసు పోలీసులకు సవాల్‌గా మారింది.

కేవీపీని కలిసిన పీసీసీ చీఫ్ షర్మిల



హనుమాన్‌జంక్షన్ రూరల్ : పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అంపాపురంలోని కేవీపీ రామచంద్రరావు మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం పశ్చిమగోదావరి జిల్లా దెందులూరు మండలంలోని పోతునూరులో జరిగే సమావేశానికి వెళుతూ మార్గమధ్యలో అంపాపురంలో కేవీపీ ఇంటికి వచ్చారు. తన తండ్రికి ప్రాణస్నేహితుడైన రామచంద్రరావును కలిసేందుకే వచ్చానని ఆమె తెలిపారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రఘువీరారెడ్డి, రుద్రరాజు, సంకర పద్మశ్రీ ఆమె వెంట ఉన్నారు. గన్నవరం నియోజకవర్గంలో బహిరంగసభ నిర్వహించే ఆలోచనతోనే అంతర్గత సమావేశం జరిగినట్టు సమాచారం. సుంకర సుబాష్‌చంద్ర బోస్, కొండపావులూరి రమేష్, తదితరులు షర్మిలను కలిసి మాట్లాడారు.



దుర్గగుడి ధర్మపథం వేదికపై భక్తిగీతాలాపన



వన్‌టౌన్, ఫిబ్రవరి 8: దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ధర్మపథం వేదికపై గురువారం పెనమలూరుకు చెందిన పి. ప్రమీలారాణి ఆధ్వర్యంలోని శ్రీనివాస భజన బృందం భక్తిగీతాలను ఆలపించింది. సరస్వతిదేవి, దుర్గమ్మ శివుడు, రాముడు, వెంకటేశ్వరస్వామి తదితర దేవుళ్లను స్తుతిస్తూ భక్తి పారవశ్యంతో భజన గీతాలు పాడారు. ప్రభావతి, మాధవి, పద్మ, పుష్ప,పార్వతి, కృష్ణవేణి, ఉమాదేవి, స్వరూపరాణి, విజయలక్ష్మి, బోసు, ప్రమీలారాణి భజన బృందంలో ఉన్నారు.

రాజకీయ నాయకుడు గద్దెలా ఉండాలి

కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న

భారతీనగర్, ఫిబ్రవరి 8: కృష్ణా జిల్లాలో సేవా కార్యక్రమాలు మొదలైందే గద్దె రామ్మోహన్ నుంచేనని, ఆయన గన్నవరంలోనే మొదలుపెట్టారని, ఆ సేవా కార్యక్రమాలే గద్దెను రాజకీయ నాయకుడిని చేసిందని, రాజకీయ నాయకుడు అంటే గద్దెలాగా ఉండాలని ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న అన్నారు. గురునానక్‌కాలనీలోని ఎన్‌ఏసీ కల్యాణమండపంలో గురువారం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ సహకారంతో 100మంది మహిళలకు కుట్టుమిషన్లు, చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న మాట్లాడుతూ ఒక సామాన్య కుటుంబంలో పుట్టి, తన వ్యాపారాల్లో వచ్చిన లాభం నుంచి ప్రజలకు గద్దె రామ్మోహన్ సేవా కార్యక్రమాలు చేసేవారన్నారు. 1994లో గద్దె టీడీపీ టికెట్ ఆశిస్తే, పార్టీ ఇవ్వలేకపోయిందని, దాంతో అక్కడి ప్రజలు పట్టుబట్టి ఇండిపెండెంట్‌గా పోటీ చేయించి, 11వేల మెజార్టీతో గెలిపించారన్నారు. 1999లో విజయవాడ పార్లమెంట్‌కు చంద్రబాబు పంపిస్తే 90వేల మెజార్టీతో గెలిచి ఎంపీ అంటే ఎలా ఉండాలి అంటే గద్దెలాగా ఉండాలి అనే విధంగా పనిచేశారన్నారు. రెండుసార్లు పార్టీ ఎక్కడికి వెళ్లమంటే అక్కడ పోటీ చేసి ఓడిపోయి నష్టపోయారే గానీ పార్టీకి ఎప్పుడు ఎదురు తిరగలేదన్నారు. కేశినేని నాని ఎంపీగా గెలవడానికి గద్దె రామ్మోహన్ కారణమని, నాని కూతురు శ్వేతకు కార్పొరేటర్ సీటు ఇచ్చి గెలిపించిన వ్యక్తి గద్దె అని, ఇది నగర ప్రజలందరికి తెలుసన్నారు. ఆ విషయం మరిచి కేశినేని నాని ఆయన వల్లే గద్దె రామ్మోహన్ రెండుసార్లు గెలిచారంటూ నోటికి వచ్చినట్లుగా మాట్లాడుతున్నారన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేస్తేనే ఆ కుటుంబాలు ముందుకు సాగుతాయనే ఉద్దేశ్యంతో 2014-19వరకు చంద్రబాబు మెప్మా ద్వారా టైలరింగ్ శిక్షణా తరగతులు నిర్వహించి, శిక్షణ పూర్తి చేసిన మహిళలకు ఉచిత కుట్టు మిషన్లు ఇచ్చారన్నారు. జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ మాట్లాడుతూ మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించేందుకు ఎన్టీఆర్ ఆస్తిలో సమాన హక్కును కల్పించారన్నారు.

తానా సభ్యులు పుట్టగుంట సురేష్ మాట్లాడుతూ గద్దె రామ్మోహన్ సేవా కార్యక్రమాలు చేయడంలో తమలాంటి వారికి ఆదర్శమన్నారు. నియోజకవర్గ పరిశీలకులు సుఖవాసి శ్రీనివాస్, ఎస్.ఫిరోజ్, ముమ్మనేని ప్రసాద్, చెన్నుపాటి ఉషారాణి, పొట్లూరి సాయిబాబు, గుండు శ్రీను, మాదల చిన్నతల్లి, టీడీపీ-జనసేన పార్టీల డివిజన్ అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, గద్దె అనురాధ, బుద్దా వెంకన్న తదితరులు

టీడీపీ అధికారంలోకి రావడం చారిత్రాత్మక అవసరం

● బొండా ఉమా

అజిత్‌సింగ్‌నగర్, ఫిబ్రవరి 8 : రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడం చారిత్రాత్మక అవసరమని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో గురువారం 36వ డివిజన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూటకపు హామీలతో గద్దెనెక్కిన జగన్ ప్రజా వ్యతిరేక విధానాలను, విజన్ ఉన్న గొప్ప నాయకుడు చంద్రబాబు పాలనల మధ్య వ్యత్యాసాలను ప్రజలకు వివరించాలని సూచించారు. నేతలు ఘంటా కృష్ణమోహన్, నవనీతం సాంబశివరావు పాల్గొన్నారు.

కండ్రికలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ

పాయకాపురం: 64వ డివిజన్ కండ్రిక కాలనీలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో బొండా ఉమా టీడీపీ అధికారంలోకి రాగానే అమలు చేయనున్న వివిధ పథకాలతో కూడిన కరపత్రాలను స్థానికులకు అందజేశారు. నేతలు పలగాని శివ, సూరవరపు నాగరాజు, పాల్గొన్నారు.

గవర్నర్‌పేట: అస్తవ్యస్తంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ పాలనా వ్యవస్థను గాడిలో పెట్టేందుకు చంద్రబాబు రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని టీడీపీ యువనేత బొండా రవితేజ అన్నారు. 23వ డివిజన్ సూర్యారావుపేటలోని టీడీపీ కార్యాలయం నుంచి బుధవారం డివిజన్ కార్పొరేటర్ నెల్లిబండ్ల బాలస్వామి ఆధ్వర్యంలో టీడీపీ భవిష్యత్తు గ్యారెంటీ పాదయాత్ర జరిగింది. పార్టీ కార్యాలయం వద్ద అభిమానులు రవితేజను గజమాలతో సత్కరించారు. యాత్రను ప్రారంభించిన రవితేజ ఇంటింటికీ తిరుగుతూ భవిష్యత్తు గ్యారెంటీ కరపత్రాలను పంచారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సూర్యారావుపేటలోని ఆసుపత్రులు, వ్యాపార సంస్థలకు వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ డివిజన్ నేతలు చింతా దుర్గారావు, రాము, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బొండా ఉమామహేశ్వరరావు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

భారతీనగర్, ఫిబ్రవరి 8: విద్యుత్‌లైన్లు మరమ్మతుల కారణంగా రింగ్‌రోడ్డు సెక్షన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8.30 నుంచి 11.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయుచున్నట్లు గుణదల సబ్‌స్టేషన్ కార్యనిర్వాహక ఇంజనీర్ పి.హరిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నోవాటెల్ హోటల్ ఏరియా భారతీనగర్ మెయిన్ రోడ్డుతోపాటు 1 నుంచి 15 రోడ్ల వరకు, వివేకానంద రోడ్డు, తిమ్మరుసు వారి రోడ్డు, శ్రీనగర్ కాలనీ, శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీ, కనకదుర్గా గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

వైసీపీ బులుగు ముఠాకు మతిభ్రమించింది : వీరంకి

విద్యాధరపురం, ఫిబ్రవరి 8: రానున్న ఎన్నికల్లో టీడీపీ- జనసేన గెలుపు ఖాయం కావడంతో వైసీపీ బులుగు ముఠాకు మతిభ్రమించి ఇష్టానుసారం మాట్లాడుతున్నారని టీడీపీ బీసీ సాధికార సమితి ప్రధానకార్యదర్శి వీరంకి వెంకట గురుమూర్తి విమర్శించారు. ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు, లోకేశ్‌లను గురించి విమర్శించే ముందు రామచంద్రాపురంలో తంతే రాజమండ్రిలో పడ్డ రాష్ట్ర మంత్రి వేణుగోపాల్ నోరు అదుపులో పెట్టుకోవాలన్నారు. బులుగు ముఠాకు మతిభ్రమించి ఏం చేస్తున్నారో, ఏం మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. జగన్ ఏం ఉద్ధరించాడని మంత్రి వేణుగోపాల్ మాట్లాడుతున్నాడని ప్రశ్నించారు. వైవీ సుబ్బారెడ్డి వద్ద మోకరిల్లినపుడే వేణుగోపాల్ స్థాయి ఏమిటో తెలిసిందన్నారు. ఇష్టానుసారం వాగితే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు.

ఓబీసీలకు నష్టం కలిగించేలా బీజేపీ వైఖరి

కేశన శంకరరావు

వన్‌టౌన్, ఫిబ్రవరి 8 : ఓబీసీలకు నష్టం కలిగించేలా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వైఖరి ఉందని ఏపీ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేశన శంకరరావు అన్నారు. గురవారం ఆయన సంఘ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ఏపీలో కులగణనపై జనసేన అధిపతి పవన్ కల్యాణ్ వ్యాఖ్యానం చేయడం సరికాదన్నారు. ఆయన వ్యాఖ్యలు కేంద్రంలోని బీజేపీ మెప్పు పొందడానికేనన్నది స్పష్టమవుతున్నదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కులగణనలో తప్పులు ఉంటే బీసీలు ఉద్యమిస్తారన్నారు. రాజకీయపార్టీలు మద్దతివ్వాలి కానీ అడ్డుకోవడం సరికాదన్నారు. పవన్ కల్యాణ్ తన వైఖరిని మానుకుని కులగణనకు మద్దతివ్వాలని, లేదంటే ఎన్నికల్లో గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

25 వేల ఓట్ల మెజారిటీతో వెలంపల్లి గెలిస్తే రాజీనామా చేస్తా

● కార్పొరేటర్ కంచి దుర్గ సవాల్

పాయకాపురం, ఫిబ్రవరి 8 : రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో సెంట్రల్ నియోజకవర్గంలో వైసీపీ తరఫున వెలంపల్లి శ్రీనివాసరావు 25 వేల ఓట్ల మెజారిటీతో గెలిస్తే తాను కార్పొరేటర్ పదవికి రాజీనామా చేస్తానని 60వ డివిజన్ టీడీపీ కార్పొరేటర్ కంచి దుర్గ సవాల్ విసిరారు. వాంబేకాలనీలోని టీడీపీ కార్యాలయంలో గురువారం కార్పొరేటర్ విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెంట్రల్‌లో తమ నేత బొండా ఉమా ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అభివృద్ధి పనులే జరగలేదంటూ వెలంపల్లి అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన అభివృద్ధి గురించి మాట్లాడకుండా దాటవేసే ధోరణిలో వెలంపల్లి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు కంచి ధనశేఖర్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమని, ఇలాంటి వెల్లంపల్లులు వంద మంది వచ్చినా బొండా ఉమా ముందు సరిపోరని, ఇకపై వెలంపల్లి తన పని తాను చేసుకుంటే మంచిదని, బొండా ఉమాపై అవాకులు చవాకులు పేలితే సహించేది లేదని హెచ్చరించారు. నవనీతం సాంబశివరావు, పైడి శ్రీను, ఎం. సుబ్బలక్ష్మీ పాల్గొన్నారు.

ఏపీలో నగరాలకు ఒక సీటు కేటాయించండి

● చంద్రబాబుకు బంకా నాగమణి వినతి

చిట్టినగర్, ఫిబ్రవరి 8: ఆంధ్రప్రదేశ్‌లో నగరాల సామాజిక వర్గానికి రానున్న ఎన్నికల్లో ఒక సీటు కేటాయించాలని, 25 ఏళ్లుగా పార్టీలో కొనసాగుతూ నిస్వార్థంగా ప్రజలకు సేవలందిస్తున్న తనకు అవకాశం కల్పించాలని చంద్రబాబు నాయుడికి విజ్ఞప్తి చేసినట్లు టీడీపీ మహిళా నాయకురాలు బంకా నాగమణి అన్నారు. గురువారం ఆంజనేయవాగులో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ 7న చంద్రబాబు నాయుడిని తాడేపల్లిలో ఆయన నివాసం వద్ద కలసి బయోడేటా ఇచ్చి పరిశీలించాలని కోరినట్లు తెలిపారు. చంద్రబాబు సానుకూలంగా స్పందించారన్నారు. 2024లో పశ్చిమ నియోజకవర్గం నుంచి అసెంబ్లీకి పోటీ చేసే అవకాశం ఇవ్వాలని కోరారు. కొరికాని శివరామ్, ఈది దుర్గాంబ, బంకా విజయ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

మహాత్మాగాంధీ హోల్‌సేల్ మార్కెట్‌ను మరింతగా అభివృద్ధి చేస్తాం : పోతిన మహేశ్



విద్యాధరపురం, ఫిబ్రవరి 8 : మహాత్మాగాంధీ హోల్‌సేల్ మార్కెట్‌ను మరింతగా అభివృద్ధి చేస్తామని జనసేన అధికార ప్రతినిధి, విజయవాడ పశ్చిమ ఇన్‌చార్జి పోతిన మహేశ్ అన్నారు. ఇంటింటికి రాబోయే మన టీడీపీ-జనసేన ప్రభుత్వం నినాదంతో సాగుతున్న ప్రచారంలో గురువారం ఆయన మహాత్మాగాంధీ హోల్‌సేల్ మార్కెట్‌లో వ్యాపారులను కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వ్యాపారాలు బాగా సాగాలంటే టీడీపీ-జనసేనకు మద్దతివ్వాలన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అవినీతి, అక్రమాలను సోదాహరణంగా వివరించారు. జల్లి రమేష్, బొమ్మ రాంబాబు, గోవిందు లక్ష్మి, తిరుపతి అనూష ఇంకా పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు.

మహిళా పారిశ్రామికవేత్తలకు సత్కారం



మొగల్రాజపురం, ఫిబ్రవరి 8: మహిళా సాధికారత సాధించాలంటే వృత్తి విద్య నేర్చుకోవడం మంచి మార్గమని జనశిక్షణా సంస్థాన్ చైర్‌పర్సన్ నాగళ్ల విద్యాఖన్నా తెలిపారు. మొగల్రాజపురం మొగల్ హాలులో జరుగుతున్న మహిళా ఉత్సవ్‌లో గురువారం మహిళా పారిశ్రామికవేత్తలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మహిళలను పారిశ్రామికవేత్తలుగా తయారు చేయడంతో పాటు వారి ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కూడా కల్పిస్తున్నామని చెప్పారు. డాక్టర్ ఎన్. సాహితి (వేదమంత్ర ఆయుర్వేదిక్ ఆసుపత్రి), ఆళ్ల నిర్మలకుమారి (శ్రీ సాయి పెట్టికోట్స్), డి.అపర్ణ(అపర్ణ జ్యూట్ క్రియేషన్)లను సత్కరించారు. జనశిక్షణా సంస్థాన్ డైరెక్టర్ ఏ.పూర్ణిమ,సిబ్బంది, స్టాల్స్ నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడండి

మేయర్, నగర కమిషనర్

సత్యనారాయణపురం, ఫిబ్రవరి 8: మంచినీటి సరఫరాలో ఎటువంటి జాప్యం లేకుండా ప్రజలకు అందించాలని మేయర్ రాయన భాగ్యలక్ష్మి, నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పేర్కొన్నారు. మేయర్‌తో కలిసి కమిషనర్ గురువారం 31వ డివిజన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరంతరం కాల్వలో పూడికలు తీయాలన్నారు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, వర్షపు నీరు వెళ్లే కాల్వలను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. కొత్తపైపు లైన్‌లు వేసినప్పుడు తవ్విన రోడ్లను ఎప్పటికప్పుడు సరిచేయాలన్నారు. రోడ్లపైన అనధికార ఆక్రమణలను తొలిగించి ప్రజలకు ఇబ్బంది కలిగించకుండా చూడాలని టౌన్ ప్లానింగ్ సిబ్బందిని ఆదేశించారు.

31 వ డివిజన్ కార్పొరేటర్ పెనుమత్స శిరీష, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ రామకోటేశ్వరరావు, రామ్మోహనరావు, శ్రీనివాస్, బయాలజిస్ట్ సూర్య నాయర్, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



సైడు కాల్వలను పరిశీలిస్తున్న మేయర్, కమిషనర్

ఉపాధ్యాయినిగా గాయత్రి సేవలు నిరుపమానం



గాయత్రీ దేవి దంపతులను సన్మానిస్తున్న సహచర ఉపాధ్యాయులు

పటమట, ఫిబ్రవరి 8 : కొమ్మా సీతారామయ్య బాలికోన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయినిగా పనిచేస్తూ గురువారం స్వచ్ఛంద పదవీ విరమణ చేస్తున్న అత్తలూరి గాయత్రి సేవలు నిరూపమానమైనవని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అన్నే లక్ష్మీకుమారి పేర్కొన్నారు. అత్తలూరి గాయత్రి దేవి పదవీ విరమణ కార్యక్రమం పటమటలంక కొమ్మా సీతారామయ్య బాలికోన్నత పాఠశాలలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు ఆమెతో గల అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఉపాధ్యాయిని అత్తలూరి గాయత్రి ఐక్య ఉపాధ్యాయ సంఘానికి బిల్డింగ్ ఫండ్‌కు తన వంతుగా లక్ష రూపాయల విరాళాన్ని ప్రకటించారు. కేఎస్ఆర్ జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలకు రూ.20వేలు విలువచేసే ఇనుప బీరువాని బహూకరించారు. పాఠశాల సిబ్బంది, ఐక్య ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు, ఇతర ఉపాధ్యాయులు, బాల బాలికలు, బంధుమిత్రులు పాల్గొన్నారు.


11న ఖురాన్ కంఠస్థ పోటీలు

భవానీపురం, ఫిబ్రవరి 8: స్థానిక ఆటోనగర్‌లోని ది ఆటోమొబైల్ టెక్నీషియన్ అసోసియేషన్ హాల్లో ఈ నెల 11న ఉదయం 10 గంటలకు 9వ రాష్ట్ర స్థాయి బాల,బాలికల ఖురాన్ కంఠస్థ ప్రతిభా పోటీలను నిర్వహిస్తున్నట్లు యునైటెడ్ ఫోరం ఫర్ ఖురానిక్ స్టడీస్ చైర్మన్ మొహ్మద్ దావూద్, సిటీ ఇన్‌చార్జ్ షేక్ హుస్సేన్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలను ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. 3 నుంచి 12 ఏళ్లలోపు బాల, బాలికలు పాల్గొనవచ్చునన్నారు.

విలువిద్యలో యుక్తశ్రీకి జాతీయ స్థాయి మెడల్



గవర్నర్‌పేట, ఫిబ్రవరి 8: ఛత్తీస్‌ఘడ్ రాష్ట్ర రాజధాని రాయపూర్‌లో జరిగిన 40వ ఎన్‌టీపీసీ సబ్ జూనియర్ జాతీయ ఆర్చరీ చాంపియన్‌షిప్ పోటీల్లో నలంద విద్యానికేతన్ విద్యార్థిని కొండపావులూరి యుక్తశ్రీ(10వ తరగతి) మెడల్ సాధించినట్లు స్కూల్ ప్రిన్సిపాల్ మాదల పద్మశ్రీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. యుక్తశ్రీ ఎలిమినేషన్ రౌండ్‌లో వ్యక్తిగత బంగారు పతకాన్ని, టీమ్ మ్యాచ్‌లలో జట్టు కాంస్య పతకాన్ని దక్కించుకున్నట్లు తెలిపారు. సబ్ జూనియర్ జాతీయ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో చాంపియన్‌గా నిలిచిందని తెలిపారు. ఏపీలో 20 సంవత్సరాల నుంచి సబ్ జూనియర్ రికర్వ్ బాలికల విభాగంలో జాతీయ స్థాయిలో చాంపియన్ అయిన మొదటి అమ్మాయిగా యుక్తశ్రీ నిలిచిందని అభినందించారు.



గ్రూప్-1, 2 పరీక్షలకు ఉచిత శిక్షణ

మొగల్రాజపురం, ఫిబ్రవరి 8: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మైనారిటీ యువతీ యువకులకు గ్రూప్-1, 2 పరీక్షలకు షాలోమ్ ఎలైట్స్ ఐఏఎస్ స్టడీ సర్కిల్ కొల్లూరి ఫౌండేషన్ ద్వారా స్థానిక జమ్మిచెట్టు సెంటర్ సమీపంలోని బీఎస్ఆర్‌కే భవన్‌లో ఉన్న ఇన్‌స్టిట్యూషన్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. మైనార్టీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ సీఈడీ ఎం సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డవలప్‌మెంట్ ఆఫ్ మైనార్టీస్ డైరెక్టర్ డాక్టర్ మస్తాన్ వలీ ఆధ్వర్యంలో గురువారం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రిటైర్డ్ ఐజీ సత్తార్ఖాన్ హాజరయ్యారు. స్పెషల్ గెస్ట్‌గా డిప్యూటీ డైరెక్టర్ స్టేట్ ఆడిట్ (ఏయూ)ఎం.ఈ. ప్రసాద్, డిప్యూటీ డైరెక్టర్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ ఆర్ రవికుమార్, డైరెక్టర్ కొల్లూరి కాంతారావులు విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
శుక్రవారం • 9 ఫిబ్రవరి 2024
cinema@andhrajyothy.com

ట్రూ లవర్ ఈ వాలెంటైన్ విన్నర్



మణికందన్, శ్రీ గౌరి ప్రియ, కన్న రవి ప్రధాన తారాగణంగా రూపొందిన తమిళ చిత్రం 'ట్రూ లవర్'. ఈ ప్రేమకథా చిత్రానికి ప్రభురామ్ వ్యాస్ దర్శకత్వం వహించారు. దర్శకుడు మారుతి, నిర్మాత ఎస్‌కేఎన్ ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్నారు. ఈ నెల 10న 'ట్రూ లవర్' విడుదలవుతోంది. గురువారం చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఎస్‌కేఎన్ మాట్లాడుతూ 'తమిళ ప్రీమియర్స్ చూసిన వాళ్లు ఈ మధ్యకాలంలో ఇలాంటి సినిమా రాలేదని చెబుతున్నారు. తెలుగువాళ్లకూ ఈ సినిమా బాగా నచ్చుతుంది. పెయిడ్ ప్రీమియర్స్ వేస్తున్నాం. మణికందన్, గౌరీప్రియ నటన ఆకట్టుకుంటుంది. ఈ సినిమా ఈ వాలెంటైన్ డే విన్నర్ అవుతుంది. 'బేబీ' హిందీ రీమేక్‌లో నేను నటించడం లేదు' అని తెలిపారు. మారుతి మాట్లాడుతూ 'ట్రూ లవర్' కథను దర్శకుడు సహజంగా తెరకెక్కించాడు. దర్శకుడి ప్రతిభ అబ్బురపరుస్తుంది. ప్రేమికులే కాదు కుటుంబం అంతా కలసి చూసే సినిమా ఇది' అన్నారు. మణికందన్ మాట్లాడుతూ 'పక్కా స్ర్కీన్‌ప్లేతో తీసిన సినిమా ఇది. ఇక్కడి ప్రేక్షకులు నన్ను తెలుగు నటుడిగానే చూస్తున్నారు. మారుతి, ఎస్‌కేఎన్ రిలీజ్ చేయడం వల్ల ఈ సినిమా స్థాయి పెరిగింది' అని చెప్పారు. శ్రీ గౌరి ప్రియ మాట్లాడుతూ 'ఈ చిత్రం తమిళ ప్రీమియర్స్‌కు ప్రేక్షకుల నుంచి చక్కటి స్పందన వస్తోంది. తెలుగులో సూపర్ హిట్ అవుతుందని నమ్ముతున్నాం' అన్నారు.

'ఈగల్' చిత్రంలో మునుపెన్నడూ చూడని రవితేజను ప్రేక్షకులు చూడబోతున్నారు. ఈ చిత్రం కాన్సెప్ట్‌లోనే విధ్వంసం ఉంది. కంటెంట్ ఎక్స్‌ట్రార్డినరీగా ఉంటుంది' అని దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని చెప్పారు. రవితేజ కథానాయకుడిగా ఆయన దర్శకత్వం వహించిన చిత్రం 'ఈగల్'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. కావ్య థాపర్, అనుపమా పరమేశ్వరన్ కథానాయికలు. 'ఈగల్' చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా సినిమా విశేషాలను కార్తీక్ మీడియాతో పంచుకున్నారు.

రాంబో, టెర్మినేటర్ తరహాలో...

కార్తీక్ ఘట్టమనేని



● 'ఈగల్'లో కథానాయకుడు సాధారణ పత్తి రైతులా కనిపిస్తాడు. కానీ ఓ అంతర్జాతీయ సమస్యపైన అతను పోరాటం చేస్తుంటాడు. 'రాంబో', టెర్మినేటర్' లాంటి సినిమాలను ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేశారు. మనం కూడా అలాంటి ఒక సినిమా తీయాలనే ప్రయత్నంలోంచే 'ఈగల్' పుట్టింది. ఇదొక అద్భుతమైన యాక్షన్, డ్రామా ఎంటర్టైనర్. ప్రేక్షకులను అలరిస్తుంది. పూర్తి స్థాయి యాక్షన్ చిత్రం చేయాలనేది దర్శకుడిగా నా కల. అది 'ఈగల్'తో నెరవేరింది.

● పక్షుల్లో గద్దకు చాలా సునిశితమైన దృష్టి ఉంటుంది. సుదూరాన ఉన్న లక్ష్యాన్ని సైతం చూసి వేటాడుతుంది. ఈ సినిమాలో కథానాయకుడికి కూడా భవిష్యత్తులో జరగబోయే పరిణామాలను అంచనా వేయగల నైపుణ్యం ఉంటుంది. అందుకే 'ఈగల్' టైటిల్ పెట్టాం. హిందీలో 'సహదేవ్ వర్మ' టైటిల్‌తో విడుదల చేస్తున్నాం.

● 'ధమాకా' సినిమాకు సినిమాటోగ్రాఫర్‌గా పనిచేసే సమయంలో రవితేజకు కథ చెప్పాను. 'మంచి ఎంటర్టైనర్ అవుతుంది చేద్దాం' అని వెన్నుతట్టారు. ఈ సినిమా అంతటా ఆయన పాత్ర ఒకేలా ఉంటుంది. ఆయన ఎనర్జీ లెవల్స్ వేరే లెవల్లో ఉంటాయి. ఆయన నుంచి నేర్చుకోవాల్సింది క్రమశిక్షణ. ఆహారపు అలవాట్లు, నిద్రవేళలు కచ్చితంగా పాటిస్తారు.

● ఈగల్ సౌండ్ డిజైన్‌కే ఆరునెలలు పట్టింది. యూరప్‌లో రియల్ గన్స్‌తో షూట్ చేసి ఆ సౌండ్‌ని రికార్డ్ చేశాం. అలాగే పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సహకారం మరువలేనిది. ఒక్క ఫోన్ కాల్ చేస్తే చాలు కావలసిన వనరులు సమకూర్చేవారు.

● ఈ చిత్రంలో నవదీప్ నటన ఆశ్చర్యపరుస్తుంది. అనుపమా పరమేశ్వరన్ కథను ముందుకు నడిపించే పాత్రను పోషించారు. త్వరలో తేజ సజ్జాతో ఓ చిత్రం చేస్తున్నాను.

కలయిక కుదిరిందా?





'విక్రమ్' చిత్రంతో కమల్‌హాసన్‌ను సక్సెస్ ట్రాక్ ఎక్కించారు దర్శకుడు లోకేశ్ కనగరాజ్. ఇప్పుడు కమల్‌హాసన్ కూతురు శ్రుతీహాసన్‌తో ఆయన ఓ చిత్రం చేయబోతున్నారనే వార్త కోలీవుడ్‌లో వినిపిస్తోంది. వీరిద్దరు కలసి దిగిన ఫొటో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవడం ఈ చర్చకు మరింత ఊపునిచ్చింది. వీరిద్దరి కాంబోలో లేడీ ఓరియంటెడ్ చిత్రం తెరకెక్కుతోందని అంటున్నారు. అయితే శ్రుతీ, లోకేశ్ తో కమల్‌హాసన్ ఓ మ్యూజిక్ ఆల్బమ్ తెరకెక్కిస్తున్నారనే వార్త సైతం వినిపిస్తోంది. అధికారిక ప్రకటన వస్తే తప్ప దీనిపై స్పష్టత వచ్చే అవకాశం లేదు.

నవ్వించే గూఢచారి



హాస్య నటుడు వెన్నెల కిశోర్ హీరోగా నటించిన 'చారి 111' చిత్రం మార్చి ఒకటిన విడుదల కానుంది. టీజీ కీర్తికుమార్ దర్శకత్వంలో అదితి సోని నిర్మించిన సినిమా ఇది. సంయుక్త విశ్వనాథన్ హీరోయిన్‌గా నటించారు. కన్‌ఫ్యూజ్ అయ్యే గూఢచారిగా వెన్నెల కిశోర్ కనిపిస్తారని దర్శకనిర్మాతలు చెప్పారు. 'ఇదొక స్పై యాక్షన్ కామెడీ సినిమా. సిల్లీ మిస్టేక్స్ చేసే గూఢచారి ఒక పెద్ద కేసుని ఎలా పరిష్కరించాడన్న అంశంతో చిత్రాన్ని రూపొందించాం. వెన్నెల కిశోర్, సంయుక్త గూఢచారి పాత్రలు పోషించారు. వాళ్ల బాస్‌గా మురళీశర్మ కీలక పాత్ర చేశారు.' అని దర్శకుడు చెప్పారు. గూఢచారి చిత్రాల్లో 'చారి 111' కొత్తగా ఉంటుందని నిర్మాత తెలిపారు. త్వరలో పాటలు, ట్రైలర్‌ను విడుదల చేస్తామని చెప్పారు.

యువతకు నచ్చే సోలో బాయ్



బిగ్‌బాస్ ఫేమ్ గౌతమ్ కృష్ణ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రానికి 'సోలో బాయ్' టైటిల్ ఖరారైంది. పీ నవీన్ కుమార్ దర్శకత్వంలో సెవెన్ హిల్స్ సతీష్ నిర్మించారు. బుధవారం చిత్రబృందం టైటిల్‌ను ప్రకటించి ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. నిర్మాత మాట్లాడుతూ 'మా నిర్మాణంలో వచ్చిన 'బట్టల రామస్వామి బయోపిక్' ప్రేక్షకులను అలరించింది. 'సోలో బాయ్' చిత్రం ప్రేక్షకుల హృదయాలను స్పృశిస్తుంది' అన్నారు. గౌతమ్ కృష్ణ మాట్లాడుతూ "ఆకాశవీధిలో" చిత్రంతో నటుడిగా గుర్తింపు వచ్చింది. ఈ సినిమాతో ప్రేక్షకులకు మరింత చేరువవుతాననే నమ్మకం ఉంది' అన్నారు. యువతకు, కుటుంబ ప్రేక్షకులకు ఈ చిత్రం నచ్చుతుందని దర్శకుడు తెలిపారు.

మత్స్యకారుల కథతో 'సముద్రుడు'



రమాకాంత్, అవంతిక, భానుశ్రీ హీరోహీరోయిన్లుగా నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'సముద్రుడు'. నగేశ్ నారదాసి దర్శకత్వంలో బదావత్ కిషన్ ఈ చిత్రాన్ని నిర్మించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధమైన ఈ చిత్రం టీజర్‌ను తెలంగాణ మాజీ మంత్రి కేటీఆర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'మత్స్యకారుల జీవితాలను ప్రతిబింబిస్తూ రూపొందించిన సినిమా ఇది. కేటీఆర్‌గారు మా చిత్రం టీజర్‌ను ఆవిష్కరించి, ఓ సామాజిక అంశాన్ని కమర్షియల్ హంగులతో సినిమాగా తీయడం అభినందనీయం అన్నారు. మే 3న మా సినిమాను విడుదల చేస్తాం' అని తెలిపారు. హీరో రమాకాంత్ మాట్లాడుతూ 'అన్ని కమర్షియల్ అంశాలతో సినిమా రూపుదిద్దుకుంది. అందరూ చూసి అభినందిస్తారనే నమ్మకం ఉంది' అన్నారు. సుమన్, శ్రవణ్, రామరాజు, రాజ్ ప్రేమి, సమ్మెట గాంధీ, ప్రభావతి, జబర్దస్త్ శేషు, చిత్రం శ్రీను తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: సుభాష్ ఆనంద్, ఎడిటింగ్: నందమూరి హరి.

లవ్ జిహాద్ డ్రిల్



అమెరికాలో డాక్టర్‌గా సెటిల్ అయిన హరనాథ్ పొలిచర్ల సినిమా మీద మమకారంతో ఇండియా వచ్చి చిత్రాలు తీస్తుంటారు. స్వీయ దర్శకత్వంలో ఆయన నిర్మించిన తాజా చిత్రం 'డ్రిల్' ఈ నెల 16న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సినిమా టీజర్‌ను విడుదల చేశారు. సంగీత దర్శకుడు ఆర్.పి.పట్నాయక్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై హరనాథ్ మరెన్నో సినిమాలు తీయాలనీ, 'డ్రిల్' చిత్రం విజయవంతం కావాలనీ కోరారు.

డాక్టర్ హరనాథ్ మాట్లాడుతూ 'నాకు చిన్నప్పటి నుంచి సినిమాలంటే ఇష్టం. ఆ కారణంగానే ఇప్పటివరకూ ఎనిమిది సినిమాలు తీశా. అమెరికాలో డాక్టర్ వృత్తిలో ఎంత బిజీగా ఉన్నా ఎప్పటికప్పుడు సినిమా అప్డేట్స్ తెలుసుకుంటుంటాను. లవ్ జిహాద్ మీద తెలుగులో ఇంతవరకూ ఒక్క సినిమా కూడా రాలేదు. అందుకే ఆ కాన్సెప్ట్‌తో స్క్రిప్ట్ రెడీ చేసుకుని ఇండియాకు వచ్చి సినిమా తీశా. ఇంతవరకూ నేను చేసిన సినిమాలకు ఇది భిన్నంగా ఉంటుంది' అన్నారు. కారుణ్య చౌదరి హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో భవ్య, సిషిగంధ, తనికెళ్ల భరణి, జెమినీ సురేశ్, కోటేశ్వరరావు, సత్తన్న, విశ్వ , జబర్దస్త్ ఫణి తదితరులు నటించారు.

స్వానుభవం


సామవేదం షణ్ముఖశర్మ

అధ్యయనం, అనుష్ఠానంతోనే... దివ్యానుభవం సాధ్యం

మన జీవితంలోని ప్రతి సంఘటనా ఈశ్వర ప్రేరణతోనే జరుగుతుంది. నా జీవితంలో కూడా 'ఇది దైవ ప్రమేయం, దైవ సంకల్పం' అని నేను భావించే సంఘటనలు ఎన్నో మలుపులకు దోహదం చేశాయి. అలాగే భగవదనుగ్రహం, భగవంతుని కృప లభించిన సందర్భాలు కూడా అనేకం ఉన్నాయి. అయితే అలాంటి అనుభవాలన్నిటినీ బహిర్గతం చేయకూడదన్నది శాస్త్ర నిర్దేశం. దాన్ని గౌరవించాలి. చెప్పదగినవి మాత్రమే చెప్పవచ్చు. ఒకసారి రైలు ప్రయాణం చేస్తున్నాను. ఆ రైలు ప్రమాదానికి గురయింది. తక్షణమే, అప్రయత్నంగా మృత్యుంజయ స్వామి శ్లోకం ఒకటి మనసులో మెదిలింది. ఆ శ్లోకాన్ని ధ్యానం చేస్తూ కూర్చున్నాను. అప్పుడు ఎలాంటి హానీ కలుగకుండా బయటపడగలిగాను. నేను మాత్రమే కాదు... రైలులో ఉన్న అందరూ క్షేమంగా ఉన్నారు. అలాగే భగవత్ స్వరూపులైన మహాత్ముల దర్శనం, వారి ద్వారా లభించిన ఆధ్యాత్మిక అనుభవాలు, క్షేత్రయాత్రలు చేస్తున్నప్పుడు... ఆ క్షేత్రాల్లోని దేవతా శక్తి అనుభవంలోకి రావడం, అమ్మవారి ధ్యాన సాధన చేస్తున్నప్పుడు ఆ తల్లి అనుగ్రహాన్ని స్పష్టంగా అనుభవించడం... ఇలాంటి ఉదంతాలు కూడా అనేకం. ఆధ్యాత్మికంగా నా స్వానుభవాల్లో ప్రధానమైనది నేను ప్రవచనకారుణ్ణి కావడమే. నా ఉపాధి కోసం నేను పాత్రికేయ వృత్తిని ఎంచుకున్నాను. సాహిత్యం మీద ఆసక్తి ఉండడంతో... సృజనాత్మకంగా కొన్ని గీతాలను రాశాను. 'నేనూ రాయగలను' అనే నమ్మకం ఏర్పడింది. నా రచనలు లలిత గీతాలుగా 'ఆకాశవాణి'లో ప్రసారం అయ్యాయి. అప్పుడు సినిమాల్లో పాటలు రాయాలనే కోరిక కలిగింది. సినిమా రంగంలో అడుగుపెట్టాను. గేయ రచయితగా గుర్తింపు పొందాను. కాబట్టి వృత్తిగా నేను సాహిత్యాన్నే ఎంచుకున్నాను. కానీ నా అంతర్గత ప్రవృత్తిలో ఆధ్యాత్మిక లక్షణాలు, ఆధ్యాత్మిక భావాలు చిన్న వయసునుంచే ఉన్నాయి. ఆధునిక సాహిత్యం చదువుకున్నా, ప్రాచీన సాహిత్యాన్ని కూడా బాగా అధ్యయనం చేశాను. వాటిలోని కవితా రీతులు, సాహిత్య భావాలతో పాటు ధార్మికత, ఆధ్యాత్మికత నన్ను అమితంగా ప్రభావితం చేశాయి. మన పూర్వ ఋషులు అందించిన ప్రాచీన సంస్కృత గ్రంథాలు, తెలుగులోని సంప్రదాయ సాహిత్యం... ఇవన్నీ నన్ను ప్రభావితం చేశాయి. వృత్తిపరంగా ఏది చేస్తున్నా నా అలవాట్లు, దైనందిన చర్య... ఇవన్నీ ఆధ్యాత్మిక అభ్యాసంతోనే ఉండేవి. అయితే ఆ ఆధ్యాత్మిక భావజాలమే నా సంపూర్ణ జీవితం అవుతుందని నేను అప్పట్లో ఊహించలేదు. సాహితీపరమైన ఏదో ఒక వృత్తి చేసుకుంటూ... ఆధ్యాత్మిక సంస్కారాన్ని వ్యక్తిగతంగా మాత్రమే ఉంచుకోవాలని అనుకున్నాను. కానీ ఆ భగవంతుడి సంకల్పం వేరేలా ఉంది. నేను ఆధ్యాత్మికమైన విషయాలు మాట్లాడుతున్నప్పుడు అందరూ విని ఆనందించేవారు. మరికొన్ని విషయాలను చెప్పాలని కోరేవారు. ఆ తరువాత ప్రవచనాలు ఒక మాధ్యమంగా ప్రాచుర్యం పొందడంతో... ఆధ్యాత్మిక ప్రవచనకర్తగా కొత్త దారిలో అడుగు పెట్టాను. అదే విధంగా మన సనాతన ధర్మంపై సమాజానికి మరింత అవగాహన కలిగించాలనే ఉద్దేశంతో రాసిన రచనలు కూడా ప్రజలపై ప్రభావం చూపించాయి. దీనితో ప్రవచనం, రచన అనే రెండూ ఆధ్యాత్మికతతోనే ముడివేసుకుపోయాయి. ఒకసారి కంచి పరమాచార్య శ్రీ చంద్రశేఖరేంద్రస్వామిని దర్శించుకున్నాను. అప్పుడు ఆయన మౌన దీక్షలో ఉన్నారు. కానీ ఆయన సమక్షంలో మాటల్లో చెప్పలేని స్పందన కలిగింది. మహాస్వామి శిష్యులైన మహాదేవానందనాథులు నాకు గురువుగా లభించారు. ఆయన నాకు మంత్రోపదేశం చేశారు. ఆ తరువాత నా ఆధ్యాత్మిక అనుష్ఠానం ఇంకా విస్తారంగా పెరిగింది. ఒక్క విషయం కచ్చితంగా చెప్పవచ్చు. అనుష్ఠానం ఉన్నవారికి అనుభవం ఉంటుంది. అనుష్ఠానం లేకుండా, కేవలం కబుర్లతో కాలక్షేపం చేస్తూ 'నాకు అనుభవాలు లేవు' అనడం అసంబద్ధం. 'అనుష్ఠానం' అంటే గురువులు ఇచ్చిన మంత్రాలను సాధన చేయడం. 'అధ్యయనం' అంటే ఆర్ష గ్రంథాలను పఠించి, వాటి సారాంశాన్ని, వాటిలోని మర్మాలను అవగాహన చేసుకోవడం. అనుష్ఠానం, అధ్యయనం... ఈ రెండూ చేస్తూ ఉంటే... మన జీవితాల్లో తప్పకుండా దివ్యానుభూతులు ఉంటాయి. దైవసంకల్పం, దైవప్రమేయం తప్ప మరొకటి లేదని తెలుస్తుంది. 'దైవాధీనం జగత్ సర్వం' అనే సత్యం అనుభవంలోకి వస్తుంది.

> సనాతన ధర్మంలో ఆధ్యాత్మికత వివిధ మార్గాలతో ఉంటుంది. ఒక మార్గాన్ని అనుసరించేవారు ఇతర మార్గాలను తక్కువ చేయడం ఎప్పుడూ మంచిది కాదు

భక్తి వ్యక్తిగతమే... కానీ సామాజికం కూడా

మనిషి అంటే శరీరం, ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి, ప్రాణం... ఇవి మాత్రమే అనుకుంటే అది భౌతికత. వీటన్నిటికీ చైతన్యాన్ని ఇస్తూ... వీటన్నిటికీ అతీతమైనది ఒకటుంది. దాన్ని 'ఆత్మ' అంటారు. దాని అస్తిత్వాన్ని అంగీకరించడాన్నే 'ఆధ్యాత్మికత' అంటారు. ఆత్మను ఆవిష్కరించుకోవడానికి... అంటే ఆత్మ తాలూకు స్వరూపాన్ని తెలుసుకోవడానికి, ఆ అనుభూతిని పొందడానికి చేసే సాధన... ఆధ్యాత్మిక సాధన అవుతుంది. ఇది మూడు రూపాల్లో ఉంటుంది. మొదటిది ధర్మం, రెండోది భక్తి, మూడోది జ్ఞానం. ఈ మూడు విడివిడిగా కాదు... కలిసే ఉండాలి. వ్యక్తి ఆచరణ ధర్మబద్ధమై ఉండాలి. మనస్సు ఆత్మ స్వరూపుడైన ఈశ్వరుడిపై ఉండాలి. అది భక్తి అవుతుంది. ఆ స్వరూపాన్ని సంపూర్ణంగా అవగాహన చేసుకొని, అది తనలో ఉన్న 'నేను' అనే తత్త్వానికి వేరు కాదు అని తెలుసుకోవడమే జ్ఞానం. ధర్మం, భక్తి, జ్ఞానం... ఈ మూడిటి కలయికతో కూడినదే ఆధ్యాత్మిక సాధన. దాన్నే 'ఆధ్యాత్మికత' అంటారు. భక్తి వ్యక్తిగతమైనదే... అందులో సందేహం లేదు. భక్తుని అంతరంగం పరమాత్మతో లేదా భగవంతుడితో అనుబంధం ఏర్పరచుకుంటుంది కనుక... భక్తి, ముక్తి అనేవి ఆ వ్యక్తికీ, ఆ పరమాత్మకు మాత్రమే సంబంధించిన అంశాలు. కానీ భక్తులవల్ల, వారి జీవన విధానం వల్ల సమాజం ప్రభావితం అవుతుంది. కాబట్టి అది కొంత మేరకు సామాజిక అంశం కూడా. వ్యక్తులు కలిస్తేనే సమాజం అవుతుంది. కాబట్టి భక్తిని వ్యక్తిగతతత్త్వంగా కలిగినవారందరూ కలిస్తే సమాజం అవుతుంది. అందుకే 'భక్త సమాజం' అని అంటూ ఉంటాం. అలాంటి సమాజం మనం నివసిస్తున్న దేశ కాలాల మీద ప్రభావం చూపిస్తుంది. అందువల్ల భక్తి వ్యక్తిగతమైనప్పటికీ దానికి సామాజికమైన స్వరూపం కూడా ఉంటుంది.

మార్గాలు, రూపాలు... అన్నీ ఒక్కటే


ఎప్పుడైనా సమాజంలో భౌతికం, ఆధ్యాత్మికం... ఈ రెండిటి గురించీ ఆలోచించేవారు ఉంటారు. కానీ ప్రస్తుతం గ్లోబలైజేషన్ పెరగడం, అనేక రకాల సమాచార సాధనాలు అందుబాటులోకి రావడం, అవి సాంకేతిక పరిజ్ఞానం ద్వారా లభ్యమవడంతో చాలామందిలో ఆధ్యాత్మికమైన ప్రవృత్తి ఏర్పడుతోంది. ఎక్కువమందిలో ఆధ్యాత్మిక చింతన పెరుగుతోంది. 'కనబడుతున్న ఈ భౌతికమైన జీవితానికి అతీతంగా ఒక పారమార్థికమైన జీవితం ఉంది' అనే ఒక భావన ఏర్పడుతోంది. దానికి అనుగుణంగా పెద్దల రచనలు, మహానుభావుల వ్యక్తిత్వాలు స్ఫూర్తినిస్తున్నాయి. ఉదాహరణకు రామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద, రమణమహర్షి, చంద్రశేఖరేంద్ర సరస్వతి... ఇలాంటి మహాత్ముల చరిత్రలు, వారు చెప్పిన ఉపదేశాలు ఇప్పుడు ఎక్కువ లభ్యమవడంతో... ప్రజల్లో మంచి మార్పులు వస్తున్నాయి. అయితే గుర్తుంచుకోవాల్సిన మరొక ముఖ్యమైన విషయం ఏమిటంటే... సనాతన ధర్మంలో ఆధ్యాత్మికత అనేది ఆ వ్యక్తి తాలూకు సంస్కారాన్ని అనుసరించి వివిధ మార్గాలతో ఉంటుంది. ఒక మార్గాన్ని అనుసరించేవారు ఇతర మార్గాలను తక్కువ చేయడం లేదా "ఆ మార్గం వల్ల లాభం లేదు, నా మార్గమే గొప్పది" అనడం అనే ధోరణి ఎప్పుడూ మంచిది కాదు. ఉదాహరణకు, భక్తిమార్గంలో ఉన్నాం అనుకొనేవారు జ్ఞానాన్ని తృణీకరించడం, జ్ఞానమార్గంలో ఉన్నామనుకొనేవారు భక్తిని తృణీకరించడం, "మేం భక్తిలో, జ్ఞానంలో ఉన్నాం కాబట్టి మాకు ధర్మంతో పని లేదు" అనుకోవడం... ధర్మమే ప్రధానం కానీ ఇవన్నీ కావనడం... ఇలాంటి వాదోపవాదాల వల్ల ఆ మార్గాలన్నిటికీ ఉన్న పరస్పర అనుబంధం తెలియకుండా పోతోంది. పరమాత్మను విష్ణువుగా ఆరాధిస్తే వైష్ణవం, శివుడిగా ఆరాధిస్తే శైవం, శక్తిగా ఆరాధిస్తే శాక్తేయం, గణపతిగా ఆరాధిస్తే గాణపత్యం... ఆరాధించేది ఏ రూపమైనా పరమాత్మ ఒక్కరే అనే సమైక్యభావనను విడిచిపెట్టి... దేవుణ్ణి కేవలం తమకు నచ్చిన దేవతా రూపంగా మాత్రమే చూస్తూ, మిగిలిన రూపాలను, మార్గాలను తక్కువగా చూడడం అనే వైఖరి మంచిది కాదు. ఒక సమగ్రమైన ఏకత్వాన్ని తెలుసుకోగలిగే, సమన్వయ ధోరణితో కూడిన ఆధ్యాత్మికతను సనాతన ధర్మం అందించింది. భిన్నమైన ఆరాధనా మార్గాలు అనుసరించినా అవన్నీ చేరేది భగవంతుడి దగ్గరకే. ఏ రూపాన్ని ఆరాధించినా అవన్నీ ఆ పరమాత్మ స్వరూపాలే. ఈ భావనను సమాజంలో విస్తరింపజేయాల్సిన అవసరం ఉంది.

(సామవేదం షణ్ముఖశర్మ సుప్రసిద్ధ ప్రవచనకర్త, సాహితీవేత్త, ఆధ్యాత్మిక గ్రంథ రచయిత)

సంభాషణ: **కృష్ణశర్మ**

దైవమార్గం

ఆర్తులకు ఆశాకిరణం



దేవ పుత్రుడైన ఏసు క్రీస్తుకు మానవుడిగా జన్మనిచ్చే కార్యానికి... ఆ దేవుడే ప్రత్యేకంగా ఎంపిక చేసిన స్త్రీమూర్తి మరియ మాత. ఒకప్పుడు ఫ్రాన్స్ దేశంలోని లూర్దు నగరానికి సమీపంలో ఉన్న పచ్చిక మైదానంలో గొర్రెలను మేపుకొంటున్న బెర్నదెత్తు అనే అమ్మాయికి ఆమె దర్శనమిచ్చింది. ఆనాటి నుంచి 'లూర్దు మాత'గా ఆమె ప్రఖ్యాతి చెందింది. ఆ పేరుతో సైతం మరియ మాత ఆరాధనలను ప్రపంచవ్యాప్తంగా అందుకుంటోంది. విజయవాడ సమీపంలోని గుణదల కొండ మీద గుహలో ప్రతిష్ఠితమైన లూర్దు (మేరీ) మాత దక్షిణ భారతదేశంలో... తమిళనాడులోని వేలాంగణి తరువాత... రెండవ అతి పెద్ద మేరీ మాత క్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. ఈ చర్చి కిందటి ఏడాదే వందేళ్ళు పూర్తి చేసుకుంది. ప్రతి సంవత్సరం ఇక్కడ నిర్వహించే ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాల్లోని కథోలిక పీఠాలకు చెందిన బిషప్‌లతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది తరలివస్తారు. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి తొమ్మిది నుంచి మూడు రోజుల పాటు ఈ ఉత్సవాలు వైభవోపేతంగా సాగుతాయి. మరియ మాతను ప్రధానంగా ఆరాధించేది కథోలికులే అయినప్పటికీ... కథోలికేతర క్రైస్తవులు, క్రైస్తవేతరులు కూడా పెద్ద సంఖ్యలో గుణదల మాతను దర్శించుకుంటారు. మాతృత్వానికి చిహ్నమైన ఆమెకు "మా కోసం ఆ ప్రభువును, ఆ దైవ కుమారుణ్ణి వేడుకోవమ్మా" అంటూ తమ కష్టాలను విన్నవించుకుంటారు. గుణదల మాతకు మొక్కుకుంటే అనుకున్నవి నెరవేరుతాయనీ, వ్యాధుల నుంచి స్వస్థత లభిస్తుందని, ఆధ్యాత్మిక ప్రయోజనాలు చేకూరుతాయనీ భక్తులు నమ్ముతారు. ఆమెను మానవాళికి ఆశాకిరణంగా, నిర్మల, నిష్కళంక మాతగా, మోక్షానికి దారి చూపే తల్లిగా, ఆరోగ్యప్రదాయినిగా, దిశానిర్దేశం చేసే 'మేరిస్టెల్లా' (సముద్రపు నక్షత్రం)గా పరిగణిస్తారు.

• డాక్టర్ దేవదాసు బెర్నార్డ్ రాజు
9866755024

అల్లాహ్ చూపిన బాట

సందేశం

"మానవులు తమ సంపాదనను మూడు భాగాలుగా చేసి, ఒక భాగాన్ని దానం చెయ్యాలి. మరో భాగంతో కుటుంబ అవసరాలు తీర్చుకోవాలి. మూడో భాగాన్ని భవిష్యత్ అవసరాల కోసం వినియోగించాలి. ఆ విధంగా చేసినవారి అవసరాలను ఆ అల్లాహ్ తీరుస్తాడు. అల్లాహ్ చూపిన బాటలో నడిచిన వారికి ఎల్లప్పుడూ ఆయన కృప లభిస్తుంది" అని పేర్కొంటూ అంతిమ దైవప్రవక్త మహమ్మద్ చెప్పిన కథ ఇది:

ఒక వ్యక్తి మైదానంలో నడుస్తున్నాడు. "ఆ విశ్వాసి తోట కోసం వర్షాన్ని కురిపించు" అని మేఘాలను ఎవరో ఆజ్ఞాపించడం అతను విన్నాడు. అంతలోనే దట్టమైన నల్లని మేఘాల నుంచి ఒక మబ్బు తునక వేరు పడింది. ఒక నల్లరాతి నేల మీద వర్షాన్ని కురిపించింది. ఆ నీరు చిన్న కాలువలు కట్టింది. చివరికి అవన్నీ ఒక పెద్ద కాలువగా మారాయి. అది ప్రవాహంగా ముందుకు సాగుతోంది. ఇది చూసి ఆశ్చర్యపోయిన ఆ వ్యక్తి ఆ ప్రవాహం వెంట నడవసాగాడు. కొంత దూరం వెళ్ళాక... ఆ ప్రవాహం ఒక తోటలోకి మళ్ళింది. అక్కడ ఒక రైతు తన తోటకు నీరు పెడుతూ కనిపించాడు.



ఇది చూసిన ఆ వ్యక్తి "ఓ అల్లాహ్ దాసుడా! నీ పేరేమిటి?" అని అడిగాడు. అంతకుముందు మేఘాలకు అదృశ్యవాణి చెప్పిన విశ్వాసి పేరే ఆ రైతు కూడా చెప్పాడు.

అప్పుడు ఆ వ్యక్తి "నేను మైదానంలో నడుస్తూ ఉండగా... "ఫలానా విశ్వాసి తోట కోసం వర్షం కురిపించు" అని మేఘాలను ఎవరో ఆజ్ఞాపించినట్టు వినిపించింది. అది నీ పేరే. దాన్ని 'అల్లాహ్‌వాణి'గా నేను భావిస్తున్నాను. ప్రత్యేకంగా నీ తోటలోనే వర్షం కురిపించాలని అల్లాహ్ ఆదేశించడానికి అర్హత కలిగిన పని నువ్వేం చేస్తున్నావు?" అని రైతును ప్రశ్నించాడు.

"నేను నా తోటలో పండే మొత్తం పంటలో మూడో వంతు దానం చేస్తాను. మరో మూడోవంతు నా కుటుంబం ఆహారానికి సరిపోతుంది. మిగిలిన దాన్ని తరువాత వేయబోయే పంటకోసం ఉపయోగిస్తాను" అని ఆ రైతు చెప్పాడు.

"అల్లాహ్ చూపిన మార్గాన్ని భక్తి విశ్వాసాలతో అనుసరిస్తే... మనకు అవసరమైనదాన్ని ఊహించని మార్గాల్లో కచ్చితంగా ఆయన ప్రసాదిస్తాడు" ఈ కథ ద్వారా దైవప్రవక్త బోధించారు.

• మహమ్మద్ వహీదుద్దీన్

సంకీర్తనా పథంలో దాసశ్రేష్ఠుడు

"గురువుకు గులాము కానంతవరకు దొరకదన్నా ముక్తి" అని తన కృతిలో శ్రీపురందరదాసు చెబుతారు. గురువుకు గులాము అయితేనే హరికి దాసులవుతారనేది శాస్త్రాల సారం. అందుకే పురందరదాసు తన సర్వస్వం త్యజించి... గురువైన శ్రీవ్యాసరాయలును ఆశ్రయించారు. పురందరదాసు నారద ముని అంశతో జన్మించినవాడు. పరమలోభి అయిన వజ్రాల వ్యాపారి శ్రీనివాసనాయకుడు దాసవరేణ్యుడిగా మారిన కథ ఆసక్తికరమైనది.

పురంధరదాసు అసలు పేరు శ్రీనివాస నాయకుడు. ఒక రోజు శ్రీనివాస నాయకుడు తన చేతిలోని బంగారు ముక్కెరను తీక్షణంగా పరిశీలిస్తున్నాడు. ఆ ముక్కెరను, దాన్ని తన చేతిలో పెట్టి... డబ్బు అడుగుతున్న ముసలి బ్రాహ్మణుణ్ణీ, అతని పక్కన ఉన్న బాలుణ్ణీ మార్చి మార్చి చూస్తున్నాడు. 'ఆరు నెలల క్రితం తన కొడుకు ఉపనయనం కోసం ఈ బ్రాహ్మణుడు ధన సహాయం కావాలని వచ్చాడు. ఎన్నిసార్లు తిప్పి పంపినా, తిట్టి పంపినా విసుగు లేకుండా... పగలూ, మధ్యాహ్నం తేడా లేకుండా నాకు జిడ్డులా తగులుకున్నాడు. 'పోనీలే' అని అప్పటికి ఒక నాణేన్ని ఇస్తే... దాన్ని తీసుకొని తన స్థాయికి తగినట్టు కార్యక్రమాన్ని చేసుకోకుండా... 'అది చిలుము పట్టిన నాణెం' అంటూ తిరస్కరించాడు. ఇప్పుడేమో ఇంత విలువైన ముక్కెరను కుదువ పెట్టి డబ్బు అడుగుతున్నాడు. ఈ అమూల్యమైన ముక్కెర ముమ్మూర్తులా నా భార్య సరస్వతీబాయికి ఆమె పుట్టింటివారు పెట్టిన ముక్కెరలానే ఉంది. దీని సంగతేమిటో చూడాల్సిందే' అనుకున్నాడు. ఆ ముక్కెరను పెట్టెలో పెట్టి, తాళం వేశాడు. తాళాన్ని పదిసార్లు లాగి చూశాడు. తన ఎదుట కదలకుండా నిలబడిన బ్రాహ్మణుణ్ణీ, బాలుణ్ణీ చూసి 'పది నిమిషాల్లో వస్తాను. కూర్చొని ఉండండి' అని చెప్పి ఇంటికి బయలుదేరాడు. జగన్నాటక సూత్రధారి అయిన శ్రీహరి ఎవరినైనా తనవారుగా చేసుకోవాలని ఆయన అనుకుంటే... మొదట వారికి వైరాగ్యాన్ని ప్రసాదిస్తాడు. బాలుని రూపంలో చతుర్ముఖ బ్రహ్మ వెంటరాగా... ముసలి బ్రాహ్మణుడి రూపంలో శ్రీనివాసనాయకుడి దగ్గరకు వచ్చాడు. అతణ్ణి అనుగ్రహించి, సన్మార్గంలోకి పంపడానికి శ్రీహరి సాగిస్తున్న లీల ఇది. శ్రీనివాస నాయకుడి దగ్గరకు రావడానికి ముందు... సరస్వతీ బాయి దగ్గరకు వెళ్ళి... ఆమె భర్త చూపిన లోభత్వాన్ని వివరించి, తన కుమారుడి ఉపనయనానికి సాయం యాచించాడు. పుట్టింటివారు ఇచ్చిన ముక్కెరను దానం చేసే స్వాతంత్ర్యం ఆమెకు ఉందని గుర్తు చేశాడు. ఆమె నుంచి స్వీకరించిన ముక్కెరనే... ఆమె భర్తకు ఇచ్చి, డబ్బు అడిగాడు.

విశేషం


నేడు శ్రీ పురంధరదాసు ఆరాధన

శ్రీనివాసనాయకుడు ఇంట్లో ప్రవేశించగానే భార్యను చూశాడు. ఆమె ముక్కుకు రోజూ ఉండే ముక్కెర లేదు. ఆ ముక్కెర తనకు తక్షణమే కావాలని, లేకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయనీ హెచ్చరించాడు. ఏం చేయాలో అర్థంకాని సరస్వతీబాయి విషం తాగి ప్రాణాలు తీసుకోవాలనుకుంది. విషపు పాత్రతో తులసి చెట్టు దగ్గరకు వెళ్ళి, చివరిసారిగా గోపాల కృష్ణుణ్ణి ప్రార్థన చేస్తూ ఉండగా... ఆ పాత్రలో చటుక్కున ఏదో పడింది. అదేమిటని పరిశీలిస్తే... ఆమె ముక్కెర. భగవంతుడి దయాగుణానికి మనసులోనే అనంత ప్రణామాలను అర్పిస్తూ... ఆ ముక్కెరను భర్తకు ఇచ్చింది. అది చూసిన శ్రీనివాసనాయకుడి తల తిరిగిపోయింది. ఆ ముక్కెరతో తన దుకాణానికి వెళ్ళాడు. అక్కడ బ్రాహ్మణుడు, అతని కుమారుడు లేరు. ఖజానా పెట్టె తాళం తెరిచి చూస్తే... అందులో తను ఉంచిన ముక్కెర లేదు. ఆ మాయ అతనికి అంతు పట్టలేదు. ఇంటికి వెళ్ళి, భార్యను అడిగి... జరిగినది తెలుసుకున్నాక... అతనికి సంభ్రమాశ్చర్యాలు, సిగ్గు, బాధ, పశ్చాత్తాపం కలిగాయి. జ్ఞానోదయమయింది. వైరాగ్యం పొందాడు. నవకోటి నారాయణుడిగా పేరు పొందిన అతను ఆ క్షణమే సమస్త సంపదలను వదిలి, కట్టుబట్టలతో భార్యాబిడ్డలతో ముందుకు నడిచాడు. 80 ఏళ్ళ వయసు వరకూ సంచారం చేస్తూ... 4 లక్షల 75 వేల సంకీర్తనలను భగవదర్పితం చేశాడు. సంపదపట్ల ఎంతో లోభిత్వాన్ని చూపించిన ఆయన అందుకు విరుద్ధంగా... జ్ఞానాన్ని ప్రజలకు పంచడంలో అత్యంత దాతృత్వాన్ని ప్రదర్శించాడు.


అద్భుతమైన సంగీతం, సరళమైన సాహిత్యం, ఆధ్యాత్మిక జ్ఞానం... ఈ మూడిటి త్రివేణీ సంగమమే ఆయన రచనలు. ఉపనిషత్ సారాన్ని సులువైన మాటల్లో అందించాడు. అందుకే ఆయన కృతులు 'పురన్దరోపనిషత్తులు' అనిపించుకున్నాయి. ఆయన కీర్తనలలో వైవిధ్యం ఊహాతీతం. మానవ జన్మ విశిష్టత తెలుసుకోవాలనీ, పరమత సహనం కలిగి ఉండాలనీ, శైవ, వైష్ణవ వైషమ్యాలు తగవనీ ప్రబోధించాడు. లౌకిక సంపద కన్నా భక్తి, జ్ఞానాలు అనే సంపద అత్యంత విలువైనదని లోకానికి తెలియజేసిన ఆదర్శ మూర్తి పురంధరదాసు. పుష్య అమావాస్య (నేడు) శ్రీ పురందరదాసుల పుణ్యతిథి. 'ఈశ బేకు ఇద్దు జయిసబేకు' అని తన కీర్తనలో ఆయన బోధించినట్టు ఉన్నతమైన నైతిక విలువలతో లౌకిక గమ్యాలను కూడా చేరుకొంటూనే సుందరమైన సమాజాన్ని నిర్మిద్దాం.

• మాధ్వ ప్రచార పరిషత్
9440258841

వ్యాసపీఠం

13 చక్రాల ఆధ్యాత్మిక ప్రయాణం

ఆరోగ్యంగా.. ఆనందంగా.. ప్రశాంతంగా ఉండటం చాలా మంది జీవితలక్ష్యం. చాలా సందర్భాలలో ఈ మూడు సాధించటానికి శారీరకంగాను.. మానసికంగాను ఆరోగ్యంగా.. ఆనందంగా ఉంటే చాలనుకుంటారు. కానీ ఆధ్యాత్మికతంగా పురోగతి సాధిస్తే తప్ప జీవితలక్ష్యం సాధ్యం కాదంటారు హార్ట్‌ఫుల్‌నెస్ ఆర్గనైజేషన్ (రామచంద్రమిషన్) అధినేత దాజీ. ఈ పురోగతిలో ధ్యానంతో పాటుగా..మన శరీరంలోని నిక్షిప్తమై ఉన్న చక్రాల ఉద్దీపన కూడా చాలా కీలకమైనదంటారాయన. సాధారణంగా భారతీయ సంప్రదాయ యోగ పద్ధతుల ప్రకారం మన శరీరంలో ఏడు చక్రాలు ఉంటాయి. ఒకో చక్రానికి ఒకో విశిష్టత ఉంది. వీటి ఉద్దీపనే ఒక వ్యక్తి జీవిత లక్ష్యం కావాలి. కానీ దాజీ సిద్ధాంతం ప్రకారం మనకు 13 చక్రాలుంటాయి. ఇవే మన జీవనాన్ని నిర్దేశిస్తాయి. మన జీవిత గమనంలో ఈ చక్రాలకు ఉన్న ప్రాముఖ్యతను వివరిస్తూ దాజీ రాసిన గ్రంథమే- "స్పిరిట్యువల్ అనాటమీ". దీనిలో చక్రాల ప్రాముఖ్యతతో పాటుగా.. వాటిలోని శక్తి ప్రసారం కాకుండా అడ్డుకొనే అంశాలేమిటి? వాటిని ఎలా శుద్ధి చేయాలి? ధ్యానం వల్ల మనం ఎలా ప్రగతిని సాధిస్తాం? మొదలైన ప్రశ్నలన్నింటికీ ఈ గ్రంథంలో సమాధానాలు లభిస్తాయి. "2016లో న్యూజెర్సీలో మెడిటేషన్ వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్న సమయంలో ఈ పుస్తకం రాయాలనే ప్రేరణ కలిగింది. ఒక సాయంత్రం హఠాత్తుగా నాకు స్పిరిట్యువల్ అనాటమీకి సంబంధించిన కొన్ని అంశాలు గోచరించాయి. ఆ రోజు రాత్రే నాకు గోచరించిన అంశాలతో మొదటి చాప్టర్ రాశాను. ఆ తర్వాత కొన్ని రోజుల్లో పుస్తకం అవుట్‌లైన్ పూర్తిచేశాను. ఆ తర్వాత ఆరేళ్ల ఈ అంశాలకు సంబంధించిన అనేక వ్యాసాలు రాశాను. ప్రపంచవ్యాప్తంగా ప్రయోగాత్మక వర్క్‌షాప్‌లను నిర్వహించాను. నా అనుభవాలన్నింటినీ క్రోడీకరించి ఈ పుస్తకాన్ని రాశాను" అంటారు దాజీ. ఆధ్యాత్మిక మార్గంలో ప్రయాణిస్తున్నవారందరూ తప్పనిసరిగా చదవాల్సిన పుస్తకమిది.



స్పిరిట్యువల్ అనాటమీ
రచయిత : దాజీ (కమలేష్ జి. పాటిల్)
ప్రచురణ: హార్పర్ కాలిన్స్ **ధర:** రూ. 499
అమేజాన్ మరియు అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాల్లో లభిస్తుంది.

సహజయోగ

మనలో మహాసరస్వతి స్థిరపడాలంటే...

మాఘ మాసం అయిదో రోజు వసంత పంచమి. ఆ రోజున కళలకు, విజ్ఞాన శాస్త్రానికి, సంగీతానికి, జ్ఞానానికి దేవత అయిన సరస్వతిని ఆరాధిస్తాం. ఆమె వాక్కు, బుద్ధి, వివేకం, విద్యలకు అధిదేవత. వసంత పంచమి శీతాకాలానికి ముగింపును, వసంత ఋతువు ఆగమనాన్ని సూచిస్తుంది. ఋగ్వేదంలో, 'దేవీ భాగవతం'లో, 'బ్రహ్మవైవర్త పురాణం'లో, పద్మపురాణంలో సరస్వతీ దేవి గురించి వివిధ గాథలు ఉన్నాయి. ఆమెను ఆద్యంతరహిత శక్తి స్వరూపిణిగా వివిధ శాస్త్రాలు స్తుతించాయి. సృష్టి కార్యాన్ని నిర్వహించడానికి బ్రహ్మకు శక్తిని ప్రసాదించడానికి సరస్వతిని శ్రీమాతాదేవి ప్రసాదించిందని 'దేవీభాగవతం' చెబుతోంది. హంసవాహినిగా, వీణాపాణిగా, మాలాపుస్తకధారిణిగా సరస్వతిని ఎక్కువగా చిత్రీకరించడం కనిపి



14న వసంత పంచమి

స్తుంది. సరస్వతీ వర్ణనల్లో తెల్లని వస్తువులకు ప్రాధాన్యం. ఆమె ధరించే వీణ పేరు కచ్ఛపి. పరాశక్తి ధరించిన తొలి అయిదు రూపాల్లో సరస్వతి ఒకటి. సరస్వతీదేవి ప్రత్యేకతను సహజయోగ ప్రదాత శ్రీమాతాజీ నిర్మలా దేవి పలు సందర్భాల్లో ఈ విధంగా వివరించారు:

మహాసరస్వతీ శక్తి మన సూక్ష్మ శరీరంలోని కుడిపార్శ్వంవైపు పని చేస్తుంది. స్వాధిష్ఠాన చక్రంలో కొలువై ఉన్న సరస్వతీ శక్తి తన గమనంలో... ఆ చక్రంలోని ఎడమ భాగాన్ని కుండలినీ జాగృతి ద్వారా ప్రకాశింపజేసినప్పుడు... మనలో కళాత్మక ప్రతిభలన్నీ అభివృద్ధి చెందుతాయి. కానీ స్వాధిష్ఠాన చక్రంలో రెండవ భాగాన్ని మనం చదవడం, రాయడం లాంటి వాటికి మాత్రమే ఉపయోగిస్తున్నాం. అంతకన్నా ఉన్నత స్థాయికి ఎదగడం మీద మన చిత్తాన్ని సారించడం లేదు. దీనివల్ల స్వాధిష్ఠాన చక్రంలో అసమతుల్యత ఏర్పడుతుంది. సరస్వతీ కృపవల్ల కళాకారులు సాహిత్యం, కళలు, సంగీత సాధన విషయంలో నిష్ణాతులైనా లక్ష్మీతత్త్వం వారికి అంతగా సహకరించకపోవడం మనం చూస్తూనే ఉంటాం. అది సహకరించాలంటే మనలోని సరస్వతీతత్త్వం... మహాసరస్వతీతత్త్వ స్థాయికి చేరాలి. అందుకోసం ఆజ్ఞాచక్రాన్ని అధిగమించే స్థాయికి ఆధ్యాత్మికంగా చేరుకోవాలి. అదే మహాలక్ష్మి, మహాసరస్వతి శక్తులు కలిసే స్థానం. కళాసామర్థ్యానికి తగిన విధంగా ధనార్జన చేయలేకపోతున్నామనుకొనేవారికి... ఆజ్ఞాచక్రాన్ని దాటితేనే ఆ సమస్య పరిష్కారానికి దారి దొరుకుతుంది. ఎప్పుడయితే మహాసరస్వతీతత్త్వం మనలో అభివృద్ధి చెందడం మొదలవుతుందో... వాస్తవాన్ని గ్రహించగలుగుతాం. అవగాహనలో మార్పు వస్తుంది 'మనమందరం ఒక్కటే, విశ్వంలో మనం అంతర్భాగం' అనే సత్యం స్థిరపడుతుంది. సరస్వతీతత్త్వం ఒక బీజం లాంటిదైతే... మహాసరస్వతీతత్త్వం ఒక వృక్షం లాంటిది. మీలో నిక్షిప్తమైన సరస్వతీ శక్తిని మహాసరస్వతీ శక్తిగా మార్చుకోకపోతే... మీ సుషుమ్నా మార్గంలో ఉన్న శ్రీమహాలక్ష్మీ శక్తితో ఐక్యం కాలేరు. శ్రీమహాలక్ష్మీ శక్తి అనుగ్రహం ద్వారా మాత్రమే మీరు ఆత్మసాక్షాత్కారం పొందగలరు. మన ఎడమ పార్శ్వంలోని ఇడానాడిలో ఉన్న మహా కాళీ తత్త్వం వల్ల ఏదైనా పనిని తలపెట్టి, దాన్ని నెరవేర్చుకోవాలనే కోరికను కలిగి ఉంటారు. అయితే దాన్ని కార్యరూపంలోకి తీసుకువచ్చేది మాత్రం శ్రీమహాసరస్వతీ శక్తే. మనలోని సరస్వతీ శక్తిని జాగృతం చేసుకొని, మహాసరస్వతీ శక్తిని స్థిరపరుచుకోవడం అనేది.. కుండలినీ శక్తి ఉత్థానం ద్వారా ఆత్మసాక్షాత్కారం పొందడం ద్వారా, నిత్య సహజ యోగ ధ్యానం ద్వారా మాత్రమే సాధ్యపడుతుంది.


డాక్టర్ పి. రాకేష్
8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ

2024-25లో 7% వృద్ధి



ద్రవ్యోల్బణం అంచనా 4.5 శాతం

కీలక రెపో రేటు యథాతథం

- ద్వైమాసిక ద్రవ్య పరపతి సమీక్ష నిర్ణయాలను ప్రకటించిన ఆర్‌బీఐ
- ఏప్రిల్ 3-5 తేదీల్లో తదుపరి సమీక్ష

ముంబై: వచ్చే ఆర్థిక సంవత్సరం (2024-25)లో జీడీపీ వృద్ధి రేటు 7 శాతంగా నమోదు కావచ్చని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) అంచనా వేసింది. గత అంచనా 6.6 శాతంతో పోలిస్తే అధికమిది. అయితే, ఈ ఆర్థిక సంవత్సరానికి (2023-24) జాతీయ గణాంకాల కార్యాలయం అంచనా వేసిన 7.3 శాతం వృద్ధి రేటు కంటే తక్కువే. కుటుంబాల వినియోగంతో పాటు ప్రైవేట్ రంగ పెట్టుబడులు పుంజుకోవడం, వ్యాపార సెంటిమెంట్, బ్యాంకులు, కార్పొరేట్ కంపెనీల బ్యాలెన్స్ షీట్లు మెరుగవడం ఇంకా మౌలిక పెట్టుబడులపై ప్రభుత్వం ప్రధానంగా దృష్టిసారించడం వంటి అంశాలు వచ్చే ఏడాది వృద్ధి జోరు కొనసాగింపునకు దోహదపడనున్నాయని ఆర్‌బీఐ పేర్కొంది. గత ఆర్థిక సంవత్సరం (2022-23)లో వృద్ధి రేటు 7.2 శాతంగా నమోదైంది. రబీ సాగు పెరగడం, తయారీ రంగ లాభదాయకతలో స్థిరత్వం, చురుకుగా సాగుతున్న సేవా రంగం వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఆర్థిక కార్యకలాపాలకు ఊతమివ్వనున్నాయని ద్రవ్యపరపతి సమీక్షలో ఆర్‌బీఐ ప్రస్తావించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రిటైల్ ద్రవ్యోల్బణం సగటు 5.4 శాతానికి పరిమితం కానుందన్న ఆర్‌బీఐ.. వచ్చే ఆర్థిక సంవత్సరంలో 4.5 శాతానికి తగ్గవచ్చని అంచనా వేసింది. భారీ, పునరావృత ఆహార ధరల షాక్‌లు ద్రవ్యోల్బణ నియంత్రణకు అవాంతరంగా మారుతున్నాయని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ అన్నారు.

భౌగోళిక రాజకీయ పరిణామాలు, సరఫరా వ్యవస్థపై వాటి పరిణామాలు, అంతర్జాతీయ ఆర్థిక సేవల మార్కెట్లు, కమోడిటీ ధరల్లో ఒడుదొడుకులకు ద్రవ్యోల్బణాన్ని అంచనాల కంటే పెంచే ప్రమాదం ఉందని సమీక్ష నివేదికలో గవర్నర్ పేర్కొన్నారు. రిటైల్ ధరల ఆధారిత ద్రవ్యోల్బణాన్ని 4 శాతానికి (+/-2 శాతం) కట్టడి చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆర్‌బీఐకి లక్ష్యాన్ని నిర్దేశించింది. గత ఏడాది డిసెంబరులో ద్రవ్యోల్బణం 5.69 శాతంగా నమోదైంది.

త్రైమాసికాల వారీగా వృద్ధి, ద్రవ్యోల్బణ అంచనాలు (%)

త్రైమాసికం	వృద్ధి	ద్రవ్యోల్బణం
క్యూ1 (ఏప్రిల్-జూన్)	7.2	5.0
క్యూ2 (జులై-సెప్టెంబరు)	6.8	4.0
క్యూ3 (అక్టోబరు-డిసెంబరు)	7.0	4.6
క్యూ4 (జనవరి-మార్చి)	6.9	4.7

రిటైల్, ఎంఎస్ఎంఈ రుణగ్రహీతలకు కేఎఫ్ఎస్ ఇవ్వాలి..

రుణాల మంజూరులో పారదర్శకతను పెంచేందుకు ఆర్‌బీఐ మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై అందరు రుణదాతలు రిటైల్, ఎంఎస్ఎంఈ రుణగ్రహీతలకు వడ్డీ రేటు సహా రుణ ఒప్పంద నిబంధనలకు సంబంధించిన కీ ఫ్యాక్ట్ స్టేట్‌మెంట్ (కేఎఫ్ఎస్)ను అందించాలని ఆర్‌బీఐ ఆదేశించింది. ప్రస్తుతం వాణిజ్య బ్యాంకులిచ్చే వ్యక్తిగత రుణాలతోపాటు ఆర్‌బీఐ నియంత్రిత డిజిటల్ లెండింగ్ కంపెనీలు, సూక్ష్మ రుణ సంస్థల రుణాలకు కేఎఫ్ఎస్ తప్పనిసరి.

త్వరలో ఈ-రూపీ ఆఫ్‌లైన్ లావాదేవీలు

డిజిటల్ రూపాయి లేదా సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ (సీబీడీసీ) వినియోగదారులు త్వరలో ఇంటర్నెట్ సౌకర్యం లేని లేదా పరిమిత కనెక్టివిటీ ప్రాంతాల్లో ఆఫ్‌లైన్‌లోనూ లావాదేవీలు నెరిపే వెసులుబాటు కల్పించనున్నట్లు ఆర్‌బీఐ గవర్నర్ దాస్ తెలిపారు. ఆర్‌బీఐ రిటైల్ సీబీడీసీని 2022 డిసెంబరులో పైలట్ పద్ధతిన ప్రవేశపెట్టింది. 2023 డిసెంబరు నాటికి డిజిటల్ రూపాయి ద్వారా రోజుకు 10 లక్షల లావాదేవీల లక్ష్యాన్ని చేరుకుంది.

ఆరోసారీ వడ్డీ రేట్లు మారలేదు..

ఆర్‌బీఐ వరుసగా ఆరోసారీ కీలక వడ్డీ (రెపో) రేట్లను యథాతథంగా కొనసాగించింది. అంతర్జాతీయ అనిశ్చితులతో పాటు ద్రవ్యోల్బణాన్ని మరింత తగ్గించాల్సిన అవసరం ఉన్న నేపథ్యంలో బ్యాంకింగ్ నియంత్రణ మండలి ఈ నిర్ణయం తీసుకుంది. వడ్డీ రేట్లపై సర్దుబాటు వైఖరిని క్రమంగా ఉపసంహరించుకోవాలన్న గత నిర్ణయాన్ని కూడా యథావిధిగా కొనసాగిస్తున్నట్లు తెలిపింది. 2022 మే నుంచి 2023 ఫిబ్రవరి మధ్య కాలంలో ఆర్‌బీఐ రెపో రేటును వరుసగా ఆరు విడతల్లో 2.5 శాతం పెంచింది. దాంతో రెపో 6.5 శాతానికి చేరుకుంది. గతంలో రెపో పెంపు ప్రభావం మార్కెట్‌కు ఇంకా పూర్తిగా బదిలీ కాలేదని ఆర్‌బీఐ గవర్నర్ అన్నారు. ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షలో భాగంగా శక్తికాంత దాస్ అధ్యక్షతన ఆరుగురు సభ్యుల మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) మూడు రోజుల పాటు (ఈ నెల 6-8 తేదీల్లో) సమావేశమైంది. ప్రస్తుత దేశీయ, అంతర్జాతీయ ఆర్థిక పరిణామాల నేపథ్యంలో రెపో రేటును యథాతథంగా కొనసాగించాలని ఐదుగురు సభ్యులు ఓటేశారు. తదుపరి సమీక్షను ఏప్రిల్ 3-5 తేదీల్లో నిర్వహించనున్నట్లు తెలిపింది.

నిరంతర నిబంధనల ఉల్లంఘన కారణంగానే పేటీఎంపై చర్యలు

నియంత్రణ నియమావళిని నిరంతరం ఉల్లంఘించిన కారణంగానే పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్ (పీపీబీఎల్)పై కఠిన చర్యలు చేపట్టడం జరిగిందని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. నిబంధనలకు అనుగుణంగా దిద్దుబాటు చర్యలు చేపట్టేందుకు ఈ ఫిన్‌టెక్ కంపెనీకి తగినంత సమయం ఇవ్వటంతో పాటు ఇందుకు సంబంధించి సంస్థతో జరిపిన దీర్ఘకాలిక ద్వైపాక్షిక చర్యలు ఆశించిన ఫలితాలివ్వకపోవడం వల్లే ఆంక్షలు విధించాల్సి వచ్చిందని శక్తికాంత దాస్ తెలిపారు. అయితే, పేటీఎంకు వ్యవస్థాగతమైన ముప్పేమీ లేదని పరపతి సమీక్ష నిర్ణయాల ప్రకటన అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పేర్కొన్నారు. ఆర్‌బీఐ చర్యలు వ్యవస్థ స్థిరత్వానికి భంగం కలగకుండా చూడటంతోపాటు కస్టమర్ల ప్రయోజనాలను రక్షించేందుకేనని దాస్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. పీపీబీఎల్‌పై ఆంక్షలపై పేటీఎం యాప్‌పై ప్రభావం ఉండదని ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ జే స్వామినాథన్ స్పష్టం చేశారు. బ్యాంకులు తమ విధానాలకు అనుగుణంగా అవసరమైన జాగ్రత్తలు పాటిస్తూ పేటీఎం వాలెట్‌తో భాగస్వామ్యం కావచ్చన్నారు. కాగా, పీపీబీఎల్ ఉదంతంపై ప్రజల్లో చాలా సందేహాలు, ఆందోళనలు ఉన్నాయని.. వాటిపై స్పష్టతనిచ్చేందుకు వచ్చేవారంలో సమగ్ర ఎఫ్ఏక్యూ (ఫ్రీక్వెంట్లీ ఆస్క్‌డ్ క్వశ్చన్స్) విడుదల చేయనున్నట్లు దాస్ తెలిపారు.

ఎల్ఐసీ లాభం రూ.9,444 కోట్లు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం ఎల్ఐసీ డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికానికి గాను రూ.9,444 కోట్ల నికర లాభం ఆర్జించింది. అంతకు ముందు సంవత్సరం ఇదే కాలం (రూ.6,344 కోట్లు)తో పోలిస్తే ఇది 49 శాతం ఎక్కువ. ఇదే సమయంలో కంపెనీ స్థూల ఆదాయం రూ.1,96,891 కోట్ల నుంచి రూ.2,12,447 కోట్లకు, నికర ప్రీమియం ఆదాయం రూ.1,11,788 కోట్ల నుంచి రూ.1,17,017 కోట్లకు చేరాయి.

అపోలో లాభంలో 60% వృద్ధి

హైదరాబాద్: డిసెంబరుతో ముగిసిన త్రైమాసికానికి అపోలో హాస్పిటల్స్ రూ.4,850.60 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.245 కోట్ల నికర లాభం ఆర్జించింది. అంతకు ముందు సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే ఆదాయం 13.8 శాతం, నికర లాభం 60 శాతం పెరిగాయి. దీంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి వాటాదారులకు ఒక్కో షేరుపై రూ.6 చొప్పున తాత్కాలిక డివిడెండ్ చెల్లించాలని అపోలో హాస్పిటల్స్ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది. రూ.5 ముఖ విలువ ఉన్న షేరుపై ఇది 120 శాతానికి సమానం.

39% పెరిగిన ఎన్‌సీసీ లాభం

హైదరాబాద్: ఎన్‌సీసీ లిమిటెడ్ డిసెంబరుతో ముగిసిన త్రైమాసికానికి మంచి ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ఈ కాలానికి కంపెనీ టర్నోవర్ అంతకు ముందు సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే 39 శాతం పెరిగి రూ.4,773.19 కోట్లకు చేరింది. ఇదే సమయంలో నికర లాభం రూ.149.88 కోట్ల నుంచి రూ.212.82 కోట్లకు పెరిగింది. డిసెంబరు త్రైమాసికంలో కంపెనీ కొత్తగా రూ.796 కోట్ల విలువైన ఆర్డర్లు సంపాదించింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	63,240 ▲	58,010 ▲	76,100 ▲
ముంబై	62,612 ▼	57,353 ▼	69,950 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

8వ తేదీ		విజయవాడ	546
హైదరాబాద్	545	విశాఖపట్నం	555
9వ తేదీ		వరంగల్	547
చిత్తూరు	583	డజను గుడ్లు రూ.72	
గోదావరి	546		

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	117	గోదావరి	122
వరంగల్	117	విజయవాడ	122
కరీంనగర్	117	గుంటూరు	124
మహబూబ్‌నగర్	117	ఒంగోలు	124
కర్నూలు	117	చిత్తూరు	130
విశాఖపట్నం	117		

భారత్‌లోనూ 'కోడ్ వితౌట్ బారియర్స్'

- 75,000 మంది మహిళా డెవలపర్లకు శిక్షణ
- మైక్రోసాఫ్ట్ చైర్మన్ సత్య నాదెళ్ల

బెంగళూరు: సాఫ్ట్‌వేర్ దిగ్గజం 'మైక్రోసాఫ్ట్' కంపెనీ తన 'కోడ్ వితౌట్ బారియర్స్' కార్యక్రమాన్ని భారత్‌కు విస్తరిస్తోంది. ఈ నెలలోనే భారత్‌లో ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని కంపెనీ చైర్మన్, సీఈఓ సత్య నాదెళ్ల ప్రకటించారు. మైక్రోసాఫ్ట్ 'ఏఐ టూర్' సందర్భంగా ఆయన ఈ విషయం వెల్లడించారు. ఈ కార్యక్రమం ద్వారా కంపెనీ ఈ సంవత్సరం దేశంలో 75,000 మంది మహిళా సాఫ్ట్‌వేర్ డెవలపర్లకు వేగంగా అభివృద్ధి చెందుతున్న క్లౌడ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధ (ఏఐ), డిజిటల్ టెక్నాలజీల వంటి సాంకేతిక అంశాల్లో శిక్షణ ఇవ్వనుంది. సాఫ్ట్‌వేర్ ఉత్పత్తుల అభివృద్ధిలో స్త్రీ-పురుషుల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తగ్గించేందుకు 2021లో మైక్రోసాఫ్ట్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ప్రస్తుతం ఆసియా-పసిఫిక్ ప్రాంతంలోని తొమ్మిది దేశాల్లో మైక్రోసాఫ్ట్ ఈ కార్యక్రమం అమలు చేస్తోంది. ఈ నెలాఖరులోగా భారత్‌లోనూ ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది.

ఐఈడబ్ల్యూ-2024లో 'మేఘా' రిగ్గులు

గోవాలో జరుగుతున్న ఇండియా ఎనర్జీ వీక్ (ఐఈడబ్ల్యూ)-2024 సదస్సులో హైదరాబాద్ కేంద్రంగా పని చేసే మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) తన అత్యాధునిక డ్రిల్లింగ్ రిగ్‌ను ప్రదర్శించింది. కంపెనీ అనుబంధ డ్రిల్‌మెక్ ఎస్.పీ.ఏ అనే కంపెనీ సాంకేతిక సహకారంతో 'హెచ్ హెచ్ 150' అనే ఈ ఆటోమేటెడ్ హైడ్రాలిక్ వర్క్‌ఓవర్ రిగ్‌ను తయారు చేసింది. ఈ రిగ్‌కు అవసరమైన విడిభాగాల్లో 55 శాతానికి పైగా ఉత్పత్తులను ఎంఈఐఎల్ స్థానిక కంపెనీల నుంచి సేకరించింది.

స్పెక్ట్రమ్ కనీస ధర రూ.96,317 కోట్లు

న్యూఢిల్లీ: మొబైల్ టెలికాం సేవలకు అవసరమైన 8 స్పెక్ట్రమ్ బ్యాండ్ల కనీస ధరను ప్రభుత్వం రూ.96,317 కోట్లుగా ఖరారు చేసింది. దివాలా ప్రక్రియలో ఉన్న కంపెనీలకు చెందిన 800, 900, 1800, 2100, 2300, 2500, 3300 మెగాహెర్ట్జ్, 26 గిగా హెర్ట్జ్ బ్యాండ్ల స్పెక్ట్రమ్‌ను ప్రభుత్వం త్వరలో వేలం వేయనుంది.

వడ్డీ రేట్ల అనిశ్చితిపై ఆగ్రహ జ్వాలలు

ఒక శాతం నష్టపోయిన మార్కెట్

ముంబై: ఆర్‌బీఐ వడ్డీ రేట్ల తగ్గింపుపై నెలకొన్న అనిశ్చితి ఇన్వెస్టర్లను ఆగ్రహానికి గురి చేసింది. వడ్డీ రేట్లలో యథాతథ స్థితి కొనసాగింపు పట్ల తీవ్ర అసంతృప్తి చెందిన ఇన్వెస్టర్లు వడ్డీ రేట్ల ప్రభావం అధికంగా ఉండే ఆర్థిక సర్వీసులు, బ్యాంకింగ్, ఆటో, రియల్టీ, కమోడిటీ షేర్లలో అమ్మకాలకు తెగబడ్డారు. దీంతో ఈక్విటీ మార్కెట్ గురువారం ఒక శాతం మేరకు నష్టపోయింది. సెన్సెక్స్ 723.57 పాయింట్ల నష్టంతో 71428.43 వద్ద ముగియగా నిఫ్టీ 212.55 పాయింట్ల నష్టంతో 21717.95 వద్ద క్లోజైంది. ఒక దశలో సెన్సెక్స్ 921.38 పాయింట్లు నష్టపోయి 71230.62 పాయింట్ల ఇంట్రాడే కనిష్ఠ స్థాయిని తాకింది.

పేటీఎం షేర్లు ఢమాల్: పేటీఎం మాతృసంస్థ వన్ 97 కమ్యూనికేషన్ షేరు రెండు రోజుల ర్యాలీ అనంతరం మళ్లీ నష్టాల్లోకి జారుకుంది. గురువారం ఈ షేరు బీఎస్ఈలో 9.99 శాతం దిగజారి దిగువ సర్క్యూట్ రూ.447.10 స్థాయిని తాకింది. ఎన్ఎస్ఈలో కూడా అదే స్థాయిలో దిగజారి రూ.446.65కు పడిపోయింది. ఫలితంగా కంపెనీ మార్కెట్ విలువ రూ.3153.18 కోట్లు నష్టపోయి రూ.28,934.44 కోట్ల స్థాయికి దిగజారింది.

ఐదో విలువైన కంపెనీగా ఎల్ఐసీ

ఎల్ఐసీ షేర్లు గురువారం ఒక్కరోజే 6 శాతం పెరగడంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.6,99,702.87 కోట్లకు పెరిగింది. స్టాక్ మార్కెట్‌లో ఐదో అత్యంత విలువైన కంపెనీగా నమోదయింది. బీఎస్ఈలో ఈ షేరు ఒక దశలో రికార్డు స్థాయిలో 9.51 శాతం పెరిగి రూ.1,144.45 స్థాయిని తాకినా చివరికి 5.86 శాతం లాభంతో రూ.1,106.25 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో 6.46 శాతం లాభపడి రూ.1,112 వద్ద ముగిసింది. ఒక్క రోజులోనే కంపెనీ మార్కెట్ విలువ రూ.38,740.62 కోట్ల మేరకు పెరిగింది. ప్రస్తుతం స్టాక్‌మార్కెట్లో అత్యంత విలువైన కంపెనీగా రిలయన్స్ (రూ.19,64,044.94 కోట్లు) అగ్రస్థానంలో ఉండగా టీసీఎస్ (రూ.15,13,218.99 కోట్లు), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (రూ.10,66,150.51 కోట్లు), ఇన్ఫోసిస్ (రూ.7,02,754.66 కోట్లు) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

స్పోర్ట్స్

డేవిస్ కప్ వరల్డ్ గ్రూప్-1లో స్వీడన్‌తో భారత్ పోరు

న్యూఢిల్లీ: గతవారం పాకిస్థాన్‌తో పోరులో గెలుపొంది డేవిస్ కప్ వరల్డ్ గ్రూప్-1లో చోటు ఖరారు చేసుకున్న భారత టెన్నిస్ జట్టుకు విదేశీ గడ్డపై తదుపరి ప్రత్యర్థి ఎవరో తేలిపోయింది. వరల్డ్ గ్రూప్-1లో భాగంగా భారత్ ఈ సెప్టెంబరులో స్వీడన్ జట్టుతో తలపడనుంది. ఇటీవల క్వాలిఫయర్స్ తొలిరౌండ్లో బ్రెజిల్ చేతిలో స్వీడన్ ఓడిపోయింది. అయితే, ఇప్పటిదాకా స్వీడన్‌తో భారత్ ఐదుసార్లు పోటీపడ్డా ఒక్కసారి కూడా నెగ్గలేకపోయింది. మరి.. ఈసారైనా మనోళ్లకు విజయం దక్కుతుందో లేదో చూడాలి.



ఈఫిల్ టవర్ ఐరన్‌తో ఒలింపిక్ పతకాలు

పారిస్: మరో ఐదు నెలల్లో పారిస్‌లో ప్రతిష్ఠాత్మక ఒలింపిక్స్ ఆరంభం కానున్నాయి. 17 రోజుల పాటు జరిగే ఈ మెగా ఈవెంట్‌లో విజేతలుగా నిలిచే అథ్లెట్లకు 5,084 పతకాలను అందించనున్నారు. అయితే వందేళ్ల తర్వాత తాము ఆతిథ్యం ఇవ్వబోతున్న ఈ గేమ్స్‌ను చిరస్మరణీయం చేసుకోవాలనే ఆలోచనలో నిర్వాహకులున్నారు. దీంట్లో భాగంగా ఒలింపిక్స్, పారాలింపిక్స్‌లో పోటీపడే విజేతలకు ప్రదానం చేసే స్వర్ణ, రజత, కాంస్య పతకాలను గురువారం విడుదల చేశారు. ఒలింపిక్స్ చరిత్రలోనే అత్యంత ప్రత్యేకంగా, చరిత్రాత్మకంగా, మరచిపోలేని విధంగా ఉండేలా ఈ పతకాలను రూపొందించారు. ఫ్రాన్స్ దేశ చరిత్రాత్మక కట్టడమైన ఈఫిల్ టవర్ నుంచి తీసిన ఇనుమును ఈ పతకాల తయారీలో వాడడం విశేషం. ప్రతి పతకానికి షడ్భుజాకారంలో 18 గ్రాముల ఇనుమును అద్దారు. దీనిపైనే పారిస్ 2024 ఒలింపిక్స్ లోగోను కూడా ఉంచారు. ప్రముఖ ఫ్రెంచ్ జ్యువెలరీ హౌజ్ చౌమెట్ ఈ పతకాలను తయారు చేసింది. 'ఒలింపిక్స్, పారాలింపిక్స్ విజేతలకు ఈఫిల్ టవర్ ముక్కను అందించాలనుకుంటున్నాం. ఈ పతకాలు మా దేశ గౌరవానికి ప్రాతినిధ్యం వహించేలా ఉంటాయి' అని పారిస్ ఒలింపిక్స్ నిర్వాహక కమిటీ చీఫ్ టోనీ ఎస్టాంగ్యూట్ తెలిపారు.



ఒలింపిక్ చాంపియన్‌కు అరుదైన గౌరవం

ఐస్ ప్యాలెస్ 'వాల్ ఆఫ్ ఫేమ్'పై చోప్రా

లౌజానే (స్విట్జర్లాండ్): ఒలింపిక్ చాంపియన్, జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రాకు అరుదైన గౌరవం దక్కింది. స్విట్జర్లాండ్‌లోని ప్రముఖ ఐస్ ప్యాలెస్ యుంగ్‌ఫ్రావ్ 'వాల్ ఆఫ్ ఫేమ్'లో నీరజ్ చిత్రానికి చోటు లభించింది. ప్యాలెస్ గోడపై నీరజ్ పేరిట ఏర్పాటు చేసిన స్మారక ఫలకాన్ని అతడు ఆవిష్కరించాడు. ఈ సందర్భంగా అక్కడ ఉంచేందుకు తన జావెలిన్‌ను బహుమానంగా ఇచ్చాడు. అనంతరం జావెలిన్ త్రో విన్యాసాలతో సందర్శకులకు కనువిందు చేశాడు. టాప్ ఆఫ్ యూరప్‌గా పిలిచే ఈ ప్యాలెస్ ప్రముఖ పర్యాటక ప్రాంతం. ఇక్కడి గోడలపై స్విస్ దిగ్గజం రోజర్ ఫెడరర్, గోల్ఫర్ రోరీ మెక్‌ఇల్రాయ్ స్మారకాలు కూడా ఉన్నాయి. స్విస్ పర్యాటకానికి చోప్రా ప్రచారకర్తగా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే.



బుమ్రాను ఏం చేద్దాం?

మూడో టెస్టుకు విశ్రాంతిపై మల్లగుల్లాలు

న్యూఢిల్లీ: ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఐదు టెస్టుల సిరీస్‌లో భారత్ తొలి టెస్టు ఓడినా.. రెండో టెస్టులో అద్భుత పోరాటం కనబర్చింది. పేసర్ బుమ్రా తన పదునైన బౌలింగ్‌తో పర్యాటక జట్టును హడలగొట్టడంతోనే విజయం దక్కింది. ప్రస్తుతం సిరీస్‌లో 1-1తో నిలిచిన భారత్ పోటీని రసవత్తరంగా మార్చింది. అయితే మిగిలిన మూడు టెస్టుల కోసం జట్టును ఇంకా ప్రకటించాల్సి ఉంది. ఇప్పటికే జడేజా గాయంతో, కోహ్లీ వ్యక్తిగత కారణాలతో సిరీస్ ఆడేది సందేహంగా మారింది. ఈనేపథ్యంలో పేసర్ బుమ్రాకు టీ20 వరల్డ్‌కప్‌నకు ముందు తగిన విశ్రాంతి కల్పిస్తే బావుంటుందనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఇప్పటిదాకా జరిగిన రెండు టెస్టుల్లో అతడు 57.5 ఓవర్లు వేసి 15 వికెట్లు తీయడం విశేషం. జట్టు కీలక బౌలర్ కావడంతో అతడిపై అధికంగా పనిఒత్తిడి పడకూడదనే భావనలో సెలెక్టర్లున్నారు. ఈ సిరీస్ తర్వాత ఐపీఎల్, అనంతరం టీ20 వరల్డ్‌కప్ వరుసగా ఉంటాయి. అంతేకాకుండా గాయాలతోనే దాదాపు 2022-23 ఏడాదంతా ఆటను మిస్ అయ్యాడు. అందుకే ముందుజాగ్రత్తగా రాజ్‌కోట్‌లో జరిగే మూడో టెస్టు నుంచి తప్పిస్తే ఎలా ఉంటుందనే ఆలోచనలో సెలెక్టర్లు ఉన్నారు. కానీ భారత స్పిన్నర్లను ఇంగ్లండ్ బ్యాటర్లు సులువుగా ఆడేస్తున్న వేళ.. అటు బుమ్రా కూడా జట్టులో లేకపోతే ఎలా? అనే సందేహం కూడా వ్యక్తమవుతోంది. అదీగాకుండా తను జట్టు వైస్‌కెప్టెన్. అనుభవజ్ఞుడు విరాట్ అందుబాటులో లేకపోవడంతో కెప్టెన్ రోహిత్‌కు బుమ్రా అండ అవసరం. ఏదిఏమైనా రాజ్‌కోట్‌లో ఆడాలా? వద్దా? అనే నిర్ణయం తీసుకునేందుకు బోర్డు పెద్దలు బుమ్రాకే పూర్తి అధికారం ఇచ్చినట్టు సమాచారం.



సెమీస్‌లో నిఖత్

సోఫియా (బల్గేరియా): డిఫెండింగ్ చాంపియన్ నిఖత్ జరీన్ వరుసగా మూడోసారి స్ట్రాంజా బాక్సింగ్ టోర్నమెంట్‌లో సెమీఫైనల్లో ప్రవేశించింది. గురువారం జరిగిన 50 కిలోల క్వార్టర్స్ బౌట్‌లో నిఖత్ 5-0తో లఖదిరి వాసిల్లా (ఫ్రాన్స్)ను చిత్తు చేసింది. వాసిల్లా ఐరోపా చాంపియన్, పారిస్ ఒలింపిక్స్‌లో తలపడే బాక్సర్ కావడంతో పోరు హోరాహోరీగా సాగుతుందని అంతా భావించారు. అయితే, నిఖత్ పంచ్ పవర్ ముందు వాసిల్లా పూర్తిగా తేలిపోయింది. శనివారం జరిగే సెమీస్ పోరులో స్థానిక బాక్సర్ చుకనోవాతో నిఖత్ తలపడనుంది. ఇక, 66 కిలోల విభాగంలో అరుంధతి చౌధురి కూడా సెమీస్ చేరింది. క్వార్టర్స్‌లో అరుంధతి 5-0తో మిలీనా (సెర్బియా)పై నెగ్గింది.



ట్రోఫీ పంచుకున్నారు


- సంయుక్త విజేతలుగా భారత్, బంగ్లా
- గందరగోళంగా టైటిల్ ఫైట్
- శాఫ్ అండర్-19 మహిళల ఫుట్‌బాల్

ఢాకా: వివాదాస్పద రీతిలో ముగిసిన శాఫ్ అండర్-19 మహిళల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో భారత్, బంగ్లాదేశ్ జట్లు సంయుక్త విజేతలుగా నిలిచాయి. గురువారం నాటకీయ రీతిలో మలుపులు తిరిగిన ఫైనల్ మ్యాచ్‌లో భారత్ 1-1 (11-11) స్కోరుతో బంగ్లాదేశ్‌తో సమంగా నిలిచింది. 8వ నిమిషంలో షిబానా దేవి గోల్‌తో భారత్ 1-0తో పైచేయి సాధించింది. కానీ, సెకండాఫ్ ఇంజ్యూరీ టైమ్‌లో సగోరిక గోల్‌తో బంగ్లా 1-1తో స్కోరు సమం చేసింది. దీంతో మ్యాచ్ ఫలితం షూటౌట్‌కు దారి తీసింది. నరాలు తెగే ఉత్కంఠ మధ్య జరిగిన పెనాల్టీ షూటౌట్‌లో ఇరుజట్లూ 5-5తో నిలవడంతో.. సడన్ డెత్ అనివార్యమైంది. అందులో కూడా 6-6తో సమంగా నిలిచాయి. ఈ సమయంలో షూటౌట్ ఆపేసిన రెఫరీ.. రెండు జట్ల కెప్టెన్లనూ పిలిచి టాస్ వేసింది. ఇందులో భారత్‌ను అదృష్టం వరించింది. కానీ, బంగ్లా జట్టు స్టేడియంలోనే నిరసనకు దిగడంతో వాతావరణం మారిపోయింది. మరోవైపు వీక్షకులు కూడా భారత ప్లేయర్లపై నీళ్ల బాటిళ్లు విసురుతూ రచ్చ చేయడంతో మన అమ్మాయిలు స్టేడియం వీడి డ్రెస్సింగ్ రూమ్‌కు వెళ్లిపోయారు. అనేక తర్జనభర్జనల అనంతరం మ్యాచ్ కమిషనర్.. ఇరుజట్లనూ సంయుక్త విజేతలుగా నిర్ణయించాడు. గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితులు ఎదురుకాలేదని అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్) వర్గాలు తెలిపాయి. తమ సమ్మతితోనే జాయింట్ విన్నర్‌గా ప్రకటించాడని చెప్పాయి.

ప్రొ లీగ్ నుంచి వరుణ్ అవుట్



న్యూఢిల్లీ: అత్యాచార కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న భారత హాకీ ఆటగాడు వరుణ్ కుమార్ అంతర్జాతీయ హాకీ సమాఖ్య ప్రొ లీగ్ టోర్నీ నుంచి గురువారం వైదొలిగాడు. ఈ టోర్నీ శనివారం భువనేశ్వర్‌లో మొదలవనుంది. ఇందుకోసం అతడు జట్టుతో కలిసి భువనేశ్వర్‌లోనే ఉన్నాడు. వివాహం చేసుకుంటానని నమ్మించి మైనర్‌గా ఉన్నప్పుడే తనపై వరుణ్ అత్యాచారం చేశాడని ఓ మహిళ గత సోమవారం బెంగళూరు పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. దీంతో పోలీసులు పోక్సో చట్టం కింద వరుణ్‌పై కేసు నమోదు చేశారు. కాగా..హాకీ ఇండియా వర్గాల కథనం ప్రకారం..వరుణ్‌పై ఫిర్యాదు చేసిన మహిళ బెంగళూరులోని సాయ్ సెంటర్‌లో వాలీబాల్ ప్లేయరట. అక్కడే వరుణ్‌కు పరిచయమైన ఆ మహిళ ప్రస్తుతం ఎయిర్ హోస్టెస్‌గా పని చేస్తోందని సమాచారం.



ఇషాన్‌కు కష్టమేనా?

బరోడా: కొంతకాలంగా క్రికెట్‌కు దూరమైన వికెట్ కీపర్ ఇషాన్ కిషన్ తిరిగి ప్రాక్టీస్ ఆరంభించాడు. నవంబరులో ఆస్ట్రేలియాతో టీ20 సిరీస్ తర్వాత అతడు అంతర్జాతీయ క్రికెట్ ఆడలేదు. మానసిక అలసట కారణంగా విశ్రాంతి తీసుకున్నాడు. జట్టులో చోటు కోసం ఎదురుచూస్తున్న అతను బరోడాలోని రిలయన్స్ స్టేడియంలో తీవ్రంగా సాధన చేస్తున్నాడు. టీమిండియాలోకి రావాలంటే ఇషాన్ దేశవాళీల్లో ఆడాలని కోచ్ ద్రవిడ్ ఇదివరకే స్పష్టం చేశాడు. దీంతో శుక్రవారం నుంచి హరియాణాతో జరిగే రంజీ మ్యాచ్‌కు ఇషాన్ జార్ఖండ్ జట్టు తరఫున ఆడాలి. అయినా అతను రంజీకి దూరంగా ఉండడం గమనార్హం. దీంతో ఇప్పట్లో ఇషాన్ టీవిండియాలో కనిపించడం కష్టమేనన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

- **హైదరాబాద్‌లో 'వీడీ' వాలీబాల్ ఫైనల్**

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): వాలీబాల్ లీగ్‌లోని హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ జట్టు ఆధ్వర్యంలో విజయ్ దేవరకొండ (వీడీ) వాలీబాల్ టోర్నీ లీగ్ దశను తెలుగు రాష్ట్రాల్లో విజయవంతంగా నిర్వహించామని ఆ టీమ్ సహ యజమాని, సినీ హీరో విజయ్ దేవరకొండ వెల్లడించాడు. తెలంగాణ, ఏపీలోని 16 నగరాల్లో లీగ్ మ్యాచ్‌లు నిర్వహించామన్న విజయ్.. ఈనెల 10, 11న హైదరాబాద్‌లో సెమీస్, ఫైనల్ జరుగుతాయన్నాడు.

యువ భారత్‌తో ఫైనల్‌కు

ఆసీస్ సై

ఉత్కంఠ సెమీస్‌లో పాక్ ఓటమి

అండర్-19 ప్రపంచకప్



టామ్ స్ట్రాకర్ (6/24)



బెనోని (సౌతాఫ్రికా): అండర్-19 వరల్డ్ కప్ ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ భారత్‌తో పోరుకు ఆస్ట్రేలియా సిద్ధమైంది. గురువారం ఉత్కంఠగా జరిగిన రెండో సెమీఫైనల్లో ఆస్ట్రేలియా వికెట్ తేడాతో పాకిస్థాన్‌ను ఓడించింది. మొదట పాకిస్థాన్..పేసర్ టామ్ స్ట్రాకర్ (6/24) ధాటికి 48.5 ఓవర్లలో 179 పరుగులకు ఆలౌటైంది. అజాన్ అవైస్ (52), అరాఫత్ మిన్హాస్ (52) హాఫ్ సెంచరీలతో మెరిశారు. ఛేదనలో 49.1 ఓవర్లలో 9 వికెట్లకు 181 పరుగులు చేసిన ఆస్ట్రేలియా విజయం అందుకుంది. హ్యారీ డిక్సన్ (50), ఒలీవర్ పెక్ (49) సత్తా చాటారు. అలీ రజా 4, అరాఫత్ 2 వికెట్లు పడగొట్టారు. స్ట్రాకర్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. ఆదివారం ఇదే వేదికలో భారత్, ఆసీస్ మధ్య టైటిల్ ఫైట్ జరగనుంది. తొలి సెమీస్‌లో దక్షిణాఫ్రికాపై భారత్ నెగ్గిన సంగతి తెలిసిందే.

ఆఖర్లో హైడ్రామా..: మోస్తరు లక్ష్య ఛేదనలో ఆసీస్ ఓపెనర్లు డిక్సన్, సామ్ తొలి వికెట్‌కు 33 పరుగులతో శుభారంభం ఇచ్చారు. ఆపై ఆసీస్ 26 పరుగుల తేడాతో 4 వికెట్లు చేజార్చుకొని 59/4తో నిలిచింది. అయితే డిక్సన్, ఒలీవర్ ఐదో వికెట్‌కు 43 పరుగులు జోడించి ఆదుకున్నారు. అనంతరం క్యాంప్‌బెల్ జతగా ఒలీవర్ ఆరో వికెట్‌కు 44 రన్స్ చేర్చడంతో ఆస్ట్రేలియా కోలుకుంది. కానీ పాక్ బౌలర్లు మళ్లీ విజృంభించడంతో వెంటవెంటనే మూడు వికెట్లు చేజార్చుకున్న ఆస్ట్రేలియా 46 ఓవర్లు ముగిసేసరికి 164/9తో నిలవడంతో మ్యాచ్‌లో ఉత్కంఠ ఏర్పడింది. ఒక్క వికెట్ పడగొడితే పాకిస్థాన్‌దే గెలుపు. అయితే మెక్‌మిలన్, వైడ్లర్ (నాటౌట్ 2) తెలివిగా ఆడుతూ మ్యాచ్‌ను చివరి ఓవర్ వరకూ లాగించారు. ఆఖరి ఓవర్లో మూడు పరుగులు కావాల్సి ఉండగా.. జీషన్ వేసిన తొలి బంతి మెక్‌మిలన్ బ్యాటును తాకుతూ లెగ్‌స్టంప్‌ను ముద్దాడినంత పనిచేసి బౌండరీ లైన్ దాటింది. షార్ట్‌ఫైన్ లెగ్ ఫీల్డర్ ఒబైద్ డైవింగ్ చేస్తూ బంతిని ఆపేందుకు యత్నించినా ఫలితం లేకపోయింది. అంతే..ఆస్ట్రేలియా జట్టు సంబరాల్లో మునిగిపోయింది.

సంక్షిప్తస్కోరు

పాకిస్థాన్: 48.5 ఓవర్లలో 179 (అజాన్ 52, అరాఫత్ 52, హంస్సేన్ 17, స్ట్రాకర్ 6/24).

ఆస్ట్రేలియా: 49.1 ఓవర్లలో 181/9 (డిక్సన్ 50, పెక్ 49, టామ్ క్యాంప్‌బెల్ 25, మెక్‌మిలన్ 19 నాటౌట్, అలీ రజా 4/34, అరాఫత్ 2/20).



వైసీపీ సర్కార్ చీకటి జీవోల దహనం

ప్రభుత్వ తీరుపై టీడీపీ నిరసన ప్రదర్శన

అమరావతి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): జాబ్ క్యాలెండర్ ఎక్కడ? మద్య నిషేధం ఏదీ? అంటూ ప్లకార్డులు పట్టుకుని, బై బై జగన్ అంటూ టీడీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గురువారం వెలగపూడి ఫైర్‌స్టేషన్ దగ్గర నుంచి అసెంబ్లీ వరకు ర్యాలీ చేశారు. అసెంబ్లీకి హాజరయ్యాక.. యాత్ర-2 సినిమా కోసం సభను వాయిదా వేయడాన్ని నిరసిస్తూ వాకౌట్ చేశారు. ఆతర్వాత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం జారీ చేసిన చీకటి జీవోల ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నేతలు మీడియాతో మాట్లాడుతూ యాత్ర-2 సినిమా కోసం సభను వాయిదా వేయడం జగన్‌రెడ్డికే చెల్లిందని విమర్శించారు. జగన్ అసమర్థ పాలనతో రాష్ట్రం అధోగతి పాలైందని అచ్చెన్నాయుడు ధ్వజమెత్తారు.



నిరుద్యోగులు, మహిళల సమస్యలపై ప్లకార్డులతో అసెంబ్లీకి వెళ్తున్న టీడీపీ ఎమ్మెల్యేలు

శాసనసభలో టీడీపీ సభ్యుల నిరసన

- జాబ్ క్యాలెండర్, మద్య నిషేధం, దిశపై చర్చకు పట్టు
- వాయిదా తీర్మానాన్ని తిరస్కరించిన స్పీకర్
- స్పీకర్ పోడియంపైకి వెళ్లి ప్రతిపక్ష ఎమ్మెల్యేల నిరసన

అమరావతి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): జాబ్ క్యాలెండర్, మద్యనిషేధం, దిశ చట్టం అమలుపై శాసనసభలో చర్చించాలని ప్రతిపక్ష టీడీపీ పట్టుబట్టింది. దీనికోసం ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని స్పీకర్ తిరస్కరించడంతో టీడీపీ ఎమ్మెల్యేలు సభలో గురువారం నిరసనకు దిగారు. వారి నిరసనను పట్టించుకోకుండా స్పీకర్ ప్రభుత్వ బిల్లులను చేపట్టడంతో కొందరు టీడీపీ సభ్యులు పోడియంపైకి ఎక్కి నినాదాలు చేస్తూ నిరసన కొనసాగించారు. ఈ గందరగోళ పరిస్థితుల మధ్యే స్పీకర్ బిల్లులను చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ విద్యుత్తు సుంకం సవరణ బిల్లు, ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు విశ్వవిద్యాలయాల (స్థాపన, క్రమబద్ధీకరణ) సవరణ బిల్లులను సభ ఆమోదించింది. ఆ వెంటనే స్పీకర్ టీ బ్రేక్ ప్రకటించారు. 9.26 గంటలకు టీ బ్రేక్ ఇవ్వగా.. మధ్యాహ్నం 12.30 గంటలకు తిరిగి సభను ప్రారంభించారు. టీ బ్రేక్ కోసం 3 గంటలపాటు సభను వాయిదా వేయడంపై ప్రతిపక్షంతోపాటు అధికార ఎమ్మెల్యేలు సైతం అసహనం వ్యక్తం చేశారు. అప్రాప్రియేషన్ బిల్లును సిద్ధం చేయడం చేతగాని ప్రభుత్వం శాసనసభను అపహాస్యం పాలు చేసిందని టీడీపీ విమర్శించింది. కాగా కోరం లేకపోవడంతో శాసనసభ పావుగంట ఆలస్యంగా ప్రారంభమైంది.

మండలిలోనూ నిరసనలు

టీడీపీ సభ్యుల నిరసనలతో శాసన మండలి హోరెత్తింది. సమావేశం ప్రారంభం కాగానే టీడీపీ సభ్యులు జాబ్ క్యాలెండర్, మద్య నిషేధం, దిశ చట్టం అంశాలపై చర్చకు ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని ఛైర్మన్ కొయ్యే మోషేన్ రాజు తిరస్కరించారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీలు ఉద్యోగుల బకాయిలపై ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని కూడా ఛైర్మన్ తిరస్కరించారు. దీంతో పీడీఎఫ్ ఎమ్మెల్సీలు తమ స్థానాల్లో నిల్చొని నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఉద్యోగుల బకాయిలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. టీడీపీ సభ్యులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ.. నినాదాలు చేస్తూ ఛైర్మన్ పోడియంపైకి ఎక్కి నిరసన తెలిపారు. సభ్యుల నిరసనల మధ్యే బిల్లులు పాస్ చేశారు.

ఇది ప్రజా వ్యతిరేక బడ్జెట్: టీడీపీ

శాసనమండలిలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా టీడీపీ ఎమ్మెల్సీలు యువత, రైతు, ఉద్యోగుల వ్యతిరేక బడ్జెట్ అంటూ మండిపడ్డారు. పోలవరం, ఉద్యోగాల భర్తీ, రాజధానికి సంబంధించిన అంశాలు బడ్జెట్‌లో కనిపించలేదని విమర్శించారు. బడ్జెట్‌లో అభివృద్ధిపై దృష్టి సారించలేదని పీడీఎఫ్ ఎమ్మెల్సీ లక్ష్మణరావు విమర్శించారు. స్థానిక సంస్థలకు నిధులు కేటాయించకుండా నిర్వీర్యం చేశారని విమర్శించారు. శాసనమండలి 9 బిల్లులకు ఆమోదం తెలిపింది.

అసెంబ్లీకి రాని సీఎం!



చివరి రోజు చాంబర్లోనే!.. కోరం లేక ఆలస్యంగా సభ

- తొలిసారి ఫొటో సెషన్ లేదు.. స్పీకర్, సీఎంతో ఫొటోలు దిగడానికి మెజారిటీ ఎమ్మెల్యేల నిరాకరణ?
- ఆఖరి రోజున హాజరైంది 71 మంది వైసీపీ ఎమ్మెల్యేలే.. 4 రోజుల్లో 10 గంటలే సభ.. 9 బిల్లులకు ఆమోదం
- బిల్లుల కోసం లాబీల్లో కాంట్రాక్టర్ల లాబీయింగ్.. సీఎం కాన్వాయ్‌లోకీ దూసుకొచ్చిన వైనం

అమరావతి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల చివరి రోజు రెండు అరుదైన ఘటనలు చోటు చేసుకున్నాయి. సీఎం జగన్మోహన్ రెడ్డి గురువారం సభలో అడుగుపెట్టలేదు. పూర్తిగా తన చాంబర్‌కే పరిమితమయ్యారు. అసెంబ్లీ కార్యకలాపాల్లో పాలుపంచుకోలేదు. అలాగే స్పీకర్, సీఎంతో ఎమ్మెల్యేల ఫొటో సెషన్ కూడా జరగలేదు. మెజారిటీ వైసీపీ సభ్యులు ఫొటోలు దిగడానికి నిరాకరించినట్లు సమాచారం. ఇంకోవైపు.. నాలుగు రోజుల ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సమావేశాల్లో గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగంతో కలిపి సభ జరిగింది కేవలం పది గంటల రెండు నిమిషాలే. మొత్తంగా 20 మంది ఎమ్మెల్యేలు మాట్లాడారు. అసెంబ్లీ 9 బిల్లులను ఆమోదించింది. ద్రవ్య వినియమ బిల్లుకు మూజువాణి ఓటుతో ఆమోదం తెలిపాక.. సభాపతి తమ్మినేని సీతారాం సభను నిరవధికంగా వాయిదా వేశారు. 2019-24 అసెంబ్లీ చివరి సమావేశాలకు అధికార పక్ష సభ్యుల్లో పలువురు దూరంగా ఉన్నారు. సర్వేల సాకుతో జగన్ తమకు టికెట్లు నిరాకరించడమే దీనికి ప్రధాన కారణం. ప్రజల్లో తనపై వ్యతిరేకత ఉండగా.. ఆయన దానిని తమపైకి నెట్టి మొండిచేయి చూపారని చాలా మంది గుర్రుగా ఉన్నారు.

33 మంది సిటింగ్‌లకు మొండిచేయి..

58 అసెంబ్లీ స్థానాలకు, 14 లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ఖరారుచేస్తూ జగన్ ఇప్పటికి ఆరు జాబితాలు విడుదల చేశారు. సిటింగ్ ఎమ్మెల్యేల్లో 33 మందికి టికెట్ దక్కలేదు. ఇంకా 117 అసెంబ్లీ, 11 ఎంపీ అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. ఐప్యాక్, ఇతర సర్వేల ఆధారంగా వీటిలోనూ సగానికిపైగా స్థానాల్లో అభ్యర్థులను మారుస్తారన్న ప్రచారం సాగుతోంది. దీంతో సిటింగ్‌లు తీవ్ర మనస్తాపానికి లోనయ్యారు. ఈలోపు 3 రాజ్యసభ స్థానాలకు ఎన్నికల కమిషన్ ఎన్నికలు ప్రకటించడంతో.. టికెట్లు రానివారు అధికారిక అభ్యర్థులకు ఓటేయరేమోనని జగన్ ఆందోళన చెందారు. అందుకే ఇప్పటికే ప్రకటించిన 58 అసెంబ్లీ స్థానాల్లోనూ మళ్లీ సర్వేలు చేపట్టామని.. అప్పుడు సిటింగ్‌లకే తిరిగి అవకాశం లభించే అవకాశం ఉందని లీకులిచ్చారు. అయితే ఇది జరిగే పని కాదని వారికి పూర్తిగా అర్థమైంది. అందుకే మెజారిటీ ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాలకు రాలేదు.

తమ్మినేనికి పుట్టిన రోజు శుభాకాంక్షలు

గురువారం స్పీకర్ తమ్మినేని పుట్టిన రోజు సందర్భంగా ఆయనకు శాసనసభలో కొద్దిమంది మాత్రమే శుభాకాంక్షలు తెలిపారు. ఇక సమావేశాల చివరిరోజున సభాపతి, సీఎం, ప్రధాన ప్రతిపక్ష నేతలతో సభ్యులందరూ కలిసి ఫొటో దిగడం ఆనవాయితీ. ఇందుకోసం అసెంబ్లీ సిబ్బంది ప్రాంగణంలో దాదాపు 100 కుర్చీలు వేశారు. కానీ 71 మందికి మించి లేరని తెలియడంతో ఫొటో సెషన్‌ను ఎత్తేశారు.

సీఎం కాన్వాయ్‌లోకి కాంట్రాక్టర్లు..

సమావేశాల చివరిరోజు అసెంబ్లీ ప్రాంగణానికి జగన్ అరగంట ఆలస్యంగా వచ్చారు. కానీ సభలోకి రాలేదు. సీఎం చాంబర్ వైపు వెళ్తున్న జగన్ కాన్వాయ్‌ను చూసిన కొందరు.. 'జగనన్నా'.. అని బిగ్గరగా పిలిచారు. తన అభిమానులేమోనని భావించి ఆయన తన కారు ఆపారు. కానీ వారంతా ప్రభుత్వ పనులు చేసిన కాంట్రాక్టర్లు.. వైసీపీ కార్యకర్తలు. కారు ఆపగానే వారు ఆయన వద్దకు వెళ్లారు. ప్రభుత్వం అప్పగించిన పనులు పూర్తిచేసినా.. ఇంకా బిల్లులు రావడం లేదని వారు వాపోయారు. త్వరలోనే బిల్లులు ఇప్పిస్తానని హామీ ఇచ్చి జగన్ ముందుకు సాగారు. వీరంతా ఒక్కసారిగా కాన్వాయ్‌వైపు దూసుకురావడంతో భద్రతా సిబ్బందిపై జగన్ అసహనం వ్యక్తం చేశారు. అయినా కాంట్రాక్టర్లు మంత్రుల చాంబర్లలో చక్కర్లు కొట్టారు. బిల్లుల కోసం లాబీయింగ్ చేస్తూ కనిపించారు.

మా అప్పులు తక్కువే!

- గత ప్రభుత్వమే ఎక్కువ అప్పులు చేసింది
- ఏపీతో పోల్చితే కేంద్రం తీసుకున్న రుణాలే హెచ్చు

ఓటాన్ అకౌంట్ బిల్లుపై బుగ్గన ప్రసంగం

అమరావతి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థూల ఉత్పత్తి పెరుగుదల 2023లో 16.02 శాతంగా నమోదైందని, ఈ విషయంలో దేశంలోనే నాలుగవ స్థానంలో రాష్ట్రం నిలిచిందని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి వెల్లడించారు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌పై ఆయన శాసనసభలో గురువారం ప్రసంగించారు. 2018-19లో 11 శాతం స్థూల ఉత్పత్తి రేటుతో దేశంలోనే 14వ స్థానంలో ఏపీ ఉండగా, ఇప్పుడు 16.02 శాతానికి చేరిందన్నారు. వ్యవసాయ రంగంలో 8.3 శాతం వార్షిక వృద్ధి రేటుతో ఏపీ 2018-19లో 12వ స్థానంలో ఉండగా, నాలుగేళ్లలోనే 13శాతం పెరుగుదలతో 6వ స్థానానికి రాష్ట్రం చేరిందని తెలిపారు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో రెవెన్యూ రాబటి రూ.2,05,352 కోట్లు, కేంద్రం నుంచి వస్తున్న పన్నులు రూ.49,286 కోట్లు, పన్ను ఆదాయం 1,09,00,537 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. నాన్ ట్యాక్స్ రెవెన్యూ రూ.14,400 కోట్లు, గ్రాంట్స్ ఇన్ ఎయిడ్ రూ.32,127 కోట్లు, ఓపెన్ మార్కెట్ లోన్లు రూ.71,000 కోట్లు, కేంద్రం నుంచి తీసుకువచ్చిన లోన్లు రూ.6,164 కోట్లు అని బుగ్గన వివరించారు. మొత్తం రాబడి 2,86,389 కోట్లు... రెవెన్యూ ఖర్చు 2,30,110 కోట్లు, క్యాపిటల్ ఖర్చులు 30,530 కోట్లుగా చూపించి ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టామన్నారు. ఈ సందర్భంగా బడ్జెట్‌పై పలుపార్టీల నేతల విమర్శలు చేశారు. వాస్తవ లెక్కలకు, బడ్జెట్‌కు వ్యత్యాసం ఉందని ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు విమర్శించారు.

కేంద్రం అప్పులెక్కువ...

ఏపీతో పోల్చితే కేంద్రం అప్పులే అధికమని ఆర్థిక మంత్రి బుగ్గన అన్నారు. బీజేపీ మాత్రం రాష్ట్ర అప్పుల గురించే మాట్లాడుతోందని విమర్శించారు. తమ ప్రభుత్వం ఎక్కువ అప్పులు చేసిందని టీడీపీ నేతలు బయట చెబుతున్నారని, ఏవిధంగా చూసినా ఇది అవాస్తవమని వివరించారు. పరిమితికి మించి అప్పులు ఎలా సాధ్యమని, అప్పుకు అనుమతి లేనిది ఎలా చేస్తామని ప్రశ్నించారు. గత ప్రభుత్వ అప్పులతో పోల్చితే తాము తక్కువ చేశామన్నారు. తమ ప్రభుత్వం అప్పు చేయలేదని అనడం లేదని, అదంతా సంక్షేమ పథకాల రూపంలో కనిపిస్తోందన్నారు. బడ్జెట్ బిల్లును ఆమోదించాలని ఆయన సభను కోరారు. అనంతరం సభ దానిని ఆమోదించింది.

సభాపతి స్థానం ప్రత్యేకం

అమరావతి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): గురువారం శాసన సభ చివరి రోజు కావడంతో స్పీకర్ తమ్మినేని సీతారాం కొంత భావోద్వేగానికి గురయ్యారు. సభాపతిగా ఎన్నికైన నాటి నుంచి సభలో జరిగిన విషయాలను ప్రస్తావించారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ "నాలుగు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ జీవితంలో మంత్రిగా పని చేశాను. కానీ అన్నింటికంటే ప్రత్యేకమైనది సభాపతి స్థానం. సభాపతిగా ఎన్నికయ్యాక.. నా జిల్లా, నా నియోజకవర్గం అనే భావనలు తొలగిపోయాయి. అందర్నీ సమాన దృష్టితో చూశాను. నిక్కచ్చిగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాను. ప్రతిపక్ష సభ్యులకూ సమాన అవకాశాలు ఇచ్చాను. భిన్నాభిప్రాయాలు ప్రజాస్వామ్యానికి అత్యంత అవసరం. కనుకనే ప్రతిపక్ష నేతల విసుర్లు, విమర్శలు ఓపికగా భరించాను. విపక్ష సభ్యులు పదే పదే వెల్‌లోకి దూసుకువచ్చారు. నా పోడియం చుట్టుముట్టారు. వ్యవస్థ హుందాతనాన్ని కాపాడడానికి కఠిన చర్యలు తీసుకోకతప్పని పరిస్థితి. నాకు ఎవరిపైనా వ్యక్తిగత ద్వేషం లేదు. సభ సక్రమంగా జరగడం కోసమే కఠినమైన నిర్ణయాలు తీసుకోవాల్సి వచ్చింది' అని వివరించారు.

విపక్షమన్న వివక్ష లేదు

- అందరినీ సమాన దృష్టితో చూశా
- ఎవరిపైనా వ్యక్తిగత ద్వేషం లేదు
- సభ కోసమే కఠినమైన నిర్ణయాలు: తమ్మినేని



గురువారం రాత్రి మహీధరరెడ్డితో మాట్లాడుతున్న పోర్టు అధికారులు

ప్రభుత్వంపై మహీధరరెడ్డి తిరుగుబాటు!

- రామాయపట్నం పోర్టు వద్ద నిర్వాసితులతో కలిసి ఆందోళన

కందుకూరు, ఫిబ్రవరి 8: మాజీ మంత్రి, కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి జగన్ ప్రభుత్వంపై తిరుగుబావుటా ఎగురవేశారు. గురువారం సాయంత్రం ఆయన అమరావతి నుంచి నేరుగా రామాయపట్నం పోర్టు నిర్మాణ ప్రాంతానికి వెళ్లి పునరావాస గ్రామాల ప్రజలతో కలిసి ఆందోళనకు దిగారు. పోర్టు నిర్వాసిత గ్రామాలైన కర్లపాలెం, ఆవులవారిపాలెం, మొండివారిపాలెం గ్రామస్థులతో కలిసి పోర్టు పరిపాలనా కార్యాలయానికి వెళ్లారు. లోపల ఉన్న అధికారులు, సిబ్బందిని బయటకు పిలిపించి తాళం వేసేశారు. బాధితులు బయట ఆందోళన చేస్తుంటే కనీసం పట్టించుకోకుండా లోపల కూర్చుని పనులు చేసుకుంటున్నారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతకుముందు మధ్యాహ్నం అమరావతి అసెంబ్లీ ప్రాంగణంలో సీఎం జగన్.. మహీధర్‌రెడ్డిని పిలిపించి కందుకూరు టికెట్ పెంచలయ్య యాదవ్ కుటుంబానికి ఇస్తున్నట్లు తెలిపారు. వారిని గెలిపించుకుని రావాలని సూచించారు కూడా. అక్కడి నుంచి నేరుగా రామాయపట్నం పోర్టు వద్దకు చేరుకున్న మహీధర్‌రెడ్డి.. అప్పటికే సిద్ధంగా ఉన్న పునరావాస గ్రామాల ప్రజలతో కలిసి ఆందోళనకు పూనుకున్నారు. పోర్టు అధికారులతో ఆయన మాట్లాడుతూ.. నిర్వాసిత గ్రామాల ప్రజలకు పునరావాస ప్యాకేజీ ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం, పోర్టు అథారిటీ తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నాయని మండిపడ్డారు. ప్రకటించిన ప్యాకేజీ అమలు చేయాలని ఎన్ని సార్లు కోరినా పోర్టు అధికారులు, ప్రభుత్వ ఉన్నతాధికారుల్లో చలనం లేదని విమర్శించారు. తగు చర్యలు తీసుకుంటామని కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు నచ్చజెప్పేందుకు ప్రయత్నించగా, బాధితులకు న్యాయం జరిగే వరకు పనులు జరగనివ్వబోమని మహీధర్‌రెడ్డి తేల్చిచెప్పారు. రాత్రి వరకు ఆందోళన కొనసాగింది. మహీధర్‌రెడ్డికి నియోజకవర్గంలో బలమైన వర్గం, కేడర్ ఉన్నాయి. అన్ని వర్గాల్లోనూ ఆదరణ ఉంది. టికెట్ నిరాకరించిన నేపథ్యంలో ఆయన తదుపరి అడుగులను రాజకీయ వర్గాలు ఆసక్తిగా గమనిస్తున్నాయి.

డజను మంది రెడీ!

గుంటూరు జిల్లాలో 12 సీట్లలో టీడీపీ అభ్యర్థులపై స్పష్టత

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి గుంటూరు జిల్లాలో మెజారిటీ సీట్లలో టీడీపీ అభ్యర్థులపై కసరత్తు కొలిక్కి వచ్చింది. మొత్తం 17 సీట్లు ఉండగా 12 స్థానాలకు అభ్యర్థులు ఖరారయ్యారు. తెనాలి స్థానాన్ని పొత్తులో భాగంగా జనసేనకు ఇచ్చారు. జనసేన మరో సీటు కోరుతున్నట్లు తెలిసింది. అభ్యర్థులు ఖరారైన 12 సీట్లలో ఎనిమిది చోట్ల గత ఎన్నికల అభ్యర్థులే మళ్లీ పోటీ చేయనున్నారు. నాలుగు చోట్ల కొత్తవారు బరిలో దిగుతున్నారు. మంగళగిరిలో నారా లోకేశ్, వేమూరులో నక్కా ఆనందబాబు, పొన్నూరు-ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, తాడికొండ-తెనాలి శ్రావణ్ కుమార్, రేపల్లె-అనగాని సత్యప్రసాద్, చిలకలూరిపేట-ప్రత్తిపాటి పుల్లారావు, వినుకొండ-జీవీ ఆంజనేయులు, గురజాలలో యరపతినేని శ్రీనివాసరావు తిరిగి పోటీ చేయనున్నారు. వీరిలో అనగాని సిటింగ్ ఎమ్మెల్యే. కొత్తగా సత్తెనపల్లెలో మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ, ప్రత్తిపాడులో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రామాంజనేయులు, మాచర్లలో జూలకంటి బ్రహ్మారెడ్డి, బాపట్లలో నరేంద్ర వర్మ పోటీ చేయనున్నారు. తెనాలిలో జనసేన తరఫున ఆ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ పోటీ చేయనున్నారు. గుంటూరు పశ్చిమ సీటును కూడా ఆ పార్టీ ఆశిస్తోంది. కానీ దానిపై ఇంకా నిర్ణయం జరగలేదు. ఈ సీటుకు టీడీపీ తరఫున చాలా మంది పోటీపడుతున్నారు. ఇక్కడ కోవెలమూడి రవీంద్ర ఇన్‌చార్జిగా ఉన్నారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, డాక్టర్ శేషయ్య, వెంకటేశ్ యాదవ్, మన్నవ మోహనకృష్ణ, డేగల ప్రభాకర్, శనక్కాయల రాజకుమారి కూడా ఆ సీటు ఆశిస్తున్నారు. ఇదే సీటును జనసేన నుంచి బోనబోయిన శ్రీనివాస యాదవ్ కోరుతున్నారు. గుంటూరు తూర్పు సీటును ముస్లింలకు ఇవ్వాలని టీడీపీ నాయకత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. ఇన్‌చార్జి మహ్మద్ నజీర్, పార్టీ నేత వహీద్, దివంగత టీడీపీ నేత లాల్ జాన్ బాషా సమీప బంధువు ఆరిఫ్, మహిళా అభ్యర్థిని షేక్ సాయిస్తా బేగం పేర్లు పరిశీలనలో ఉన్నాయి. పెదకూరపాడులో మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్‌తోపాటు కొత్తగా వచ్చిన నేత భాష్యం ప్రవీణ్ సీటును ఆశిస్తున్నారు. తెనాలి సీటు జనసేనకు ఇవ్వడం వల్ల అవకాశం కోల్పోతున్న ఆలపాటి కూడా ఈ సీటు కోరుకుంటున్నారు. నరసరావుపేటలో ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబుతోపాటు కడియాల లలిత్, కడియాల వెంకటేశ్వరరావు, నల్లపాటి రాము పేర్లు పరిశీలనలో ఉన్నాయి.

నియోజకవర్గం	అభ్యర్థి
మంగళగిరి	నారా లోకేశ్
వేమూరు	నక్కా ఆనందబాబు
పొన్నూరు	ధూళిపాళ్ల నరేంద్రకుమార్
తాడికొండ	తెనాలి శ్రావణ్‌కుమార్
చిలకలూరిపేట	ప్రత్తిపాటి పుల్లారావు
ప్రత్తిపాడు	బూర్ల రామాంజనేయులు
వినుకొండ	జీవీ ఆంజనేయులు
మాచర్ల	జూలకంటి బ్రహ్మారెడ్డి
గురజాల	యరపతినేని శ్రీనివాసరావు
బాపట్ల	వేగేశ్న నరేంద్రవర్మ
సత్తెనపల్లె	కన్నా లక్ష్మీనారాయణ
రేపల్లె	అనగాని సత్యప్రసాద్
తెనాలి	జనసేన (నాదెండ్ల మనోహర్)

లావు నరసరావుపేటలోనే..

జిల్లాలోని మూడు ఎంపీ సీట్లలో రెంటిపై టీడీపీ నాయకత్వం ఒక నిర్ణయానికి వచ్చినట్లు చెబుతున్నారు. నరసరావుపేట సీటుకు సిటింగ్ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఖరారయ్యారు. గుంటూరు ఎంపీ సీటుకు ప్రవాసాంధ్రుడు పెమ్మసాని చంద్రశేఖర్‌వైపు నాయకత్వం మొగ్గు కనిపిస్తోంది. బాపట్ల ఎంపీ సీటుపై ఇంకా తుది నిర్ణయం జరుగలేదు.

11 నుంచి లోకేశ్ 'శంఖారావం'

- ఇచ్ఛాపురం నుంచి ప్రారంభం



అమరావతి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ యువనేత నారా లోకేశ్ ఈ నెల 11 నుంచి శంఖారావం పేరుతో జిల్లాల యాత్ర ప్రారంభిస్తున్నారు. ఉత్తరాంధ్రలోని ఇచ్ఛాపురం నుంచి యాత్ర ప్రారంభం కానుంది. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు గురువారం పార్టీ కేంద్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో యాత్ర లోగోను, ప్రచార గీతాన్ని ఆవిష్కరించారు. ఇటీవల లోకేశ్ రాష్ట్రవ్యాప్తంగా యువగళం పేరుతో పాదయాత్ర నిర్వహించారు. టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టు పరిణామాలతో ఈ యాత్రను మధ్యలో కొంతకాలం ఆపేయాల్సి వచ్చింది. ఉత్తరాంధ్రలోని అన్ని జిల్లాల్లోనూ యువగళం నిర్వహించి ఇచ్ఛాపురంలో ముగించాలని ముందుగా అనుకొన్నా సమయం చాలక విశాఖ సమీపంలో ముగించాల్సి వచ్చింది. అప్పుడు వెళ్లలేకపోయిన ఉత్తరాంధ్ర నియోజకవర్గాలను ఆయన ఇప్పుడు శంఖారావం పేరుతో సందర్శించాలని నిశ్చయించారు. బహిరంగ సభలు కాకుండా కేవలం పార్టీ శ్రేణులతో భేటీని నిర్వహించి వారిని ఎన్నికలకు సన్నద్ధం చేయాలని నిర్ణయించారు. ఒక్కో నియోజకవర్గంలో నాలుగైదు వేల మంది పార్టీ నేతలు, కార్యకర్తలతో ఈ సమావేశాలు నిర్వహించాలని తలపెట్టారు. రోజూ మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ సమావేశాలు నిర్వహిస్తారు. ఈ నెల 11న ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, 12న నరసన్న పేట, శ్రీకాకుళం, ఆముదాల వలస, 13న పాతపట్నం, పాలకొండ, కురుపాం నియోజకవర్గాల్లో లోకేశ్ సభలు నిర్వహిస్తారు.

అమిత్ షా పిలుపుతోనే చంద్రబాబు వెళ్లారు...

కేంద్ర హోంమంత్రి అమిత్ షా పిలుపుతోనే తమ పార్టీ అధినేత చంద్రబాబు ఢిల్లీ వెళ్లారని ఒక ప్రశ్నకు సమాధానంగా అచ్చెన్నాయుడు చెప్పారు. 'ఢిల్లీలో ఏం మాట్లాడారో చంద్రబాబు అందరికీ చెబుతారు. పార్టీ నాయకులతో మాట్లాడి ఆయన తన నిర్ణయం తీసుకొంటారు. జగన్ రెడ్డి ఢిల్లీ ఎందుకు వెళ్తున్నారో మాకు తెలియదు' అని అన్నారు. వైసీపీలోని పనికిమాలిన వెధవలు ఫొటోలు మార్ఫింగ్ చేసి చంద్రబాబుపై దుష్ప్రచారం చేస్తున్నారని అచ్చెన్న ధ్వజమెత్తారు. 'ఢిల్లీలో కాళ్లు పట్టుకొనే అలవాటు జగన్ రెడ్డికి ఉంది. దాన్ని మాకు పూయాలని ఫొటోలు మార్ఫింగ్ చేసి తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలపై మేం ఎన్ని ఫిర్యాదులు ఇచ్చినా చర్యలు లేవు. ఈసారి వారికి ఎలా సమాధానం చెప్పాలో అలాగే చెబుతాం' అన్నారు.

తాడేపల్లి ప్యాలెస్‌లో ఏడుపు:రఘురామ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): రానున్న లోక్ సభ ఎన్నికల్లో బీజేపీకి మెజారిటీ స్థానాలు రావద్దని, అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీకి 175 స్థానాలు రావాలని ముఖ్యమంత్రి జగన్ కోరుకోవడం ఆయన సంకుచిత మనస్తత్వానికి నిదర్శనమని వైసీపీ రెబల్ ఎంపీ రఘురామకృష్ణంరాజు విమర్శించారు. గురువారం రచ్చబండ కార్యక్రమంలో భాగంగా ఢిల్లీలోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర బడ్జెట్ ఒక తోకడా బడ్జెట్ అని, మాయల మరాఠీ బడ్జెట్ అని విమర్శించారు. ఢిల్లీలో బీజేపీ పెద్దలతో చంద్రబాబు సమావేశమైన వేళ తాడేపల్లి ప్యాలెస్‌లో ఏడుపు మొదలైందని.. ఇక్కడ పొత్తు పొడిస్తే... అక్కడ టీవీ బద్దలైందని ఎద్దేవా చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి 21 లోక్ సభ స్థానాలు, 140 అసెంబ్లీ స్థానాలు ఖాయమని, అంతకంటే ఎక్కువగానే వచ్చే అవకాశం ఉందని, వైసీపీ భూస్థాపితం కావడం ఖాయమని చెప్పారు. ఫేక్ ఫొటోలతో సోషల్ మీడియాలో ప్రచారం ద్వారా తమ నీచ సంస్కృతి, ప్రవృత్తిని వై 'చీప్' గాళ్లు తెలియజేశారని ధ్వజమెత్తారు.

'పోలవరం' 2026కు పూర్తి కాదు: కేంద్రం


న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు మొదటి దశ 2026 మార్చిలోపు పూర్తి కాదని కేంద్రం స్పష్టం చేసింది. గురువారం లోక్‌సభలో వైసీపీ సభ్యుడు బ్రహ్మానందరెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర జల వనరుల మంత్రి బిశ్వేశ్వర్ తుడు సమాధానం ఇచ్చారు. 'కేంద్రం తరఫున పోలవరం ప్రాజెక్టును అమలు చేయాల్సింది ఏపీ ప్రభుత్వమే. తాడిపూడి ఎత్తిపోతల పథకం, తారకరామ తీర్థ సాగరం ప్రాజెక్టు కూడా 2026 మార్చి వరకూ పూర్తి కావు. కందుల ఓబుల్‌రెడ్డి గుండ్లకమ్మ రిజర్వాయర్, తోట వెంకటాచలం పుష్కర ఎత్తిపోతల, ముసురుమల్లి రిజర్వాయర్ 2025 జూన్ నాటికి పూర్తి అవుతాయి. సర్దార్ గౌతు లచ్చన్న బ్యారేజ్ 2025 మార్చి నాటికి పూర్తవుతుంది' అని వివరించారు.

ఐఆర్ఆర్ కేసులో సీఐడీ చార్జిషీటు

- అందులో చంద్రబాబు, నారాయణ, లోకేశ్ పేర్లు

విజయవాడ, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఇన్నర్ రింగ్‌రోడ్డులో అక్రమాలు జరిగాయని కేసు నమోదు చేసిన సీఐడీ దానికి సంబంధించి చార్జిషీటును విజయవాడ ఏసీబీ కోర్టులో గురువారం దాఖలు చేసింది. దీనికి న్యాయస్థానం ఇంకా నంబరు కేటాయించలేదు. చార్జిషీటులో టీడీపీ అధినేత చంద్రబాబు, మాజీ మంత్రి పొంగూరు నారాయణ, నారా లోకేశ్, రియల్టర్లు లింగమనేని రాజశేఖర్, లింగమనేని రమేశ్ పేర్లను చేర్చింది. 2014-19 మధ్యకాలంలో సీఆర్డీఏకి చంద్రబాబు, నారాయణ ఎక్స్ అఫిషియో ఛైర్మన్, వైస్ ఛైర్మన్లుగా వ్యవహరించారని సీఐడీ పేర్కొంది. రాజధాని నిర్మాణం కోసం సింగపూర్ ప్రభుత్వంతో జీ2జీ ఒప్పందం చేసుకున్నారని, దీనికి కేంద్రం నుంచి ఎలాంటి అనుమతి తీసుకోలేదని స్పష్టం చేసింది. "విదేశీ సంస్థ అయిన సర్బాన జురాంగ్ సంస్థకు మాస్టర్ ప్లాన్‌ను రూపొందించే బాధ్యత అప్పగించారు. దీనికి ఫీజు రూపంలో కోట్లాది రూపాయలు చెల్లించారు. ఇది పూర్తిగా అక్రమం. ఇన్నర్ రింగ్ రోడ్డును లింగమనేని రమేశ్, చంద్రబాబుకు సంబంధించిన హెరిటేజ్ భూములు, నారాయణ విద్యాసంస్థల భూముల పక్కనుంచి తీసుకెళ్లారు. చంద్రబాబు స్కెచ్‌తో నారాయణ 58 ఎకరాలు కొనుగోలు చేశారు. ఈ భూములకు పక్కన సీడ్ క్యాపిటల్ వచ్చేలా ప్లాన్ డిజైన్ చేయించారు. క్విడ్ ప్రో కోలో భాగంగా లింగమనేని రమేశ్‌కు చెందిన అతిథిగృహాన్ని చంద్రబాబు కానుకగా తీసుకున్నారు. ఏసీబీ కోర్టు ఈ అతిథి గృహం జప్తునకు ఆదేశించింది. లింగమనేని రమేశ్‌కు చెందిన భూముల పక్కనే హెరిటేజ్ సంస్థ 14 ఎకరాలు కొనుగోలు చేసింది. వీటి పక్కనుంచే ఐఆర్ఆర్ వెళ్లేలా రోడ్డు అలైన్‌మెంట్ మార్చడం ద్వారా ఈ భూముల విలువను పెంచుకున్నారు. ఐపీసీ 120(బీ), 409, 420, 34, 35, 36,37 ప్రివెన్షన్ ఆఫ్ కరప్షన్ యాక్ట్ 1988 సెక్షన్ 13(2) రెడ్‌విత్ 13(1)(సీ)(డీ) ప్రకారం శిక్ష విధించండి" అని కోర్టును సీఐడీ కోరింది.

ఓట్ల శాతం మారుతోందిలా..



మూడ్ మారుతోంది!


(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికలు జరిగితే రాష్ట్రంలోని పాతిక ఎంపీ సీట్లలో టీడీపీ 17 సీట్లు గెలుచుకునే అవకాశముంది. వైసీపీకి ఎనిమిది వస్తాయని ఈ సర్వే వెల్లడించింది. టీడీపీకి 45 శాతం ఓట్లు వస్తాయని... వైసీపీ 41.1 శాతానికే పరిమితమవుతుందని తేలింది. ఇక బీజేపీకి 2 శాతం, కాంగ్రెస్‌కు 3 శాతం ఓట్లు వస్తాయని సర్వేలో వెల్లడైంది. 'ఇతరుల'కు 9 శాతం ఓట్లు వచ్చే అవకాశముందని సర్వేలో వెల్లడైంది. ఇందులో... జనసేనే కీలకం. 2019 ఎన్నికల్లో 'ఇతరుల'కు తొమ్మిది శాతం ఓట్లు లభించాయి. వామపక్షాలు, నోటా, స్వతంత్రులు వంటి వారిని జనసేన పార్టీతో కలిపి ఇతరుల కింద లెక్కగట్టారు. అప్పుడు జనసేనకు 6.84 శాతం ఓట్లు లభించాయి. ఇప్పుడు కూడా ఈ ఇతరులకు తొమ్మిది శాతం వస్తాయని 'ఇండియా టుడే' సర్వే అంచనా వేసింది. ఇందులో జనసేన పార్టీ వాటా ఎంతో ఈ సర్వే నిర్దిష్టంగా పేర్కొనలేదు. పోయినసారి వచ్చినంతే ఈసారీ వస్తాయని అనుకొంటే జనసేన ఓట్లు సుమారుగా ఏడు శాతం అవుతాయి. టీడీపీకి వచ్చే 45 శాతం ఓట్లకు జనసేన 7 శాతం కలిపితే... ఈ కూటమికి 52 శాతం ఓట్లు పడే అవకాశముంది. ఇక బీజేపీకి 2 శాతం ఓట్లు పడతాయన్నది ఈ సర్వే అంచనా! దీని ప్రకారం టీడీపీ-జనసేన-బీజేపీ కలిసి పోటీ చేస్తే.. కూటమి ఓట్లు 54 శాతానికి చేరుకుంటాయి. అదే జరిగితే... మొత్తం ఎంపీ సీట్లు ఈ కూటమికే దక్కే అవకాశం ఉందన్నది రాజకీయ నిపుణుల విశ్లేషణ. ఈ లెక్కన అసెంబ్లీ ఎన్నికల్లోనూ భారీ మెజారిటీ తథ్యం.

పతనం దిశగా వైసీపీ పయనం

2019 ఎన్నికల్లో వైసీపీ 49 శాతం ఓట్లతో... 22 ఎంపీ సీట్లు గెలుచుకుంది. 151 అసెంబ్లీ స్థానాలు దక్కించుకుని అధికారంలోకి వచ్చింది. అప్పుడు టీడీపీకి దక్కిన ఓట్లు 40 శాతం. గెలుచుకున్న ఎంపీ సీట్లు మూడు! గెలుచుకున్న అసెంబ్లీ స్థానాలు 23. నాలుగున్నరేళ్లు గడిచేసరికి మొత్తం సీన్ రివర్స్ అయ్యింది. వైసీపీ ఏకంగా 8 శాతం ఓట్లను కోల్పోనుందని... టీడీపీ ఐదు శాతం ఓట్లను అదనంగా సాధించనుందని 'ఇండియా టుడే మూడ్ ఆఫ్ ది నేషన్' సర్వేలో తేలింది. ఇక... ఈ సర్వే ప్రకారం గత ఎన్నికలతో పోలిస్తే కాంగ్రెస్, బీజేపీలకు స్వల్పంగా ఓట్లు పెరగనున్నాయి. సొంతంగా గెలుచుకొనే సీట్లేవీ లేవు. 2019 ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెరో ఒక శాతం ఓట్లు మాత్రమే లభించాయి. ఈసారి బీజేపీకి రెండు శాతం, కాంగ్రెస్‌కు మూడు శాతం ఓట్లు లభించనున్నాయి. టీడీపీతో బీజేపీ పొత్తు చర్చలు ప్రారంభించకముందు, జగన్ సోదరి వైఎస్ షర్మిల పీసీసీ చీఫ్ కాకముందు చేసిన సర్వేలో తేలిన లెక్కలివి.

రాష్ట్రం కోసం.. తప్పదనిపిస్తోంది!



ఎన్డీయేలో చేరికపై చంద్రబాబు మనోగతం!!

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

'రాష్ట్ర విస్తృత ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎన్డీయేలో చేరాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా మనల్ని ఆహ్వానించారు. మనకున్న పరిమితులు, సమస్యలపై చర్చించాం. వారి అభిప్రాయం వారు చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాలరీత్యా చేరక తప్పదేమోనని అనిపిస్తోంది' అని టీడీపీ అధినేత చంద్రబాబు పేర్కొన్నట్లు సమాచారం. బుధవారం రాత్రి అమిత్ షాతో భేటీ తర్వాత ఆయన కొంత మంది టీడీపీ నేతలతో చర్చల సారాంశాన్ని పంచుకున్నారు. షా ఆహ్వానం మేరకు ఎన్డీయేలో చేరడానికి సానుకూలంగా ఉన్నట్లు ఆయన మాటల్లో వ్యక్తమైందని తెలుస్తోంది. 'వైసీపీ పాలనలో రాష్ట్రం ఆర్థికంగా దివాలా తీసింది. అభివృద్ధి కనుచూపుమేరలో లేకుండా పోయింది. కనీసం రోడ్లు బాగుచేసే పరిస్థితి లేదు. రాష్ట్రంపై చెడు ముద్ర పడింది. పరిశ్రమలు, పెట్టుబడులేవీ రావడం లేదు. ఈ దుస్థితి నుంచి రాష్ట్రాన్ని మళ్లీ పట్టాలు ఎక్కించడానికి కేంద్ర సహకారం అవసరం. కేంద్రం ఆదుకోకపోతే మనం సొంతంగా ఇన్ని సమస్యలు అధిగమించలేం. రాజధాని కట్టాలి. పోలవరం పూర్తి చేయాలి. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి. అదీగాక కేంద్రంలో మళ్లీ ఎన్డీయే ప్రభుత్వమే ఏర్పాటయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. బీజేపీ తనకు తానుగానే మనల్ని ఆహ్వానించింది. ఎన్డీయేలో చేరితే రాష్ట్రానికి మంచి జరుగుతుందనిపిస్తోంది. ఒకరకంగా ఇది మనకు తప్పని పరిస్థితి అయింది' అని ఆయన వారితో చెప్పారు. రాష్ట్రంలో తమకు ఉన్న అవరోధాలు, సమస్యల గురించి అమిత్ షాతో చర్చించానని తెలిపారు. 'మైనారిటీ వర్గాలు గతంలో వైసీపీకి మద్దతు ఇచ్చేవి. జగన్ పాలన చూసిన తర్వాత ఆ వర్గాల్లో గణనీయభాగం టీడీపీ వైపు మొగ్గుచూపుతున్నారు.. ఇప్పుడు మేం ఎన్డీయేలో చేరితే వారు మళ్లీ వైసీపీ వైపు మళ్లుతారేమోనన్న అనుమానాలు ఉన్నాయని చెప్పాను. వైసీపీ తీసుకున్న అనేక ప్రజా వ్యతిరేక నిర్ణయాలను కేంద్రం అడ్డుకోలేదని.. దీనివల్ల రాష్ట్రం నష్టపోయిందన్న అభిప్రాయం కొన్నివర్గాల్లో ఉందని వివరించాను. నేనేమీ దాచుకోలేదు. అన్నీ వివరంగా చెప్పాను. ఈ విషయాలు షా, నడ్డా శ్రద్ధగావిన్నారు. మైనారిటీ వర్గాలను కొన్ని పార్టీలు రెచ్చగొడుతున్నాయని, సరైన పద్ధతిలో వారికి మన ఆలోచనలను విశదీకరించగలిగితే ఆ వర్గాలను దరి చేర్చుకోవచ్చని షా అభిప్రాయపడ్డారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్రం సహకారం ఉంటుందన్న భరోసా ఇస్తామని కూడా చెప్పారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న టీడీపీ.. ఎన్డీయేలోకి వస్తే బాగుంటుందని, రాష్ట్రానికి కూడా ఉపయోగం ఉంటుందని చెప్పారు. నేను పార్టీ నేతలతో మాట్లాడి తుది నిర్ణయం చెబుతానని తెలిపాను. వారు కూడా అంగీకారం తెలిపారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో చేరడమే మంచిదేమో అని అనిపిస్తోంది. దీనిపై పార్టీ వాళ్లతో మాట్లాడతాను' అని చంద్రబాబు అన్నట్లు సమాచారం.

బలం లేని చోట ఇస్తే..

ఎన్డీయేలో చేరడం ఖాయమైతే ఎన్నికల్లో బీజేపీకి ఎన్ని సీట్లు ఇవ్వాల్సి ఉంటుందన్నదానిపై టీడీపీ వ్యూహ బృందం కసరత్తు చేస్తోంది. రాష్ట్రంలో బీజేపీకి ఉన్న ఓట్ల శాతం, తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని పరిమిత సంఖ్యలోనే సీట్లు ఇవ్వాలని యోచిస్తున్నారు. బలం లేనిచోట సీట్లు ఇస్తే వైసీపీకి అయాచితంగా కట్టబెట్టినట్లు అవుతుందని అభిప్రాయపడుతున్నారు.

నాడు బీజేపీయే కలిసి రాలేదు..!

గతంలో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, టీడీపీ కలిసి పోటీ చేసిన విషయం కూడా చంద్రబాబు-అమిత్‌షా చర్చల్లో ప్రస్తావనకు వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. 'తెలంగాణలో కలిసి పనిచేద్దామని ఆ ఎన్నికలకు చాలా ముందే ప్రతిపాదించాను. కానీ అక్కడి బీజేపీ నేతలు పట్టించుకోలేదు. తప్పనిసరి పరిస్థితుల్లో కాంగ్రెస్‌తో జట్టు కట్టాల్సి వచ్చింది. బీజేపీ కలిసి వచ్చి ఉంటే ఆ పరిస్థితి తలెత్తేదే కాదు' అని చంద్రబాబు చెప్పారు. అమిత్ షా కూడా నిజమేనని అన్నట్లు సమాచారం.

గతం గతః!

▸ అన్నీ మరచి.. కలిసి పనిచేద్దాం: షా



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): గతం మరిచిపోదామని.. కలిసి కట్టుగా పనిచేద్దామని కేంద్ర హోం మంత్రి, బీజేపీ అగ్ర నేత అమిత్ షా.. టీడీపీ అధినేత చంద్రబాబుకు చెప్పినట్లు తెలుస్తోంది. దరిమిలా రెండు పార్టీల నాయకత్వాలూ మళ్లీ జట్టుకట్టాలన్న రాజకీయ అవగాహనకు వచ్చినట్లు సమాచారం. బుధవారం రాత్రి వీరిద్దరి మధ్య జరిగిన చర్చల్లో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా కూడా పాల్గొన్న సంగతి తెలిసిందే. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. మోదీ నాయకత్వాన్ని మరింత పటిష్ఠం చేసేందుకు తిరిగి ఎన్డీయేలోకి రావాలని చంద్రబాబును అమిత్‌షా ఆహ్వానించారు. దక్షిణాదిన బీజేపీ ఉనికిని బలోపేతం చేసేందుకు సహకరించాలని కోరారు. రాష్ట్రాన్ని బలోపేతం చేసేందుకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. దేశ, రాష్ట్ర ప్రయోజనాల రీత్యా కలిసి పనిచేయాలని నిర్ణయానికి వచ్చారని తెలిసింది. త్వరలో టీడీపీ-బీజేపీ-జనసేన మధ్య పొత్తుపై లాంఛనంగా ప్రకటన చేస్తారని సమాచారం. రాజకీయ అవగాహన కుదరడంతో గురువారం చంద్రబాబు హైదరాబాద్‌కు తిరుగుపయనమయ్యారు. కాగా, అమిత్‌షా, నడ్డాలతో చంద్రబాబు మంతనాలపై జాతీయ మీడియాలో గురువారం విస్తృత చర్చ జరిగింది. టీడీపీ త్వరలో తిరిగి ఎన్డీయేలోకి రానుందని పలు చానళ్లు వెల్లడించాయి.

'సలహా' కాదు... సొంతం స్వాహా!

(మొదటి పేజీ తరువాయి)



డీఎల్‌ఆర్‌ప్రసాద్

ఐదేళ్లలో లోకానికి తెలిసిపోయింది. ఇంతకీ ఏపీఎండీసీలో చేరిన వ్యక్తి జీతమెంతో తెలుసా?... ఉపరాష్ట్రపతికి ఇచ్చేదానికంటే కొంచెం ఎక్కువే. ఇతర సదుపాయాలు సరేసరి. ఆ సలహాదారు మరెవ్వరో కాదు..డీఎల్‌ఆర్ ప్రసాద్. ఆయన వల్ల ఏపీఎండీసీకి వచ్చిన అదనపు లాభం ఎంతో నిర్ధారణ కాలేదు. కానీ, బొగ్గు అమ్మకాల్లో ఏపీఎండీసీకి వచ్చే లాభాలు తగ్గిపోగా, అమ్మకాల టెండర్ దక్కించుకున్న అదానీకి కనకవర్షం కురుస్తోంది. అదెలాగో తెలియాలంటే ముందుగా డీఎల్‌ఆర్ ప్రసాద్ గురించి తెలుసుకోవాలి...

వయా అదానీ టూ ఏపీఎండీసీ...

ఏపీఎండీసీకి సులియారీ(మధ్యప్రదేశ్)లో కేంద్రం కేటాయించిన బొగ్గు గనులున్నాయి. ఇక్కడ కోల్ మైనింగ్ కాంట్రాక్టును అదానీ కంపెనీ దక్కించుకుంది. బొగ్గు గనులను తవ్వడం ఒక ఎత్తయితే, దాన్ని ప్రాసెస్ చేసి అమ్మడం మరో పెద్దపని. ఎలాగూ మైనింగ్ టెండర్ దక్కించుకున్న అదానీ గ్రూప్.... బొగ్గు (ముడిబొగ్గు) అమ్మకం టెండరు కూడా దక్కించుకోవాలని చూస్తోంది. సీన్ కట్‌చేస్తే, జగన్ సర్కారు వచ్చాక, 2019 నవంబరులో ఏపీఎండీసీ సలహాదారుగా డీఎల్‌ఆర్ ప్రసాద్‌ను నియమించింది. అంతకు ముందు వరకు ఆయన అదానీ ఎంటర్‌ప్రైజెస్‌లో ప్రెసిడెంట్ హోదాలో 2015 ఏప్రిల్ నుంచి 2019 నవంబరు వరకు పనిచేశారు. దీనికన్నా ముందు అదానీ ఆస్ట్రేలియా కంపెనీలో 2010 డిసెంబరు నుంచి 2015 ఏప్రిల్ వరకు మైన్స్ డైరెక్టర్‌గా పని చేశారు. జగన్ సర్కారు సలహదారుల నియామకాల్లో భాగంగా రాష్ట్రానికి వచ్చారు డీఎల్‌ఆర్ ప్రసాద్. అయనకు నెల జీతం రూ.4,23,340. ఇవి కాక, ఇతర వనరులు, సదుపాయాలు అదనం. ప్రతి వారాంతంలో ఓ వాహనం ఆయనను హైదరాబాద్‌కు తీసుకెళ్లి దింపి వస్తుంది. సోమవారం మరోసారి హైదరాబాద్ వెళ్లి మళ్లీ ఆయనను ఇక్కడకు తీసుకొస్తుంది. రాష్ట్రపతి నెల వేతనం రూ.5లక్షలు. ఉపరాష్ట్రపతి వేతనం రూ.4 లక్షలు కావడం గమనార్హం.

అదానీకే బొగ్గు అమ్మకం టెండర్

మధ్యప్రదేశ్‌లోని సులియారీ కోల్‌బ్లాక్‌లో ఉన్న బొగ్గు గనుల్లో తవ్విన బొగ్గును అమ్మేందుకు 2021 అక్టోబరులో ఏపీఎండీసీ టెండర్లు పిలిచింది. ఊహించినట్లుగానే టెండర్‌ను అదానీ గ్రూప్ దక్కించుకుంది. రెగ్యులర్ టెండర్, రివర్స్ టెండర్‌లో ఆ సంస్థే నెంబర్ వన్‌గా నిలిచింది. మైక్రోస్మాల్ ఇండస్ట్రీయల్ ఎంటర్‌ప్రెన్యూర్స్‌కు ఇచ్చే బొగ్గు టన్ను ధర రూ.12వేలపైనే ఉంటోంది. కానీ, అదానీకి ఇస్తోన్న టన్ను ధర పన్నులతో కలిపి రూ.6వేలలోపే ఉంటుందని తెలిసింది. అంతేనా.... ఈ టెండర్ నిబంధనల రూపకల్పనలో ఏపీఎండీసీ దేశంలో మరెక్కడా చోటుచేసుకోని విన్యాసాలు చేసింది. టెండర్ కట్టబెట్టినందుకు బ్యాంక్ గ్యారంటీలు తీసుకోలేదు. దీనికి విరుద్ధంగా పెర్ఫార్మెన్స్ డిపాజిట్ కింద రూ.250 కోట్లు అదానీ చెల్లించేలా నిబంధన విధించింది. టెండర్ దక్కాక అగ్రిమెంట్ అయిన తర్వాత అదానీ నుంచి ఏపీఎండీసీకి 250 కోట్ల నగదు వచ్చింది. దీన్ని నెల వాయిదా రూపంలో అదానీకి వడ్డీతో సహా చెల్లించే సరికొత్త రూల్ తీసుకొచ్చారు. ఫలితంగా అదానీకి ప్రతి నెల అసలు, వడ్డీ కలిపి రూ.30.63కోట్లు చొప్పున 10 నెలల్లో రూ.306.03 కోట్లు చెల్లించారు. అంటే అసలుపై అదనంగా మరో రూ.56.03 కోట్లు వడ్డీ రూపంలో ఏపీఎండీసీ చెల్లించేలా అగ్రిమెంట్ చేసుకున్నారు. ఇలాంటి ఒప్పందాలు కోల్‌ఇండియాలో కూడా జరగలేదు. నిజానికి టెండర్‌లో బ్యాంక్ గ్యారంటీ నిబంధన పెట్టి ఉంటే, ఎస్‌బీఐ నిబంధనల ప్రకారం ఏపీఎండీసీకి రూ.56.03 కోట్లు వచ్చేవి. ఆ సొమ్మును ప్రజా అవసరాలకు వాడుకునే అవకాశం ఉండేది. ఆర్థికంగా తనకు నష్టం జరిగినా ఫర్వాలేదు కానీ అదానీ నష్టపోకూడదని వడ్డీ చెల్లింపులు చేసిన ఆలోచనలు ఎవరివి? జగన్ తెచ్చిపెట్టుకున్న సలహాదారు డీఎల్‌ఆర్ ప్రసాద్ ఈ చర్యలను ఎందుకు అడ్డుకోలేకపోయారు? ప్రభుత్వ ప్రయోజనాలను ఎందుకు కాపాడలేకపోయారు? బ్యాంక్ గ్యారంటీ లేకపోవడం వల్ల ఏపీఎండీసీ నష్టపోతుందని ఎందుకు సర్కారుకు దిశానిర్దేశం చేయలేకపోయారు? నిజంగా ఆయన ఇదంతా చేసి ఉంటే గోల్‌మాల్ ఎలా జరిగి ఉండేది? ప్రభుత్వం నుంచి రూ.లక్షల వేతనం తీసుకున్నందుకు ఆయనవల్ల జరిగిన మేలు ఏమైనా ఉందా?

చిక్కడు.. దొరకడు..

డీఎల్‌ఆర్ ప్రసాద్ సలహాదారు హోదాలో ఫైళ్లు చూడరు. ఆయనకు ఫైళ్లు పంపరు. ఒకవేళ ఏదైనా వచ్చినా ఆయన సంతకాలు చేయరు. అంటే, ఏ రూపంలోనూ ప్రభుత్వానికి జవాబుదారీగా లేరన్నమాట. ఆయన ప్రభుత్వ ప్రయోజనాలు పరిరక్షించే సలహాలే ఇచ్చి ఉంటే, కోల్ అమ్మకం టెండర్లలో టెండర్ కండీషన్లు ఎందుకు మారిపోయాయి? బ్యాంక్ గ్యారంటీకి బదులు పెర్ఫార్మెన్స్ గ్యారంటీలు ఎలా తెరపైకి వచ్చాయి? ఎవరు ఇచ్చిన సలహాతో ఏపీఎండీసీ తాను నష్టపోయే ఈ నిర్ణయం తీసుకుంది. దీనికి సమాధానం లేదు. ఒక్క ఫైల్‌పైనా సంతకాలు చేయరు. కాబట్టి ఆయన చిక్కరు... ఎవ్వరికీ దొరకరు. కానీ తన పూర్వ సంస్థ అదానీ కోరుకున్నట్లుగానే టెండర్లు, కాంట్రాక్టులు జరిగిపోతున్నాయి. బొగ్గు వేలంలో ఎంఎస్ఎంఈలకు అధిక రేటు, అదానీకే తక్కువ రేటు దక్కేలా చకచకా నిర్ణయాలు జరిగిపోతున్నాయి. సలహాదారుగా చేరాక ఆయనకు జీతం రూపంలో రూ.కోట్లు వచ్చాయి. కానీ, ఏపీఎండీసీకి ఒక్క రూపాయి అదనపు ఆదాయం తీసుకురాగలిగారా? ఇప్పుడు గనుల శాఖలో ఇదే హాట్‌టాపిక్‌గా మారింది.

ఇసుక అక్రమ తవ్వకాలపై ఈడీ, సీబీఐ కేసులు తప్పవు

- ▸ కనిష్ఠంగా 10 మంది కలెక్టర్లను విచారించే అవకాశం
- ▸ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలకు విరుద్ధంగా తవ్వకాలు
- ▸ షిరిడి సాయి ఎలక్ట్రికల్స్‌కు కాంట్రాక్టులు పెద్ద స్కాం
- ▸ ఈ అక్రమార్జన అంతా మనీలాండరింగే: బాలశౌరి



గుంటూరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): 'ఇసుక విధానం పెద్ద కుంభకోణం. ప్రతీ నెలా రూ.200 కోట్లు ప్రభుత్వ పెద్దలకు చేరుతుంది. ఇది చాలా దారుణం. దీనిపై త్వరలోనే ఈడీ, సీబీఐ, ఐటీ శాఖలు దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయబోతున్నాయి' అని మచిలీపట్నం ఎంపీ, జనసేన నేత వల్లభనేని బాలశౌరీ ఆరోపించారు. గురువారం సాయంత్రం గుంటూరులోని తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఇసుక కుంభకోణంలో పాత్ర ఉన్న ఏ ఒక్కరినీ కేంద్ర ప్రభుత్వం వదిలి పెట్టదు. కనీసం రాష్ట్రంలో 10 మంది కలెక్టర్లను ఈడీ విచారించే అవకాశం లేకపోలేదు. 2019లో జగన్ అధికారంలోకి ఉచిత ఇసుకని రద్దు చేసి కొత్త పాలసీ పేరుతో జాప్యం చేసి ఐదు, ఆరు నెలలు భవన నిర్మాణ రంగ కార్మికుల జీవనోపాధిని దెబ్బతీశారన్నారు. ఆ తర్వాత జేపీ సంస్థకి, అక్కడి నుంచి సబ్ కాంట్రాక్టులు ఇచ్చారు. కొన్నాళ్లపాటు ఆన్‌లైన్, ఫ్రీ డెలివరీ అని చెప్పి చివరికి నేరుగా నగదు తీసుకొని ఇసుక సరఫరా చేసే విధానానికి తీసుకొచ్చారు. ప్రతీ జిల్లాలో ఇసుక రీచ్‌లను తన పార్టీ నాయకులకు అప్పగించి వాళ్ల వద్ద నుంచి నేరుగా డబ్బు వసూలు చేస్తున్నారు. వాళ్లకు నష్టం వచ్చినా వదిలిపెట్టకుండా ముక్కుపిండి కలెక్షన్ చేస్తున్నారు. ఇసుక తీయడానికి పర్యావరణ అనుమతులు లేవు. గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలకు విరుద్ధంగా అధికారుల కళ్ల ముందే అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. పీసీబీ చెప్పినా ఆపడం లేదు. పైకి పేదలకు, పెత్తందార్లకు మధ్య జరుగుతున్న పోరాటం అంటాడు. చేసేది మాత్రం పేదల పొట్ట కొట్టడమే. తమిళనాడులో ఇలానే అక్రమ మైనింగ్‌కు పాల్పడినందుకు ఈడీ ఐదు సాంకేతిక విధానాల ద్వారా విచారణ జరిపి, అక్రమాలను నిర్ధారించింది. రూ.4,730 కోట్ల ఆదాయం రావాల్సి ఉండగా అక్కడ కేవలం రూ.36 కోట్లు మాత్రమే ప్రభుత్వానికి రావడంతో ఐదు జిల్లాల కలెక్టర్లపై కేసులు నమోదు చేసింది. అదే పరిస్థితి ఇక్కడ పునరావృతం కాక తప్పదు. గత 10 రోజులుగా మా జనసేన పార్టీ కార్యకర్తలు రీచ్‌ల వద్దకు వెళ్లి ఫోటోలు, వీడియోలు తీస్తుంటే వారిపై పోలీసులు దాడి చేస్తున్నారు. అయితే ఇమేజ్‌లు తీస్తున్న శాటిలైట్‌ను ఏం చేయలరన్న విషయాన్ని గుర్తించాలి. ఇప్పటికైనా వైసీపీ ప్రభుత్వం ఇసుక రీచ్‌లను ఎస్సీ, ఎస్టీ, బీసీలకు, స్థానిక సంస్థలు, సొసైటీలకు కేటాయిస్తే ఆయా వర్గాలకు ఉపాధి దొరుకుతుంది. ఇదేవిధంగా షిరిడి సాయి ఎలక్ట్రికల్స్ అనేది మరో పెద్ద కుంభకోణం. దీనిపై ఎన్ని పుస్తకాలైనా రాయొచ్చు. స్మార్ట్ మీటర్ల కాంట్రాక్టు ఆ సంస్థకి కట్టబెట్టారు. ట్రాన్స్‌ఫార్మర్ల కొనుగోలు కాంట్రాక్ట్‌ని దోచి పెట్టారు. సోలార్ మాడ్యూల్స్ తయారు చేస్తారని పవర్ సబ్సిడీని ఇస్తున్నారు, భూములు ఇచ్చారు. ఇప్పుడు రాష్ట్రంలో ఉన్న క్వార్ట్జ్ ఖనిజ సంపద అంతా ఆ సంస్థకే దోచి పెడుతున్నారు. ఈ అక్రమార్జన అంతా మనీ లాండరింగ్ కిందకు వస్తుంది. దాంతో కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఈడీ, సీబీఐ, ఐటీ తదితర శాఖలన్నీ దాడులు చేస్తాయి' అని బాలశౌరి ప్రకటించారు.

ఢిల్లీలో వాలిన జగన్

(మొదటి పేజీ తరువాయి)

చెప్పినట్లు తెలిసింది. శుక్రవారం సాయంత్రం వరకూ జగన్ ఢిల్లీలోనే ఉండాలని నిర్ణయించుకున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. బుధవారం రాత్రి చంద్రబాబుతో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా చర్చలు జరిపిన సంగతి తెలిసిందే. ఎన్డీయేలో భాగస్వామి కావాలని అమిత్‌షా ఆయనను కోరారని, పరస్పర ప్రయోజనాల రీత్యా కలిసి వెళ్లాలనే అవగాహన కుదిరిందని ఇరుపార్టీల వర్గాలు చెబుతున్నాయి. ఇదే నేపథ్యంలో జగన్ హుటాహుటిన ఢిల్లీకి చేరుకోవడం గమనార్హం. శుక్రవారం ఆయన ప్రధాని మోదీని కలిసే అవకాశాలున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

రేయ్ ల.. కొడకా.. నీకు బ్రేకులు వేస్తా..!

- ▸ మంత్రి గుమ్మనూరు జయరాం తిట్లదండకం
- ▸ బీసీ నాయకుడు వీరేశ్‌కు బెదిరింపులు

ఆలూరు, ఫిబ్రవరి 8: కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరాం ఆగడాలు, బెదిరింపులు రోజురోజుకూ పెచ్చరిల్లిపోతున్నాయి. మంత్రిగా హుందాగా ఉండాల్సిన ఆయన దిగజారి బూతులు మాట్లాడుతూ కిందిస్థాయి నేతలను బెదిరిస్తున్నారు. తాజాగా బీసీ వర్గానికి చెందిన వైసీపీ కో కన్వీనర్‌ని మంత్రి బండబూతులు తిట్టిన ఆడియో కలకలం రేపుతోంది. 'రేయ్... లం.. కొడకా... అత్యుత్సాహం చూపుతున్నావు... నీకు బ్రేకులేస్తా... ఇదే ఫస్ట్, ఇదే లాస్ట్... ఇక చెప్పేది ఉండదు..' అంటూ మంత్రి జయరాం, ఆలూరు మండల వైసీపీ కో-కన్వీనర్ అరికెర వీరేశ్‌కు వార్నింగ్ ఇచ్చిన ఆడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆ ఫోన్ సంభాషణ ఇలా...

ఈశ్వర్ (మంత్రి తనయుడు): హలో.. నేను ఈశ్వర్‌ని వీరేశా మాట్లాడేది..? నాన్న మాట్లాడుతారు..

వీరేశ్: నమస్తే అన్న.. చెప్పన్నా..

మంత్రి: ఏమంత అత్యుత్సాహం చూపుతున్నావు..?

వీరేశ్: అన్నా... జగనన్న మీద అభిమానం..

మంత్రి: జగనన్న మీద అభిమానం అట్లున్ని.. నీవు ఒక్కటే కాదు.. నేను కూడా ఉన్నా.. అత్యుత్సాహం చేయ్యొద్దు.. చానా స్పీడ్ అయితే బ్రేకులు పడతాయ్.

వీరేశ్: అన్న వేరే తప్పు ఏమైనా చేశానా...?

మంత్రి: నాటకం చేయెద్దు.. అత్యుత్సాహం చేయ్యొద్దని ఆరోజే చెప్పా. ఫస్ట్.. లాస్ట్, ఇక చెప్పేది ఉండదు.

వీరేశ్: అన్న ఒక్కటే అడుగుతాను.. నేను నీ కోసం ప్రాణాలు తెగించి తిరిగాను

మంత్రి: రేయ్ లం.. కొడకా.. ఊరికే ఉంటావా. కొడకా.. నిన్ను చంపేస్తానంటే వాడు నాగరాజు గాడు.. మీ సర్పంచ్.. వాడిని ఆపినాను రా.. నా కొడకా..

వీరేశ్: అన్న ఎవరేమి చంపుకోరు.. మేము వాళ్లనేమి చంపేకి పోము... వాళ్లు మమ్మల్ని చంపేకి రారు..

మంత్రి: ఆరోజు మా ఇంటికి ఎందుకు వచ్చింట్రి..

వీరేశ్: మీరే పిలిచారు.. వచ్చాము...నా

మంత్రి: నీవు వాన్ని మీద ఏదేదో కేసులంటే ఇద్దరికీ రాజీ చేసినందుకు నాకు బుద్ధి తక్కువ కదా...

వీరేశ్: నీవు రాజీ చేస్తివి.. వాడికి రౌడీషీట్ తీపిస్తివి అన్న.. ఎంత అడిగాను మాకు తీపించమని. మొన్న జగనన్న పుట్టిన రోజు తిరగ పొద్దున అనగా ఎస్పీ ఆఫీసులో అన్న మమ్మల్ని గు... పగలకొట్టారు.

మంత్రి: ఫోన్ పెట్టు.. కొడకా.. పెట్టు..



బుధవారం రాత్రి నుంచి ఆశాలు ఉన్న కార్యాలయానికి పోలీసులు తాళం వేయడంతో గురువారం ఉదయాన్నే గేట్లు దూకి పోరాటానికి వెళ్తున్న కార్యకర్తలు



ముళ్ల కంచెలను దాటుకుంటూ జాతీయ రహదారిపైకి



కొలనుకొండ వద్ద జాతీయ రహదారిపై బైఠాయించిన ఆశాలు

ఆశాలపై దుశ్శాసనపర్వం

(మొదటి పేజీ తరువాయి)

పోలీసు' అన్నట్లుగా ఆశాలను అదుపులోకి తీసుకునే క్రమంలో మహిళా పోలీసులతోపాటు కొందరు మగ పోలీసులు కూడా తీవ్ర బలప్రయోగానికి పాల్పడ్డారు. మహిళలని కూడా చూడకుండా దుశ్శాసన పర్వానికి తెరతీశారు. శాంతియుతంగా ర్యాలీ చేసేందుకు యత్నించినవారిని ఎక్కడికక్కడ అరెస్టు చేశారు. ప్రతిఘటించినవారి దుస్తులు చించి, కింద పడేసి లాగి చిత్రహింసలకు గురిచేశారు. ఈ క్రమంలో ఆశాలకు రక్తపు గాయాలైనా, స్పృహతప్పి పడిపోయినా కనికరించ లేదు. బలవంతంగా వాహనాల్లో కుక్కి పోలీసు స్టేషన్లకు తరలించారు. మహాధర్నాలో భాగంగా.. తమకు కనీస వేతనాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో మెడికల్ లీవ్స్ తదితర డిమాండ్లతోపాటు పనిఒత్తిడి తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఏపీ ఆశా వర్కర్ల సంఘం, సీఐటీయూ వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ కార్యాలయం ముట్టడికి పిలుపునిచ్చాయి. ముందుగా గురువారం ఉదయమే విజయవాడలోని ధర్నాచౌక్ చేరుకుని, అక్కడి నుంచి ర్యాలీగా కమిషనరేట్‌కు బయలుదేరాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం నుంచే ఆశాలపై ప్రభుత్వం నోటీసులు జారీచేసి, అరెస్టులు, నిర్బంధాలకు పాల్పడింది. గురువారం తెల్లవారుజాము నుంచే పోలీసులు విజయవాడ నగరాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ధర్నాచౌక్ ప్రాంతమంతా పోలీసుల వలయంలోకి వెళ్లింది. కమిషనరేట్ ముట్టడికి అనుమతి లేకపోవడంతో ఆశ వర్కర్ల సంఘ ప్రతినిధులను ముందుగానే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 30 మంది ఆశ వర్కర్లను అరెస్టు చేసి, వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు.

అన్ని జిల్లాల్లోనూ పోలీసుల ఉక్కుపాదం

తమ డిమాండ్ల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాలో.. ప్రతిచోటా ఆశావర్కర్లు రోడ్డెక్కారు. అనంతపురం, కర్నూలు, నెల్లూరు, ఉమ్మడి గోదావరి తదితర జిల్లాల్లో బుధవారం రాత్రి నుంచే ఆశాలపై పోలీసుల నిర్బంధకాండ కొనసాగింది. ఏలూరు జిల్లాలో ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు ప్రధాన రహదారుల్లో తనిఖీలు చేపట్టారు. ఇళ్లకు వెళ్లి నోటీసులు ఇచ్చి ఇంట్లో నుంచి బయటకు రాకుండా నిర్బంధించారు. పలుచోట్ల ఆశాలను పోలీస్‌స్టేషన్లకు తరలించారు. భీమవరం, తాడేపల్లిలలో రైల్వే స్టేషన్, బస్‌స్టాండ్ వద్ద ఆశాలను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. తణుకులో పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో సీఐటీయూ నాయకులు ధర్నా నిర్వహించారు. ప్రకాశం జిల్లా నుంచి ఆశాలు విజయవాడ వెళ్లకుండా కట్టడి చేశారు. 120 మందికిపైగా నాయకులకు నోటీసులు జారీచేశారు. అదేక్రమంలో సీఐటీయూ నాయకులను హౌస్ అరెస్టు చేశారు. గిద్దలూరులో ఆశాలను పోలీసు స్టేషన్‌కు తరలించగా, వారు అక్కడే ఆందోళన కొనసాగించారు. బాపట్ల జిల్లా వేమూరులోని 50 మందికిపైగా ఆశాలను స్టేషన్‌కు తరలించారు. విజయవాడ వెళ్లకుండా తమను అడ్డుకోవడంపై పార్వతీపురం, అనంతపురం జిల్లాల నుంచి విజయవాడకు వెళ్లేందుకు సిద్ధమైన ఆశాలను స్థానిక పోలీస్ స్టేషన్లకు తరలించి, రాత్రి వదిలిపెట్టారు. గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో సుమారు వంద మంది ఆశాలను రైళ్ల నుంచి దించేశారు. పోలీసుల కళ్లుగప్పి విజయవాడకు చేరుకున్న పలువురిని అక్కడి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆశాల అక్రమ అరెస్టులను నిరసిస్తూ విశాఖలో సీఐటీయూ కార్యాలయం నుంచి జగదాంబ జంక్షన్ వరకు ఆశా కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. పేదలకు ఆరోగ్యసేవలు అందించే తమను కార్మికులుగా గుర్తించాలని కోరినా పట్టించుకోవడంలేదని, విపరీతమైన పనిభారం విపరీతంగా పెంచేశారని ఆశా కార్యకర్తలు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమకు కనీస వేతనాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో మెడికల్ లీవ్స్ తదితర సౌకర్యాలు కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

సీఎం నివాస ప్రాంతంలో.. రాస్తారోకో

తాడేపల్లి, ఫిబ్రవరి 8: ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ ఆశా వర్కర్స్ సీఐటీయూ యూనియన్లు చలో విజయవాడకు పిలుపునివ్వడంతో రాష్ట్రంలోని ఆయా ప్రాంతాల నుంచి ఆశావర్కర్లు భారీగా సీఎం నివాస ప్రాంత సమీపానికి తరలివచ్చారు. అక్కడ సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మతో సహా ఆశాలందరినీ పోలీసులు నిర్బంధించి గేట్లకు తాళాలువేశారు. సీపీఎం నేతలు నిలదీయగా తాళాలు తీశారు. దీంతో ఆశాలు హైవేపైకి చేరుకుని రాస్తారోకో నిర్వహించారు. విజయవాడ-చెన్నై జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో పోలీసులు వారిని బలవంతంగా లాగేసి ఈడ్చుకెళ్లి వివిధ స్టేషన్లకు తరలించారు. ఈ క్రమంలో శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన ఆశాకార్యకర్త లక్ష్మి స్పృహతప్పి పడిపోయింది. కాగా, ఆశా వర్కర్లపై లాఠీచార్జ్ చేయడం జగన్‌రెడ్డి నిరంకుశ పాలనకు పరాకాష్ఠ అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు విమర్శించారు. వెంటనే ఆశాల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



చీరలాగేసి..



బస్సులో కుక్కుతూ..



మూకుమ్మడిగా దాడి చేస్తూ..

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.



టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ సమావేశంలో మాట్లాడుతున్న నెట్టెం రఘురామ్

దేవుడి పేరుతో ఓట్లు దండుకున్నారు

- ఇప్పుడేమో అందరినీ అణచివేస్తున్నారు
- సీఎం జగన్‌పై నెట్టెం రఘురామ్ విమర్శ

విద్యాధరపురం, ఫిబ్రవరి 8: దేవుడి పేరిట ఓట్లు దండుకుని సీఎం అయ్యాక జగన్‌రెడ్డి అందరినీ అణచివేస్తున్నాడని టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్ విమర్శించారు. ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఎస్సీ సెల్ జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ సభలో ఆయన మాట్లాడారు. బైబిల్ బోధించేదయినా, మహాత్మాగాంధీ చెప్పేదయినా దళితులకు సమాజంలో గుర్తింపు ఇవ్వాలనే చెబుతాయన్నారు.

కోడికత్తి శీనుకు బెయిల్ రావడం శుభసూచికం: కేశినేని చిన్ని

కోడికత్తి శీనుకు బెయిల్ రావడం శుభసూచకమని టీడీపీ సీనియర్ నాయకుడు కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. అతనిని ఐదేళ్లపాటు జైలులో ఉంచారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి కోర్టుకు వెళ్లి ఉంటే ఒక్కరోజులోనే బయటకు వచ్చి ఉండేవాడన్నారు. జగన్ పాలనలో దళితులపై 6000కుపైగా దాడులు జరిగాయని, 188 మంది దళితులను హత్య చేశారని తెలిపారు. కొలికపూడి శ్రీనివాస్, సొంగా సంజయ్ వర్మ, శావల దేవదత్, వాసం మునియ్య మాట్లాడారు.

వైసీపీ ఎన్నికల ప్రచార కరపత్రంలా రాష్ట్ర బడ్జెట్

- ఈ ప్రభుత్వంలో ప్రతి స్కీమూ ఓ స్కామే: బొండా ఉమా

అజిత్‌సింగ్‌నగర్, ఫిబ్రవరి 8: వైసీపీ ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరానికి బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ప్రచార కరపత్రంలా ఉందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు విమర్శించారు. మొగల్రాజపురంలోని తన నివాసంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఏడాది బడ్జెట్‌ను పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోయారని, ఎన్నికల ముందు ప్రజలను మభ్యపెట్టేలా ఈ బడ్జెట్ ఉందని బొండా ఉమా విమర్శించారు. జగన్ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో అప్పులు రెట్టింపయ్యాయన్నారు. రాష్ట్రాన్ని అప్పులాంధ్రప్రదేశ్‌గా మార్చిన ఘనత జగన్ అండ్ కోదేనని ఆయన అన్నారు. వైసీపీ ప్రభుత్వం తెచ్చిన ప్రతి స్కీమ్ ఓ స్కామ్ అని ఆయన దుయ్యబట్టారు. ఆఖరుకు విద్యార్థులకు ఇచ్చే ట్యాబుల్లో రూ.వెయ్యి కోట్లు అవినీతి జరిగిందని ఆరోపించారు. మద్యంపై వచ్చే ఆదాయంతోనే జగన్ ప్రభుత్వం నడుస్తోందని, నాసి రకం మద్యంతో 30 వేలమందిని పొట్టనపెట్టుకున్నారన్నారు.

కొత్తదనం లేని రాష్ట్ర బడ్జెట్: నెట్టెం రఘురాం

విద్యాధరపురం, ఫిబ్రవరి 8: ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కొత్తదనమేదీ లేదని టీడీపీ ఎన్టీ ఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్ అన్నారు. నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బడ్జెట్‌లో అంకెల తికమకలు, గారడీ చేశారని, అంచనాలు భారీగా ఉన్నా ఖర్చులు చాలా తక్కువగా ఉన్నాయని తెలిపారు. రూ.13 వేల కోట్ల రెవెన్యూ లోటును రూ.44 వేల కోట్లకు, రూ.35 వేల కోట్ల ద్రవ్యలోటును రూ.60 వేల కోట్లకు పెంచిన ఘనత బుగ్గనదేనన్నారు. టీడీపీ హయాంలో కంటే నాలుగు రెట్లు రెట్లు వైసీపీ హయాంలో తీసుకోవడంతో రాష్ట్రం రుణాంధ్రప్రదేశ్‌గా మారిందన్నారు.

అధికారంలోకి వచ్చిన వెంటనే..

15వేల మందికి ఇళ్ల స్థలాలిస్తాం

- టీడీపీ గన్నవరం ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు

ఉంగుటూరు, ఫిబ్రవరి 8: టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గన్నవరం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో అర్హులైన 15వేలమంది పేదలకు ఇళ్లస్థలాలు ఇస్తామని టీడీపీ గన్నవరం నియోజకవర్గ ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు హామీ ఇచ్చారు. ఇందుపల్లి, వెంకట్రామాపురం, జంధ్యాలవారి కండ్రికలో గురువారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందుపల్లిలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ అంకెల గారడీ తప్ప ప్రజలకు ఉపయోగపడేలా లేదన్నారు. పన్నుల బాదుడు తప్ప బడ్జెట్లో కొత్త అంశాలు ఏవీ లేవని వెంకట్రావ్ విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్రంలో అప్పులు రూ.11.58లక్షల కోట్లు అని, ఇందులో కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులు రూ.95.400కోట్లు ఉన్నాయని తెలిపారు. చల్లగుళ్ల లక్ష్మణరావు, తుమ్మల రఘు, ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి, ఆళ్ల హనోక్, ఆళ్ల గోపాలకృష్ణ నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి చలమలశెట్టి రమేష్ పాల్గొన్నారు.



ఇందుపల్లిలో బాబుష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న యార్లగడ్డ వెంకట్రావు

ఆశా వర్కర్లది న్యాయపోరాటం

- వారి పోరాటానికి టీడీపీ మద్దతు: బోడె ప్రసాద్

పెనమలూరు, ఫిబ్రవరి 8: ఆశా వర్కర్లది న్యాయమైన పోరాటమని వారి డిమాండ్లు ఆమోదించేంత వరకు టీడీపీ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ హామీ ఇచ్చారు. చలో విజయవాడ కార్యక్రమానికి బందరు వైపు నుంచి విజయవాడ వస్తున్న వంద మంది ఆశా వర్కర్లను పెనమలూరు పోలీసులు నిర్బంధించిన పోరంకిలోని ఓ కల్యాణ మండపంలో ఉంచారు. అక్కడకు వెళ్లిన బోడె ప్రసాద్ వారికి సంఘీభావం తెలిపారు. మునిసిపల్ వర్కర్లు, అంగన్వాడీలు, ఆశా వర్కర్లకు ఎన్నికల సమయంలో అలవికాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన సైకో జగన్‌రెడ్డి హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆయన దుయ్యబట్టారు. ఆశా వర్కర్ల న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా నిరసనలు తెలుపుతున్న తన ఇంటి ముందు రోజూ పోలీసు జీప్ ఉంటోందని, ప్రజావ్యతిరేక కార్యక్రమాలను వ్యతిరేకిస్తూ నిరసనల్లో పాల్గొన్న తనపై అనేక కేసులు ప్రభుత్వం వేధిస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. వచ్చే జనసేన-టీడీపీ ప్రభుత్వంలో ఆశావర్కర్ల న్యాయమైన డిమాండ్ల ఆమోదానికి కృషిచేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఆయన వెంట మారుపూడి ధనకోటేశ్వరరావు, కోయ ఆనంద్‌ప్రసాద్ ఉన్నారు.

పేర్ని నానీ..బాలశౌరిపై అవాకులు చెవాకులు మానుకో

- లేకుంటే మీ ఇంటిని ముట్టడిస్తాం:తాతపూడి గణేష్

పెనమలూరు, ఫిబ్రవరి 8: ఇటీవల జనసేన పార్టీలో చేరిన ఎంపీ బాలశౌరిపై ఎమ్మెల్యే పేర్ని నాని చేస్తున్న అనుచిత వ్యాఖ్యలు ఆపకపోతే పేర్ని నాని ఇంటిని జనసైనికులు ముట్టడిస్తారని జనసేన తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు తాతపూడి గణేష్ హెచ్చరించారు. తాడిగడప పంట కాల్వ రోడ్డులోని జనసేన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. బాలశౌరిపై పేర్ని నాని అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. వైసీపీలో ఉన్న దుష్ట సంప్రదాయాలను, అవినీతిని, అన్యాయాలను దగ్గరుండి గమనించిన బాలశౌరి మునిగే నావ నుంచి ముందుగానే బయటికి దూకారన్నారు. టీడీపీ- జనసేన కలయికతో వైసీపీ గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. జనసేన, టీడీపీ నేతలను తిట్టేందుకు పేర్ని నానికి ముట్టిన ప్యాకేజీ ఎంతో వెల్లడించాలని డిమాండ్ చేశారు. వైసీపీ వికృత చేష్టలను భరించలేక ఇతర పార్టీల వైపు ఆపార్టీ నేతలు తొంగి చూస్తున్నారు. పేర్ని నాని మంత్రిగా బందరులో చేసిన అభివృద్ధిని చెప్పగలడా అని ప్రశ్నించారు. ఎంపీ బాలశౌరిని విమర్శించే స్థాయి నానికి లేదన్నారు. నియోజకవర్గ సమన్వయకర్త ముప్పారాజా, అడపా నాగశ్రీ, వడ్డి జీవ, మాదాసు రాము, చెన్నా గాంధీ, తిరుమలశెట్టి సుధీర్, ఓంకార్, గంధం సురేష్, వంగూరు మురళి పాల్గొన్నారు.

జనరల్ స్థానాల్లోనూ

దళిత, గిరిజనులకు టికెట్లివ్వాలి: డీబీపీఎస్

గవర్నర్‌పేట, ఫిబ్రవరి 8: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు జనరల్ స్థానాల్లోనూ దళిత, గిరిజనులను పోటీకి నిలుపుతామని ప్రకటించి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని దళిత, బహుజన పోరాట సమితి (డీబీపీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు అన్నవరపు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. రాష్ట్ర దళిత ఐక్యవేదిక, డీబీపీఎస్ నేతలు బుధవారం ఎంజీ రోడ్డులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం, సామాజిక స్థూపాన్ని సందర్శించారు. తమ డిమాండ్లను లేఖల రూపంలో అన్ని రాజకీయ పార్టీల నేతలకు పంపుతామని, తమకు సానుకూలంగా నిర్ణయాలు తీసుకున్న పార్టీలకు అండగా నిలుస్తామని అన్నారు. పీతల శ్యామ్‌కుమార్, కొల్లూరి కోటేశ్వరరావు, కొడాలి దయాకర్, గాలి దుర్గా ప్రసాద్, కాసాని గణేష్, కొరపాటి మీనా, శ్రీనివాస్, దాసరి సాంబశివరావు, కె. రత్నం, కొసనం వర్ధన్, తాటికొండ రాంబాబు పాల్గొన్నారు.

లోపభూయిష్టంగా..

జగనన్న భూహక్కు-భూరక్ష రీసర్వే



ఎస్ఎన్‌పాలెంలో పట్టాభూమిగా నమోదైన పంటకాలువ

- ఎస్ఎన్‌పాలెంలో సాగు భూములు చెరువుగా..
- పంటకాలువను సాగుభూమిగా గుర్తిస్తూ.. రైతులకు నోటీసులు, హెచ్చరిక బోర్డులు
- రెవెన్యూ అధికారుల తీరుపై రైతుల ఆగ్రహం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 8: రెవెన్యూ రికార్డుల్లో కచ్చితత్వం, భూవివాదాల శాశ్వత పరిష్కారం కోసం వైసీపీ ప్రభుత్వం నిర్వహించిన జగనన్న భూ హక్కు- భూ రక్ష రీ సర్వే రైతులకు తిప్పలు తెచ్చింది. ప్రతి గ్రామంలోనూ భూవిస్తీర్ణం తగ్గిపోవడం, రైతుల పేర్లు మారిపోవడం, సాగు చేసుకునే భూములపై రైతులు హక్కులు కోల్పోవడం జరిగిందని, తమకు న్యాయం చేయాలని ఆధారాలతో రెవెన్యూ అధికారులను కలిసినా సమాధానం చెప్పకపోగా రీసర్వే ఆధారంగా చర్యలకు ఉపక్రమిస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. రీసర్వేలో ఎదురయ్యే సమస్యల్ని, అభ్యంతరాల్ని పరిశీలించి పరిష్కరించాలంటే అదనపు సమయం పడుతుందనే రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు అంటున్నారు. పాసుపుస్తకాల ఆధారంగా బ్యాంకు లోన్లు, రిజిస్ట్రేషన్లు జరుగుతాయని, కానీ రీసర్వే ప్రకారం తప్పుల తడకగా ఉండటంతో రిజిస్ట్రేషన్లు జరగట్లేదని, బ్యాంకులు లోన్లు ఇచ్చేందుకు వెనకాడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి గ్రామంలోను భూహక్కు-భూరక్ష పథకం కింద చేసిన సర్వే లోపభూయిష్టంగా, తప్పులతడకగా ఉన్నా రెవెన్యూ అధికారులు తమకు తెలియదని, తమ దగ్గర పరిష్కారం లేదని చేతులు దులుపుకొంటున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.





ఎస్ఎన్‌పాలెంలో సాగుభూమిలో హెచ్చరిక బ్యానర్ కడుతున్న రెవెన్యూ సిబ్బంది, చెరువు భూమి అనడంతో కంపసాటి లక్ష్మి పొలంలో వైసీపీ నాయకులు తొక్కించేసిన పంట

పూర్వీకుల నుంచి సంక్రమించిన భూమిని చెరువంటున్నారు



తాతల కాలంలోనే భూమి రిజిస్ట్రేషన్ అయ్యింది. వారి నుంచి రెండెకరాలు సంక్రమించింది. 50 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నాం. రెవెన్యూశాఖ వారు వచ్చి ఇది ప్రభుత్వ భూమి అని చెరువుగా రీసర్వేలో ఉందని చెప్పి నోటీసులను గోడకు అంటించి వెళ్లారు. మావద్ద న్యాయపరంగా అన్ని ఆధారాలు ఉన్నాయి. చెప్పినా వినకుండా సాగుభూమిలో బోర్డులు పెడుతున్నారు. రెవెన్యూ అధికారులను కలిసినా తమకు తెలియదని, సమస్యలను పరిష్కరించే లాగిన్ మావద్ద లేదని చెబుతున్నారు. సమస్య పరిష్కారం కాకుండా చర్యలు ఎందుకు తీసుకుంటున్నారన్న ప్రశ్నకు సమాధానం చెప్పడం లేదు. ఉన్నతాధికారుల ఆదేశాలంటూ తప్పించకుంటున్నారు.

- పుసునూరి అనసూయ, ఎస్.ఎన్.పాలెం

- ఎస్ఎన్‌పాలెంలో సర్వే నెం.38లో 60 ఏళ్లకు పైగా సాగులో ఉన్న భూములను చెరువుగా చూపి నోటీసులు ఇచ్చారని, సాగుభూముల్లో హెచ్చరిక బోర్డులు పెడుతున్నారని చిన్న, సన్నకారు రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇదే అదనుగా భావించిన అధికార పార్టీ నాయకులు పంట పొలాల్లో తమకిష్టం వచ్చినట్లు తొక్కించేస్తూ బాటలు వేసి వారి పొలాల్లోకి వెళుతున్నారని కంపసాటి లక్ష్మి అనే మహిళ రైతు ఆవేదన వ్యక్తంచేశారు. తమ పూర్వీకుల నుంచి 50 ఏళ్ల క్రితమే భూములు సంక్రమించాయని వాటికి రిజిస్ట్రేషన్లు అయ్యాయని లక్ష్మి తెలిపారు. సీసీఆర్‌సీలతో పాటు పాసుపుస్తకాలూ వాటికి మంజూరయ్యాయన్నారు. వాటి అధారంగానే ఆడపిల్లలకు స్త్రీధనంగా రిజిస్ట్రేషన్లు చేశామని, ఇప్పుడు చెరువని సాకుచూపి వారి పొలాల్లోకి వెళ్లేందుకు సాగులో ఉన్న పంటను అధికార పార్టీ నాయకులు తొక్కించేశారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.
- గత పాసుపుస్తకాల్లో చూపించిన 1.21ఎకరాల భూమి కన్నా 25సెంట్ల భూమి తగ్గిపోయిందని కొత్తపల్లికి చెందిన వి.రావు, ఎం.ఎన్.పాలెంకు చెందిన నాగేశ్వరరావు తెలిపారు. దీనిపై తగిన ఆధారాలతో ఫిర్యాదు చేసినా ఇంతవరకూ ఎటువంటి చర్యలు చేపట్టకపోగా రీసర్వే ఆధారంగానే కొత్త పాసుపుస్తకాలను జారీ చేశారని తెలిపారు.
- బిళ్లనపల్లికి చెందిన కొండపావులూరి ప్రసాద్ హైదరాబాద్‌లో ఉంటారు. పూర్వీకుల నుంచి సంక్రమించిన భూమిని రీసర్వేలో రహదారిగా మార్చారని, ఫిర్యాదు చేసినా ఇంతవరకూ ఎటువంటి సమాధానం లేదని, స్థానిక అధికారపక్ష నాయకులు చెప్పినట్లు రెవెన్యూ సిబ్బంది రీసర్వే నెంబర్లు మార్చేశారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.





గుణదలలో ఆర్వోబీ నిర్మాణం కోసం ఖాళీ చేయించిన ప్రదేశంలో గుణదల తిరునాళ్లకు స్థలాలు అద్దెకు ఇచ్చేందుకు టెంట్‌లో కుర్చీలు వేసుకుని కూర్చున్న వైసీపీ నాయకులు

తిరునాళ్లలో స్టాల్స్ అద్దెకిస్తాం!

- నీటిపారుదల శాఖ ఖాళీ స్థలంలో టెంట్ వేసుకుని కూర్చున్న వైసీపీ నాయకులు

గుణదల, ఫిబ్రవరి 8: ధనార్జనకు ఉపయోగపడే ఏ ఒక్క అవకాశాన్నీ వైసీపీ నాయకులు వదులుకోరు. గుణదల ఏలూరు రోడ్డు వెంబడి టెంట్ వేసుకుని అందులో కూర్చుని తిరునాళ్లకు స్టాల్స్ అద్దెకు ఇవ్వడమే అందుకు నిదర్శనంగా చెప్పొచ్చు. గుణదల లూర్దుమాత తిరునాళ్ల 9, 10, 11 తేదీల్లో జరగనున్నాయి. తినుబండారాలు, బొమ్మలు, కొబ్బరికాయలు, చెరుకుగడలు విక్రయించుకునేందుకు స్టాల్స్ పెట్టుకునేవారు తమను సంప్రదించాలని వైసీపీ ఒకటో డివిజన్ నాయకులు ఏకంగా నీటిపారుదలశాఖ ఖాళీ స్థలంలో టెంట్ వేసుకుని కూర్చున్నారు. బహిరంగంగానే స్టాల్స్‌కు స్థలాన్ని అద్దెకు ఇస్తున్నారు. స్టాల్స్ తీసుకున్న వారికి విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు మెయిన్ వైర్లపై జంపర్ వేసి ఉంచారని సమాచారం. గుణదల సెంటర్ నుంచి గుణదల శివాలయం వెనుక వరకు ఏలూరు రోడ్డు వెంబడి రైవస్ కాల్వకట్టపై ఉన్న నిర్మాణాలను గడచిన కొద్ది రోజుల క్రితమే ఆర్వోబీ వంతెన నిర్మాణం నిమిత్తం తొలగించారు. ఈ స్థలం ఖాళీగా ఉండటంతో గుణదల మేరీమాత ఉత్సవాలకు వ్యాపారాలు చేసుకునేవారికి స్టాల్స్‌గా అద్దెకు ఇచ్చేందుకు వైసీపీ నాయకులు దందా చేస్తున్నారు. అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తుండటం విమర్శలకు తావిస్తోంది. అధికారులకు ఇందులో వాటాలు అందుతుండటం వల్లనే వారు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి.

అధికార పార్టీ జులుం

- కేదారేశ్వరపేట పండ్ల మార్కెట్‌లోకి వాహనాల రాకపోకలకు ఆటంకంగా గడ్డర్ల ఏర్పాటు
- గడ్డర్లను తొలగించిన మార్కెట్ అసోసియేషన్ సభ్యులు

పాతరాజరాజేశ్వరి పేట, ఫిబ్రవరి 8: కేదారేశ్వరపేటలో అధికార పార్టీనేతలు తమ జులుం చూపారు. నెల క్రితం 34వ డివిజన్ ప్రభాస్ కాలేజ్ రోడ్డు వైపున ఉండే కేదారేశ్వరపేట పండ్ల మార్కెట్‌కు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ఇనుప గడ్డర్లను ఏర్పాటు చేశారు. గురువారం రాత్రి రోడ్డు వైపునకు ఇరువైపులా వేసిన గడ్డర్లను కలుపుతూ ఐరన్‌రాడ్‌ను ఏర్పాటు చేయడానికి అధికార పార్టీ నేతలు యత్నించారు. దీంతో పండ్ల మార్కెట్ అసోసియేషన్, వ్యాపారులు వారిని అడ్డుకున్నారు. నెల క్రితం ఏర్పాటు చేసిన గడ్డర్లను కూడాపూర్తిగా తొలగించారు. దీంతో కాస్త ఉద్రిక్తత నెలకొంది. అధికార పార్టీ తమపై కావాలనే కక్షపూరితంగా ఇటువంటి పనులకు పాల్పడుతోందని, నోటీసులు లేకుండా దారికి అడ్డుగా గడ్డర్లు ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగించాలని చూస్తున్నారని, ఇటువంటి పనులకు పాల్పడితే సహించబోమని అసోసియేషన్ సభ్యులు మండిపడుతున్నారు.

గుణదల పొలాల్లో మహిళ మృతదేహం

గుణదల, ఫిబ్రవరి 8: గుణదల నుంచి నున్న వెళ్లే మార్గంలోని పంట పొలాల్లో గుర్తుతెలియని మహిళ మృతదేహం వివస్త్రగా పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. గుణదల పోలీసులు పూర్వాపరాలు సేకరించారు. చనిపోయిన మహిళ ఎవరు అన్నది ఇంకా తెలియరాలేదు. బ్లేడుబ్యాచ్ ముఠా ఎవరైనా మహిళను పొలాల్లోకి తీసుకొచ్చి అత్యాచారం చేసి చంపిపడేశారా ? లేక ఇంకెవరైనా ఎక్కడైనా చంపి బట్టలు లేకుండా ఇక్కడ పడేసి వెళ్లిపోయారా అన్నకోణంలో గుణదల పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. చనిపోయిన మహిళ వయస్సు సుమారు 50 ఏళ్లు ఉండొచ్చని పోలీసులు అంటున్నారు. మృతదేహం కుళ్లి దుర్వాసన వస్తోంది. మహిళ మృతదేహం పడి ఉన్న దరిదాపుల్లో ఎక్కడా ఆమె వస్త్రాలు కనబడకపోవడం ఆధారాలు దొరక్కుండా జాగ్రత్త పడేందుకే ఇలా చేసి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ఎండ్‌గేమ్‌లో నటించిన నటులు

అలరించిన ఎండ్‌గేమ్

విజయవాడ కల్చరల్, జనవరి 8: మహారాష్ట్రకు చెందిన మోనోవిత్ థియేటర్ బృందం ప్రదర్శించిన 'ఎండ్‌గేమ్' ఆంగ్ల నాటకం ఆద్యంతం అలరించింది. భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ, అనుబంధ సంస్థ నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంస్కృతి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ నాటక ప్రదర్శనల్లో భాగంగా రెండోరోజు గురువారం నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సోనూ పిలానియా దర్శకత్వంలో ఎండ్‌గేమ్ నాటకం ప్రదర్శించారు. సాజన్ కటారియా, కలిమ్ జాఫర్, నిధి ఎస్.శాస్త్రిలు నటించి మెప్పించారు. నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా ప్రతినిధి ఇమ్మినేని వివేక్ పాల్గొన్నారు. అనంతరం కళాకారులను సత్కరించి అభినందించారు.

ఆర్టీసీ ఉద్యోగులకు

నైట్ అవుట్ అలవెన్సుపై హర్షం

విజయవాడ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో నైట్ అవుట్ డ్యూటీలకు వెళ్లే సిబ్బందికి అలవెన్సుల అమలు, పెంపుదల ఉత్తర్వుల పట్ల ఆర్టీసీ గుర్తింపు సంఘాలు ఎన్ఎంయూఏ, ఈయూలు హర్షం వ్యక్తం చేశాయి. ఆయా సంఘాల తరపున పీవీ రమణారెడ్డి, వై.శ్రీనివాసరావు, పలిశెట్టి దామోదరరావు, జీవీ నరసయ్య ఆర్టీసీ యాజమాన్యానికి, ప్రభుత్వానికి గురువారం కృతజ్ఞతలు తెలిపారు. నైట్ అవుట్ అలవెన్సును రూ. 150 నుంచి రూ. 300లకు, ఇంటర్ స్టేట్ వెళ్లే సిబ్బందికి రూ.200 నుంచి రూ.400కు పెంచారని తెలిపారు. 6 వేల మంది ఉద్యోగులకు లబ్ధి కలుగుతుందని తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగులకు సెప్టెంబరు 1, 2022 నుంచి రావాల్సిన బకాయిల చెల్లింపులూ చేయాలని ఏపీ ఎస్ఆర్టీసీ ఎండీకి విజ్ఞప్తి చేశారు. అర్హులైన ప్రతిఒక్కరికీ డే అవుట్, టీఏ చెల్లింపులూ చేయాలని కోరారు.

విద్యాధరపురంలో ఆర్టీసీ

కల్యాణ మండపాన్ని నిర్మించండి

- ఏపీఎస్ఆర్టీసీ ఎండీకి ఈయూ లేఖ

విజయవాడ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): విద్యాధరపురంలో ఉన్న ఖాళీ స్థలంలో ఆర్టీసీ కల్యాణ మండపాన్ని నిర్మించాలని ఏపీఎస్ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావుకు ఏపీపీటీడీ ఈయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జీవీ నరసయ్యలు గురువారం లేఖ రాశారు. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్‌లో ఆర్టీసీ కల్యాణ మండపాన్ని నిర్మించి ఆర్టీసీ ఉద్యోగులకు రాయితీతోనూ, బయటి వ్యక్తులకు అద్దె ప్రాతిపదికన ఇచ్చేవారని తెలిపారు. విభజన అనంతరం రాష్ట్రంలో కల్యాణ మండపం లేదన్నారు. కల్యాణమండపంతో పాటు కమర్షియల్‌గా కొన్ని షాపులు నిర్మించి అద్దెకు ఇవ్వొచ్చని తెలిపారు.

మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ఉద్యమం

లబ్బీపేట, ఫిబ్రవరి 8: మత్తు పదార్థాలను నిర్మూలిద్దాం-ఉత్తమ సమాజాన్ని నిర్మిద్దాం అనే నినాదంతో మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 8 నుంచి 18 వరకు రాష్ట్ర స్థాయి ఉద్యమాన్ని నిర్వహిస్తున్నట్లు జమాత్ ఇస్లామీ హింద్ నగర అధ్యక్షుడు ముహమ్మద్ ఖలీలుల్లాహ్ తెలిపారు. లబ్బీపేటలోని సంస్థ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. మత్తు పదార్థాల వినియోగం అంతర్జాతీయ సమస్యగా మారిందని అన్నారు. రాష్ట్రంలోని విద్యా సంస్థలతో పాటు ఇతర చోట్ల గెట్ టుగెదర్ కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, పోస్టర్లు, కరపత్రాలతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఉద్యమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సంస్థ జనరల్ సెక్రటరీ అబ్దుల్ అజీజ్, ఉద్యమ కన్వీనర్ సయ్యద్ లుఖ్మాన్, షేక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ యూనివర్సిటీ

షూటింగ్ చాంప్‌కు ఉమామహేష్

విజయవాడ స్పోర్ట్సు, ఫిబ్రవరి 8: నగరానికి చెందిన యువ షూటర్ మద్దినేని ఉమామహేష్ కురుక్షేత్రలో ఈ నెల7న నిర్వహించిన సౌత్‌వెస్ట్ ఇంటర్ యూనివర్సిటీ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించాడు. ఫైనల్ పోరులో ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన మధ్యప్రదేశ్ షూటర్ ఐశ్వర్య ప్రతాప్‌సింగ్(633.4) పాయింట్లపై 633.7 పాయింట్ల స్కోర్‌తో స్వర్ణం సాధించి ఆల్ వరల్డ్ యూనివర్సిటీ చాంపియన్‌షిప్‌కు అర్హత సాధించాడు. స్పెయిన్‌లో ఈనెల 10 నుంచి 18 వరకు నిర్వహించే ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్‌కప్‌లో జూనియర్ కేటగిరిలో వ్యక్తిగత, మిక్స్‌డ్, టీమ్ ఈవెంట్‌లో భారత్ తరపున ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఈనెల 21 నుంచి 27వరకు అసోంలో నిర్వహించే ఖేలో ఇండియా యూనివర్సిటీ చాంపియన్‌షిప్‌లో కేఎల్ యూనివర్సిటీ తరపున బరిలో దిగనున్నాడు. కేఎల్ యూనివర్సిటీ డీన్ హరికిషోర్, చైర్మన్ సత్యనారాయణ, ప్రెసిడెంట్ రాజాబాబు, ఏపీ రైఫిల్ అసోసియేషన్ తరపున డి. రాజ్‌కుమార్, టి.సలలిత్, నాగిశెట్టి సుబ్రహ్మణ్యేశ్వరరావులు అభినందించారు.

విద్యుత్ కాంట్రాక్టు కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలి

ధర్నాచౌక్, ఫిబ్రవరి 8: విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కార్మికులందరినీ సంస్థలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని విద్యుత్ సంస్థలో విలీనం, రెగ్యులరైజేషన్ సాధన కమిటీ డిమాండ్ చేసింది. దాసరిభవన్ వద్ద గురువారం వారు దీక్ష చేశారు. దీక్ష చేసుకునేందుకు అనుమతించకుండా ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు అన్నారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు గొంతెత్తితే కేసులు పెట్టి ఉద్యమాలను అణచివేయడం ఈ ప్రభుత్వానికి పరిపాటిగా మారిందన్నారు. విద్యుత్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా యాజమాన్యం ప్రభుత్వం నాటకాలు ఆడుతున్నారన్నారన్నారు. కాంట్రాక్టు కార్మికులను సంస్థలో విలీనం చేయాలని, మీటర్ రీడర్లకు ఉపాధి భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సాధన కమిటీ నేతలు ఎం.బాలకాశీ, కట్ట నాగరాజు మాట్లాడారు. రెండు శతాబ్దాలుగా పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులను తెలంగాణ తరహాలో విలీనం చేసి రెగ్యురల్ చేయాలని, అరియర్స్, కారుణ్య నియామకాలు, మెడికల్ పాలసీ, సర్వీస్ ఇంక్రిమెంట్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు ఔట్‌సోర్స్ జేఏసీ నేత కె.విజయ్, వీఆర్‌ఏ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.పెద్దన్న ఈ దీక్షకు సంఘీభావం తెలిపారు.



దాసరిభవన్ వద్ద దీక్ష చేస్తున్న సాధన కమిటీ సభ్యులు

సిలంబంలో తెలుగు తేజాల సత్తా

కృష్ణలంక, ఫిబ్రవరి 8: భారతీయ యుద్ధకళ సిలంబం(కర్రసాము)లో తెలుగు తేజాలు చూపిన ప్రతిభ చాలా గొప్పదని భవిష్యత్తులో మరిన్ని విజయాలు అందుకుంటూ జిల్లా, రాష్ట్ర కీర్తిని దశదిశలా చాటాలని కలెక్టర్ ఎస్.ఢిల్లీ రావు అన్నారు. దేశంలో తొలిసారిగా వరల్డ్ యూనియన్ సిలంబం ఫెడరేషన్ 9 (డబ్ల్యూయూఎస్ఎఫ్) జనవరి 26-28 వరకు మదురైలో నిర్వహించిన సిలంబం ప్రీమి యర్ లీగ్‌లో రజతం, కాంస్య పతకాలు సాధించిన చిన్నారులు కోచ్ కె.సత్యశ్రీకాంత్ ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఢిల్లీరావును మర్యాదపూర్వకంగా కలిశారు. పతకాలు సాధించిన చిన్నారులను కలెక్టర్ అభినందించారు. సిలంబం ప్రీమియర్ లీగల్ (ఎస్‌పీఎల్)లో విజయవాడ నుంచి మూడు జట్లు పాల్గొన్నాయని కోచ్ సత్య శ్రీకాంత్ తెలిపారు. అండర్-17 కేటగిరిలో బాలికల జట్టు రజతంతో పాటు రూ.25 వేల నగదు బహుమతి, అండర్-10 బాలురు, బాలికల జట్లు కాంస్య పతకాలు కైవసం చేసుకున్నాయని తెలిపారు. జి.ప్రఘ్న్య, హియా ముఖేష్ జైన్, పి.రోషిని, పి.హారికలతో పాటు కూడిన అండర్-17 బాలికల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచి రజతంతో పాటు రూ.25 వేల నగదు బహుమతి సాధించినట్లు వెల్లడించారు. వి.సాత్విక్, జి.సూర్యప్రణవ్, ఎంఎస్‌వీడీ మోక్షిత్‌ల అండర్-10 బాలుర జట్టుతో పాటు మాన్య ముఖేష్ జైన్, పి.శ్రీరూప కార్తీష, పి.శ్రీకర లాస్యల అండర్-10 బాలికల జట్టు కాంస్య పతకాలు సాధించాయని ఆయన తెలిపారు.



పతకాలు సాధించిన విద్యార్థులతో కలెక్టర్ ఢిల్లీరావు, కోచ్ సత్య శ్రీకాంత్ తదితరులు

బడుగు వికాసం సబ్సిడీలు వెంటనే విడుదల చేయండి

- ఏపీఎస్ఆర్టీసీ హైర్ బస్ ఓనర్స్ అసోసియేషన్ డిమాండ్

ధర్నాచౌక్, ఫిబ్రవరి 8: జగనన్న బడుగు వికాసం సబ్సిడీలు వెంటనే విడుదల చేయాలని ఏపీఎస్ఆర్టీసీ హైర్ బస్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.సర్వేష్ డిమాండ్‌చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాలో 10 వేల మంది ఎంఎస్ఎంఈ యూనిట్ల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాదిమందికి ఉపాధి కల్పిస్తున్నారన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు నెలకొల్పిన ఎస్సీ, ఎస్టీ యువతకు సబ్సిడీ నేటికి విడుదల చేయకపోవడంతో బ్యాంకులు లోన్లు కట్టలేక అనేక మంది ఇబ్బంది పడుతున్నారన్నారు. సేవా రంగంలో ఆర్టీసీ హైర్ బస్సులు పొందిన లబ్ధిదారులు సబ్సిడీ అందక బస్సులు నడపలేని పరిస్థితిలో ఉన్నారన్నారు. కార్యదర్శి .పి.బాలయ్య, జి.రాజు పాల్గొన్నారు.

వెలంపల్లి ప్రలోభాలను నమ్ముకున్నారు

- వలంటీర్లకు కావాల్సింది కుక్కర్లు, బహుమతులు కాదు
- వేతనాల పెంపు: సీపీఎం నేత సీహెచ్ బాబూరావు

పాయకాపురం, ఫిబ్రవరి 8: వైసీపీ సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెలంపల్లి శ్రీనివాస్ ప్రజలను ఓట్లు అడిగే ధైర్యం లేక, ప్రజలు ఓట్లు వేస్తారు అనే నమ్మకం లేక వలంటీర్ల నమ్ముకుని, వారి ద్వారా ఓటర్లను మభ్యపెట్టాలని ప్రయత్నిస్తున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు విమర్శించారు. 63వ డివిజన్ రాజీవ్‌నగర్‌లో గురువారం ఆయన పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సెంట్రల్ నియోజకవర్గంలో వలంటీర్లకు కుక్కర్లు, నగదు ఇచ్చి ప్రలోభపెట్టాలని వైసీపీ నేతలు చూడటం శోచనీయమని బాబూరావు అన్నారు. వలంటీర్లకు కావాల్సింది కుక్కర్లు, బహుమతులు, నగదు కాదని వైసీపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వారి వేతనాలు పెంచి వారికి ఉద్యోగభద్రత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. వెల్లంపల్లి శ్రీనివాస్ తన అధికారంతో డబ్బు రాజకీయాలు చేస్తూ ప్రజలను మభ్యపెట్టడానికి ప్రయత్నిస్తున్నాడని, వలంటీర్లను, ప్రభుత్వ అధికారులను పావులుగా వాడుకుని అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలను మరచి ప్రజలపై భారాలు మోపిన పాలకులను ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు.

వ్యవస్థలో సమానత్వం

లేనప్పుడు అభివృద్ధి అసాధ్యం

- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ గంధం చంద్రుడు

గవర్నర్‌పేట, ఫిబ్రవరి 8: వ్యవస్థలో సమానత్వం లేనప్పుడు అభివృద్ధి అసాధ్యం అని, సామాజిక న్యాయం గురించి ఇంకా మాట్లాడుకోవాల్సి వస్తోందంటే సమాజంలో అసమానతలు తొలగిపోలేదని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ గంధం చంద్రుడు అన్నారు. దళిత స్త్రీ శక్తి సంస్థ 18వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం అరండల్‌పేటలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్-బాబూ జగ్జీవన్ రామ్ ఐక్యవేదికభవన్‌లో దళిత ఆదివాసీ స్త్రీలు-సామాజిక న్యాయం అనే అంశంపై దళిత స్త్రీ శక్తి జాతీయ కన్వీనర్ గడ్డం ఝాన్సీ అధ్యక్షతన నిర్వహించారు. గంధం చంద్రుడు ముఖ్య అతిథిగా విచ్చేశారు. దళిత స్త్రీశక్తి సంస్థ 18వ వార్షిక నివేదికను గంధం చంద్రుడు ఆవిష్కరించారు. రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి రాజేశ్వరరావు, పోలవరం ప్రాజెక్టు స్పెషల్ ఆఫీసర్ సరళావందనం, సైకాలజిస్ట్ రమాదేవి, ఎస్టీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు శివానీ, భూమికా సంస్థ కో-ఆర్డినేటర్ అనుపమ, ఎస్టీ అసోసియేషన్ రాష్ట్ర సభ్యుడు శ్రీనివాసనాయక్, దళిత స్త్రీ శక్తి సంస్థ నేషనల్ కో-ఆర్డినేటర్ సత్య, రాష్ట్ర కోఆర్డినేటర్లు స్వప్న, రోహిణి, రోజా, మేరి నిర్మల, కుమారి పాల్గొన్నారు.

'ఉత్తర-దక్షిణ' చిచ్చు పెట్టడం లేదు!

- రాష్ట్రాల రాజ్యాంగ హక్కులే కోరుతున్నాం: ఏచూరి
- విపక్ష ప్రభుత్వాలపై కేంద్రం యుద్ధం: కేజ్రీ
- ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద కేరళ సర్కారు ధర్నా
- సీఎం విజయన్, రాష్ట్ర మంత్రులు హాజరు
- పార్లమెంటు ప్రాంగణంలో డీఎంకే ఎంపీల నిరసన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: కేంద్రం తమపై వివక్ష చూపుతోందంటూ మరో దక్షిణ రాష్ట్రం ఢిల్లీలో ధర్నాకు దిగింది. బుధవారం కర్ణాటక ప్రభుత్వం చేపట్టగా.. గురువారం కేరళలోని ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం నిరసన ప్రదర్శన నిర్వహించింది. దక్షిణ భారతంలోని విపక్ష పాలిత రాష్ట్రాలు ఉత్తర-దక్షిణ ప్రాంతాల నడుమ చిచ్చుపెడుతున్నాయన్న విమర్శలను సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఖండించారు. రాష్ట్రాలకు రాజ్యాంగబద్ధంగా సంక్రమించిన హక్కులను మాత్రమే అవి కోరుతున్నాయని చెప్పారు. ఢిల్లీలో కేరళ భవన్ నుంచి జంతర్ మంతర్ వరకు సాగిన మార్చ్‌కు సీఎం పినరయి విజయన్ నాయకత్వం వహించారు. రాష్ట్ర మంత్రులు, ఎల్‌డీఎఫ్ భాగస్వామ్య పక్షాల నేతలు వెంట నడిచారు. ఏచూరితోపాటు ఢిల్లీ, పంజాబ్ సీఎంలు అరవింద్ కేజ్రీవాల్, భగవంత్‌సింగ్ మాన్, జమ్మూకశ్మీరు మాజీ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లా తదితరులు వారికి సంఘీభావం ప్రకటించారు. విపక్ష పాలిత రాష్ట్రప్రభుత్వాలపై కేంద్రం యుద్ధానికి దిగిందని, వాటిని వేధించడానికి అనేక ఎత్తులు వేస్తోందని కేజ్రీవాల్ విమర్శించారు. ఈడీ, సీబీఐ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను ప్రయోగించి వేధిస్తోందని దుయ్యబట్టారు. జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్‌ను ఈడీ అరెస్టు చేసిందని.. రేపు తననూ అరెస్టు చేయొచ్చని వ్యాఖ్యానించారు. బీజేపీ దేశాన్ని చీల్చేందుకు ప్రయత్నిస్తోందని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా ఆరోపించారు. డీఎంకే నేతలు తిరుచి శివ, పళనివేల్ త్యాగరాజన్, రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ కూడా పాల్గొన్నారు. ఈ ధర్నాకు కాంగ్రెస్ నేతలు దూరంగా ఉన్నారు. రాష్ట్ర ఆర్థిక ఇబ్బందులకు కేంద్రం ఒక్కదానిదే బాధ్యత కాదని అసెంబ్లీలో ప్రతిపక్ష నేత వీడీ సతీశన్ స్పష్టం చేశారు. రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రి, బీజేపీ నేత వి.మురళీధరన్ సైతం ఎల్‌డీఎఫ్ ధర్నాను రాజకీయ డ్రామాగా అభివర్ణించారు. ఇంకోవైపు.. తమిళనాడు పట్ల కేంద్రం నిర్లక్ష్యం చూపుతోందంటూ డీఎంకే, దాని మిత్రపక్షాల ఎంపీలు పార్లమెంటు ప్రాంగణంలో గాంధీజీ విగ్రహం వద్ద గురువారం ధర్నా చేశారు.

మధ్య తరగతి లక్ష్యంగా బీజేపీ మేనిఫెస్టో

- కమిటీకి పలు అంశాలపై పురందేశ్వరి సూచనలు
- నాలుగు గంటల సుదీర్ఘ చర్చ... 20న మళ్లీ సమావేశం
- 22న 8 వేల పంచాయతీల్లో దళిత రచ్చబండ

అమరావతి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సమగ్రాభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని మధ్య తరగతి ప్రజలే లక్ష్యంగా మేనిఫెస్టో సిద్ధం చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఎన్నికల ప్రణాళిక సభ్యులకు దిశా నిర్దేశం చేశారు. విజయవాడలోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో జరిగిన మేనిఫెస్టో కమిటీ సమావేశంలో సభ్యులకు రాష్ట్రంలోని పరిస్థితులకు అనుగుణంగా ఆమె కీలక సూచనలు చేశారు. నాలుగు గంటలకుపైగా సుదీర్ఘంగా జరిగిన ఈ సమావేశంలో కీలక అంశాలపై చర్చించిన కమిటీ ఈ నెల 20న మరో మారు సమావేశం అవ్వాలని నిర్ణయించింది. మరోవైపు ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గం, అధ్యక్షుడు గుడిసె దేవానంద్ నేతృత్వంలో సమావేశమైంది. రాష్ట్రంలోని ఎనిమిది వేల పంచాయతీల్లో దళిత రచ్చబండ పేరుతో ఈ నెల 22న నిర్వహించబోయే కార్యక్రమంపై చర్చించారు.

జగన్‌ను ఓడించడానికి ఢిల్లీకి బాబు: మంత్రి వేణు

అమరావతి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): తెలుగు జాతి ఆత్మగౌరవ రక్షణకు ఎన్టీఆర్ టీడీపీని స్థాపిస్తే, చంద్రబాబు తెలుగు వారి ఆత్మగౌరవాన్ని ఢిల్లీ పెద్దలకు తాకట్టు పెడుతున్నారని మంత్రి వేణుగోపాలకృష్ణ వ్యాఖ్యానించారు. గురువారం అమరావతి సచివాలయంలో మీడియాతో మంత్రి మాట్లాడుతూ... 'జగన్‌ను ఓడించడానికి చంద్రబాబు ఎవరి కాళ్లు అయినా పట్టుకుంటాడు. పేదలకు మంచి చేసే జగన్ అధికారంలోకి రాకూడదని జనసేనతో పొత్తు పెట్టుకున్న చంద్రబాబు ఇప్పుడు బీజేపీతో పొత్తుకు సిద్ధమౌతున్నారు' అని అన్నారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ... టీడీపీ, జనసేన అన్ని చోట్లా పోటీ చేసే దమ్ములేక కలిసి వెళ్తున్నాయన్నారు.

ఆలయాల సమాచారానికి ప్రత్యేక యాప్: కొట్టు

అమరావతి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాల్లో ఆన్‌లైన్ సేవలను అందుబాటులోకి తెస్తున్నామని దేవదాయ మంత్రి కొట్టు సత్యనారాయణ చెప్పారు. గురువారం అమరావతి సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, 'ఆలయాల్లో దర్శనం, పూజా కార్యక్రమాలు, వసతి సౌకర్యాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేందుకు సాఫ్ట్‌వేర్‌ను రూపొందిస్తున్నాం. ప్రత్యేక యాప్‌తో వాట్సాప్ ద్వారా ఆలయాల సమగ్ర సమాచారాన్ని ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నాం' అని చెప్పారు. ఆలయ ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంపు, పదోన్నతుల సందర్భంగా మంత్రిని పలు ఆలయాల ఉద్యోగులు సన్మానించారు.

రివర్స్ పాలనంటే ఇది కాదా?: పీడీఎఫ్

అమరావతి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఎవరు అధికారంలోకి వస్తే ఏది రాజధాని అవుతుందో తెలియని పరిస్థితి నెలకొందని పీడీఎఫ్ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు వ్యాఖ్యానించారు. గురువారం అమరావతి సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ రివర్స్ పాలనంటే ఇది కాదా అని ప్రశ్నించారు. ప్రజాసమస్యలపై మండలిలో మాట్లాడుతుంటే ప్రభుత్వం ఉక్కుపాదంతో అణిచివేస్తోందని ఇళ్ల ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రభుత్వోద్యోగుల భద్రతకు చర్యలు తీసుకోవాలి

అమరావతి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విశాఖపట్నం, అన్నమయ్య జిల్లాల్లో ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులను కొందరు దుర్మార్గులు అత్యంత పాశవికంగా హత్య చేశారని, ఇలాంటి అనాగరిక చర్యలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సచివాలయ విభాగాధికారుల సంఘం డిమాండ్ చేసింది. ప్రభుత్వ ఉద్యోగులకు తగిన భద్రత కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సంఘం అధ్యక్షుడు ఎం రంగస్వామి డిమాండ్ చేశారు.

పొగమంచు ఎఫెక్ట్.. విమానాలు గాలిలో చక్కర్లు

గన్నవరం, ఫిబ్రవరి 8: దట్టమైన పొగమంచు కారణంగా గన్నవరం విమానాశ్రయంలో పలు విమానాల రాకపోకలు ఆలస్యమయ్యాయి. రన్‌వేపై విజుబిలిటీ లేక దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అరగంటపాటు గాలిలోనే చక్కర్లు కొట్టాయి. ఢిల్లీ నుంచి వచ్చిన ఎయిరిండియా, హైదరాబాద్, చెన్నై నుంచి వచ్చిన ఇండిగో విమానాలు 30 నిమిషాలు ఆలస్యంగా ల్యాండ్ అయ్యాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

ఐసీడీఎస్, ఎండీఎం కమీషన్ 23.71 కోట్లు విడుదల

అమరావతి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలు, మధ్యాహ్న భోజన పథకానికి రేషన్ సరుకులు సరఫరా చేసిన డీలర్లకు చెల్లించాల్సిన బకాయిలు రూ.23.71 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు గురువారం సచివాలయంలో చెక్కును విడుదల చేశారు. కరోనా సమయంలో చనిపోయిన 53 మంది రేషన్ డీలర్లకు త్వరలోనే పరిహారం అందజేస్తామని చెప్పారు. కేరళ తరహాలో రేషన్ డీలర్ల కోసం సంక్షేమ నిధిని ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రేషన్ డీలర్ల కమీషన్‌ను పెంచే అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందన్నారు.

వచ్చే 14 నెలల్లో 30 ప్రయోగాలు

- గగన్‌యాన్ మిషన్‌లో 7 ..లాంచ్ మేనిఫెస్టోలో ఇన్-స్పేస్ వెల్లడి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో రాబోయే 14 నెలల్లో 30 అంతరిక్ష ప్రయోగాలు చేపట్టనుంది. 2023-24 ఆఖరి త్రైమాసికంతో పాటు వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రైవేటు స్టార్టప్‌లైన స్కైరూట్, అగ్నికుల్‌తో సహా 30 అంతరిక్ష ప్రయోగాలు నిర్వహించనున్నట్టు ఇన్-స్పేస్ గురువారం ప్రణాళికను విడుదల చేసింది. ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్ సెంటర్ (ఇన్-స్పేస్) ప్రకటించిన ఇంటిగ్రేటెడ్ లాంచ్ మేనిఫెస్టోలో గగన్‌యాన్‌కు సంబంధించిన ఏడు ప్రయోగాలు, ఇస్రో సరికొత్త రాకెట్ ఎస్ఎస్ఎల్వీ (స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికిల్), రెండు పీఎస్ఎల్వీ ప్రయోగాలు ఉన్నాయి. వాతావరణ పరిశీలన కోసం జీఎస్ఎల్వీ-ఎఫ్14 ద్వారా ఇన్‌శాట్-3డీఎస్ ఉపగ్రహాన్ని ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రయోగించనున్నారు. ఎస్ఎస్ఎల్వీ ప్రయోగం మార్చి నాటికి ఉంటుంది. 2024-25లో పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీలతో ఇస్రో మూడేసి ప్రయోగాలు చేపట్టనుంది. చెన్నైకి చెందిన అగ్నికుల్ కాస్మోస్.. ఈ ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో తన మొదటి త్రీడీ ప్రింటెడ్ రాకెట్ అగ్నిబాన్-సార్టెడ్‌ను ప్రయోగించనుంది. ఏరోస్పేస్ తన స్వదేశీ రాకెట్ విక్రమ్-1-1తో వచ్చే ఏడాది నాలుగు ప్రయోగాలు నిర్వహించనుంది.



జగన్ బాదుడు వీరలెవల్

- టీడీపీ కంటే వైసీపీ అప్పులే ఎక్కువ
- 365 రోజుల్లో 341 రోజులు ఆర్‌బీఐ నుంచి అప్పే
- కరెంటు విషయంలో జనాలను పీక్కుతినేది నిజమే
- ఉత్పత్తి తగ్గినా జీఎస్‌డీపీ ఎలా పెరుగుతోందో?
- రోడ్లు, ఆర్టీసీ బస్సులంటే జనాలు బెంబేలు
- గత ఐదేళ్ల కాలంలో ఆర్థిక వృద్ధిరేటు డీలా
- జగన్ వైఫల్యాలను బయటపెట్టిన కాగ్

గత ప్రభుత్వంతో పోల్చితే జగన్ సర్కారు చేస్తున్న అప్పులే ఎక్కువ అని 'కాగ్' తేల్చింది. తెచ్చిన అప్పుల్లో సింహభాగం అభివృద్ధి కోసమే నాటి చంద్రబాబు సర్కారు ఖర్చు చేసిందని కూడా స్పష్టం చేసింది. 2019లో చంద్రబాబు ప్రభుత్వం రూ.38,112 కోట్ల అప్పు తెచ్చి, అందులో రూ.21,819 కోట్లను అభివృద్ధి కోసం ఖర్చు పెట్టింది. 2023లో జగన్ ప్రభుత్వం రూ.67,985 కోట్ల అప్పులు తెచ్చి రూ.9,017 కోట్లను మాత్రమే అభివృద్ధి కార్యకలాపాలకు ఖర్చు చేసిందని కాగ్ స్పష్టంగా పేర్కొంది. రాష్ట్ర నిర్మాతలెవరో, వినాశకులెవరో ఈ గణాంకాలు చూస్తే తెలిసిపోతుంది.

కరెంటు బిల్లుల రూపంలో జగన్ సర్కార్ జనాలను పీక్కుతింటున్నది నిజమేనని కాగ్ తన గణాంకాల ద్వారా తేటతెల్లం చేసింది. కరెంటుపై పన్నులు, సుంకాల ద్వారా 2018-19లో చంద్రబాబు ప్రభుత్వం రూ.11 కోట్లు వసూలు చేయగా, 2022-23లో జగన్ ప్రభుత్వం రూ.4,243 కోట్లు వసూలు చేసింది. ఇవన్నీ జనాల జేబుల నుంచి ప్రభుత్వం అధికారికంగా లాక్కున్నవేనని కాగ్ నివేదిక చెప్తోంది.

అమరావతి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): "గత ప్రభుత్వం తీసుకున్న రుణాలతో పోల్చితే మేం చేసిన అప్పులు తక్కువ' అంటూ ప్రతిసారీ ప్రెస్‌మీట్ పెట్టి ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చెబుతుంటారు. ఓటాన్ అకౌంట్ బిల్లుపై చర్చలోనూ ఆయన అదే సెలవిచ్చారు. కానీ టీడీపీ హయాంతో పోల్చితే వైసీపీ సర్కారే ఎక్కువ అప్పులు చేసిందని స్వయంగా కాగ్ వెల్లడించింది. సీఎం జగన్ వైఫల్యాలను తన నివేదికలో సుస్పష్టంగా వివరించింది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆర్‌బీఐ నుంచి వేజ్ అండ్ మీన్స్, ఓడీ అప్పులు తేవడం మహాపాపమన్నట్టు జగన్ మాట్లాడారు. కానీ, ఆయన గద్దెనెక్కాక 2022-23లో ఏకంగా 166 రోజుల పాటు వేజ్ అండ్ మీన్స్‌లో, 23 రోజులు ఎస్‌డీఎల్‌లో, 152 రోజుల పాటు ఓడీలో ఉంది. వేజ్ అండ్ మీన్స్ అప్పు కింద రూ.1,18,039 కోట్లు, ఓడీ అప్పు కింద రూ.57,066 కోట్లు వాడారు. 365 రోజుల్లో 341 రోజుల పాటు ఆర్‌బీఐ నుంచి అప్పు తీసుకుంటూనే ఉన్నారు.

రూపాయి కోడికి పదిరూపాయల మసాలా!

అమ్మకాలు, వ్యాపారాల ద్వారా వచ్చే పన్ను భారీగా తగ్గిపోయింది. టీడీపీ హయాంలో చివరి ఏడాది 2018-19లో రూ.21,194 కోట్ల ఆదాయం రాగా, 2022-23లో ఇది రూ.18,004 కోట్లకు తగ్గిపోయింది. 2018-19లో రూ.21,194 కోట్ల ఆదాయం వసూలు చేయడానికి టీడీపీ ప్రభుత్వం రూ.321 కోట్లు ఖర్చు చేస్తే.. రూ.18,004 కోట్ల ఆదాయం వసూలు చేయడానికి వైసీపీ ప్రభుత్వం 396 కోట్లు ఖర్చు చేయడం వింతగా ఉంది. రూపాయి కోడికి 10 రూపాయల మసాలా ఖర్చు చేసిన చందం ఇది. అయినా, ఎంత ఖర్చు పెట్టినా ఆదాయం మాత్రం పెరగలేదు. కరెంటు బిల్లుల రూపంలో జగన్ సర్కార్ జనాలను పీక్కుతింటున్నది నిజమేనని కాగ్ తేటతెల్లం చేసింది. కరెంటుపై పన్నులు, సుంకాల ద్వారా 2018-19లో చంద్రబాబు ప్రభుత్వం రూ.11 కోట్లు వసూలు చేయగా, 2022-23లో జగన్ ప్రభుత్వం రూ.4,243 కోట్లు వసూలు చేసింది. ప్రజల బతుకుల్లో వెలుగులు నింపామన్న మంత్రి బుగ్గన దీనికేం సమాధానం చెప్తారు?

మద్యం అమ్మకాల్లో డిజిటల్ బంద్..

లిక్కర్ అమ్మకాల్లో పారదర్శకతకు పాతరవేస్తూ ఆన్‌లైన్, యూపీఐ చెల్లింపులు జగన్ సర్కారు నిలిపివేసింది. కేవలం డబ్బులిచ్చి కొనుక్కెళ్లమంటూ ప్రవేశ పెట్టిన విధానం వల్ల రూ.14,798 కోట్ల వసూలుకు రూ.132 కోట్లే ఖర్చయింది. యూపీఐ చార్జీలు, బ్యాంకు లావాదేవీల చార్జీలు, ఇతర ఫీజులు తప్పించుకుంది. దేశ సరిహద్దులు దాటి తీసుకొచ్చే సరుకులు, వస్తువులపై వేసే కస్టమ్స్ సుంకం కూడా 2019తో పోల్చితే 2023లో గణనీయంగా తగ్గిపోయింది. దీనర్థం విమాన సర్వీసులు తగ్గిపోయాయి. రాష్ట్రంలో పారిశ్రామిక వ్యవస్థ కుప్పకూలిపోయింది. 2019లో ఎక్సైజ్ డ్యూటీ ద్వారా ఖజానాకు రూ.1500 కోట్లు వస్తే 2023లో రూ.474 కోట్లే వచ్చింది. అంటే రాష్ట్రంలో పెద్దగా వస్తువులేమీ తయారుకావడం లేదు. ఎకనమిక్ సమ్మిట్ నిర్వహించాం... 13 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని డబ్బా కొట్టుకుంటున్న వైసీపీ సర్కార్ దీనికేం సమాధానం చెప్తుందో?

నిర్మాతలెవరో.. విధ్వంసకులెవరో..

జగన్ సర్కార్ టీడీపీ ప్రభుత్వం చేసిన అప్పుల కంటే ఎక్కువ అప్పులు చేసిందని కాగ్ గట్టిగా చెప్తోంది. 2019లో మంగళవారం తెచ్చే అప్పులు రూ.23,461 కోట్లుండగా, 2023లో అవి రూ.45,000 కోట్లకు పెరిగాయి. 2019లో చంద్రబాబు ప్రభుత్వం రూ.56,000 కోట్ల అప్పులకు గ్యారంటీ ఇస్తే, 2023 నాటికి ఈ గ్యారంటీ అప్పులు రూ.2,02,470 కోట్లకు పెరిగాయి. అలాగే, 2019లో చంద్రబాబు ప్రభుత్వం రూ.38,112 కోట్ల అప్పు తెచ్చి, అందులో రూ.21,819 కోట్లను అభివృద్ధి కోసం ఖర్చు పెట్టింది. 2023లో జగన్ ప్రభుత్వం రూ.67,985 కోట్ల అప్పులు తెచ్చి అందులో రూ.9,017 కోట్లే అభివృద్ధికి ఖర్చు చేసిందని కాగ్ స్పష్టంగా పేర్కొంది. రాష్ట్ర నిర్మాతలెవరో, వినాశకులెవరో ఈ గణాంకాలు చూస్తే తెలిసిపోతుంది.

అప్పుల కోసం పెంచేసిన వృద్ధి!

జగన్ ప్రభుత్వం వచ్చాక రాష్ట్ర ఆర్థిక వృద్ధిరేటు డీలా పడిందని కాగ్ గణాంకాలు చూస్తే అర్థమవుతోంది. 2019లో రాష్ట్రవృద్ధిరేటు 16 శాతంఉండగా, 2023లో 10 శాతమే ఉందని స్పష్టం చేసింది. వృద్ధిరేటు తగ్గినా, సేవారంగం భూస్థాపితమైనా, పారిశ్రామికరంగం పడకేసినా సరే రాష్ట్ర జీఎస్‌డీపీ మాత్రం రూ.14 లక్షల కోట్లకు చేరుకోవడం అనుమానాస్పద అంశమే. ఎఫ్ఆర్‌బీఎం చట్టం ప్రకారం రాష్ట్ర జీఎస్‌డీపీలో 3.5 శాతాన్ని అప్పులు తెచ్చుకునేందుకు అనుమతిగా ఇస్తుంది కేంద్రం. ఈ అప్పుల కోసమే కేవలం పేపర్‌పై మాత్రమే జీఎస్‌డీపీని పెంచిచూపిస్తూ, రాష్ట్ర సామర్థ్యానికి మించి అప్పులు తెచ్చి రాష్ట్రాన్ని నాశనం చేస్తోంది వైసీపీ ప్రభుత్వం. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ జగన్ హయాంలో పతనమైన తీరును కాగ్ తన నివేదికలో సవివరంగా పొందుపరించింది. ఇప్పుడు బుగ్గన, దువ్వూరి కృష్ణ ప్రెస్‌మీట్లు పెట్టి కాగ్ నివేదికను, ఆ సంస్థను ఖండించగలరా?

2023 నాటికే రూ.6.23 లక్షల కోట్ల అప్పులు

- కార్పొరేషన్ అప్పులు అదనం: కాగ్
- మొత్తం అప్పులు 11.23 లక్షల కోట్లు

ప్రతిపక్షాలు, మీడియా ఆరోపిస్తున్నట్టు రాష్ట్ర అప్పు రూ.10 లక్షల కోట్లు దాటలేదని ఆర్థిక మంత్రి బుగ్గన, సీఎం స్పెషల్ సెక్రటరీ దువ్వూరి కృష్ణ బుకాయిస్తూ ఉంటారు. కానీ, 2023 నాటికే రాష్ట్ర అప్పులు రూ.6.23 లక్షల కోట్లని కాగ్ నివేదికలో స్పష్టంగా ఉంది. అదే కాగ్ ప్రతి నెలా ఇచ్చే నివేదికలో తమకు జగన్ సర్కార్ కార్పొరేషన్ల అప్పుల వివరాలు, వాటికిచ్చిన గ్యారంటీల వివరాలు చెప్పడం లేదని ఐదేళ్ల నుంచి రాస్తోంది. అంటే ఆ రూ.6.23 లక్షల కోట్ల అప్పులకు కార్పొరేషన్ల అప్పులు కలపాలని చెబుతోంది. ఆ అప్పులు రూ.2 లక్షల కోట్లుంటాయని అంచనా. ఇది ఏడాది క్రితం అప్పు. ఈ ఏడాదిలో రూ.లక్ష కోట్లకు పైనే జగన్ అప్పు తెచ్చారు. అంటే ఆ 6.23 లక్షల కోట్లకు ఈ రూ.3 లక్షల కోట్లు కలిపితే మొత్తం అప్పు రూ.9.23 లక్షల కోట్లకు చేరుతుంది. పెండింగ్ బిల్లులు రూ.2 లక్షల కోట్ల వరకు ఉన్నాయి. ఇవి కూడా కలిపితే మొత్తం అప్పు రూ.11.23 లక్షల కోట్లకు చేరుతుంది. రాష్ట్ర జీఎస్‌డీపీ రూ.14 లక్షల కోట్లలో ఈ అప్పుల వాటా దాదాపు 78.6 శాతం. ఎఫ్ఆర్‌బీఎం చట్టం ప్రకారం 35 శాతానికి మించకూడదనేది గమనార్హం.

పోటీలో టీడీపీ..!

- రాజ్యసభ ఎన్నికల పత్రాలు సిద్ధం చేసిన పార్టీ

అమరావతి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సీటుకు పోటీ చేయడానికి అవసరమైన పత్రాలను తెలుగుదేశం పార్టీ సిద్ధం చేసుకొంది. ఈ పోటీకి ఎవరైనా నామినేషన్ వేయాలంటే నిర్ణీత సంఖ్యలో ఎమ్మెల్యేలు వారి అభ్యర్థిత్వానికి మద్దతుగా సంతకాలు చేయాల్సి ఉంటుంది. ఆ సంతకాలను టీడీపీ కార్యాలయం తమ ఎమ్మెల్యేల నుంచి సేకరించి ఉంచుకొంది. గురువారం అసెంబ్లీ సమావేశాలు ముగిశాయి. ఎమ్మెల్యేలు ఎవరి జిల్లాలకు వారు వెళ్లిపోతున్నారు. మళ్లీ వారిని ప్రత్యేకంగా పిలిపించడం ఎందుకన్న భావంతో గురువారమే సంతకాలు తీసుకొన్నారు. ఈ ఎన్నికల్లో పార్టీ పోటీ చేస్తుందో లేదో ఇంకా తెలియదని, ముందు జాగ్రత్తగా సంతకాలు సేకరించి ఉంచుకొన్నామని టీడీపీ శాసనసభాపక్ష కార్యాలయ సిబ్బంది తెలిపారు. శాసనసభ గురువారం ఉదయం ప్రారంభం అయ్యే సమయానికి అధికార పక్ష సభ్యులు చాలినంత మంది లేరు. దీన్ని గమనించిన టీడీపీ ఎమ్మెల్యేలు అభ్యంతరం పెట్టారు. దీంతో అధికార పక్షం హడావుడి పడింది. అందరికీ ఫోన్లు చేయడం మొదలు పెట్టింది. అయినా కోరంకు సరిపోను రావడానికి పావుగంట పట్టింది. ఈలోపు టీడీఎల్పీ ఉప నేత అచ్చెన్నాయుడు లోపలికి వెళ్ళే ద్వారం వద్ద నిలబడి ఆయన ఫోన్లో వీడియో తీశారు. 'ఇప్పుడు సమయం ఉదయం తొమ్మిది గంటల పది నిమిషాలు. స్పీకర్ కుర్చీపైన గడియారంలో ఇదే సమయం కనిపిస్తోంది. ఇంతవరకూ అధికార పక్ష ఎమ్మెల్యేలు రాలేదు. సభ ప్రారంభం కాలేదు. ఇదీ వైసీపీ పరిస్థితి' అని ఆ వీడియోలో వ్యాఖ్యానించారు. దానిని ఎక్స్‌లో పోస్టు చేశారు.

టీడీఎల్పీకి వచ్చిన కాపు రామచంద్రారెడ్డి

టికెట్టు లభించని వైసీపీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి గురువారం టీడీఎల్పీ కార్యాలయానికి వచ్చారు. ఆయన అక్కడ అడుగు పెట్టడం ఇదే ప్రథమం. అచ్చెన్నాయుడిని పలకరించడానికి వచ్చి కొద్దిసేపు కూర్చున్నారు. టీడీపీ ఎమ్మెల్యేలను ఆప్యాయంగా పలకరించారు. 'నాకు అన్యాయం జరిగింది. పైన భగవంతుడు ఉన్నాడు. పన్నెండేళ్లపాటు పార్టీకి సేవ చేశాను' అని విలేకరులతో అన్నారు.

హడావుడిగా పదోన్నతులు

- దేవదాయ శాఖలో అర్ధరాత్రి డీసీ పదోన్నతుల ఆర్డర్లు

అమరావతి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖలో అక్రమ పదోన్నతులకు బ్రేక్ పడడం లేదు. ఆ శాఖ మంత్రి, ఉన్నతాధికారులు.. కొందరు అసిస్టెంట్ కమిషనర్ల(ఏసీలు)కు డిప్యూటీ కమిషనర్లు (డీసీలు)గా పదోన్నతులు కల్పించారు. బుధవారం అర్ధరాత్రి ఆర్డర్లు జారీ చేసి, గురువారం ఉదయమే కొత్త స్థానాల్లో జాయిన్ కావాలని ఆదేశించారు. పదోన్నతుల ఆర్డర్లు కూడా బయటకు రానివ్వకుండా ఏసీలకు వ్యక్తిగతంగా పంపించి, ఫోన్‌లో సమాచారం అందించారు. వారు హడావుడిగా గురువారం ఉదయం కొత్త స్థానాల్లో చేరిపోయారు. డీసీ పదోన్నతుల్లో సీనియారిటీతో పాటు నిబంధనలకు లోబడి పదోన్నతులు కల్పించాలని హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినా.. నిబంధనలు పూర్తిగా పక్కన పెట్టి చీకటి పదోన్నతులు కల్పించేశారు. డీసీ పదోన్నతుల ఆర్డర్లలో.. పండుగలు ఎక్కువగా ఉండడం, భూ సమస్యల పరిష్కారం కోసమే పదోన్నతులు కల్పించినట్లు పేర్కొన్నారు. శాఖలో అనధికారికంగా పని చేస్తున్న ఒక కీలక అధికారి కనుసన్నల్లోనే ఈ ప్రక్రియ నడిచిందన్న విమర్శలు వస్తున్నాయి. మంత్రి అండదండలతోనే సదరు అధికారి ఇష్టారాజ్యంగా చేస్తున్నారు. పదోన్నతులు ఇవ్వడానికి లక్షల రూపాయలు వసూళ్లు చేసినట్లు తెలుస్తోంది. పదోన్నతుల విషయంపై కొందరు ఏసీలు కోర్టును ఆశ్రయించారు.

ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తానని

హామీ ఇచ్చి విస్మరించిన మోదీ

- న్యూఢిల్లీలో జరిగిన ముఖ్యమంత్రుల సమావేశంలో విద్యార్థి, యువజన జేఏసీ ఆందోళన


ఢిల్లీలో కేరళ సీఎం పినరయి విజయన్‌కు వినతి పత్రం అందిస్తున్న జేఏసీ నాయకులు జిలానీ, బీవీ రెడ్డి

గుంటూరు, ఫిబ్రవరి 8: ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తానని 2014 ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన మోదీ అధికారంలోకి వచ్చాక విస్మరించారని ప్రత్యేక హోదా సాధన విద్యార్థి, యువజన జేఏసీ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు షేక్ జిలాని, బి.వెంకటేశ్వర రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీ నిరంకుశ వైఖరికి వ్యతిరేకంగా ప్రత్యేక హోదా సాధన విద్యార్థి, యువజన జేఏసీలు గురువారం ఢిల్లీ జంతర్ మంతర్‌లో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా తలపెట్టిన ముఖ్యమంత్రుల సమావేశంలో కేరళ ముఖ్యమంత్రి పిన్నరయి విజయన్, సీపీఐ జాతీయ కార్యదర్శి డి రాజా, సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరిలు ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేహోదా విషయంలో మద్దతు ఇవ్వాలని వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జిలాని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దక్షిణాది రాష్ట్రాలపై నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తుందన్నారు. వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ నిరుద్యోగ యువత, ప్రజలంతా ఆగ్రహజ్వాలతో కేంద్రంలో మోదీని, ఆంధ్రాలో జగన్‌ను తరిమికొట్టడానికి సిద్ధంగా ఉన్నారని తెలియజేశారు.

దగా డీఎస్సీకి నిరసనగా చలో అసెంబ్లీ

- విజయవాడలో విద్యార్థి సంఘ నేతల అరెస్టు

విజయవాడ, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వస్తే మెగా డీఎస్సీ తీస్తామని హామీ ఇచ్చి.. ఐదేళ్లు అధికారం అనుభవించి.. ఇప్పుడు ఎన్నికల ముందు మినీ డీఎస్సీతో తమ భవిష్యత్తును అంధకారంలోకి నెట్టారంటూ నిరుద్యోగులు జగన్ సర్కారుపై కన్నెర్ర చేశారు. కేవలం 6 వేల ఉపాధ్యాయుల పోస్టులకే నోటిఫికేషన్ ఇవ్వడంతో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో.. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన విద్యార్థులు గురువారం చలో అసెంబ్లీకి పిలుపునిచ్చారు. దీంతో పోలీసులు విజయవాడతోపాటు ప్రవేశ మార్గాల్లో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. తెల్లవారుజాము నుంచే విజయవాడ నగరాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద నుంచి చలో అసెంబ్లీకి బయలుదేరిన ఏఐఎస్ఎఫ్ నేతలను, విద్యార్థులను పోలీసులు అక్కడే అడ్డుకున్నారు. రైల్వేస్టేషన్, పాత ప్రభుత్వాసుపత్రి వీధుల నుంచి యువకులు పరుగులు తీసుకుంటూ తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్దకు రాగా, వారిని పోలీసులు అరెస్టు చేసి వాహనాల్లో స్టేషనుకు తరలించారు.



మెగా డీఎస్సీ కోసం విజయవాడలో ఆందోళన చేస్తున్న నిరుద్యోగులను అదుపులోకి తీసుకుని తరలిస్తున్న పోలీసులు

డ్యాం పరిశీలించిన ఎన్‌డీఎస్‌ఏ బృందం

శ్రీశైలం ఆనకట్టను ఎన్‌డీఎస్‌ఏ(నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ) చైర్మన్ వివేక్ త్రిపాఠి నేతృత్వంలోని నిపుణుల బృందం గురువారం పరిశీలించింది. కేఆర్ఎంబీ సభ్యులతో కలిసి డ్యాం భద్రత, నిర్వహణ, నీటి నిల్వలు, వినియోగం తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రాజెక్టు ఇంజనీర్లతో సమీక్ష నిర్వహించారు. జలవనరుల శాఖ ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రాజెక్ట్స్ సీఈ కబీర్ బాషా, శ్రీశైలం ప్రాజెక్టు ఎస్ఈ శ్రీరామచంద్రమూర్తి డ్యాం భద్రత, నిర్వహణ వివరాలను బృందానికి వివరించారు.



అధ్యయనాలే తప్ప.. ఆచరణ లేదు!

- శ్రీశైలం డ్యాం భద్రతపై దోబూచులాట
- తక్షణ చర్యలపై పాలకుల్లో లోపించిన చిత్తశుద్ధి

(కర్నూలు-ఆంధ్రజ్యోతి)

సాగునీటి ప్రాజెక్టులు ఆధునిక దేవాలయాలు. పది కాలాలు మెట్ట పొలాలను తడిపి కష్టజీవుల సేవలో తరించాలంటే వాటిని 'జాతీయ సంపద'గా గుర్తించి కాపాడుకోవాలి. బహుళార్థసాధక ప్రాజెక్టుగా కర్నూలు జిల్లాలో కృష్ణా నదిపై శ్రీశైలం ప్రాజెక్టును నిర్మించారు. తెలుగు రాష్ట్రాల జీవనాడి.. రాయలసీమ కరువు రైతుల ప్రాణాధారం ఈ ప్రాజెక్టు. 2009లో 25.5 లక్షల క్యూసెక్కులకు పైగా వరద చేరి డ్యాం పైనుంచి ప్రవహించడంతో ప్రాజెక్టు భద్రత, నిర్వహణ లోపాలపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. 2014 సెప్టెంబరు 23న దేశ రాజధాని ఢిల్లీలో కేంద్ర జలవనరుల మంత్రిత్వ శాఖ సమీక్ష నిర్వహించింది. అధ్యయనానికి నాటి ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్(ఈఎన్‌సీ) ఎం.వెంకటేశ్వరరావు అధ్యక్షతన 8మంది నిపుణులతో కమిటీ ఏర్పాటైంది. నాటినుంచి డ్యాం భద్రతపై పలు నిపుణుల కమిటీలు అధ్యయనం చేయడం.. నివేదికలు ఇవ్వడం పరిపాటిగా మారింది. అయితే, తీసుకున్న చర్యలు మాత్రం శూన్యమనే చెప్పాలి. డ్రిప్-2 కింద రూ.139కోట్ల నిధులు మంజూరు చేయాలని ఇంజనీర్లు ప్రతిపాదనలు పంపితే ప్రపంచ బ్యాంక్ కొర్రీలు పెట్టి వెనక్కి పంపారే తప్ప నిధులు ఇవ్వలేదు. ప్లంజ్‌పూల్, భద్రత, నిర్వహణ సమస్యలు వెంటాడుతున్నా.. తక్షణ చర్యలపై పాలకుల్లో చిత్తశుద్ధి కనిపించడం లేదు.

నిర్మాణానికి 20 ఏళ్లు..

ఉమ్మడి రాష్ట్రంలో శ్రీశైలం దేవస్థానం దగ్గర కృష్ణానదిపై 1963 జూలై 24న 'శ్రీశైలం ప్రాజెక్టు' నిర్మాణానికి అప్పటి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ పునాది రాయి వేశారు. ప్రాజెక్టు నిర్మాణం పూర్తవడానికి 20ఏళ్లు పట్టింది. డ్యాం గరిష్ఠ నీటి మట్టం 885 అడుగులు. గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 308.04 టీఎంసీలు. వరద ప్రవాహ సామర్థ్యం (ఫ్లడ్ వాటర్ డిశ్చార్జ్ కెపాసిటీ) 13.20 లక్షల క్యూసెక్కులు. డ్యాంలోకి ఏటేటా పూడిక చేరడంతో గరిష్ఠ నీటినిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలుగా 2011లో నిర్ధారించారు. అంటే 92.24 టీఎంసీల మేర పూడిక చేరింది. 2009 అక్టోబరులో డ్యాంకు 25.5 లక్షల క్యూసెక్కుల వరద చేరడంతో ప్లంజ్‌పూల్ గుంత వల్ల డ్యాం భద్రతకు ఎలాంటి ముప్పు పొంచి ఉంది? మళ్లీ అంత వరద వస్తే డ్యాం తట్టుకోగలదా? డ్యాం ఆనకట్ట సహా కుడి, ఎడమ గట్లు ఏమేరకు దెబ్బతిన్నాయి? తదితర ప్రశ్నలు తలెత్తాయి. 2014 సెప్టెంబరు 23న ఢిల్లీలో కేంద్ర జలవనరుల శాఖ శ్రీశైలం సహా వివిధ ప్రధాన ప్రాజెక్టుల భద్రత, నిర్వహణ లోపాలపై సమీక్షించింది. ఢిల్లీలో 2014 సెప్టెంబరు 23న జరిగిన ప్రాజెక్టు సమీక్షలో శ్రీశైలం ప్రాజెక్టు భద్రత, నిర్వహణ లోపాలపై అధ్యయనానికి నాటి ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు చైర్మన్‌గా ఏర్పాటైన కమిటీ అక్టోబరు 28న ప్రాజెక్టును పరిశీలించి పలు సూచనలు చేస్తూ నివేదిక ఇచ్చింది. 2017 జూలై 13న కేంద్ర జలసంఘం మాజీ చైర్మన్ డాక్టర్ వైకే మూర్తి నేతృత్వంలోని నిపుణుల కమిటీ, 2018 జూన్ 11, 12న రిటైర్డ్ ఈఎన్‌సీ పి.రామరాజు, రిటైర్డ్ సీఈ కె.సత్యనారాయణ, రిటైర్డ్ ఈఈ కె.కృష్ణ కమిటీ ఈ ప్రాజెక్టును పరిశీలించి, పలు సూచనలు చేస్తూ నివేదికలు ఇచ్చాయి. 2020 ఫిబ్రవరి 25న కేంద్ర జలసంఘం మాజీ చైర్మన్, డ్యాం భద్రతా నిపుణులు ఏబీ పాండ్యా చైర్మన్‌గా పది మంది సభ్యులతో కేంద్ర కమిటీ డ్యాంను పరిశీలించి.. నివేదికలను అధ్యయనం చేసి 2021లో కేంద్ర జలసంఘంకు అధ్యయన రిపోర్టులను ఇచ్చి డ్యాం భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేసింది. తాజాగా గురువారం ఎన్‌డీఎస్ఏ చైర్మన్ వివేక్ త్రిపాఠి ఆధ్వర్యంలో నిపుణుల బృందం పరిశీలించింది.

కమిటీలు చేసిన సూచనలు ఇవీ..

- డ్యాం గరిష్ఠ నీటిమట్టం (ఎండబ్ల్యూఎల్) 890 అడుగులు. ప్రాబబుల్ మ్యాగ్జిమమ్ ఫ్లడ్(పీఎంఎఫ్) 26.50 లక్షల క్యూసెక్కులుగా అంచనా వేస్తే.. 2009లో పీఎంఎఫ్‌కు దగ్గరగా వరద వచ్చింది. డ్యాం భద్రతలో రాజీ పడకుండా ప్రాబబుల్ మ్యాగ్జిమమ్ ఫ్లడ్ నిర్వహణకు స్పిల్‌వే సామర్థ్యాన్ని పెంచాలి. శ్రీశైలం డ్యాం 5 కిలోమీటర్లు ఎగువ భాగంలో అదనపు స్పిల్‌వే నిర్మాణం, అవసరమైతే గండి కొట్టేందుకు బ్రీచింగ్ సెక్షన్ ఉండేలా నిర్మించాలని సూచించింది.
- డ్యాం భద్రత దృష్ట్యా కృష్ణా బేసిన్ నుంచి కొంత వరదను కుందూ వంటి సమీప బేసిన్‌కు మళ్లించవచ్చు. శ్రీశైలం ఉపరితలంలో కుడివైపున(రైట్ బ్యాంక్) పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా చెన్నైకు తాగునీరు, తెలుగుగంగ, ఎస్ఆర్‌బీసీ ప్రాజెక్టులకు కొంత వరద, అదే విధంగా ఎడమ వైపున కూడా వరద మళ్లించడానికి అనువైన ప్రాంతం కోసం అధ్యయనం చేయాలి.
- కేంద్ర జలసంఘం, ఐఎండీల వద్ద ఆధునిక వ్యవస్థల ద్వారా డ్యాంలో చేరే వరదను ఎప్పటికప్పుడు అంచనా వేసి వచ్చే వరదను బట్టి జలాశయంలో ఉన్న నీటిని ముందుగా ఖాళీ చేయడం ఒక మార్గం.
- ప్రస్తుత స్పిల్‌వేకు ఎక్కువ ఎత్తులో రేడియల్ క్రస్ట్ గేట్లు ఉండేలా మార్పు చేయాలి. ప్రస్తుత స్పిల్‌వే క్రస్ట్ లెవల్ తగ్గించే విషయాలను పరిశీలించాలి. దీని వల్ల ప్రాజెక్టు ప్రయోజనాలపై పడే ప్రభావాన్ని పరిశీలించాలి.
- డ్యాంను ప్రస్తుత గరిష్ఠ నీటి మట్టం(ఎండబ్ల్యూఎల్)కు తగ్గట్టుగా ఎత్తు పెంచితే.. ఎగువన పలు గ్రామాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉంది. ఆ విషయాలను పరిగణలోకి తీసుకోవాలని పాండ్యా కమిటీ సూచించింది.

ముప్పుగా మారిన ప్లంజ్‌పూల్ గుంత!

శ్రీశైలం ఆనకట్ట స్పిల్‌వే గేట్ల నుంచి అతి వేగంగా కింద పడే వరద మళ్లీ ఎగిరి పడే ప్రాంతం(ప్లంజ్‌పూల్)లో భారీ గుంత ఏర్పడింది. దీనిపై పలు కమిటీలు అధ్యయనం చేశాయి. దీనివల్ల డ్యాం భద్రతకు, ప్రాజెక్టు రెండువైపుల ఉన్న గట్లు, ఆనకట్ట పునాదిపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఇప్పటికే నష్టం జరిగిన ప్రొటెక్షన్ సిలిండర్స్ రిహాబిలిటేషన్‌పై తక్షణ చర్యలు తీసుకోవాలి. ప్లంజ్‌పూల్ కుడి, ఎడమగట్లకు నష్టం జరగకుండా మరమ్మతులు చేపట్టాలి. డ్యాం 490 అడుగుల గ్యాలరీలో పెద్ద ఎత్తున సీపేజ్ ఉంది. పలుచోట్ల మెట్లు, నేల దెబ్బతిన్నాయి. వీటికి తక్షణ మరమ్మతులు, సీపేజీ నీటిని గ్యాలరీ కాలువకు మళ్లించేలా చర్యలు చేపట్టాలి.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● శుక్రవారం 9 ఫిబ్రవరి 2024
diksuchi@andhrajyothy.com

గ్వాలియర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్(ఐఐటీటీఎం)- బీబీఏ(టూరిజం అండ్ ట్రావెల్), ఎంబీఏ(టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ సహకారంతో ఈ ప్రోగ్రామ్‌లను నిర్వహిస్తున్నారు. వీటిని స్పెసిఫిక్ అండ్ జనరిక్ బిజినెస్ మాడ్యూల్స్, ఇండస్ట్రీ ప్రాక్టీసెస్, అకడమిక్ డెవలప్‌మెంట్స్, టూరిజం అండ్ బిజినెస్ స్టడీస్ తదితర అంశాలతో రూపొందించారు. ప్రోగ్రామ్‌లో భాగంగా సమ్మర్ ఇంటర్న్‌షిప్‌లు, స్టడీ టూర్లు ఉంటాయి. నెల్లూరు సహా గ్వాలియర్, భువనేశ్వర్, నోయిడా, గోవా క్యాంపస్‌లు అందుబాటులో ఉన్నాయి. గోవాలో ఎంబీఏ ప్రోగ్రామ్ మాత్రమే ఉంది. ఐఐటీటీఎం నిర్వహించే అడ్మిషన్ టెస్ట్(ఐఐఏటీ) లేదా నిర్దేశిత జాతీయ పరీక్ష స్కోర్, గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్‌లో బీబీఏ, ఎంబీఏ



బీబీఏ(టూరిజం అండ్ ట్రావెల్)

ఈ ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. మొత్తం 375 సీట్లు ఉన్నాయి. నెల్లూరు క్యాంపస్‌లో 75, గ్వాలియర్ క్యాంపస్‌లో 112, భువనేశ్వర్ క్యాంపస్‌లో 75, నోయిడా క్యాంపస్‌లో 113 సీట్లు ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్‌లు వర్తిస్తాయి. సీయూఈటీ 2023 స్కోర్ ఉన్నవారు ఐఐఏటీ 2024 రాయనవసరం లేదు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఏదేని గ్రూప్‌తో ఇంటర్/10+2/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు.

ఎంబీఏ (టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్)

ఇది రెండేళ్ల వ్యవధిగల ఫుల్ టైం మాస్టర్స్ డిగ్రీ ప్రోగ్రామ్. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ప్రస్తుత పరిస్థితుల్లో టూరిజం, ట్రావెల్ మేనేజ్‌మెంట్‌కు అవసరమైన అంశాలను దృష్టిలో ఉంచుకొని ఈ కోర్సుని రూపొందించారు. ఎకనామిక్స్, మేనేజ్‌మెంట్ వంటి కోర్ సబ్జెక్టులతోపాటు స్పెషలైజేషన్ సబ్జెక్టులు చదవాల్సి ఉంటుంది. అభ్యర్థులు వారి ఆసక్తి మేరకు టూర్ గైడింగ్, ఈవెంట్ మేనేజ్‌మెంట్, అడ్వెంచర్ టూరిజం, సప్లయ్ చెయిన్ అండ్ లాజిస్టిక్స్ స్పెషలైజేషన్‌లు ఎంచుకోవచ్చు. చివరి సెమిస్టర్లో ఆన్ జాబ్ ట్రెయినింగ్ ఉంటుంది.

సీట్లు: మొత్తం 750 సీట్లు ఉన్నాయి. నెల్లూరు క్యాంపస్‌లో 75, గ్వాలియర్ క్యాంపస్‌లో 334, భువనేశ్వర్ క్యాంపస్‌లో 112, నోయిడా క్యాంపస్‌లో 189, గోవా క్యాంపస్‌లో 40 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసే అభ్యర్థులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరు 2024 సెప్టెంబరు 30 నాటికి సర్టిఫికెట్‌లు, మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. మ్యాట్/క్యాట్/సీమ్యాట్/ఎక్స్‌ఏటీ/జీమ్యాట్/ఏటీఎంఏ/సీయూఈటీ వంటి జాతీయ పరీక్షల్లో ఒకటి రాసి అర్హత పొందిన అభ్యర్థులు సంస్థ నిర్వహించే అడ్మిషన్ టెస్ట్ రాయనవసరం లేదు. స్కోర్ కార్డ్ వ్యాలిడిటీ 2023 జూన్ 1 నుంచి 2024 మే 31 మధ్య ఉండాలి.

ఐఐఏటీ 2024 వివరాలు

- ఈ టెస్ట్‌ని ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. ఇందులో మొత్తం వంద మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. జనరల్ అవేర్‌నెస్ నుంచి 50, వెర్బల్ ఎబిలిటీ నుంచి 25, క్వాంటిటేటివ్ ఎబిలిటీ నుంచి 25 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 100. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం రెండు గంటలు.
- ఈ పరీక్షలో సాధించిన మెరిట్ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలకు పిలుస్తారు. అడ్మిషన్ టెస్ట్/జాతీయ పరీక్ష స్కోర్‌కు 70 శాతం, గ్రూప్ డిస్కషన్‌కు 15 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూకి 15 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు. తరవాత డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 5
- **ఐఐఏటీ 2024 తేదీ:** జూన్ 9
- **గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూలు:** జూన్ 11, 12
- **ఎంపికైన అభ్యర్థుల మెరిట్ జాబితా విడుదల:** జూన్ 15
- **అడ్మిషన్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** జూన్ 30
- **అకడమిక్ సెషన్స్ ప్రారంభం:** జూలై 15 నుంచి
- **వెబ్‌సైట్:** www.iittm.ac.in

హైదరాబాద్ నార్మ్‌లో పీజీడీఎం

హైదరాబాద్-రాజేంద్రనగర్‌లోని ఐకార్-నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్(నార్మ్)- 'పీజీ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్(అగ్రి-బిజినెస్ మేనేజ్‌మెంట్)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు.
మొత్తం 66 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి నాలుగేళ్ల డిగ్రీ(అగ్రికల్చర్/అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్/కమర్షియల్ అగ్రికల్చర్/అగ్రికల్చరల్ మార్కెటింగ్ అండ్ కోఆపరేషన్/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్/అగ్రికల్చరల్ బయోటెక్నాలజీ/డెయిరీ సైన్స్/ఫిషరీస్/ఫుడ్ టెక్నాలజీ/ఫుడ్ ప్రాసెస్ ఇంజనీరింగ్/ఫారెస్ట్రీ/హార్టికల్చర్/సెరీకల్చర్/వెటర్నరీ సైన్సెస్/హోం సైన్స్/కమ్యూనిటీ సైన్స్/అగ్రికల్చరల్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) ఉత్తీర్ణులై ఉండాలి. పదోతరగతి నుంచి డిగ్రీ స్థాయి వరకూ ప్రథమశ్రేణి మార్కులు ఉండాలి. క్యాట్ 2023/సీమ్యాట్ 2024 స్కోర్ తప్పనిసరి.


ఎంపిక: ఇందులో భాగంగా అనలిటికల్ రైటింగ్ స్కిల్ టెస్ట్ నిర్వహిస్తారు. ఈ పరీక్షలో అభ్యర్థులు ఇచ్చిన అంశంపై ఇంగ్లీష్‌లో వ్యాసం రాయాల్సి ఉంటుంది. ఇరవై నిమిషాల సమయం ఇస్తారు. తరవాత గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. క్యాట్ 2023/సీమ్యాట్ 2024 స్కోర్ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి సీటుకు అయిదుగురిని ఇంటర్వ్యూకి అనుమతిస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.2,000; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 29
- **వెబ్‌సైట్:** naarm.org.in

సంబల్‌పూర్ ఐఐఎంలో పీహెచ్‌డీ

రిమైండర్

సంబల్‌పూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇది నాలుగేళ్ల వ్యవధిగల ఫుల్ టైం రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. దీనిని గరిష్ఠంగా ఆరేళ్లలో పూర్తిచేయాలి. స్టయిపెండ్ సౌకర్యం ఉంది. జాతీయ పరీక్ష స్కోర్/రీసెర్చ్ ఆప్టిట్యూడ్ టెస్ట్ స్కోర్, అకడమిక్ ప్రతిభ, పర్సనల్ ఇంటర్వ్యూ, అనుభవం, స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.



స్పెషలైజేషన్‌లు: ఆర్గనైజేషనల్ బిహేవియర్ అండ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, ఎకనామిక్స్, పాలసీ అండ్ స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్, ఇన్ఫర్మేషన్ సిస్టం మేనేజ్‌మెంట్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని మాస్టర్స్ డిగ్రీ/అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్ డిగ్రీ లేదా ఐఐటీలు/ఐఐఎం సంస్థల నుంచి రెండేళ్ల పీజీ డిప్లొమా పూర్తిచేసి ఉండాలి. డిగ్రీతోపాటు సీఏ/ఐసీడబ్ల్యుఏఐ/సీఎస్ ఉత్తీర్ణులు; కనీసం 6.5 సీజీపీఏతో బీఈ/బీటెక్/బీఆర్క్/బీఎస్సీ ఇంజనీరింగ్ ఉత్తీర్ణులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. డిగ్రీ స్థాయి నుంచి పీజీ వరకు ప్రథమ శ్రేణి మార్కులు ఉండాలి. పీజీ చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారూ అర్హులే. వీరు 2024 జూన్ 30 నాటికి మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాలి. పార్ట్ టైం కోర్సులు, ఈవెనింగ్ కోర్సులు, డిస్టెన్స్ ప్రోగ్రామ్‌లు చేసినవారు దరఖాస్తుకు అనర్హులు. క్యాట్ (2021/2022/2023) లేదా జీఆర్‌ఈ/గేట్/జీమ్యాట్/జేఆర్‌ఎఫ్(యూజీసీ/సీఎస్‌ఐఆర్) వ్యాలిడ్ స్కోర్ ఉండాలి. లేని పక్షంలో సంస్థ నిర్వహించే రీసెర్చ్ ఆప్టిట్యూడ్ టెస్ట్ రాయాల్సి ఉంటుంది. అభ్యర్థుల వయసు 2024 జూన్ 1 నాటికి 40 ఏళ్లు మించకూడదు.

స్టయిపెండ్: ట్యూషన్, కంప్యూటర్, లైబ్రరీ, మెడికల్ ఇన్సూరెన్స్, అలూమ్నీ తదితర ఫీజుల నిమిత్తం కాంప్రహెన్సివ్ ఫెలోషిప్ ఇస్తారు. దీనితోపాటు మొదటి రెండేళ్లు నెలకు రూ.35,000; చివరి రెండేళ్లు నెలకు రూ.40,000 చొప్పున సబ్సిస్టెన్స్ అలవెన్స్ ఇస్తారు.

- ఐఐఎం సంస్థల నుంచి రెండు/మూడేళ్ల వ్యవధి గల ఫుల్ టైం పీజీడీఎం/పీజీపీ ఉత్తీర్ణులకు; ఐఐటీలు/ఢిల్లీ ఎఫ్‌ఎంఎస్ సంస్థల నుంచి ఎంబీఏ పూర్తిచేసినవారికి; ఎంబీఏ/పీజీడీఎం/పీజీపీ ఉత్తీర్ణతతోపాటు కనీసం అయిదేళ్ల అనుభవం ఉన్నవారికి పీహెచ్‌డీ మొదటి ఏడాది కోర్సు నుంచి మినహాయింపు ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.1000+జీఎస్‌టీ
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** మార్చి 31
- **వెబ్‌సైట్:** www.iimsambalpur.ac.in

ఐడీబీఐ బ్యాంక్‌లో జూనియర్ అసిస్టెంట్ మేనేజర్లు

మొత్తం ఖాళీలు 500

దేశవ్యాప్తంగా వివిధ జోన్లలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ఐడీబీఐ బ్యాంక్ అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. ఈ మేరకు నోటిఫికేషన్ విడుదల చేసింది. మణిపాల్(బెంగళూరు), నిట్టే(గ్రేటర్ నోయిడా) విద్యా సంస్థలతో కలిసి పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్(పీజీడీబీఎఫ్) కోర్సు ద్వారా ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఐడీబీఐ) ఆ పోస్టులను భర్తీ చేయనుంది. ఎంపికైన వారికి బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ విభాగంలో ఏడాది పీజీడీబీఎఫ్‌లో శిక్షణ ఇస్తారు. కోర్సు విజయవంతంగా పూర్తి చేసుకున్నవారికి పీజీడీబీఎఫ్ సర్టిఫికెట్‌తో పాటు జూనియర్ అసిస్టెంట్ మేనేజర్(గ్రేడ్-ఓ) ఉద్యోగం లభిస్తుంది.

జోన్లు: అహ్మదాబాద్, భోపాల్, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, ముంబయి, నాగ్‌పూర్, పుణె, భువనేశ్వర్, పట్నా, చండీగఢ్, ఢిల్లీ, కోల్‌కతా, లఖ్‌నవూ.

పోస్టు: జూనియర్ అసిస్టెంట్ మేనేజర్(గ్రేడ్-ఓ)

అర్హత: ఏదైనా గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ ఉత్తీర్ణత సాధించాలి. వయసు 2024 జనవరి 31 నాటికి 21 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల గరిష్ఠ వయోపరిమితి నిబంధనలో సడలింపు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: అర్హులైన అభ్యర్థులకు ఆన్‌లైన్ టెస్ట్ నిర్వహిస్తారు. ప్రతిభ కనబర్చిన వారు పర్సనల్ ఇంటర్వ్యూలకు అర్హత సాధిస్తారు. అందులో ప్రతిభ, ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షల ఆధారంగా తుది ఎంపికలు చేపడతారు.

దరఖాస్తు: అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూడీ అభ్యర్థులు రూ.200, ఇతరులు రూ.1000 చెల్లించాలి.

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్, విజయవాడ, విశాఖపట్నం, చీరాల, చిత్తూరు, ఏలూరు, గుంటూరు, కడప, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు, రాజమండ్రి, శ్రీకాకుళం, తిరుపతి, విజయనగరం.

రాత పరీక్ష: పరీక్షను మొత్తం 200 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో నాలుగు విభాగాలుంటాయి. అవి... లాజికల్ రీజనింగ్, డేటా అనాలసిస్, ఇంటర్‌ప్రిటేషన్(60 ప్రశ్నలు, 60 మార్కులు); ఇంగ్లీష్ లాంగ్వేజ్(40 ప్రశ్నలు, 40 మార్కులు); క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్(40 ప్రశ్నలు, 40 మార్కులు); జనరల్/ఎకానమీ/బ్యాంకింగ్ అవేర్‌నెస్(60 ప్రశ్నలు, 60 మార్కులు) అంశాల నుంచి మొత్తం 200 ప్రశ్నలు వస్తాయి. నెగెటివ్ మార్కింగ్ విధానం ఉంటుంది. తప్పుగా గుర్తించిన ప్రతి సమాధానానికి 0.25 మార్కు చొప్పున కోత విధిస్తారు.

శిక్షణ, ఫీజు వివరాలు: ఎంపికైన అభ్యర్థులను ఏడాదిపాటు పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్(పీజీడీబీఎఫ్) కోర్సులో శిక్షణ ఇస్తారు. కోర్సు ఫీజు రూ.3,00,000. విడతల వారీగా ఫీజు చెల్లించే వెసులుబాటు కూడా ఉంటుంది. అర్హత గల అభ్యర్థులకు ఐడీబీఐ బ్యాంక్ విద్యారుణం సైతం మంజూరు చేస్తుంది. కోర్సులో చేరేటప్పుడు అభ్యర్థులు మూడేళ్ల సర్వీస్ బాండ్ సమర్పించాల్సి ఉంటుంది.

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభం: ఫిబ్రవరి 12
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 26
ఆన్‌లైన్ పరీక్ష తేదీ: మార్చి 17
వెబ్‌సైట్: www.idbibank.in/

IDBI BANK

బెల్‌లో ట్రెయినీ ఇంజనీర్లు

మొత్తం ఖాళీలు 55

బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్...తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

1. ట్రెయినీ ఇంజనీర్: **33 పోస్టులు**
2. ప్రాజెక్ట్ ఇంజనీర్: **22 పోస్టులు**

విభాగాలు: ఎలక్ట్రానిక్స్, మెకానికల్, కంప్యూటర్ సైన్స్

అర్హత: సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్, బీఎస్సీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 2024 జనవరి 1 నాటికి ట్రెయినీ ఇంజనీర్‌కు 28 ఏళ్లు; ప్రాజెక్ట్ ఇంజనీర్‌కు 32 ఏళ్లు మించకూడదు.

వేతనం: నెలకు ట్రెయినీ ఇంజనీర్‌కు రూ.30,000- రూ.40,000, ప్రాజెక్ట్ ఇంజనీర్‌కు రూ.40,000- రూ.55,000 చెల్లిస్తారు.

ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ దరఖాస్తులను మేనేజర్(హెచ్‌ఆర్), ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, ప్రొఫెసర్ యూఆర్ రావు రోడ్, నాగాలాండ్ సర్కిల్ దగ్గర, జాలహళ్లి పోస్ట్, బెంగళూరు చిరునామాకు పంపాలి.

దరఖాస్తు స్వీకరణకు చివరి తేదీ: ఫిబ్రవరి 14
వెబ్‌సైట్: https://bel-india.in/

BHARAT ELECTRONICS
QUALITY. TECHNOLOGY. INNOVATION

జాబ్ కార్నర్

ఏపీ ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలోని పాఠశాల విద్యాశాఖ 'ఉపాధ్యాయ అర్హత పరీక్ష(ఏపీ టెట్-2024) నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనికి ఉపాధ్యాయ నియామక పరీక్షలో 20 శాతం వెయిటేజీ కూడా ఉంటుంది. అభ్యర్థులు 1 నుంచి 5 తరగతుల బోధనకు పేపర్-1(ఎ, బి); 6 నుంచి 8 తరగతుల బోధనకు పేపర్-2(ఎ, బి)లో అర్హత సాధించాల్సి ఉంటుంది.

పరీక్ష: ఏపీ ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)-2024

అర్హతలు: పేపర్‌ను బట్టి ఇంటర్మీడియట్, బ్యాచిలర్స్ డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీతో పాటు డీఈడీ/బీఈడీ/లాంగ్వేజ్ పండిట్ ఉత్తీర్ణులై ఉండాలి. 2023-24 విద్యా సంవత్సరం చివరి ఏడాది చదివే అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

పరీక్ష విధానం: ఆన్‌లైన్‌లో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) నిర్వహిస్తారు. రోజుకు రెండు సెషన్లలో పరీక్ష ఉంటుంది. మొదటి సెషన్ ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు ఉంటుంది.

పరీక్ష రుసుము: రూ.750
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో
దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 18
పరీక్షల నిర్వహణ: 2024 ఫిబ్రవరి 27 నుంచి 2024 మార్చి 9 వరకు
ప్రాథమిక కీ విడుదల: మార్చి 13
ఫలితాల ప్రకటన: మార్చి 14
వెబ్‌సైట్: https://aptet.apcfss.in/




మూర్ఖ పుత్రులు

ఒక ఊరిలో సోమయ్య అనే షావుకారు ఉండేవాడు. అతనికి వందెకరాలకు పైగా భూమి. ఎంతో పేరున్న మనిషి. ఇల్లంతా పనివాళ్లు, చేలో పనులు.. ఎప్పుడూ ఏదో పనిలో నిమగ్నమై ఉండేవాడు. అతనికి పక్కన ఉండే పది ఊర్లలో పేరుంది. అయితే అతనికి ఉండే ఇద్దరు కొడుకులు కూడా అజ్ఞానులని పేరుంది. ఇద్దరి కొడుకులకు అంత విలువ ఉండేది కాదు. తండ్రి ఆస్తిని తింటున్నారు. ఏమీ చేయలేని చవటలు అని తిట్టిపోసేవారు కొందరు. పైగా తన తండ్రి మాటలను లెక్క చేసేవారు కాదు. దీంతో వారిద్దరినీ ఏదో పని కల్పించాలనుకున్నాడు షావుకారు.

ఒక రోజు పక్క ఊరిలోని జమీందారు చనిపోయాడు. వెంటనే షావుకారు తన పెద్ద కొడుకుని పిలిచి జమీందారు కుటుంబాన్ని పరామర్శించి వచ్చేయ్ అన్నాడు. 'ఏమని పరామర్శించాలి' అని అడిగాడు. 'నలుగురు ఎలా చెబుతుంటే అలా చెప్పు' అన్నాడు. షావుకారు పెద్ద కొడుకు ఆ జమీందారు ఊరికి వెళ్లాడు. జమీందారు గురించి ఓ వ్యక్తిని అడిగాడు. 'పరమ దుర్మార్గుడు. చచ్చి మంచి పని అయ్యింది' అన్నాడు. వెంటనే జమీందారు ఇంటికి చేరుకున్నాడు షావుకారు కొడుకు. జమీందారు ఇంట్లో శోకం. జమీందారు భార్య దగ్గరకు వెళ్లి తన గురించి పరిచయం చేసుకున్నాడు. 'పరమ దుర్మార్గుడు. చచ్చి మంచి పని అయ్యింది' అన్నాడు. ఆ మాటలు విని జమీందారు పిల్లలు, బంధువులు అతన్ని చావబాదారు. బతుకు జీవుడా.. అనుకుంటూ ప్రాణాలతో ఇంటికి వచ్చాడు.

తన అన్న పరిస్థితి చూసి తమ్ముడు కోప్పడ్డాడు. వెంటనే విషయం తెలుసుకుని జమీందారు ఇంటికి వెళ్లాడు. 'మా అన్నకు తెలీదు. వాడు అజ్ఞాని. ఈ సారి మీ ఇంట్లో ఇలా జరిగితే చెప్పండి. వచ్చి నేను పరామర్శిస్తాను' అన్నాడు తమ్ముడు. వెంటనే అతన్ని కూడా చావబాదారు ఆ ఇంట్లో వాళ్లు.


సరైన నీడ ఏది?




చుక్కలు కలిపి రంగులు వేయండి



5 తేడాలు గుర్తించండి



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 225

9	1	4				2		
	5		2					
2		6			8	3		
7				1			4	9
		3		7		6		
4	6			8				1
		2	1			5		7
					3		2	
		7				1	9	3

సుడోకు - 224 సమాధానం

1	2	3	5	6	4	8	7	9
9	5	4	7	2	8	3	1	6
7	8	6	9	3	1	4	5	2
3	4	7	1	5	9	2	6	8
2	9	8	6	7	3	5	4	1
6	1	5	8	4	2	9	3	7
5	6	2	3	8	7	1	9	4
8	7	9	4	1	5	6	2	3
4	3	1	2	9	6	7	8	5

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్నీ బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.